www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

అప్పనంగా రూ.50 కోట్లకు 'టెండరు'

అమెరికా కంపెనీకి ఆన్‌లైన్ కోర్సు ప్రాజెక్టు

టెండర్లు లేకుండా నామినేషన్‌పై అప్పగింత

ఏడాదికి 50 కోట్లు.. ఏటా చెల్లించేలా ఎంవోయూ

విదేశీ వర్సిటీల ఆన్‌లైన్ కోర్సుల పేరిట దందా

2

శుక్రవారం | 5-1-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 64 సంచిక (Issue) : 261 | శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతరుతువు, మార్గశిరమాసం, బహుళపక్షం; తిథి: నవమి రా. 11.47 తదుపరి దశమి; నక్షత్రం: చిత్త రా. 7.50 తదుపరి స్వాతి; వర్జ్యం: రా. 1.47-3.30; దుర్ముహూర్తం: ఉ. 9.03-9.47, మ. 12.43-1.27; అమృతఘడియలు: ఉ. 12.49-2.34; రాహుకాలం: ఉ. 10.30-12.00; సూర్యోదయం: 6.51; సూర్యాస్తమయం: 5.51 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



షర్మిలను కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న రాహుల్ గాంధీ. చిత్రంలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే

కాంగ్రెస్‌లోకి షర్మిల

రాహుల్ సమక్షంలో చేరిక.. కండువా కప్పి ఆహ్వానించిన ఖర్గే

వైఎస్ఆర్‌టీపీని విలీనం చేస్తున్నా

వైఎస్ ఎక్కడున్నా సంతోషించే రోజిది

రాహుల్ ప్రధాని కావాలని ఆయన కల గన్నారు.. నెరవేర్చేందుకు కృషి చేస్తా

దేశంలో అతి పెద్ద లౌకిక పార్టీ కాంగ్రెస్

ఏ బాధ్యత ఇచ్చినా నిర్వహిస్తా: షర్మిల

సోనియాగాంధీతోనూ భేటీ

పీసీసీ పగ్గాలు అప్పగించడంపై అధిష్ఠానం మల్లగుల్లాలు

షర్మిల, బ్రదర్ అనిల్‌తో కేసీ వేణుగోపాల్ మంతనాలు

స్టార్ క్యాంపెయినర్, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శిపైనా చర్చ

ఒకట్రెండు రోజుల్లో తేలే అవకాశం!

న్యూఢిల్లీ, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సోదరి షర్మిల కాంగ్రెస్‌లో చేరారు. అగ్ర నేత రాహుల్‌గాంధీ సమక్షంలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే గురువారం ఢిల్లీలో ఏఐసీసీ ప్రధాన కార్యాలయంలో షర్మిలకు కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్యం ఠాగూర్, ఏఐసీసీ ఎస్సీ విభాగం నేత కొప్పుల రాజు, పీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు హాజరయ్యారు. వేదికపై కూర్చున్న షర్మిల భర్త అనిల్‌కు కూడా ఖర్గే కండువా కప్పబోయారు. కానీ అనిల్ తాను పార్టీలో చేరడం లేదంటూ సున్నితంగా వారించారు. అనంతరం షర్మిల ప్రసంగిస్తూ.. తన వైఎస్ఆర్‌టీపీని కాంగ్రెస్‌లో

మిగతా 11వ పేజీలో...

మణిపూర్ క్రూర ఘటనలను క్రైస్తవురాలిగా

జీర్ణించుకోలేకపోతున్నా!

2 వేల చర్చిల ధ్వంసం.. నిరాశ్రయులుగా 60 వేల మంది

నాడే కాంగ్రెస్‌కు మద్దతివ్వాలని నిర్ణయించా: షర్మిల

ఇప్పుడేం చేయాలి?

పాహిమాం

బీఆర్ఎస్ చీఫ్‌తో సీఎం జగన్ భేటీ

ఇంటికొచ్చిన 20 రోజులకు 'పరామర్శ'

అందరి సమక్షంలో కుశల ప్రశ్నలు

ఆపై... కేటీఆర్‌నూ పంపేసి ఏకాంత చర్చలు

రాజకీయ సలహాలు కోరినట్లు సమాచారం

ఓటమి ఊహించలేదన్న కేసీఆర్!

షెడ్యూలు తర్వాతే పరిస్థితి మారింది..

చివరిదాకా జనం బయటపడరు జాగ్రత్త!

జగన్‌ను అప్రమత్తం చేసిన బీఆర్ఎస్ చీఫ్

వైసీపీని చుట్టుముడుతున్న వరుస కష్టాలు

సీట్ల మార్పుపై వికటిస్తున్న ప్రయోగాలు

కాంగ్రెస్‌లో షర్మిల చేరికతో 'ఇంటి పోరు'

ఇదే సమయంలో కేసీఆర్ వద్దకు జగన్



బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను పరామర్శిస్తున్న సీఎం జగన్

(అమరావతి/హైదరాబాద్ - ఆంధ్రజ్యోతి)

తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ గాయపడి, శస్త్ర చికిత్స చేయించుకుని, ఇంటికి కూడా చేరుకున్నాక.. 20 రోజులకు ... ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆయనను పరామర్శించారు. ఏకాంతంగా, 'ప్రత్యేకం'గా కూడా పరామర్శించారు. సహజంగా ఎవరైనా ప్రమాదానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నప్పుడే వెళ్లి పలకరించి వస్తారు. కానీ... జగన్ ఇన్నాళ్ల తర్వాత వెళ్లడం, అదీ ఏకాంతంగా చర్చలు జరపడం గమనార్హం. ఆరోగ్య పరామర్శతో పాటు రాజకీయ కోణంలోనూ ఈ సమావేశం జరిగినట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. ఎంపీ మిథున్‌రెడ్డి, ప్రభుత్వ విప్ చెవిరెడ్డి భాస్కర రెడ్డి, ఎమ్మెల్సీ తలశిల రఘురామ్‌తో కలసి వైఎస్ జగన్ ప్రత్యేక విమానంలో గురువారం హైదరాబాద్‌కు వెళ్లారు. ఉదయం 11.40 గంటలకు బేగంపేట విమానాశ్రయం చేరుకున్నారు. ఆయనకు అక్కడ బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి స్వాగతం పలికారు. అక్కడి నుంచి నేరుగా బంజారాహిల్స్ నందినగర్‌లోని కేసీఆర్ నివాసానికి

మిగతా 12వ పేజీలో...

కొత్త సమర్థులు కావలెను!

వైసీపీ అభ్యర్థుల ఎంపికకు తాడేపల్లిలో కసరత్తు

25 రోజులుగా సాయిరెడ్డి, సుబ్బారెడ్డి, సజ్జల చర్చలు

అయోధ్యరామిరెడ్డి, వేమిరెడ్డి, బొత్స కూడా

ఎంపీ అభ్యర్థులకు కొరత?.. చీఫ్‌విప్ ప్రసాదరాజు, కనిగిరి ఎమ్మెల్యే మధుసూదన్‌కూ పిలుపు

11

తిట్టను పో!

వైసీపీ దూతలకు తేల్చిచెప్పిన మహీధర్‌రెడ్డి

బాబు, పవన్,లోకేశ్‌పై విమర్శలకు కందుకూరు ఎమ్మెల్యే 'నో'

'ప్రెస్ మీట్ పెట్టను.. టికెట్ మీ ఇష్టం' అని స్పష్టీకరణ

కనిగిరి ఎమ్మెల్యే సీఎంవోకు వెళ్లటంపై చర్చ

ఒంగోలు, నెల్లూరు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): టీడీపీ అధినేత చంద్రబాబు, లోకేశ్, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌లను తిట్టాలంటూ ముఖ్యమంత్రి జగన్ విధించిన షరతుకు కందుకూరు ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి ససేమిరా అన్నట్లు తెలిసింది. తిడితేనే సీటు అని ఒత్తిడి పెట్టినా

మిగతా 12వ పేజీలో...

బీసీలను ముంచేశారు!

జగన్‌కు కౌంట్‌డౌన్ మొదలు.. వంద రోజులే వైభోగం

మళ్లీ వైసీపీ కల్లే.. టీడీపీని భారీ మెజారిటీతో గెలిపించాలి

ఇందుకు బడుగులు నడుం బిగించాలి

వచ్చే 40 రోజుల్లో ప్రతి మండలంలో సమావేశాలు

ప్రభావిత వర్గాలతో చర్చలు.. బీసీలంటే సీఎంకు చులకన

అందుకే వేరే నియోజకవర్గాలకు బదిలీ

పెద్దిరెడ్డి, ద్వారంపూడిని ఎందుకు మార్చలేదు?

'జయహో బీసీ' సదస్సులో నిలదీసిన టీడీపీ అధినేత

ఈ ప్రభుత్వాన్ని కూకటి వేళ్లతో పెకలిద్దాం: చంద్రబాబు





'జయహో బీసీ' కార్యక్రమంలో మాట్లాడుతున్న చంద్రబాబు

అమరావతి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): 'బీసీలను నట్టేట ముంచిన జగన్ ప్రభుత్వాన్ని కూకటి వేళ్లతో పెకలిద్దాం రండి..' అని బలహీన వర్గాలకు టీడీపీ అధినేత చంద్రబాబు పిలుపిచ్చారు. టీడీపీకి వెన్నెముకగా ఉన్న బీసీల నడ్డివిరిచిన ఈ సర్కారును సాగనంపాలన్నారు. జగన్ ప్రభుత్వ పతనానికి కౌంట్‌డౌన్ ప్రారంభమైందని.. ఇక వంద రోజులే

మిగతా 3వ పేజీలో...

బాబు-పవన్‌తోనే వెళ్దాం!

ఒంటరి పోరుతో సీట్లు రావు!!

మెజారిటీ కమలనాథుల మనోగతం

కోర్ కమిటీ భేటీకి 40 మంది హాజరు

శివప్రకాశ్‌తో నాదెండ్ల మనోహర్ భేటీ

3



సినీ ప్రేక్షకులు కేజీఎఫ్ 1, 2 మాత్రమే చూశారు. కానీ... గుంటూరు జిల్లాలోని ఆ గ్రామీణ ఎమ్మెల్యే తన నియోజకవర్గ ప్రజలకు 'కేజీఎఫ్-3' కూడా చూపిస్తున్నారు. ఆ స్థాయిలో మట్టి కొండలను కొల్లగొట్టారన్న మాట!

రాష్ట్రంలో 'జె' ట్యాక్స్ అమలవుతోందని విపక్షాలు విరుచుకుపడుతున్నాయి. ఆ నియోజకవర్గంలో దీనికి అదనంగా 'కే' ట్యాక్స్ కూడా కట్టాల్సిందే! విపక్షాల సంగతి పక్కనపెడితే... స్వపక్షం నుంచీ విమర్శలు ఎదుర్కొన్న మహా రోశగాడు ఈ నాయకుడు!



కిలాడీ కేజీఎఫ్.. మట్టి, భూములు ఉఫ్!

ఆ ఎమ్మెల్యే అక్రమార్జనలో రోశగాడు

గుంటూరు జిల్లాలో తెగబడిన నేత

గ్రావెల్ మైనింగ్‌లో వందల కోట్ల దందా

మద్యం సిండికేట్ నుంచి ముడుపులు

అనుయాయులతో బెల్ట్ షాపులు

ఆలయ భూములపైనా కన్ను

22 ఎకరాల్లో ఆటోనగర్ ఏర్పాటుకు యత్నం

కమర్షియల్ లీజ్ పేరుతో దక్కించుకునే ఎత్తు

అధికారులూ ఆయనకు కమీషన్లు ఇవ్వాల్సిందే

ఆ ప్రజాప్రతినిధి.. వైసీపీలో ఓ కీలక నేతకు స్వయానా అల్లుడు.. ఈ నాలుగున్నరేళ్లలో కోట్లకు పడగలెత్తారు. అవినీతి అనకొండగా మారారు. అక్రమ గ్రావెల్ తవ్వకాలకు దన్నుగా నిలుస్తూ.. ఇష్టానుసారం దోపిడీకి తెరలేపారు. ఖాళీ జాగా కనబడితే స్వాహాకు తెగబడుతున్నారు. చివరకు దేవాలయ భూములనూ వదలడం లేదు.

(గుంటూరు - ఆంధ్రజ్యోతి)

గుంటూరు జిల్లాలో అత్యంత కీలకమైన, గ్రామీణ నేపథ్యం ఉన్న ఆ నియోజకవర్గం పేరు చెబితే రాజకీయ ఉద్దండుడు ఎన్జీ రంగా ముందుగా గుర్తుకు వస్తారు. అలాంటి చోట 2019 ఎన్నికల్లో రెండున్నర దశాబ్దాల తర్వాత టీడీపీపై వైసీపీ విజయం సాధించింది. అక్కడ గెలిచిన ప్రజాప్రతినిధి వైసీపీ కీలక నేత అల్లుడు కావడంతో ఆయన ఆగడాలకు అంతు లేదు.

కేజీఎఫ్‌ను తలపించే అక్రమాలు..

నియోజకవర్గంలోని మరో మండలంలో ఆ ప్రజాప్రతినిధి అక్రమాలు 'కేజీఎఫ్' సినిమాను తలపించే విధంగా ఉన్నాయి. కేజీఎఫ్ చాప్టర్-3 పేరుతో ఆయన అరాచకాలు, దోపిడీ, అక్రమ మైనింగ్‌పై ప్రతిపక్షం ఏకంగా డాక్యుమెంటరీయే రూపొందించింది. ఆ మండలం అత్యంత నాణ్యమైన ఎర్ర గ్రావెల్‌కు నెలవు. దీని మైనింగ్ పేరుతో ఎమ్మెల్యే ఈ నాలుగున్నరేళ్లలో కనీవినీ ఎరుగని

మిగతా 12వ పేజీలో...

పెన్షన్లన్నీ పెండింగ్‌లోనే!

5 వేల కోట్లు తెచ్చినా చెల్లింపుల్లేవ్

జీతాలు, పెన్షన్లకు 2,800 కోట్లు బాకీ

12



ఏలూరు జిల్లా కలెక్టరేట్ వద్ద మోకాళ్లపై నిలబడి అంగన్వాడీల నిరసన

తడాఖా చూపిస్తాం!

జగన్ సర్కారుకు అంగన్వాడీల హెచ్చరిక

నోటీసులకు బెదిరేది లేదని స్పష్టీకరణ

'మున్సిపల్' సమ్మె ఉధృతం

విశాఖలో కార్మికుడి ఆత్మహత్యాయత్నం

11

కేజీబీవీ టీచర్లపై వేటేయండి

సమ్మెలో ఉంటే తొలగించాలని ఆదేశాలు

జగన్ ప్రభుత్వ సంచలన నిర్ణయం

ఉద్యోగాలకు ముప్పున్నా నేడు చలో విజయవాడ

జనసేనపైకి జగన్ 'కాపు' అస్త్రం

- వైసీపీకి కళ్లెదుట ఓటమి కనిపిస్తోంది
- అందుకే కాపు పెద్దలను రెచ్చగొడుతోంది: పవన్

అమరావతి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ఓటమి తప్పదని వైసీపీకి స్పష్టంగా తెలుస్తోందని, అందుకే కాపు పెద్దలను తనపైకి రెచ్చగొడుతోందని జనసేన అధినేత పవన్ కల్యాణ్ అన్నారు. కాపు సామాజిక వర్గంలో అత్యధిక శాతం జనసేనకు అండగా ఉండటాన్ని వైసీపీ జీర్ణించుకోలేకపోతోందని విమర్శించారు. అందుకే కులపరమైన అస్త్రాన్ని ప్రయోగిస్తోందని, అందులో భాగంగానే కాపు పెద్దలను రెచ్చగొట్టి పార్టీని బలహీనపరచే దుష్ట ప్రయత్నాలు చేస్తోందని ఆరోపించారు. గురువారం ఆయన ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. "ఎమర్జెన్సీ సమయంలో దేశ ప్రయోజనాల కోసం అన్ని పార్టీలు ఏకతాటిపైకి వచ్చాయి. అదే రీతిలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని వైసీపీ వ్యతిరేక ఓటు చీలకూడదని ప్రకటించి, నేను మొదలుపెట్టిన కార్యాచరణ వైసీపీకి, ఆ పార్టీ అధినేతకు కంటగింపుగా మారింది. దిగజారి పార్టీపై విమర్శలు చేస్తున్నారు. కాపు పెద్దలు చేసిన వ్యాఖ్యలను నేను సహృదయంతో అర్థం చేసుకోగలను. వారి దూషణలను నేను దీవెనలుగా తీసుకొంటాను. రాష్ట్ర ప్రయోజనాల కోసమే నా అడుగులు. ఎస్సీ, ఎస్టీ, బీసీ కులాల సాధికారతతో పాటు అగ్రకులాల్లోని పేదలకు అండగా నిలిచి వారి ఆర్థిక ఉన్నతికి దోహదపడాలన్నది నా ఉద్దేశం. రాబోయే ఎన్నికల్లో కాపులు కచ్చితంగా నిర్ణయాత్మక, క్రియాశీల పాత్ర పోషిస్తారు. అందుకే కాపుల్లో అంతర్గత విభేదాలు తీసుకువచ్చే క్రమంలో వైసీపీ కుట్రలకు తెర తీసింది. కొందరు కాపు పెద్దలను జనసేనపైకి ప్రయోగిస్తోంది. జనసేనపైనా, నాపైనా సామాజిక మాధ్యమాల్లో విషపు రాతలు రాయించడం, అపోహలు సృష్టించే తప్పుడు వార్తలను కేవలం కాపు సామాజిక వర్గం వారి మొబైల్ ఫోన్లకు మాత్రమే పంపడం వంటి దుశ్చర్యలకు ఒడిగడుతోంది" అని పవన్ పేర్కొన్నారు.

జగన్‌ను కాపు పెద్దలు ప్రశ్నించాలి

"కాపు రిజర్వేషన్ పోరాటాన్ని హింసాత్మకంగా మార్చిన మాస్టర్, క్రిమినల్ బ్రెయిన్ ఆ తర్వాత ఎటు మళ్లిందో కాపు సామాజిక వర్గం గ్రహించింది. కాపులకు రిజర్వేషన్ ఇచ్చేది లేదని కాపులకు బలమైన జిల్లా అని అందరూ భావించే తూర్పుగోదావరిలోని జగ్గంపేటలో ప్రకటించిన జగన్ రెడ్డిని కాపు పెద్దలు ప్రశ్నించాలి. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లలో కాపులకు ఇచ్చిన కోటాను తొలగించిన వ్యక్తిని ప్రశ్నించాలి. కాపులను కాపు నాయకులతో తిట్టిస్తూ, తూలనాడిస్తున్న వ్యక్తిని కాకుండా నన్ను దూషించడం వల్ల ఎవరికి ప్రయోజనమో గ్రహించాలి. కుట్రలు, కుతంత్రాలతో అల్లిన వైసీపీ వలలో చిక్కుకోవద్దని నేను గౌరవించే కాపు పెద్దలకు సవినయంగా విజ్ఞప్తి చేస్తున్నాను. వైసీపీ ప్రాయోజిత విషపూరిత ప్రచారాలను, తప్పుడు అభిప్రాయాలతో కూడిన విశ్లేషణలు, వార్తలను విశ్వసించవద్దని కాపు సామాజిక వర్గంతో పాటు ప్రతి ఒక్కరికీ విజ్ఞప్తి చేస్తున్నాను" అని పవన్ కోరారు.

ఎయిడెడ్ పోస్టులకు మళ్లీ బేరం!

- ఎస్‌జీటీ రూ.25 లక్షలు.. అటెండర్ పోస్టుకు రూ.10 లక్షలు
- ప్రకాశం డీఈవోపై ఎస్సీ కమిషన్‌కు దళిత సంఘాల ఫిర్యాదు

గుంటూరు(విద్య), జనవరి 4: ఎయిడెడ్ పాఠశాలల్లో టీచర్, నాన్ టీచింగ్ పోస్టులకు మరోసారి బేరాలు మొదలయ్యాయి. టీచర్ పోస్టుల భర్తీ కోసం కొందరు యజమానులు కోర్టును ఆశ్రయించడంతో రేపోమాపో అనుకూలంగా తీర్పు వస్తుందంటూ యాజమాన్యాలు బేరాలు మొదలుపెట్టాయి. ఎస్‌జీటీ పోస్టుకు రూ.25 లక్షల నుంచి 30 లక్షలు లక్షలు, అటెండర్ పోస్టుకు రూ.10 లక్షల నుంచి రూ.15 లక్షలు చొప్పున బేరం పెట్టినట్లు తెలిసింది. విద్యాశాఖను పర్యవేక్షించే అధికారులు, ప్రజాప్రతినిధులకు ఇందులో కొంత మొత్తాన్ని వాటాలుగా ఇవ్వనున్నట్లు తెలిసింది. ఎయిడెడ్ పాఠశాలల్లో టీచర్, నాన్ టీచింగ్ పోస్టుల భర్తీకి ప్రభుత్వం త్వరలో గ్రీన్‌సిగ్నల్ ఇవ్వనుందని ప్రచారం జరుగుతోంది. త్వరలో ప్రత్యేక పరీక్ష నిర్వహణకు ఏర్పాట్లు సాగుతున్నాయని విద్యాశాఖ, ఆర్‌జేడీ కార్యాలయాల సిబ్బంది చెబుతున్నారు. పరీక్షల్లో యాజమాన్యాలకు అనుకూలమైన వారిని ఎంపిక చేసేలా సిబ్బంది ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలిసింది. పోస్టుల భర్తీలో ఆర్‌జేడీ కార్యాలయం కీలకం కానున్న నేపథ్యంలో ఇక్కడ పని చేసే ఓ అధికారితో ముందస్తు ఒప్పందాలను యాజమాన్యాలు చేసుకున్నాయని చెబుతున్నారు. టీచర్ పోస్టుకు రూ.1.50 లక్షలు, అటెండర్ పోస్టుకు రూ.75 వేల పైన సిబ్బంది డిమాండ్ చేస్తున్నారు. ఈ మొత్తం చెల్లిస్తే ఎయిడెడ్ యాజమాన్యాలు సూచించిన వారు ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణులయ్యేలా చేస్తారు. గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల పరిధిలోని పాఠశాలల్లో దాదాపు 100కుపైగా పోస్టులు భర్తీ చేయనున్నట్లు సమాచారం. విద్యాశాఖలో ఓ తృతీయ శ్రేణి అధికారి గతంలో ఓ ఎయిడెడ్ స్కూల్‌లో తమ బంధువులకు పోస్టింగ్ ఇప్పించుకున్నారు. ఇందుకోసం ఆయన భారీ మొత్తం చెల్లించారు. ఈ అధికారే మరోసారి తన ఇద్దరు కూతుళ్లకు గుంటూరులోని రెండు ఎయిడెడ్ స్కూళ్లలో టీచర్ పోస్టులు ఇప్పించేలా ప్రణాళిక సిద్ధం చేసినట్లు తెలిసింది. ఎయిడెడ్ పోస్టుల భర్తీలో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని ఆర్‌జేడీ, ప్రకాశం ఇన్‌చార్జి డీఈవో సుబ్బారావుపై దళిత సంఘాలు ఫిర్యాదు చేశాయి. ఈ నెల 17న విచారణకు రావాలని ఎస్సీ కమిషన్ నుంచి ప్రకాశం డీఈవోకు నోటీసులు అందినట్లు ఫిర్యాదుదారులు చెబుతున్నారు.

ఓట్ల కోసం వస్తే చెప్పులతో కొడతాం!

- మంత్రి అంబటిపై ముప్పాళ్ల ముస్లింల ఆగ్రహం

ముప్పాళ్ల జనవరి 4: పల్నాడు జిల్లా ముప్పాళ్లలో మంత్రి అంబటి రాంబాబుకు చేదు అనుభవం ఎదురైంది. బుధవారంనాడు రోడ్డు ప్రమాదంలో చనిపోయిన మన్సూర్ వలి మృతదేహాన్ని చూసేందుకు మంత్రి అంబటి రాంబాబు గురువారం గ్రామానికి వచ్చారు. అయితే చనిపోయిన సమయంలో రాకుండా.. ఇప్పుడెందుకు వచ్చావంటూ మంత్రిపై బాధితులు మండిపడ్డారు. 'మేము వైసీపీ సానుభూతిపరులం. మాకే ఇంత అన్యాయం జరుగుతుంటే ఏం చేస్తున్నావు?. మేం ఓట్లేస్తేనే గెలిచావు. ఈసారి ఓట్ల కోసం వస్తే చెప్పుతో కొడతాం' అని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనుకోని ఈ సంఘటనతో అవాక్కయిన మంత్రి అంబటి.. ఏమీ మాట్లాడకుండా.. మన్సూర్ వలి మృతదేహానికి పూలమాల వేసి వెళ్లి పోయారు. కాగా గ్రామంలో కూరగాయల వ్యాపారం చేసుకునే షేక్ మన్సూర్‌వలి బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో చనిపోయాడు. ఈ ఘటనకు కారణమైన వాహన డ్రైవర్‌ను బాధితులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. అయితే పోలీసులు అతడికి స్టేషన్ బెయిల్ ఇచ్చి, పంపేయడంతో ముస్లింలు తీవ్ర ఆగ్రహానికి గురయ్యారు. మన్సూర్‌వలి కుటుంబానికి న్యాయం చేయాలంటూ అతని కుటుంబ సభ్యులు, బంధువులు గురువారం సాయంత్రం పోలీసుస్టేషన్ వద్ద రోడ్డుపై బైఠాయించారు. గుంటూరులో పోస్టుమార్టం పూర్తయ్యాక మృతదేహాన్ని గ్రామానికి తీసుకురాగా, ఆ వాహనాన్ని రోడ్డుపైనే ఉంచి ఆందోళన చేశారు. వాహన డ్రైవర్‌ను పోలీసులకు అప్పగిస్తే.. వారు కాలవాలనే వదిలేశారని ఆరోపిస్తూ సుమారు 300 మంది రెండు గంటలకుపైగా రోడ్డుపైనే బైఠాయించారు.



మంత్రి అంబటి రాంబాబును చుట్టుముట్టి నిలదీస్తున్న బాధితులు



392 స్తంభాలు.. 44 ద్వారాలు!

అయోధ్య రామమందిరం నాగరా శైలిలో నిర్మాణం

అయోధ్య, జనవరి 4: ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్యలో శ్రీరామ జన్మభూమి ఆలయాన్ని జనవరి 22న ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆలయ గర్భగుడిలో రామ్ లల్లా విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తారు. ఈ క్రతువు పూర్తయిన తర్వాత 24వ తేదీ నుంచి భక్తులను దర్శనానికి అనుమతిస్తారు. ప్రతిష్ఠాపన మహోత్సవానికి ముహూర్తం దగ్గర పడుతున్న నేపథ్యంలో ఆలయానికి సంబంధించిన కీలక విశేషాలను శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ మీడియాతో పంచుకుంది. ఉత్తర భారతానికి చెందిన సంప్రదాయ నాగరా శైలిలో రామమందిరం నిర్మితమవుతోంది. ఈ మందిరం పొడవు (తూర్పు-పడమర) 380 అడుగులు, వెడల్పు 250 అడుగులు, ఎత్తు 161 అడుగులు. ఆలయంలోని స్తంభాలు, గోడలపై వివిధ దేవతామూర్తుల శిల్పాలను సుందరంగా తీర్చిదిద్దారు. మూడు అంతస్తులుగా ఉండే మందిరంలో ఒక్కో అంతస్తు 20అడుగుల ఎత్తు ఉంటుంది. ఈ ఆలయంలో 392 స్తంభాలు, 44 ద్వారాలు ఉన్నాయి. ప్రధాన గర్భగుడిలో బాల రాముడి విగ్రహం కొలువు తీరుతుంది. మొదటి అంతస్తులో శ్రీరామ దర్బార్ ఉంటుంది. ఇక్కడ మొత్తం ఐదు (నృత్య, రంగ్, సభా, ప్రార్థనా, కీర్తనా) మండపాలు ఉంటాయి. తూర్పువైపు ఉన్న సింహద్వారం నుంచి భక్తులు 32 మెట్లు ఎక్కి ఆలయం లోపలికి ప్రవేశిస్తారు. దివ్యాంగులు, వృద్ధుల సౌకర్యార్థం లిఫ్టులు, ర్యాంపులు ఏర్పాటు చేశారు. మందిరం చుట్టూ 732 మీటర్ల పొడవు, 14 అడుగుల వెడల్పుతో దీర్ఘచతురస్రాకారంలో భారీ ప్రహరీని నిర్మించారు. ఈ ప్రహరీ నాలుగు మూలల్లో సూర్యుడు, దేవీ భగవతి, వినాయకుడు, శివుడి మందిరాలు ఉన్నాయి. ఉత్తరాన అన్నపూర్ణాదేవి, దక్షిణ భాగంలో హనుమాన్ మందిరం ఏర్పాటు చేశారు. ఆలయానికి సమీపంలో పురాతన కాలం నాటి చారిత్రక బావి (సీతా కూప్) ఉంది. మందిర సముదాయంలో వాల్మీకి, విశ్వామిత్రుడు, వశిష్ఠుడు, అగస్త్య మహర్షుల ఆలయాలతో పాటు దేవీ అహల్య, నిషాద్ రాజ్ (గుహుడు), శబరికి ప్రత్యేకంగా మందిరాలు నిర్మించనున్నారు. ఈ సముదాయం నైరుతి భాగంలో కుబేర్ తిలా వద్ద జటాయువు విగ్రహాన్ని ఏర్పాటు చేయడంతో పాటు అక్కడున్న పురాతన శివాలయాన్ని పునరుద్ధరించారు. కాగా, ఇక్కడి నిర్మాణాల్లో ఎక్కడా ఇనుమును వాడలేదు. భూమిలో నుంచి వచ్చే తేమ నుంచి రక్షణ కోసం 21 అడుగుల ఎత్తయిన గ్రానైట్ స్తంభాన్ని నిర్మించారు. ఈ కాంప్లెక్స్‌లో మురుగునీటి శుద్ధి ప్లాంట్, వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్, అగ్ని ప్రమాదాల నుంచి రక్షణ కోసం నీటి సరఫరా ఏర్పాట్లు, పవర్ స్టేషన్ ఉన్నాయి. ఒకేసారి 25వేల మందికి వసతి కల్పించేందుకు యాత్రికుల వసతి కేంద్రాన్ని(పీఎఫ్‌సీ) నిర్మిస్తున్నారు. భక్తులకు వైద్య, లాకర్ సదుపాయాలు కల్పిస్తారు. భక్తులు కాలకృత్యాలు తీర్చుకోవడానికి, స్నానాల కోసం ప్రత్యేక బ్లాక్ ఉంది. ఈ మందిరాన్ని పూర్తిగా భారత సంప్రదాయ విధానంలో, స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మిస్తున్నట్లు ట్రస్ట్ వివరించింది. ఆలయ నిర్మాణానికి రూ.1,400 కోట్ల నుంచి రూ.1,800 కోట్ల వరకూ ఖర్చవుతుందని అంచనా.



ప్రతిష్ఠ రోజునే రాముడి తొలి దర్శనం

అయోధ్యలో జనవరి 22న మధ్యాహ్నం ప్రాణప్రతిష్ఠ కార్యక్రమం జరిగే వరకూ గర్భగుడిలో ఏర్పాటు చేయనున్న రామ్ లల్లా విగ్రహాన్ని అత్యంత గోప్యంగా ఉంచనున్నారు. స్వామిని ప్రతిష్ఠించే ముందు వరకూ విగ్రహం ముఖాన్ని చూడటం ఎవరికీ సాధ్యం కాదని ఆలయ వర్గాలు స్పష్టం చేశాయి. గర్భాలయంలో ఉంచడానికి ఎంపిక చేసిన మూడు విగ్రహాలలో ఏ విగ్రహాన్ని ఎంపిక చేశారనే దానిపై అధికారిక ప్రకటనతో ఎలాంటి ప్రయోజనం ఉండబోదని పేర్కొన్నాయి. ట్రస్టు సభ్యులు అందరూ కలిసి విగ్రహాన్ని ఏకగ్రీవంగా ఎంపిక చేసిన తర్వాత దీనిపై ట్రస్టు అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి ప్రకటన చేస్తారని ట్రస్ట్ సభ్యుడు కామేశ్వర్ చౌపాల్ తెలిపారు.

బాలరామ విగ్రహంపై 17న తుది నిర్ణయం

- ఉడుపి పెజావర మఠాధిపతి విశ్వప్రసన్న తీర్థ స్వామీజీ

బెంగళూరు, జనవరి 4(ఆంధ్రజ్యోతి): అయోధ్యలోని రామమందిరంలో ప్రతిష్ఠించనున్న బాలరామ విగ్రహంపై నిర్ణయాన్ని ఈ నెల 17న అధికారికంగా ప్రకటించనున్నారు. ఈ విషయాన్ని ఉడుపి పెజావర మఠాధిపతి, అయోధ్య రామజన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు సభ్యుడు విశ్వప్రసన్న తీర్థస్వామీజీ గురువారం ఉడుపిలో మీడియాకు వెల్లడించారు. మొత్తం మూడు పవిత్ర శిలలపై చెక్కిన మూర్తుల విగ్రహాలు చాలా అద్భుతంగా ఉన్నాయని, ఇందులో ఒక మూర్తిని ఎంపిక చేస్తామని తెలిపారు. అయోధ్యలో రామ మందిరం ప్రారంభోత్సవం జరుగుతున్న వేళ పాత కేసులను తిరగదోడి, కరసేవకుడిని అరెస్టు చేయడం సముచితం కాదని ఆయన కర్ణాటక కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. కాగా అయోధ్యలో రామమందిరం ప్రారంభం కానున్న ఈనెల 22న రాష్ట్ర ప్రభుత్వాలు సెలవు ప్రకటించాలని ఆయన కోరారు.

రాముడు మా కుటుంబ దేవుడు

- కాంగ్రెస్ ఎమ్మెల్యే ఇక్బాల్ హుస్సేన్

బెంగళూరు, జనవరి 4(ఆంధ్రజ్యోతి): 'శ్రీరామచంద్రుడు మా కుటుంబ దేవుడు. నేను ఆయనకు పరమ భక్తుడిని' అంటూ కర్ణాటకలోని రామనగరం కాంగ్రెస్ ఎమ్మెల్యే ఇక్బాల్ హుస్సేన్ చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. రామనగరంలో ప్రతియేటా తాము రామోత్సవం జరుపుకొంటామని, ఇది కులమతాలకు అతీతంగా, లౌకిక భావాలను కలిగి ఉంటుందన్నారు. 'రాముడు మనందరి దేవుడు. ఇది ముమ్మాటికీ సత్యం' అని ఆయన పేర్కొన్నారు. బాల్యంలో తామంతా సరస్వతీదేవి, లక్ష్మీదేవి, గణపతిని ఆరాధించే వాళ్లమని, కాంగ్రెస్ ఏనాడూ దేవుళ్లను రాజకీయాలకోసం వాడుకోలేదని చెప్పారు. కేంద్రంలో అధికారంలో ఉన్నవారు అయోధ్య రామమందిరం ద్వారా రాజకీ య లబ్ధి పొందాలని చూస్తున్నారని విమర్శించారు.

లోకం తీరు



ఖమ్మం నుంచి లోక్‌సభ బరిలోకి సోనియా!

సరేనన్న సోనియా.. నేతలకు సమాచారం

హైదరాబాద్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ అధినాయకురాలు సోనియాగాంధీ తెలంగాణ నుంచి లోక్‌సభకు పోటీపై స్పష్టత వచ్చింది. ఆమె ఖమ్మం నుంచి పోటీ చేయనున్నారు. ఈ మేరకు రాష్ట్ర పార్టీ ముఖ్యులకు కాంగ్రెస్ అధిష్ఠానం నుంచి సమాచారం అందినట్టు తెలుస్తోంది. ఆమె పోటీ ద్వారా ఇటు తెలంగాణలోనే కాకుండా, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక వంటి రాష్ట్రాల్లో కూడా సానుకూల ప్రభావం ఉంటుందని కాంగ్రెస్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. తాజాగా బుధవారం జరిగిన టీపీసీసీ సమావేశంలోనూ సోనియా పోటీపై మరోసారి చర్చ జరిగింది. అందులో భాగంగానే సోనియాగాంధీ తెలంగాణ నుంచి పోటీ చేయాలని మరోసారి తీర్మానం చేశారు. రెండోసారి తీర్మానం తర్వాత సోనియా కార్యాలయం నుంచి రాష్ట్ర నేతలకు సానుకూల సందేశం అందినట్టు తెలిసింది. రాష్ట్రం నుంచి పోటీ చేయడానికి ఆమె అంగీకరించారని, అందుకు తగ్గట్టుగా కార్యాచరణను రూపొందించాలని సూచించారని సమాచారం. ఢిల్లీ నుంచి గ్రీన్ సిగ్నల్ రావడంతో సోనియా పోటీకి సంబంధించిన ఏర్పాట్లపై రాష్ట్ర నేతలు దృష్టి సారించారు. సోనియాగాంధీ పోటీ చేయడానికి రాష్ట్రంలోని పలు లోక్‌సభ స్థానాలను పరిశీలించినప్పటికీ చివరకు ఖమ్మం నుంచి రంగంలోకి దించాలనే నిర్ణయానికి వచ్చారు. ఖమ్మం ఎంపికలో పలు అంశాలు పని చేసినట్లు తెలుస్తోంది. ఇతర నియోజక వర్గాలతో పోలిస్తే ఇక్కడ కాంగ్రెస్ చాలా బలంగా ఉంది. నియోజవర్గ గత ఎన్నికల చరిత్రను కూడా పరిగణనలోకి తీసుకున్నారు. కొత్త రాష్ట్రంలో అధికారంలో పాతుకుపోయేందుకు ఉద్దేశించిన బలమైన రాజకీయ వ్యూహంలో భాగంగానే రాష్ట్ర పార్టీ నేతలు సోనియాగాంధీని ఇక్కడ రంగంలో దించాలనే పట్టుదలను ప్రదర్శిస్తున్నట్లు సమాచారం. 1980లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తెలంగాణలోని మెదక్ నుంచి పోటీ చేసి విజయం సాధించారు.

రాష్ట్రాన్ని బట్టే వాటా

సీట్ల పంపకాలకు రాష్ట్రాల్లోని పరిస్థితులే ప్రామాణికం

- 255 స్థానాలపై కాంగ్రెస్ కేంద్రీకరణ
- త్వరలోనే ఇండియా కూటమితో చర్చలు
- అభ్యర్థుల ఎంపిక కసరత్తు ప్రారంభం
- పార్టీ ప్రధాన కార్యదర్శులు, ఇన్‌ఛార్జిలు, పీసీసీ చీఫ్‌లు, సీఎల్పీ నేతలతో మల్లిఖార్జున ఖర్గే, రాహుల్ భేటీ

న్యూఢిల్లీ, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ పూర్తిస్థాయిలో ఎన్నికల మూడ్‌లోకి వచ్చేసింది. పార్టీకి కీలకంగా మారనున్న లోక్‌సభ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహం, మేనిఫెస్టో, సీట్ల పంపకాలపై ఏఐసీసీ స్థాయిలో చర్చలు ప్రారంభించింది. మొత్తం లోక్‌సభ సీట్లలో (453 సీట్లలో) గెలుపు అవకాశం ఉన్న 255 నియోజకవర్గాలపై పూర్తిస్థాయిలో శక్తిసామర్థ్యాలను కేంద్రీకరించాలని నిర్ణయించింది. ఆయా రాష్ట్రాల్లోని పరిస్థితులు ఆధారంగా ఇండియా కూటమిలోని భాగస్వామ్యపక్షాలతో సీట్ల పంపకాలపై చర్చ లు జరపాలని తీర్మానించింది. రానున్న రోజుల్లో రాత్రీ పగలూ శక్తివంచన లేకుండా పనిచేయాలని, లోక్‌సభ ఎన్నికల తర్వాత ప్రజలకు ప్రత్యామ్నాయ ప్రభుత్వా న్ని అందించేందుకు కృషి చేయాలని కాంగ్రెస్ శ్రేణులకు పార్టీ జాతీయాధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పిలుపునిచ్చారు. ఆధునిక భారత నిర్మాణంలో, దేశ పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి పునాది వేయటంలో కాంగ్రెస్ పోషించిన పాత్రను ఎప్పటికీ గుర్తుంచుకోవాలని, చరిత్రను మరిపోయేవారు చరిత్రను సృష్టించలేరని చెప్పారు. కాంగ్రెస్ కృషిని కావాలనే తెరమరుగు ప్రయత్నం చేసే మోదీ ప్రభుత్వానికి గట్టి సమాధానం చెప్పాలన్నారు. గురువారం కాంగ్రెస్ ప్రధాన కార్యాలయంలో ఖర్గే అధ్యక్షతన పార్టీ ప్రధాన కార్యదర్శులు, రాష్ట్రాల ఇన్‌చార్జిలు, పీసీసీ అధ్యక్షులు, సీఎల్పీ నేతలతో సమావేశం జరిగింది. మూడు గంటలకు పైగా జరిగిన ఈ భేటీకి పార్టీ అగ్రనేతలు రాహుల్‌గాంధీ, ప్రియాంక గాంధీ కూడా హాజరయ్యారు. సగానికిపైగా లోక్‌సభ నియోజకవర్గాల్లో పార్టీ పోటీ చేయాలని, గెలిచే అవకాశం ఉన్న స్థానాలపై పూర్తిగా దృష్టి కేంద్రీకరించాలని ఈ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు అభ్యర్థుల ఎంపిక ప్రక్రియను ప్రారంభించాలని, తొలి జాబితాను అధిష్ఠానానికి పంపించాలని రాష్ట్రాల విభాగాలను ఆదేశించారు. ఈ వారంలో అన్ని రాష్ట్రాలకు స్క్రీనింగ్ కమిటీలను కూడా పార్టీ హైకమాండ్ నియమించనుంది. వీలైనంత త్వరలో అభ్యర్థుల తొలి జాబితాను ప్రకటించనున్నట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ఇదే సమయంలో ప్రజలకు సానుకూల అజెండాను అందించే లక్ష్యంతో మేనిఫెస్టోను రూపొందించే బాధ్యతను సంబంధిత కమిటీకి అధిష్ఠానం అప్పగించింది. మేనిఫెస్టో కమిటీ తొలిసారిగా సమావేశమై, అజెండాలో చేర్చాల్సిన అంశాలను చర్చించింది. మరోవైపు, భాగస్వామ్య పక్షాలతో సీట్ల పంపకాలపై కసరత్తు కోసం నియమించిన 'జాతీయ అలయన్స్ కమిటీ' ఖర్గేతో ఆయన నివాసంలో సమావేశమై తుదిదఫా చర్చలు జరిపింది. ఈ భేటీలో రాహుల్ కూడా పాల్గొన్నారు. ఇప్పటికే అన్ని రాష్ట్రాల కమిటీలతో చర్చించి సమోదు చేసిన వివరాలను ఖర్గేకు అందించింది. అనంతరం కమిటీ కన్వీనర్ మీడియాతో మాట్లాడుతూ..వేర్వేరు రాష్ట్రాల్లో భిన్న పరిస్థితులు ఉన్నందున రాష్ట్ర స్థాయిలో సీట్ల పంపకాలపై చర్చలు ఉంటాయని, వీలైనంత త్వరలోనే ఇండియా కూటమి పార్టీలతో చర్చలు ప్రారంభిస్తామన్నారు. లోక్‌సభ ఎన్నికల తర్వాత కేంద్రంలో ఇండియా కూటమిని అధికారంలోకి తేవటమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. కాంగ్రెస్ అలయన్స్ కమిటీలో మాజీ సీఎంలు అశోక్ గెహ్లోత్, భూపేశ్ బఘేల్‌లతోపాటు సల్మాన్ ఖుర్షీద్, మోహన్ ప్రకాశ్ సభ్యులుగా ఉన్నారు.



సమావేశంలో పాల్గొన్న ఖర్గే, రాహుల్, ప్రియాంక

అరుణాచల్‌లోనూ రాహుల్ యాత్ర

జనవరి 14న మణిపూర్ నుంచి ప్రారంభమయ్యే రాహుల్ గాంధీ యాత్ర మార్గాన్ని కూడా ఈ సమావేశంలో నిర్ణయించారు. తొలుత భారత్ న్యాయ యాత్ర అని అనుకున్నప్పటికీ.. 'భారత్ జోడో'ను కూడా కలిపి భారత్ జోడో న్యాయ యాత్రగా దీని పేరును మార్చారు. రాహుల్ గతంలో జరిపిన భారత్ జోడో యాత్ర గొప్ప ప్రజాదరణ పొందిన దృష్ట్యా.. ఆ పేరును జోడించాలని ఖర్గేతో సహా అందరూ అభిప్రాయపడ్డారని పార్టీ ప్రధాన కార్యదర్శి జైరాంరమేశ్ మీడియాకు తెలిపారు. కాగా యాత్రలో అరుణాచల్‌ప్రదేశ్‌ను కూడా చేర్చుతూ తాజాగా నిర్ణయం తీసుకున్నారు. మొత్తం 15 రాష్ట్రాల్లోని 110 జిల్లాలు, 100 లోక్‌సభ, 337 అసెంబ్లీ నియోజకవర్గాల్లో యాత్ర సాగనుంది. 67 రోజుల పాటు 6,713 కి.మీ.ల మేర రాహుల్ యాత్ర నిర్వహిస్తారని జైరాం వెల్లడించారు. కాగా, యూపీలో అత్యధికంగా 11 రోజుల పాటు యాత్ర సాగనుంది.

కూటమి కోసం దేనికైనా ఓకే..

వివిధ రాష్ట్రాల్లో బలమైన పొత్తులు ఏర్పర్చుకుని పోటీ చేయాలని, ఏ ఒక్క అవకాశాన్ని కూడా వదులుకోవద్దని సమావేశంలో పాల్గొన్న కాంగ్రెస్ నేతలు అందరూ అభిప్రాయపడ్డారు. ఇండియా కూటమిని బలోపేతం చేయటానికి పార్టీ అధ్యక్షుడు ఖర్గే తీసుకునే ఏ నిర్ణయానికైనా సంపూర్ణంగా మద్దతు ఇస్తామని ముక్తకంఠంతో చెప్పారు. గత పదేళ్ల మోదీ పాలనలో జరిగిన వైఫల్యాలపై పెద్ద ఎత్తున ప్రచారం చేయాలని, దేశ నిర్మాణం కోసం ఎజెండాను ప్రకటించాలని సమావేశం తీర్మానించింది. లోక్‌సభ ఎన్నికల కోసం పార్టీ చేపట్టిన విరాళాల సేకరణ ఆశించిన స్థాయిలో జరగటం లేదని, రెండు వారాల్లో కేవలం రూ.11 కోట్లు మాత్రమే వచ్చాయని, అన్ని రాష్ట్రాల పార్టీల విభాగాలు దీనిపై శ్రద్ధ పెట్టాలని నిర్ణయించారు.

బీజేపీ అబద్ధాలను తిప్పికొట్టాలి

ఏఐసీసీలో జరిగిన కాంగ్రెస్ నేతల సమావేశాన్ని ప్రారంభిస్తూ ఖర్గే ప్రసంగించారు. మోదీ పదేళ్ల పాలన తాలూకు వైఫల్యాలను కప్పిపుచ్చటానికి బీజేపీ భావోద్వేగపూరిత అంశాలను లేవనెత్తుతున్నదని విమర్శించారు. బీజేపీ వాళ్ల కావాలనే ప్రతి అంశంలో కాంగ్రెస్‌పై బురద చల్లుతున్నారని, పార్టీ శ్రేణులు సమైక్యంగా ఉండి ఈ అబద్ధాలను తిప్పికొట్టాలన్నారు. తమ మధ్య ఉండే విభేదాలను పక్కనపెట్టి ఒకే టీమ్‌లాగా పని చేయాలని, పార్టీలోని అంతర్గత అంశాలను మీడియా ముందు లేవనెత్తవద్దని, పార్టీ గెలుపు కోసం కృషి చేయాలని నేతలకు సూచించారు. ఇండియా కూటమి క్షేత్రస్థాయిలో కార్యకర్తల బలం, బలమైన సిద్ధాంతంతో కూడిన పార్టీల వేదిక అని ఖర్గే చెప్పారు. రాహుల్‌గాంధీ మాట్లాడుతూ, వచ్చే ఎన్నికల్లో ఇండియా కూటమి గెలుస్తుందనే భరోసాతో పని చేయాలని, తద్వారా కూటమి గెలుపునకు అవసరమైన విధంగా ప్రజాభిప్రాయాన్ని మలచాలని సూచించారు. పార్టీని నష్టపరిచేలా వ్యాఖ్యలు చేయవద్దని, పార్టీ క్రమశిక్షణ పాటించని వారిపై అధిష్ఠానం కఠిన చర్యలు తీసుకుంటుందని హెచ్చరించారు.

అప్పనంగా రూ.50 కోట్లకు 'టెండరు'

అమెరికా కంపెనీకి ఆన్‌లైన్ కోర్సు ప్రాజెక్టు

అమరావతి, జనవరి 4(ఆంధ్రజ్యోతి) :ప్రతి రూపాయి ఖర్చుకూ పక్కాగా లెక్క అంటూ ప్రచారం చేసుకునే జగన్ ప్రభుత్వం ఏడాదికి రూ.50కోట్లు ఇచ్చే ప్రాజెక్టును అప్పనంగా ఓ కంపెనీకి కట్టబెట్టింది. ఎలాంటి టెండర్లు, రెండో ఆలోచన లేకుండా ఎడ్‌ఎక్స్ అనే అమెరికన్ కంపెనీకి లాభం చేకూర్చాలని నిర్ణయించింది. విదేశీ యూనివర్సిటీల్లోని కోర్సులను రాష్ట్రంలోని విద్యార్థులకు ఆన్‌లైన్‌లో అందుబాటులోకి తేవాలని రాష్ట్ర ప్రభుత్వం ఆలోచన చేసింది. వాటిని రాష్ట్ర విద్యార్థులకు అందించేందుకు ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌ను ఎంపిక చేయాలని నిర్ణయించింది. అయితే ప్రపంచంలో ఒకేఒక్క ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్ ఎడ్‌ఎక్స్ కంపెనీ అని ముందే నిర్ణయించేసుకున్న ప్రభుత్వం, ఆ కంపెనీతో మాత్రమే చర్చలు జరిపింది. గతేడాది ఆగస్టు 14న విదేశీ వర్సిటీల్లోని కోర్సులను రాష్ట్రంలోని విద్యార్థులకు అందుబాటులోకి తేవాలని సీఎం జగన్ ఆదేశిస్తే.. సరిగ్గా మూడు రోజుల వ్యవధిలో ఎడ్‌ఎక్స్ అనే కంపెనీని వెతికి తీసుకొచ్చి ఎంవోయూ చేసుకున్నారు. దీనిబట్టి ఈ వ్యవహారం వెనుక ముందస్తు కథ నడిచిందని అర్థమవుతోంది. దీంతో సీఎం ఆదేశించినట్లు, దాంతో ఆ కంపెనీని ఎంపిక చేసినట్లు ఉన్నత విద్యాశాఖ చెప్పుకొచ్చింది. ఈమేరకు ఎడ్‌ఎక్స్ కంపెనీకి ఏడాదికి రూ.49.9కోట్లు(6 మిలియన్ల యూఎస్ డాలర్లు) ఇచ్చేందుకు అనుమతిస్తూ ఉన్నత విద్యాశాఖ గురువారం ఉత్తర్వులు జారీచేసింది. ఆ కంపెనీ ఏడాదికి 4లక్షల కోర్సుల లైసెన్సులు ఇస్తుందని తెలిపింది. ఈ లైసెన్సులను రాష్ట్రంలో ఉన్నత విద్యను అభ్యసిస్తున్న 12లక్షల మంది విద్యార్థులు ఉపయోగించుకుంటారని వివరించింది. అంటే ఏటా రూ.50 కోట్లు ఆ కంపెనీకి చెల్లించాలని పరోక్షంగా స్పష్టంచేసింది. ఈ నగదును ఉన్నత విద్యామండలి ద్వారా ప్రభుత్వం ఒకేసారి చెల్లిస్తుందని తెలిపింది. ఈ ప్రాజెక్టును నామినేషన్ ఆధారంగా ఇచ్చినట్లు ప్రభుత్వమే తన ఉత్తర్వుల్లో తెలిపింది. కానీ ప్రపంచంలో ఇలాంటి కంపెనీలు ఉన్నాయా లేవా అనే వివరాలను మాత్రం వెల్లడించలేదు.

అది లాభాపేక్ష కంపెనీ.. ప్రభుత్వం ఒప్పందం చేసుకున్న ఎడ్‌ఎక్స్ కంపెనీ పూర్తిగా లాభాపేక్ష కంపెనీ. గతంలో చేసుకున్న విద్యా సంబంధిత ఒప్పందాలన్నీ లాభాపేక్ష లేని ఎన్‌జీవోలతో చేసుకున్నారు. అయితే ఇదే విషయంపై గతంలో ఓసారి బొత్స సత్యనారాయణ విలేకరులతో మాట్లాడారు. టెండర్లు లేకుండా ఒప్పందాలు చేసుకున్నందుకు గర్వపడుతున్నామని సెలవిచ్చారు. ప్రపంచంలో ఇలాంటి కంపెనీలు ఇంకెక్కడా లేనందునే వీటిని నేరుగా ఎంపిక చేసినట్లు చెప్పుకొచ్చారు.

స్కిల్ కేసుపై అలా... ఇప్పుడిలా

గత ప్రభుత్వంలో చేపట్టిన స్కిల్ డెవలప్‌మెంట్ కేసును జగన్ ప్రభుత్వం పెద్ద కుంభకోణం అన్నట్టు ప్రచారం చేసింది. ఆ కేసులోనే మాజీ సీఎం చంద్రబాబును అరెస్టు చేసింది. అప్పట్లో షెల్ కంపెనీల ద్వారా నగదు మళ్లించి విద్యార్థులకు శిక్షణ ఇవ్వకుండా రూ.370కోట్లు వృథా చేశారని ఆరోపణలు చేసింది. మరి టెండర్ల మాట లేకుండా అడ్డగోలుగా ఏడాదికి రూ.50 కోట్లు ఇచ్చే ప్రాజెక్టుకు ఏకపక్షంగా ఒక కంపెనీకి ఇచ్చేయడాన్ని ఏమంటారని విద్యానిపుణులు ప్రశ్నిస్తున్నారు.

జగన్ 'బటన్' నొక్కినా మంత్రి ముహూర్తం మార్చారు

- పింఛన్ల పంపిణీ వాయిదా వేసిన చెల్లుబోయిన

రాజమహేంద్రవరం రూరల్, జనవరి 4: రాష్ట్రవ్యాప్తంగా సామాజిక పింఛన్ల పంపిణీకి బుధవారం కాకినాడ వేదికగా సీఎం జగన్ బటన్ నొక్కారు. నియోజకవర్గాల ఇన్‌చార్జ్‌లు అదే రోజు పంపిణీ చేస్తారని ప్రచారం చేసుకొన్నారు. కానీ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ. 'సీఎం జగన్ బటన్ నొక్కితే నాకేంటి? నాదారి నాది' అన్నట్లు ముహూర్తం తేదీ మార్చేశారు. తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రి రూరల్ నియోజకవర్గం పరిధిలో పెన్షన్ల పంపిణీని 6వ తేదీకి వాయిదా వేశారు. ఇటీవల రాజమహేంద్రవరం రూరల్ వైసీపీ సమన్వయకర్తగా మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణను నియమించారు. నియోజకవర్గ ఇన్‌చార్జిగా మంత్రికి పెన్షన్ల పంపిణీ మొదటి కార్యక్రమం. మంచిరోజులు కావని భావించి 6వ తేదీకి వాయిదా వేసినట్లు సమాచారం. దీనిపై డీఆర్‌డీఏ పీడీ మూర్తిని వివరణ కోరగా, జిల్లా వ్యాప్తంగా 1 నుంచి 6వ తేదీ వరకు పింఛన్ల పంపిణీ కార్యక్రమం షెడ్యూల్ ఇచ్చామని చెబుతూ రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గంలో పంపిణీ విషయంపై మాట దాటవేశారు.

రైలులో ప్రయాణికురాలిపై అసభ్య ప్రవర్తన

బెంగళూరు, జనవరి 4(ఆంధ్రజ్యోతి): రైలులో నిద్రిస్తున్న మహిళ వీర్యస్కలనం చేసిన వ్యక్తిని ఉత్తరకన్నడ జిల్లా గోకర్ణలో బుధవారం సాయంత్రం పోలీసులు అరెస్టు చేశారు. కేరళ రాష్ట్రం కోజికోడ్‌కు చెందిన ఓ యువతి, ఆమె స్నేహితులు ఇద్దరు సినిమాటోగ్రఫీ, వీడియో గ్రాఫర్‌లుగా పనిచేస్తున్నారు. వీరు గోవాలో కొన్ని వీడియోలు చిత్రీకరించేందుకు కేరళ నుంచి గోవాకు వెళ్లే రైలులో బయలుదేరారు. ఆమె స్నేహితులిద్దరికి ఒక చోట, ఆమెకు మరోచోట బెర్త్ లభించడంతో అక్కడే నిద్రపోయారు. రైలు బుధవారం ఉదయం సుమారు 7 గంటల సమయంలో గోకర్ణ స్టేషన్‌కు చేరింది. ఆ సమయంలో మహారాష్ట్రలోని సాంగ్లి పట్టణానికి చెందిన దత్తాత్రేయ చవాన్ అనే వ్యక్తి యువతి బెర్త్ వద్దకు వచ్చి హస్త ప్రయోగం చేశాడు. అలికిడి నిద్రలేచిన యువతి.. గట్టిగా కేకలు వేసింది. దీంతో ఆమె స్నేహితులు, తోటి ప్రయాణికులు మేల్కొని అతడిని పట్టుకుని చితకబాదారు. సమాచారం అందుకున్న పోలీసులు నిందితుడిని అరెస్టు చేశారు. బాధితురాలి నుంచి ఫిర్యాదు స్వీకరించారు.

టీడీపీకి 160 స్థానాలు ఖాయం

- బాబు, లోకేశ్ ఆధ్వర్యంలో బీసీ డిక్లరేషన్
- 'జయహో బీసీ' సదస్సులో అచ్చెన్నాయుడు

అమరావతి, జనవరి 4(ఆంధ్రజ్యోతి): వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో 160కు పైగా స్థానాలను తెలుగుదేశం పార్టీ గెలవబోతోందని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజారపు అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. జగన్‌రెడ్డి పార్టీని ప్రజలు బంగాళాఖాతంలో కలిపేందుకు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. గురువారమిక్కడ టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటుచేసిన 'జయహో బీసీ' సదస్సులో ఆయన మాట్లాడారు. బడుగు, బలహీనవర్గాలకు రాజకీయ అవకాశాలు కల్పించింది తెలుగుదేశం పార్టీనేనని, బీసీలు టీడీపీ వెంట ఉన్నారనే అక్కసుతో జగన్ దండయాత్ర చేస్తున్నారని ఆరోపించారు. జగన్ ఇచ్చిన కార్పొరేషన్ చైర్మన్ పదవులు నాలుక గీసుకోవడానికి కూడా పనికిరావని ఎద్దేవా చేశారు. కార్పొరేషన్ల ద్వారా ఒక్కరికైనా రుణం ఇచ్చిన దాఖలాలు ఉన్నాయా అని నిలదీశారు. త్వరలో చంద్రబాబు, లోకేశ్ ఆధ్వర్యంలో బీసీ డిక్లరేషన్ ప్రకటిస్తామని తెలిపారు. టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు మాట్లాడుతూ జగన్ పెత్తందారీ పాలనను అంతమొందించేందుకు బీసీలు నడుం బిగించాలని కోరారు. టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష మాట్లాడుతూ రెండు తెలుగు రాష్ట్రాల్లో బీసీల కోసం ఎనలేని కృషి చేసిన గౌతు లచ్చన్నను వైసీపీ నేతలు అవమానకరంగా మాట్లాడారని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశానికి అధ్యక్షత వహించిన టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు కొల్లు రవీంద్ర మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 40 రోజుల్లో 922 మండల కేంద్రాల్లో 'జయహో బీసీ' సభలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

తల్లి, చెల్లి సహా ఏ మహిళనూ జగన్ గౌరవించరు

- రఘురామ

న్యూఢిల్లీ, జనవరి 4(ఆంధ్రజ్యోతి): తల్లి, చెల్లితోసహా రాష్ట్రంలోని ఏ ఒక్క మహిళను సీఎం జగన్ గౌరవంగా చూడడం లేదని.. ప్రస్తుతం ప్రేమగా చూసుకునేది ఆయన శ్రీమతి, కూతుర్లను మాత్రమేనని ఎంపీ రఘురామకృష్ణరాజు అన్నారు. తల్లిని, చెల్లిని వెళ్లగొట్టి నాకు ఎవరూ లేరు మొర్రో అని అనడం జగన్ వైఖరిని తెలియజేస్తోందన్నారు. గురువారం రఘురామరాజు ఢిల్లీలో మీడియాతో మాట్లాడారు. అంగన్వాడీలు, ఆశా వర్కర్లతోపాటు మున్సిపల్ కార్మికులు రోడెక్కారని, వారిని ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాలు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు ప్రభుత్వం రూ.31 వేల కోట్లు బకాయిలు ఉన్నప్పటికీ వారు నిమ్మకు నీరెత్తినట్లు ఉన్నారని విమర్శించారు.

తెలుగు మహాసభలకు రాజమహేంద్రవరం ముస్తాబు

- నేటి నుంచి మూడు రోజుల పాటు నిర్వహణ

రాజమహేంద్రవరం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ రెండవ తెలుగు మహాసభలకు రాజమహేంద్రవరం ముస్తాబైంది. ఆంధ్ర సారస్వత పరిషత్, చైతన్య విద్యాసంస్థల సంయుక్త ఆధ్వర్యంలో రాజరాజనరేంద్ర పట్టాభిషేక సహస్రాబ్ది నీరాజనంగా రెండవ అంతర్జాతీయ తెలుగు మహాసభలను శుక్రవారం నుంచి నిర్వహించనున్నట్టు ప్రముఖ గజల్ గాయకుడు గజల్ శ్రీనివాస్, చైతన్య విద్యాసంస్థల చైర్మన్ కేవీవీఎస్ఎన్.రాజు(చైతన్యరాజు) గురువారం తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం సమీపంలోని దివాన్‌చెరువులో గల గైట్ కళాశాలల ప్రాంగణంలో ఈ నెల 5, 6, 7 తేదీల్లో ఈ మహాసభలు జరగనున్నాయి. వీటి కోసం ఆదికవి నన్నయ వేదిక, నారాయణభట్టు వేదిక, రాజరాజనరేంద్ర వేదికలు సిద్ధం చేశారు.

బీసీలను ముంచేశారు!

(మొదటి పేజీ తరువాయి)

దీని వైభోగమని స్పష్టం చేశారు. గురువారమిక్కడ టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆ పార్టీ బీసీ విభాగం అధ్యక్షుడు కొల్లు రవీంద్ర ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన 'జయహో బీసీ' సదస్సులో చంద్రబాబు ప్రసంగించారు. వచ్చే ఎన్నికల్లో ఎట్టి పరిస్థితుల్లో జగన్ గెలిచే ప్రసక్తే లేదన్నారు. టీడీపీని అధిక మెజారిటీ గెలిచేందుకు బీసీలందరూ నడుం బిగించాలని కోరారు. తాము వచ్చాక బీసీలను ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా బలోపేతం చేస్తామన్నారు. వచ్చే 40 రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా ప్రతి మండలంలో సమావేశం నిర్వహించి టీడీపీ సానుభూతిపరులను చైతన్యపరచడమే కాకుండా గ్రామాల్లో ప్రభావిత వర్గాలను కూడా కలుపుకొని చర్చించాలని పార్టీ నేతలకు సూచించారు. ఈ ప్రభుత్వం దిగిపోవాల్సిన ఆవశ్యకతను వారికి వివరించాలన్నారు. వచ్చే 20-30 ఏళ్లలో ఆంధ్రప్రదేశ్‌ను ప్రపంచంలోనే నంబర్ వన్ రాష్ట్రంగా చూడాలని లక్ష్యంగా పెట్టుకున్నానని చెప్పారు. సమాజంలో అణగారిన బీసీలను ఆర్థికంగా, సామాజికంగా బలోపేతం చేసేందుకు పీ4 మోడల్‌ను ఎంచుకున్నామన్నారు. 'బీసీల కోసం ప్రత్యేక రక్షణ చట్టం తీసుకొచ్చేందుకు సూపర్ సిక్స్‌లో చేర్చాం. వారిపై చేయి వేసిన వారి అంతు చూసే చట్టం తెస్తాం. జగన్ పది రూపాయలిచ్చి వంద రూపాయలు లాగేసుకుంటున్నాడని.. రూ.15 ఇచ్చి వంద సంపాదించేలా చేసే మనస్తత్వం తనదని చెప్పారు. తెలివి కొందరి సొత్తేమీ కాదని, ప్రపంచంలో ఎక్కువ సంపాదించే వాళ్లు తెలుగువాళ్లేనన్నారు. ఇంకా ఏమన్నారంటే..

నలుగురు రెడ్లే బాగుపడ్డారు..

జగన్ ప్రభుత్వంలో పెద్దిరెడ్డి, సాయిరెడ్డి, సుబ్బారెడ్డి, సజ్జల రామకృష్ణారెడ్డి నలుగురు రెడ్లే బాగుపడ్డారు. మిగిలిన రెడ్లు అందరూ నష్టపోయారు. జగన్ పథకాలతో ఆయన పత్రిక, టీవీలకు ఆదాయం తప్ప రాష్ట్రంలో ఎవరూ బాగుపడలేదు. బీసీలంటే చులకన కాబట్టే జగన్ వారిని వేరే నియోజకవర్గాలకు బదిలీ చేస్తున్నారు. బియ్యపురెడ్డిని, పెద్దిరెడ్డిని, ద్వారంపూడిని ఎందుకు మార్చలేదు? బట్టలిప్పిన గోరంట్ల మాధవ్‌ను ఎక్కడకు పంపారో అర్థం కాలేదు. జగన్ పాలనలో బీసీల ఊచకోత జరిగింది. పల్నాడులో 16 మందిని వైసీపీ హత్య చేసింది. వేల సంఖ్యలో తప్పుడు కేసులు పెట్టింది. 300 మంది బీసీలపై అన్యాయంగా కేసులు నమోదు చేశారు. మాచర్లలో జై జగన్ అంటే వదిలేస్తానని చంద్రయ్యను బెదిరిస్తే.. ప్రాణం పోయినా అనను అంటే గొంతు కోసి ప్రాణం తీశారు. నా కుటుంబ సభ్యుడిని కోల్పోయానని బాధపడ్డాను. చంద్రయ్య పాడె మోశాను. ప్రొద్దుటూరులో ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి అవినీతి, అరాచకంపై పోరాడిన నందం సుబ్బయ్యను చంపేశారు. జగన్‌ను ప్రశ్నించిన వాళ్లందరిపైనా తప్పుడు కేసులు పెట్టారు.



జయహో బీసీ వాహనాలను ప్రారంభిస్తున్న టీడీపీ అధినేత చంద్రబాబు

టీడీపీ నేతలు అచ్చెన్నాయుడు, కొల్లు రవీంద్ర, కూన రవికుమార్, యనమల రామకృష్ణుడు, అయ్యన్నపాత్రుడు, కళావెంకట్రావు, బండారు సత్యనారాయణమూర్తి తదితరులపైనా దొంగ కేసులు పెట్టారు.

సగం అప్పు బీసీలు తీర్చాలి..

జగన్ రూ.13 లక్షల కోట్లు అప్పు చేశారు. ఎన్నికల తర్వాత ఆయన ఉండదు. ఈ భారమంతా రాష్ట్ర ప్రజలపైనే పడుతుంది. ఇందులో సగం అప్పు రూ.6.5 లక్షల కోట్లు.. 50 శాతం జనాభా ఉన్న బీసీలపైనే మోపుతారు. రాష్ట్రంలో ధరలు విపరీతంగా పెరిగాయి. విద్యుత్ చార్జీలు, పన్నులను జగన్ పెంచుతూనే ఉన్నారు. ఆయన చెబుతున్న సంక్షేమ పథకాలన్నీ డొల్లే. చేనేత కార్మికులకు రూ.24 వేలు ఇస్తామన్నారు. 4 లక్షల మందిలో 80 వేల మందికి ఇచ్చి అందరికీ ఇచ్చినట్లు డబ్బా కొట్టుకుంటున్నారు. అబద్ధాలు చెప్పడంలో జగన్ దిట్ట. మత్స్యకారులకు మోసం చేశారు. ప్రమాదంలో మరణించిన మత్స్యకారులకు రూ.10 లక్షల బీమా అంటూ ఇచ్చిన హామీలేవీ నెరవేర్చలేదు. బీసీలకు ఏటా రూ.15 వేల కోట్ల చొప్పున సబ్‌ప్లాన్ ద్వారా అందిస్తామని జగన్ హామీ ఇచ్చి ఐదేళ్లలో రూ.75 వేల కోట్లు బాకీపడ్డారు. ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ఏ ముఖం పెట్టుకుని సాధికార యాత్ర చేస్తున్నారు? టీడీపీ మంజూరుచేసిన బీసీ కమ్యూనిటీ భవనాలను జగన్ రద్దు చేశారు. మేం ప్రారంభించిన బెస్ట్ అవైలబుల్ స్కూళ్లు, నైపుణ్యాభివృద్ధి కేంద్రాలు, స్టడీ సర్కిల్స్‌ను కూడా తీసివేశారు. వెయ్యి కోట్లతో ఆదరణ పనిముట్లను టీడీపీ ప్రభుత్వం కొనుగోలు చేసింది. వాటిని జగన్ సర్కారు పంపిణీ చేయకుండా గోడౌన్లలో ఉంచి పాడు చేసింది. బీసీ కార్పొరేషన్లకు ఒక్క పైసా కూడా నిధులు విడుదల చేయడం లేదు. నిధుల్లేని కార్పొరేషన్లు ఎందుకు? జ్యోతిబా పూలే తర్వాత దేశంలోనే బీసీల గురించి ఆలోచించింది ఎన్టీఆర్‌నే. నా హయాంలో బీసీల ఆర్థిక ఎదుగుదలకు కృషి చేశానన్నారు. వారికి రాజకీయంగా 34 శాతం రిజర్వేషన్లు ఇస్తే జగన్ 24 శాతానికి తగ్గించారు.

సమర్థ నేతలుగా తయారు కావాలి..

బీసీలు రాజకీయంగా ఎదగాలి. అందుకు టీడీపీ సహకరిస్తుంది. ఎమ్మెల్యే, ఎంపీ, ఎమ్మెల్సీ పదవులిస్తాం. అయితే ఆ మేరకు సామర్థ్యమున్న లీడర్లుగా వారు తయారు కావాలి. వైసీపీ కంటే టీడీపీలోనే బీసీ నాయకులు ఎక్కువ. బీసీ నాయకులను తయారుచేసే యూనివర్సిటీ టీడీపీ. చేతి వృత్తులు, కుల వృత్తుల్లో ఉన్న బీసీలు ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా ఎదిగేందుకు టీడీపీ అన్ని చర్యలూ తీసుకుంటుంది. ఈ ప్రభుత్వాన్ని గద్దె దించి టీడీపీ ప్రభుత్వంలో ప్రధాన భాగస్వాములు కావాలి. గత 42 ఏళ్లుగా బీసీలకు టీడీపీ చేసిన దాని కంటే వచ్చే ఐదేళ్లలో ఎక్కువ ప్రయోజనం చేకూర్చి మీ రుణం తీర్చుకుంటాం.

అమరావతిని పూర్తిచేసేది మేమే

రాష్ట్రంలో విధ్వంస పాలనకు జగన్ తెరదీశారు. మూడు రాజధానులంటూ అమరావతి రాజధానిని సర్వనాశనం చేశారు. అమరావతి కేసును సుప్రీంకోర్టు ఏప్రిల్‌కు వాయిదా వేసింది. అప్పటికి ఈ సీఎం అధికారంలో ఉండరు. రాబోయే టీడీపీ-జనసేన ప్రభుత్వమే ఏకైక రాజధాని అమరావతిని పూర్తి చేస్తుంది.

జయహో బీసీ ప్రచార రథాలు..

జయహో బీసీ ప్రచార రథాలను చంద్రబాబు పార్టీ కార్యాలయం వద్ద జెండా ఊపి ప్రారంభించారు. ఒక్కో పార్లమెంటు స్థానానికి రెండు చొప్పున యాభై రథాలను ప్రారంభించారు. 175 నియోజకవర్గాల్లో నేతలు పర్యటించి బీసీలకు టీడీపీ ప్రభుత్వం ఏం చేసింది.. మళ్లీ అధికారంలోకి వస్తే ఏం చేస్తుందో నేతలు వివరిస్తారు. బీసీలకు జగన్ చేసిన అన్యాయంపై చైతన్యం తీసుకొస్తారు.

ఎన్నికల నిర్వహణకు కార్యాచరణ సిద్ధం చేయండి

- అధికారులకు సీఎస్ జవహర్‌రెడ్డి ఆదేశం

అమరావతి, జనవరి 4(ఆంధ్రజ్యోతి): వచ్చే సాధారణ ఎన్నికలు పటిష్టంగా, సక్రమంగా నిర్వహించేందుకు వీలుగా సంబంధిత శాఖలు ఇప్పటి నుంచే తగిన కార్యాచరణను సిద్ధం చేసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి ఆదేశించారు. గురువారం అమరావతి సచివాలయంలో ఆయన అధికారులతో సమీక్షించారు. ఈ సమావేశంలో ఎన్నికల నిర్వహణకు అవసరమైన సిబ్బంది కేటాయింపుపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనాతో చర్చించారు. పోలింగ్ కేంద్రాల్లో ఉండాల్సిన కనీస సౌకర్యాలపై సీఎస్ సమీక్షించారు. రానున్న ఎన్నికల్లో డబ్బు, మద్యం వంటివి అక్రమ రవాణా నియంత్రణకు రాష్ట్ర సరిహద్దుల్లో చెక్ పోస్టులు ఏర్పాటు చేయాలన్నారు. ఎన్నికల నిర్వహణకు పోలీస్, రెవెన్యూ, ఎక్సైజ్, వాణిజ్య పన్నులు, రవాణా, ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్, విద్య, మున్సిపల్ శాఖలన్నీ తగిన కార్యాచరణ సిద్ధం చేసుకోవాలని సీఎస్ ఆదేశించారు. సీఈవో ముఖేష్‌కుమార్ మీనా మాట్లాడుతూ.. ఎన్నికల సన్నాహక ఏర్పాట్లపై సమీక్షకు కేంద్ర ఎన్నికల సంఘం ఈ నెల 9న రాష్ట్రానికి రానుందని తెలిపారు. 10న విజయవాడలో వివిధ శాఖల అధికారులతో సమీక్షిస్తారని తెలిపారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ రవి ప్రకాశ్ మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్రంలో అంతర్ రాష్ట్ర సరిహద్దుల్లో 29 ఇంటిగ్రేటెడ్ చెక్ పోస్టులున్నాయని వాటిని పటిష్టంగా నిర్వహించడం ద్వారా డబ్బు, మద్యం, గంజాయి, మత్తుపదార్థాల అక్రమ రవాణా నివారణకు చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు.

చెల్లికి ఆస్తి, పదవులు మేం ఇవ్వొద్దన్నామా?

- జగన్‌పై తులసిరెడ్డి విసుర్లు

అమరావతి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): 'సొంత చెల్లెలు షర్మిలకు పదవి ఇవ్వొద్దని కాంగ్రెస్ నేతలు చెప్పారా..? ఆస్తులు పంచొద్దని చంద్రబాబు చెప్పారా..? పరిమళ్ నత్వానీకి పదవి ఇవ్వాలని పవన్ కల్యాణ్ సిఫారసు చేశారా..? కన్న తల్లిని పార్టీ నుంచి నిర్దాక్షిణ్యంగా పంపించేయమని ఎవరన్నా ఒత్తిడి చేశారా..? వివేకా హత్య కేసు నీరు గార్చేయమని ఎవరడిగారు..? న్యాయం అడిగిన సునీతపై పులివెందులలో కేసు పెట్టమని అక్కడ ఎవరైనా చెప్పారా..' అని సీఎం జగన్‌పై కాంగ్రెస్ సీనియర్ నేత ఎస్.తులసిరెడ్డి మండిపడ్డారు. గురువారం విజయవాడలో రాష్ట్ర కాంగ్రెస్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కుటుంబాలను చీలుస్తారు.. కుట్రలు చేస్తారు.. అంటూ జగన్ బుధవారం కాకినాడలో చేసిన వ్యాఖ్యలను ఆయన తిప్పికొట్టారు. కన్న తల్లిని, సొంత చెల్లిని, రాష్ట్రంలో తల్లి పాత్ర పోషిస్తున్న లక్షలాది మంది అంగన్వాడీలను ఏడిపిస్తున్న జగన్.. కుటుంబ విలువలు, బాంధవ్యాల గురించి మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. వైఎస్ అభిమానులు.. ఆయన కుమార్తె అడుగుజాడల్లో నడవాలని ఏపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జంగా గౌతమ్ కోరారు.

మళ్లీ అధికారంలోకి వస్తే రోడ్లేస్తాం: ధర్మాన

శ్రీకాకుళం అర్బన్, జనవరి 4: 'వలంటీర్లు పింఛన్లు పంచడమే కాదు. మన గుర్తును ప్రజల్లోకి తీసుకెళ్లాలి' అని మంత్రి ధర్మాన ప్రసాదరావు వలంటీర్లకు హితోపదేశం చేశారు. శ్రీకాకుళం రూరల్ మండలం సింగుపురంలో గురువారం నిర్వహించిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. 'ప్రజలందరికీ డబ్బులు పంచేస్తున్నారని, రోడ్లపై కార్లు సాఫీగా వెళ్లడం లేదని కొందరికి కోపాలొస్తున్నాయి. మరోసారి అధికారంలోకి వస్తే రోడ్ల నిర్మాణం చేపడతాం.' అన్నారు.



బిల్లుమడలో బాధిత కుటుంబానికి చెక్కు అందిస్తున్న నారా భువనేశ్వరి

అంగన్వాడీలకు అండగా ఉంటాం

- అధికారంలోకి వచ్చాక సమస్యలు పరిష్కరిస్తాం
- మన్యం జిల్లాలో భువనేశ్వరి హామీ
- బాబు అరెస్టు తట్టుకోలేక చనిపోయిన వారి కుటుంబాలకు పరామర్శ

పార్వతీపురం, జనవరి 4(ఆంధ్రజ్యోతి): అంగన్వాడీలకు అండగా ఉంటామని నారా భువనేశ్వరి తెలిపారు. వారి అధికారంలోకి రాగానే వారి సమస్యలు పరిష్కరిస్తామని ఆమె హామీ ఇచ్చారు. 'నిజం గెలివాలి' పాదయాత్రలో భాగంగా గురువారం ఆమె పార్వతీపురం మన్యం జిల్లా పాలకొండ నియోజకవర్గంలో పర్యటించారు. జిల్లాలోని భామినిలో భువనేశ్వరికి అంగన్వాడీలు తమ సమస్యలను విన్నవించారు. టీడీపీ అధికారంలోకి రాగానే సమస్యలు పరిష్కరిస్తామని భువనేశ్వరి హామీ ఇవ్వడంతో అంగన్వాడీలు హర్షం వ్యక్తం చేశారు. టీడీపీ అధినేత చంద్రబాబు అక్రమ అరెస్టును తట్టుకోలేక మృతి చెందిన వారి కుటుంబాలను భువనేశ్వరి పరామర్శించారు. వారికి టీడీపీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. పాలకొండలోని కోటదుర్గ గుడి నుంచి సీతంపేట, కొత్తూరు మండలాల మీదుగా భామిని మండలం బిల్లుమడ గ్రామానికి భువనేశ్వరి చేరుకున్నారు. చంద్రబాబు అరెస్ట్‌తో కలతచెంది ఆ గ్రామానికి చెందిన బర్రె విశ్వనాథం మరణించారు. విశ్వనాథం భార్య వనజాక్షి, పిల్లలను భువనేశ్వరి ఓదార్చారు. ఆమెను భువనేశ్వరి ఓదార్చుతూ కుటుంబానికి టీడీపీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా రూ.మూడు లక్షల చెక్కును వనజాక్షికి అందించారు.

చంద్రబాబు సీఎం కావాలి... గిరిజనుల నినాదాలు

పాలకొండ, సీతంపేట, భామినిలో భువనేశ్వరికి తెలుగు తమ్ముళ్లు ఘన స్వాగతం పలికారు. సీతంపేటలో గిరిజనులతో భువనేశ్వరి మమేకమై మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీని గెలిపిస్తామని, చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని గిరిజనులు నినాదాలు చేశారు. ఈ పర్యటనలో టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు కిమిడి కళా వెంకటరావు, గుమ్మిడి సంధ్యారాణి, తెలుగు మహిళా రాష్ట్ర అధ్యక్షురాలు వంగలపూడి అనిత, ఎమ్మెల్సీ అనూరాధ, పాలకొండ, కురుపాం నియోజకవర్గాల ఇన్‌చార్జిలు నిమ్మక జయకృష్ణ, తోయక జగదీశ్వరి, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాబు-పవన్‌తోనే వెళ్దాం!

- ఒంటరి పోరుతో సీట్లు రావు!!
- మెజారిటీ కమలనాథుల మనోగతం
- కోర్ కమిటీ భేటీకి 40 మంది హాజరు
- శివప్రకాశ్‌తో నాదెండ్ల మనోహర్ భేటీ

అమరావతి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): 'జగన్ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉంది.. ఇటువంటి అవినీతి, అరాచక పాలనకు మంగళం పాడాలంటే పొత్తు ఉండాల్సిందే.. మన మిత్రుడు పవన్ కల్యాణ్ అటు వెళ్లిపోయారు.. మనం ఒంటరిగా వెళ్తే కాసిన్ని ఓట్లు పెరగొచ్చేమోగానీ సీట్లు రావడం కష్టమే' అని రాష్ట్ర బీజేపీ నేతలు అభిప్రాయపడ్డారు. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో గుంటూరు జిల్లా ఉండవల్లిలో రాష్ట్ర బీజేపీ కోర్ కమిటీ సమావేశమైంది. దగ్గుబాటి పురందేశ్వరి నేతృత్వంలో జరిగిన ఈ భేటీకి పార్టీ జాతీయ సంఘటన ప్రధాన కార్యదర్శి శివప్రకాశ్, మాజీ సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి సహా సుమారు 40 మంది కీలక నేతలు హాజరయ్యారు. జగన్ ప్రభుత్వంపై ప్రజా వ్యతిరేకత ఏ స్థాయిలో ఉంది.. జనం ఎటు మొగ్గు చూపుతున్నారు.. టీడీపీ-జనసేన కలిసి వెళ్తే ఫలితాలు ఎలా ఉంటాయి.. బీజేపీ ఎటువంటి నిర్ణయం తీసుకోవాలి.. అనే అంశాలపై చర్చ జరిగింది. ఎవరికి వారు పరిస్థితులు వివరించగా.. అభిప్రాయాలను లిఖితపూర్వకంగా సీల్డ్ కవర్‌లో ఇవ్వాలని శివప్రకాశ్ సూచించారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. మెజారిటీ నేతలు టీడీపీ-జనసేనతో బీజేపీ జట్టుకడితేనే మంచి ఫలితాలు ఉంటాయని స్పష్టం చేసినట్లు జాతీయ స్థాయిలో సర్వేలు నిర్వహించే ఒక ప్రజాప్రతినిధి.. పొత్తు ఉంటేనే సీట్లు వస్తాయనగా.. మాజీ మంత్రి ఆదినారాయణరెడ్డి, మరికొందరు సమర్థించినట్లు తెలిసింది. గోదావరి జిల్లాలకు చెందిన ఓ నాయకుడు మాట్లాడుతూ..



రాష్ట్ర బీజేపీ కోర్ కమిటీ సమావేశంలో ప్రసంగిస్తున్న పురందేశ్వరి

'పొత్తుతో పార్టీలోకి కొత్తగా వచ్చిన వాళ్లే పదవులు పొందుతారు.. ఎప్పటి నుంచో ఉన్న సీనియర్ల పరిస్థితి మాత్రం అలాగే ఉంటుంది' అని అన్నప్పుడు కిరణ్‌కుమార్‌రెడ్డి ఘాటుగా స్పందించారు. 'పార్టీల్లో చేరికలు ప్రతి చోటా ఉంటాయి.. మీకు చేతనైతే మమ్మల్నెందుకు చేర్చుకుంటారు' అని అనడం సమావేశంలో వేడి పెంచింది. కాగా.. వైసీపీ-బీజేపీ ఒక్కటేననే భావన ప్రజల్లో పోగొట్టకపోతే.. జగన్ ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకత బీజేపీపైనా ప్రభావం చూపుతుందనే అభిప్రాయం వ్యక్తమైంది. తమిళనాడులో ఇసుక అక్రమాలు, ఢిల్లీలో లిక్కర్ లాబీపై చర్యలు తీసుకున్న కేంద్రం.. ఏపీలో ఆ రెండింటిపై విచారణకు వేయకుంటే ప్రజల్లోకి ఎటువంటి సంకేతం వెళ్తుందని ఒక నాయకుడు ప్రశ్నించారు. అనంతరం పురందేశ్వరి విలేకరులతో మాట్లాడుతూ.. పొత్తులతో పాటు చాలా అంశాలపై చర్చించామని, తుది నిర్ణయం అధిష్ఠానం తీసుకుంటుందని చెప్పారు. షర్మిల ఏ పార్టీలో చేరినా బీజేపీకి అనవసరమన్నారు. సత్యకుమార్, మాధవ్ మీడియాతో మాట్లాడుతూ.. 'మాతో పొత్తు పెట్టుకోవాలనుకునే వాళ్లు మా అగ్ర నాయకత్వాన్ని కలిసి చర్చించాలి. దేశంలో బీజేపీ బలమైనదే గానీ ఈ రాష్ట్రంలో బలహీన పార్టీ కదా..! బలవంతుల చేతులూ కలిస్తేనే కదా ఉపయోగం.. ఒక చేత్తోనే సాధ్యం కాదుగా..' అని వ్యాఖ్యానించారు.

మేధావి అన్నకు మేధావి చెల్లెలు

మణిపూర్ హింసపై షర్మిల వ్యాఖ్యలపై సత్యకుమార్ ఘాటుగా స్పందించారు. 'మేధావి అన్నకు మేధావి చెల్లెలు.. పాదాలపై నడిచేదే పాదయాత్ర అని చెప్పే షర్మిల కాంగ్రెస్ పాలనలో ఈ దేశంలో ఎన్ని అరాచకాలు జరిగాయో తెలుసుకుని మాట్లాడాలి.. ఇందిర హయాంలో వేల ఘర్షణలు జరిగితే రాజీవ్ గాంధీ హయాంలో సిక్కుల ఊచకోత జరిగింది.. హైదరాబాద్‌లో అల్లర్లకు కారణం వైఎస్ అని ఆ పార్టీ నేతలే గతంలో చేసిన వ్యాఖ్యలపై షర్మిల ఏమంటారు' అని ప్రశ్నించారు.

వైసీపీ దోపిడీకి అడ్డుకట్ట వేయాలి

- శివప్రకాశ్‌కు నాదెండ్ల మనోహర్ వినతి

శివప్రకాశ్‌తో జనసేన ముఖ్య నాయకుడు నాదెండ్ల మనోహర్ భేటీ అయ్యారు. కోర్ కమిటీ సమావేశం తర్వాత ఆయన వచ్చి కలిశారు. జగనన్న కాలనీల పేరుతో పేదలకు సెంటు స్థలం ఇచ్చిన వైసీపీ ప్రభుత్వం.. భూసేకరణ, చదును చేయడంలో వేల కోట్ల అవినీతికి పాల్పడిన తీరును వివరించారు. ఇటీవల పవన్ కల్యాణ్ కేంద్రానికి రాసిన లేఖ ప్రతిని కూడా ఈ సందర్భంగా శివప్రకాశ్‌కు అందజేశారని బీజేపీ వర్గాలు తెలిపాయి. రాష్ట్రంలో అధికార పార్టీ దోపిడీకి కేంద్రం అడ్డుకట్ట వేసేలా పార్టీ, ప్రభుత్వ పెద్దలతో మాట్లాడాలని మనోహర్ కోరినట్లు తెలిసింది. అయితే మిత్రపక్షం నేత మర్యాద పూర్వకంగా వచ్చారు తప్ప అంతకు మించి ఏమీ లేదని పురందేశ్వరి విలేకరులకు చెప్పారు.

కాటసాని ఇలాకాలో వైసీపీ సభకు జనం కరువు

- సామాజిక సాధికార బస్సుయాత్ర తుస్సు
- నేతలు ప్రసంగిస్తుండగానే వెళ్లిపోయిన జనం



ఎమ్మెల్యే కాటసాని ప్రసంగిస్తుండగా ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు

కర్నూలు(అర్బన్), జనవరి 4: సామాజిక సాధికార సభ పేరుతో వైసీపీ జనసమీకరణ చేస్తున్నా ప్రజల నుంచి ఆదరణ కరువవుతోంది. గురువారం కర్నూలు జిల్లా కేంద్రంలోని చెన్నమ్మ సర్కిల్‌లో ఏర్పాటు చేసిన సాధికార బస్సుయాత్ర సభ మరోసారి తుస్సుమంది. సీనియర్ ఎమ్మెల్యేగా ఉమ్మడి కర్నూలు జిల్లాలో చక్రం తిప్పుతున్న కాటసాని రాంభూపాల్ రెడ్డి సొంత నియోజకవర్గంలో బస్సు యాత్రకు ప్రజల నుంచి స్పందన కరువైంది. ఊహించినదానికంటే జనం తక్కువగా రావడం, వచ్చిన వాళ్లు కూడా వైసీపీ నేతల ప్రసంగిస్తుండగానే వెనుదిరిగి వెళ్లిపోయారు. సభ ప్రారంభమైన అరగంటకే కుర్చీలు ఖాళీ కావడంతో పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌కు చెందిన ప్రధాన అనుచరుడు గుర్తించి వలంటీర్లను అప్రమత్తం చేసేందుకు ప్రయత్నం చేశారు. గడివేముల, పాణ్యం మండలాల నుంచి కార్యకర్తలు, నాయకులను తరలించేందుకు కీలక నాయకులు ఆపసోపాలు పడ్డారు. సభా ప్రాంగణానికి చేరుకున్న మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు వేదికపైకి చేరుకోగానే ప్రజలకు అభివాదం చేసేందుకు పోటీపడినా.. స్పందన కరువైంది. కీలక నాయకులు మాట్లాడుతుండగానే ఖాళీ అయిన కుర్చీలను వైసీపీ కార్యకర్తలే తొలగించడం కొసమెరుపు.

మాకు మేలు చేసే వారి వైపు నిలుస్తాం

- పెన్షనర్స్ పార్టీ ఆవిర్భావ సభలో ఎన్జీవో అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు పూర్ణచంద్రరావు

తిరుపతి రూరల్, జనవరి 4: పెన్షనర్లకు మేలు చేసే వారి వైపు నిలుస్తామని ఏపీ ఎన్జీవోస్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు పూర్ణచంద్రరావు స్పష్టం చేశారు. తిరుపతి అన్నమయ్య సర్కిల్ సమీపంలో ఉన్న రాస్ భవనంలో గురువారం నిర్వహించిన ఏపీ పెన్షనర్స్ పార్టీ ఆవిర్భావ సభలో పూర్ణచంద్రరావు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. దశాబ్దాల పాటు ప్రజలకు సేవ చేసిన పెన్షనర్ల పట్ల ప్రభుత్వం అత్యంత దారుణంగా వ్యవహరిస్తోందన్నారు. సకాలంలో పెన్షన్ అందక వృద్ధాప్యంలో ఉన్న పెన్షనర్లు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. పెన్షనర్స్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కృష్ణమనాయుడు మాట్లాడుతూ.. 75 ఏళ్లు పూర్తయిన పెన్షనర్లకు 10 శాతం అదనపు పెన్షన్ ఇవ్వాల్సి ఉండగా, దీనిని 7 శాతానికి కుదించారని చెప్పారు. దీనిని యధావిధిగా ఉంచాలని కోరారు. గడిచిన 185 నెలలుగా డీఏ అరియర్స్ పెండింగ్ ఉందన్నారు. ఐఆర్ 27శాతమిచ్చి, ఫిట్‌మెంట్ 23శాతం ఇవ్వడం అన్యాయమన్నారు. పార్టీ ఆవిర్భావ సభ అనంతరం నిర్వహించిన ప్రతినిధుల సమావేశంలో నాయకులు పెన్షనర్ల స్థితిగతులు, భవిష్యత్తు ప్రణాళికపై సుదీర్ఘంగా చర్చించారు. వచ్చే ఎన్నికల్లో పెన్షనర్లకు ప్రయోజనం కల్గించే పార్టీని, నాయకులను ఎన్నుకోవాలని కోరారు. పెన్షనర్స్ పార్టీ రాజకీయ శక్తిగా రూపొందేందుకు అందరూ తోడ్పడాలని కోరారు. వచ్చే ఎన్నికల్లో పెన్షనర్ల సత్తా చాటాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పెన్షనర్స్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పాలంకి సుబ్బరాయన్, ప్రధాన కార్యదర్శి పెద్దన గౌడ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు మునయ్య, లెక్కల మునిరత్నం నాయుడు , విజడమ్ చౌదరి, ఆత్మానంద నాయుడు, కోదండరామన్, సుబ్బారావు, సురేంద్రబాబు, శివకుమార్, నాగరాజ తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

యుద్ధ రాజకీయం!

గాజాయుద్ధాన్ని సుదీర్ఘకాలం కొనసాగించడంతోపాటు, పరిధినీ, క్షేత్రాన్నీ మరింత విస్తరించేందుకు ఇజ్రాయెల్ ప్రధాని బెంజమీన్ నెతన్యాహూ కుట్రపన్నుతున్నారని కొందరు విశ్లేషకుల అనుమానం. మంగళవారం లెబనాన్ రాజధాని బీరూట్‌లో హమాస్ డిప్యూటీ లీడర్ సలేహ్–అల్–అ-రౌరీని ఇజ్రాయెల్ డ్రోన్‌దాడిలో హతమార్చింది. గాజాయుద్ధం మొదలైన ఈ మూడునెలల కాలంలో, హమాస్ ఉన్నతస్థాయి నాయకుడు ఒకరు హత్యకు గురికావడం ఇదే తొలిసారి. తమ దేశంలోకి చొరబడి ఇజ్రాయెల్ జరిపిన ఈ ఘాతుకానికి ప్రతీకారం తీర్చుకుంటామని హిజ్బుల్లా ప్రకటించింది. శత్రువులు ఎక్కడ దాక్కున్నా వెతికి వేటాడతామని ఇజ్రాయెల్ వ్యాఖ్యానించింది. ఈ సంఘటన జరిగిన మర్నాడు, ఇరాన్‌లోని కెర్మాన్ నగరంలో రెండు వరుస పేలుళ్లలో వందమంది మరణించారు, రెండువందల మంది గాయపడ్డారు. నాలుగేళ్ళక్రితం అమెరికా డ్రోన్‌దాడిలో మరణించిన ఇరాన్ సైనిక జనరల్ సులేమానీ సంస్మరణ కార్యక్రమంలో, వేలాదిమంది ఆయన సమాధివైపు పోతుండగా ఈ ఘోరం జరిగింది. ఇందులో తమ పాత్రేమీలేదని అంటూ, ఇజ్రాయెల్‌కు ఈ పనిచేయాల్సిన అవసరం లేదని అమెరికా విదేశాంగశాఖ ప్రతినిధి సమర్థించుకొచ్చారు. ఇరాన్ సుప్రీంలీడర్ అయతొల్లా ఖమేనీ తన సందేశంలో శత్రువుల పేర్లు ఎత్తకుండా తీవ్రంగా దండిస్తామని మాత్రమే ప్రకటిస్తే, మిగతా నాయకులంతా అమెరికా, ఇజ్రాయెల్‌ను నేరుగానే తప్పుబడుతున్నారు. ఈ రెండు వరుస ఘటనలకు సంబంధం ఉన్నదా, కారకులు ఎవరన్న ప్రశ్నలను అటుంచితే, పశ్చిమాసియాలో పరిస్థితులను ఇవి మరింత ఉద్రిక్తంగా మార్చాయి.

ఇరాన్ సైన్యంలోని విదేశీ సైనిక విభాగమైన ఖుర్ద్ ఫోర్స్‌కు సులేమానీ నాయకత్వం వహిస్తూ, హమాస్, హిజ్బుల్లా, హౌతీ మిలిటెంట్ గ్రూపులకు ఆయుధాలు, నిధులు అందించి వాటిని బలోపేతం చేశారు. ప్రజల్లోనూ కీర్తి-ప్రతిష్ఠలున్న ఈయనను, ఇరాన్‌తో అణుఒప్పందం నుంచి వైదొలిగిన తరువాత అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హత్యచేయించారు. ఇప్పుడు ఇరాన్ పరోక్ష సహకారంతో ఈ మిలిటెంట్ సంస్థలు ఇజ్రాయెల్‌కు వ్యతిరేకంగా పోరాడుతున్న తరుణంలో, ఈ వరుస పేలుళ్ళలో ఇజ్రాయెల్, అమెరికాల ప్రమేయం ఉన్నదన్న అనుమానాలు రేగడం సహజం. పేలుళ్ళ తరువాత అమెరికాలోని చాలా ప్రభుత్వ భవనాలకు బాంబు బెదిరింపులు వచ్చాయి. ఇక, లెబనాన్‌లో ఇజ్రాయెల్ జరిపిన దాడిని హిజ్బుల్లా అధినేత హసన్ నస్రుల్లా చొరబాటుగా అభివర్ణిస్తూ, ఇజ్రాయెల్‌కు దీటైన సమాధానం ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు. ప్రస్తుతానికి హిజ్బుల్లా నేరుగా యుద్ధాన్ని ప్రకటించకపోయినా బీరూట్‌లో జరిగిన ఈ దాడి దానిని మరింత వేడెక్కిస్తుందనడంలో సందేహం లేదు.

ఈ రెండు ఘటనల తరువాత, ఏ కారణాలవల్లనైతేనేమి, ఇరాన్, హిజ్బుల్లా అధికారిక ప్రతిస్పందనలు ప్రస్తుతానికి మితంగానే ఉన్నాయి. కానీ, ఇజ్రాయెల్ రక్షణమంత్రి గల్లాంట్ మాత్రం గాజాలో ఇప్పుడు మేము చేస్తున్నది రేపు బీరూట్‌లో చేయడానికి ఏ మాత్రం వెనుకాడబోమని అంటున్నారు. అనేక మితవాద, అతిమితవాద పార్టీలను కూడగట్టుకొని అతికష్టంమీద అధికారంలోకి వచ్చిన ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూ గాజా యుద్ధంతో రాజకీయంగా మరింత బలపడవచ్చునని తలపోశారు. కానీ, యుద్ధానంతరం ఆయనను ప్రధానిగా కొనసాగించేందుకు పదిహేనుశాతం మంది ప్రజలు మాత్రమే అనుకూలంగా ఉన్నట్టు ఇటీవలి సర్వేలు తేల్చాయి. యుద్ధం ముగిసినవెంటనే ఎన్నికలు జరగాల్సిందేనని 70శాతం మంది ప్రజలు స్పష్టం చేశారు. దీనికితోడు, పలు కేసులు ఎదుర్కొంటున్న ఆయన న్యాయవ్యవస్థ ప్రక్షాళనపేరిట గత ఏడాది తెచ్చిన రాజ్యాంగ సవరణను సుప్రీంకోర్టు సోమవారం కొట్టివేసింది. విపక్షాలు తప్పుబడుతున్నా, లక్షలాదిమంది వీధుల్లోకి వచ్చి నిరసన ప్రదర్శనలు చేసినా ఆయన ఖాతరుచేయలేదు. తన రాజకీయ మనుగడ కోసం న్యాయవ్యవస్థ పరిధులను కుదించడానికి ఆయన చేసిన ఈ ప్రయత్నాన్ని ఇజ్రాయెల్ చరిత్రలో తొలిసారిగా పదిహేనుమంది న్యాయమూర్తుల విస్తృత ధర్మాసనం విఫలం చేసింది. నిఘావైఫల్యంతో హమాస్ దాడికి వీలుకల్పించి, ప్రతీకారంతో యుద్ధం ఆరంభించి, మూడునెలలుగా లక్ష్యం సాధించలేకపోయిన నెతన్యాహూ, ఈ పరిస్థితుల మధ్య యుద్ధాన్ని ముగించడం కంటే, దానిని విస్తరించడం ద్వారా ఉనికిని, అధికారాన్ని కొనసాగించుకోవచ్చునని భావిస్తున్నట్టు కనిపిస్తోంది.

సామరస్యానికి లాకులెత్తండి!

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఇటీవల ప్రధానమంత్రిని కలిసినపుడు పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని జాతీయ ప్రాజెక్టుగా గుర్తించాలని కోరారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి అలా కోరడంలో తప్పులేదు. కానీ, వాస్తవంలో పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి నికర జలాల కేటాయింపులు లేవు. రాష్ట్ర విభజన చట్టంలో పొందుపరచలేదు. తుదకు అపెక్స్ కౌన్సిల్ ఆమోదమూ లేదు.

సాగునీటి రంగంలో తెలంగాణకు అన్యాయం జరిగిన మాట వాస్తవం. తెలంగాణతో పాటు అవశేష ఆంధ్రప్రదేశ్‌లోని రాయలసీమకూ అపకారం జరిగింది. తెలంగాణకు గాని రాయలసీమకు గాని సాగునీటి రంగంలో సరైన న్యాయం జరగలేదంటే అది బేసిన్‌లోని అన్ని రాష్ట్రాల మధ్య నీటి పంపిణీ జరిగినపుడు తప్ప రాష్ట్ర విభజన తరువాత కాదు. అందువల్లనే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ మధ్యంతర తీర్పు సమయంలోనూ, తుది తీర్పు వచ్చినపుడు 2013లో సుప్రీంకోర్టు తలుపు తట్టి గెజిట్ నోటిఫికేషన్ జరగకుండా స్టే తెచ్చింది. ఇన్నేళ్లు గడిచినా ఈ కేసు సుప్రీంకోర్టులోనే వుంది. రాష్ట్ర విభజన తర్వాత తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చొరవ తీసుకుని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని కూడా కలుపుకొని ట్రిబ్యునల్ తీర్పు పునఃసమీక్ష కోసం ప్రయత్నించి వుండాలి. అలా చేయలేదు. తన రాజకీయ అవసరార్థం ఆంధ్రప్రదేశ్‌తో అంతర్ రాష్ట్ర జల వివాదాన్ని అట్టే పెట్టుకొన్నారు.

బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ నీటి కేటాయింపులు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు ఉరితాడు. కర్ణాటకకు గంపగుత్తగా నేరుగా వాడుకొనేందుకు 170 టియంసిలు, మహారాష్ట్రకు 78 టియంసిలు ఇచ్చి, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు 39 టియంసిలు మాత్రమే కేటాయించింది. కన్నీటి తుడుపుగా 145 టియంసిలు క్యారీ ఓవర్ కింద చూపారు. ఇంత అన్యాయం జరిగితే కేసీఆర్ ఏనాడూ పల్లెత్తుమాట అనకపోగా, అవశేష ఆంధ్రప్రదేశ్ నుంచి మాత్రమే తమకు అన్యాయం జరిగిందని వాదించేవారు. అంతేకాదు, అపెక్స్ కౌన్సిల్ సమావేశంలోను, సుప్రీంకోర్టులోను రెండు తెలుగు రాష్ట్రాల మధ్య తిరిగి కృష్ణ జలాలు పంపకం చేయాలని పట్టుపట్టారు. కాని బేసిన్ మొత్తంలో తెలుగు రాష్ట్రాలకు జరిగిన అన్యాయం గురించి పట్టించుకోలేదు. తుదకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని బుట్టలో వేసుకొని కొత్త ట్రిబ్యునల్ నియామకానికి మార్గం సుగమం చేసుకున్నారు. కొత్త ట్రిబ్యునల్ తీర్పు వచ్చే వరకైనా రేవంత్ రెడ్డి ఆగి వుండాల్సింది. జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించమని వెంటనే కోరకపోతే తనకు కేసీఆర్ దక్షిణ తెలంగాణలో పొగ బెడతారని భావించి వుండవచ్చు.



రెండు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు ఏకకంఠంతో 2013లో బ్రిజేశ్ కుమార్ ట్రిబ్యునల్ ఇచ్చిన తీర్పు తమకు సమ్మతం కాదని, బేసిన్‌లోని అన్ని రాష్ట్రాల మధ్య కృష్ణ జలాల పునఃపంపిణీ జరగాలని గట్టిగా పోరాడాలి. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చొరవ తీసుకొని ట్రిబ్యునల్ తీర్పుపై సమీక్ష కోసం న్యాయం పోరాటం చేస్తే, రెండు రాష్ట్రాల ప్రయోజనాలు కాపాడిన వారవుతారు.

ఒక రాష్ట్రం రెండుగా విభజింపబడితే వాటి మధ్య సమస్యల పరిష్కారానికి కేంద్ర ప్రభుత్వం సంధానకర్తగా వ్యవహరించాలి. అయితే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అంశంలో కేంద్ర ప్రభుత్వం సైందవ పాత్ర పోషించింది. బేసిన్‌లోని అన్ని రాష్ట్రాల మధ్య ఒక ట్రిబ్యునల్ తీర్పు వచ్చింది, కోర్టు కేసులతో పెండింగ్‌లో వుంది. దాని అతీగతీ తేలక ముందే రాష్ట్ర విభజన చట్టం మేరకు అదే ట్రిబ్యునల్ విచారణ జరిపేందుకు నోటిపై చేసింది. ఆ తీర్పు రాలేదు. తిరిగి అదే రెండు రాష్ట్రాల మధ్య మరో ట్రిబ్యునల్ నియామకం చేసింది. బహుశా భారతదేశ చరిత్రలో అంతర్ రాష్ట్ర జల వివాదాల పరిష్కారానికి ఇన్ని ట్రిబ్యునల్‌ల నియామకం ఎక్కడా జరిగివుండదేమో. మరోవేపు బ్రిజేశ్ కుమార్ ట్రిబ్యునల్ తీర్పు నోటిపై చేసేందుకు కర్ణాటక మహారాష్ట్ర ప్రభుత్వాలు యత్నాలు చేస్తున్నాయి. ఒక వేళ సుప్రీంకోర్టు గ్రీన్ సిగ్నల్ ఇస్తే రాష్ట్రాల మధ్య తంపులు పెట్టి పబ్బం గడుపుకొనేందుకు సిద్ధంగా ఉన్న కేంద్రం నోటిపై చేస్తే తెలుగు రాష్ట్రాల ప్రయోజనాలు అంతటితో ఖతమౌతాయి. తదుపరి సుప్రీంకోర్టు పరిధి కూడా దాటిపోతుంది.

ఈ సందర్భంలో, రెండు తెలుగురాష్ట్రాల ప్రభుత్వాలు ఏకకంఠంతో 2013లో బ్రిజేశ్ కుమార్ ట్రిబ్యునల్ ఇచ్చిన తీర్పు తమకు సమ్మతం కాదని, బేసిన్‌లోని అన్ని రాష్ట్రాల మధ్య కృష్ణ జలాల పునఃపంపిణీ జరగాలని గట్టిగా పోరాడాలి. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చొరవ తీసుకొని ట్రిబ్యునల్ తీర్పుపై సమీక్ష కోసం న్యాయం పోరాటం చేస్తే, రెండు రాష్ట్రాల ప్రయోజనాలు కాపాడిన వారవుతారు. ఇందుకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఎంతవరకు సహకరిస్తారో అనుమానమే. జగన్‌కు పొగబెట్టేందుకు కాంగ్రెస్ పార్టీ ఆంధ్రప్రదేశ్‌లో వైయస్ షర్మిలను దింపుతోందన్న వార్తల నేపథ్యంలో, తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వంతో కలసి పోరాటానికి జగన్ సిద్ధపడతారా? ఇక, రేవంత్ రెడ్డి చొరవ తీసుకున్నా లేకున్నా ఈ అంశంలో జగన్మోహన్ రెడ్డి సిద్ధం కాకపోతే మరోమారు ఆంధ్రప్రదేశ్‌కు అన్యాయం చేసిన వారవుతారు. బ్రిజేశ్ కుమార్ ట్రిబ్యునల్ బేసిన్‌లో మొత్తం 448 టియంసిలు రాష్ట్రాల మధ్య పంపిణీ చేస్తే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు నేరుగా ఉపయోగించుకొనేందుకు దక్కింది 39 టియంసిలు మాత్రమే. ఇది సరిదిద్దబడితే తెలుగు రాష్ట్రాల్లో మిగులు జలాల ఆధారంగా గల ప్రాజెక్టులకు అటు ఇటుగా సర్దుబాటు చేసుకోవచ్చు. ముందు, బేసిన్‌లో న్యాయమైన వాటా లభించిన తరువాత తెలుగు రాష్ట్రాలు తమ లెక్కలు తేల్చుకోవచ్చు. ఆ ఆలోచన చేయకుండా కేవలం రెండు తెలుగు రాష్ట్రాల మధ్య కయ్యానికి ప్రాధాన్యత ఇస్తే చివరకు ఎవరికీ దక్కేదేమీ ఉండదు.

■ వి. శంకరయ్య
విశ్రాంత పాత్రికేయులు

మోదీ హ్యాట్రిక్‌ను అడ్డుకోవడమెలా?

నరేంద్ర మోదీ అజేయుడా? వరుసగా మూడోసారీ కేంద్రంలో అధికారాన్ని కైవసం చేసుకోకుండా భారతీయ జనతా పార్టీని నిలవరించడం సాధ్యం కాదా? ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి అవసరమైన మెజారిటీ సీట్లను గెలుచుకోకుండా 2024 సార్వత్రిక ఎన్నికలలో అధికార పక్షాన్ని విజయవంతంగా అడ్డుకునే వ్యూహం ఏదైనా ఉన్నదా? నరేంద్ర మోదీ హ్యాట్రిక్ సాధించడం ఖాయమనే నిశ్చిత అభిప్రాయాన్ని ఇప్పటికే చాలా మంది రాజకీయ పరిశీలకులు, స్వతంత్ర విశ్లేషకులు వ్యక్తం చేస్తున్నారు. ఇక ప్రతిపక్ష నాయకుల గురించి చెప్పేదేముంది? వారితో వ్యక్తిగతంగా సంభాషించండి, తమ మనసులో మాట స్పష్టంగా చెబుతారు : మోదీ హ్యాట్రిక్ నిశ్చితం.

ఈ వ్యక్తావ్యక్త అభిప్రాయాలతో నేను విభేదిస్తున్నాను. చివరి నిమిషంలో ఏదో అద్భుతం జరుగుతుందనే నమ్మకంతో కాదు సుమా. ఇటీవల మూడు ఉత్తరాది రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలలో బీజేపీ తిరుగులేని విజయాన్ని, ప్రధాని మోదీకి అచంచల ప్రజాదరణ ఉందని ఒపీనియన్ పోల్స్‌లో వెల్లడవుతున్న విషయాన్నికూడా నేనేమీ ఉపేక్షించడం లేదు. ప్రతిపక్ష కూటమి 'ఇండియా' ఘనవిజయం సాధించగలదని, బీజేపీకి ఘోర పరాజయం అనివార్యమని సునిశ్చితంగా విశ్వసించేందుకు ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల ఫలితాలుగానీ, ప్రస్తుత సందర్భంలో వివిధ సర్వేలు వెల్లడిస్తున్న వాస్తవాలు గానీ మనకు ఏ మాత్రం ఆస్కారమివ్వడం లేదు. అదే సమయంలో, వచ్చే వేసవిలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలలో 273 సీట్లు (ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి అవసరమైన మెజారిటీ) స్వాయత్తం చేసుకోకుండా బీజేపీని అడ్డుకోవడం సాధ్యమే అన్న అంశాన్ని కూడా అవి కొట్టివేయడం లేదు. ప్రతిపక్షానికి ఒక వినూత్న వ్యూహం ఉండి, దానిని పటిష్ఠంగా అమలుపరిచేందుకు పరిపూర్ణ రాజకీయ సంకల్పం ఉంటే బీజేపీ మరోసారి కేంద్రంలో అధికారానికి రాకుండా అడ్డుకోవడం సుసాధ్యమేనని స్పష్టంగా చెప్పవచ్చు.

ఆ వ్యూహం ఎలా ఉండాలి? 2024 సార్వత్రిక సమరాన్ని మూడు యుద్ధ క్షేత్రాలుగా పరిగణనలోకి తీసుకోవల్సి ఉన్నది. అవి: ప్రాథమిక లేదా ప్రధాన; గౌణ లేదా అప్రధాన; యుద్ధక్షేత్రం. ఈ మూడు విభిన్న యుద్ధ క్షేత్రాలలో విజయానికి అవసరమైన వేర్వేరు ఎత్తుగడలు రూపొందించుకోవడం తప్పనిసరి అన్నది ఈ వ్యూహపు మౌలిక భావన.

తొలుత మూడో యుద్ధ రంగంపై మన దృష్టిని సారిద్దాం. బీజేపీకి విజయావకాశాలు లేని, కనీసం పోటీ ప్రధానంగా ఉండే రెండు ప్రత్యర్థి పార్టీలలో ఒకటిగా లేని రాష్ట్రాలు ఈ మూడో యుద్ధ రంగం పరిధిలోకి వస్తాయి. ఇది దక్షిణ భారతావని అని మరి చెప్పనవసరం లేదు. కేరళ, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్. ఇప్పుడు వీటితో పాటు తెలంగాణను కూడా చేర్చవచ్చు. అలాగే పంజాబ్, కశ్మీర్, మిజోరం, నాగాలాండ్ కూడా. ఈ ఎనిమిది రాష్ట్రాలలో మొత్తం 120 లోక్‌సభ స్థానాలు ఉన్నాయి. 2019లో జాతీయ అధికార పక్షం ఈ 120లో కేవలం 6 స్థానాలను మాత్రమే గెలుచుకున్నది : తెలంగాణ నుంచి 4, పంజాబ్ నుంచి 2. పంజాబ్‌లో అకాలీదళ్‌తోనూ, తెలంగాణలో భారత్ రాష్ట్ర సమితితో లోపాయికారీ పొత్తు ఏమైనా ఉంటే తప్ప, సాధారణ పరిస్థితులలో ఈ 6 సీట్లనూ బీజేపీ 2024లో నిలబెట్టుకోవడం అసాధ్యం. 'ఇండియా' కూటమి ఈ రాష్ట్రాలలో అనుసరించాల్సిన ప్రధాన వ్యూహం బీజేపీని అడ్డుకోవడమే. ప్రస్తుత ఆరు స్థానాలతో పాటు, బీజేపీ కైవసం చేసుకోదలిచిన తిరువనంతపురం (కేరళ), కన్యాకుమారి, కోయంబత్తూరు (తమిళనాడు) మొదలైన నియోజకవర్గాలలో అధికార పక్షాన్ని గట్టిగా ఎదుర్కోవడమే ప్రతిపక్ష కూటమి ప్రధాన వ్యూహంగా ఉండి తీరాలి. 'ఇండియా' భాగస్వామ్య పక్షాలు, పౌర సమాజమూ ఈ నియోజకవర్గాలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి. అవసరమైతే భాగస్వామ్య పక్షాల మధ్య ఓట్ల బదిలీ జరగాలి. తద్వారా బీజేపీని ప్రస్తుత స్థానాలకు మాత్రమే పరిమితం చేయడం సుసాధ్యమవుతుంది. మరి కొంచెం కష్టపడితే, అదృష్టం కూడా కలిసివస్తే ఈ ఎనిమిది రాష్ట్రాల యుద్ధ రంగంలో బీజేపీకి ఒక్క సీటు కూడా దక్కకుండా చేయవచ్చు.



2024 సార్వత్రిక పోరులో 'ఇండియా' ఘన విజయం సాధించగలదని, బీజేపీకి ఘోర పరాజయం అనివార్యమని విశ్వసించేందుకు ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల ఫలితాలుగానీ, ఇప్పుడు వివిధ సర్వేలు వెల్లడిస్తున్న విషయాలు గానీ మనకు ఏ మాత్రం ఆస్కారమివ్వడం లేదు. వచ్చే వేసవిలో లోక్‌సభ ఎన్నికలలో 273 సీట్లు స్వాయత్తం చేసుకోకుండా బీజేపీని అడ్డుకోవడం సాధ్యమే అన్న అంశాన్నీ అవి కొట్టివేయడం లేదు. విపక్షానికి ఒక వినూత్న వ్యూహం ఉండి, దానిని పటిష్ఠంగా అమలుపరిచే రాజకీయ సంకల్పం ఉంటే బీజేపీ వరుసగా మూడోసారి అధికారానికి రాకుండా అడ్డుకోవడం సుసాధ్యమవుతుంది.



■ యోగేంద్ర యాదవ్

223 లోక్‌సభా నియోజకవర్గాలు ఉన్న రాష్ట్రాలు రెండో యుద్ధరంగం పరిధిలోకి వస్తాయి. ఇవి ప్రధానంగా హిందీ భాషా ప్రాంతాలు. ఉత్తర్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్, మధ్య ప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, రాజస్థాన్ మొదలైన రాష్ట్రాలలో బీజేపీ ఒక ప్రబల శక్తిగా ఉన్నదని ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. వచ్చే మూడు నెలల వ్యవధిలో ఆ రాష్ట్రాలలో ఆ పార్టీని పరాజితను చేయడం చాలా చాలా కష్టమైన పని. వీటికి తోడు గుజరాత్, అసోంతో పాటు త్రిపుర, అరుణాచల్ ప్రదేశ్ లాంటి చిన్న రాష్ట్రాలు కూడా ఈ అప్రధాన యుద్ధ రంగంలోకే వస్తాయి. 2019 సార్వత్రిక సమరంలో ఈ 223 స్థానాలలో 190 బీజేపీకి కైవసమయ్యాయి. ఈ రాష్ట్రాలలో సాధించిన తిరుగులేని విజయాలే బీజేపీని అజేయ శక్తిగా నిలబెడుతున్నాయి. రాబోయే సార్వత్రిక ఎన్నికలలోనూ ఈ రాష్ట్రాలలో అధికార పక్షం ఘన విజయాలు సాధించడం ఖాయమని ప్రతీ ఒక్కరూ నిశ్చితంగా భావిస్తున్నారు. అయితే లోక్‌సభలో తన మెజారిటీని పూర్తిగా నిలబెట్టుకునేందుకు ఈ రాష్ట్రాలలోని సీట్లు అన్నిటినీ బీజేపీ గెలుచుకోవల్సిన అవసరముందని కొంత మంది విశ్లేషకులు తెగేసి చెప్పుతున్నారు. ఇదిగో, ఇక్కడే ప్రతిపక్ష కూటమికి జయపతాకను ఎగురవేసేందుకు ఒక స్పష్టమైన అవకాశమున్నది.

'ఇండియా' కూటమి ఏమి చెయ్యాలి? ఈ రాష్ట్రాలలో బీజేపీని 'ఓడించడానికి' ప్రయత్నించే బదులు ఆ పార్టీ స్థానాలను సాధ్యమైనంతగా తగ్గించేందుకు పూనుకోవాలి. ఎంపిక చేసిన ప్రాంతాలలో బీజేపీ తన ప్రస్తుత సీట్లను మళ్లీ గెలుచుకోకుండా చూడాలి. గుజరాత్‌నే తీసుకోండి. ఆ రాష్ట్రం బీజేపీకి కంచుకోట. అక్కడ 4 సీట్లను, ముఖ్యంగా ఆదివాసీ ప్రాంతాలలో కైవసం చేసుకోవడాన్ని కాంగ్రెస్ లక్ష్యంగా పెట్టుకోవాలి. రాజస్థాన్ ఆగ్నేయ ప్రాంతాలలో అరడజన్ సీట్లలో విజయం సాధించేందుకు కాంగ్రెస్‌కు అవకాశాలున్నాయి. భారతీయ ఆదివాసీ పార్టీతో పొత్తు పెట్టుకుంటే రాజస్థాన్ దక్షిణ జిల్లాల్లో రెండు సీట్లను కాంగ్రెస్ గెలుచుకోగలదు. దళితులు– ఓబీసీల ప్రాబల్యమున్న మధ్యప్రదేశ్ ఉత్తర ప్రాంతాలలో కూడా కాంగ్రెస్‌కు ఇటువంటి విజయాలు దక్కే అవకాశమున్నది. బీజేపీ ఓటు బ్యాంకును స్వాధీనం చేసుకోవలసిన అవసరం కాంగ్రెస్‌కు లేదు. అయితే ఇటీవలి అసెంబ్లీ ఎన్నికలలో తనకు లభించిన ఓట్లను ఎటువంటి మినహాయింపు లేకుండా కాపాడుకోవలసిన అవసరం కాంగ్రెస్‌కు ఎంతైనా ఉన్నది. ఉత్తరప్రదేశ్‌లో ఎన్నికల సమరం చాలా క్లిష్టంగా ఉంటుంది. అయినప్పటికీ సమాజ్ వాది పార్టీ– రాష్ట్రీయ లోక్‌దళ్– కాంగ్రెస్ కూటమి దాదాపు 25 సీట్లను లక్ష్యంగా పెట్టుకుని సంపూర్ణ విజయం సాధించవచ్చు.

సమస్త నియోజకవర్గాలలోనూ విజయం సాధించేందుకు ప్రయత్నించడం కాకుండా స్థానిక పార్టీలతో పొత్తులు, సామాజిక సంకీర్ణాలతో సాధ్యమైనన్ని సీట్లను కైవసం చేసుకునేందుకు ప్రతిపక్షం తన శక్తి సామర్థ్యాలను కేంద్రీకరించడమే ఈ వ్యూహంలోని కీలక అంశం. ఉత్తరప్రదేశ్‌లో మినహా ఇక్కడ కూడా ప్రతిపక్షాలు ఒక మహా కూటమిగా ఏర్పడవలసిన అవసరం లేదు. ఎంపిక చేసుకున్న స్థానిక పార్టీలతో పొత్తు పెట్టుకోవడమే ప్రస్తుత అవసరం. అలాంటి ఏర్పాటుతో ప్రస్తుతం బీజేపీ అధీనంలో ఉన్న 190 సీట్లలో 20 నుంచి 25 సీట్లను ప్రతిపక్షం తప్పక గెలుచుకోగలదు.

మిగిలిన 200 నియోజక వర్గాలే ప్రధాన, అసలైన యుద్ధ రంగం. 2019 సార్వత్రిక ఎన్నికలలో బీజేపీ ఈ రెండు వందల నియోజక వర్గాలలో గణనీయమైన విజయాలు సాధించింది. అయితే ఇప్పుడు ఆ స్థానాలలో అది బలహీనపడింది. ఇందుకు పలు వేర్వేరు కారణాలు ఉన్నాయి. మహారాష్ట్ర, బిహార్‌లలో రాజకీయ శక్తుల పునరేకీకరణ జరిగింది. ఈ కొత్త శక్తులతో సరికొత్త పొత్తు పెట్టుకునేందుకు ప్రతిపక్ష 'ఇండియా' కూటమికి మంచి అవకాశమున్నది. 2019 అనంతరం అసెంబ్లీ ఎన్నికలు జరిగిన పశ్చిమ బెంగాల్, హిమాచల్ ప్రదేశ్, కర్ణాటకలో పరాజయాలను బీజేపీ మూటగట్టుకున్నది. మోదీ ప్రభుత్వం తెచ్చిన కొత్త సాగు చట్టాలకు వ్యతిరేకంగా ప్రజ్వరిల్లిన రైతుల ఉద్యమంతో హర్యానా ప్రజల రాజకీయ వైఖరులు మారాయి. ఒడిషాలో బిజూ జనతాదళ్ 2019లో వలే లోక్‌సభ సీట్లను ఈ సారి బీజేపీకి కానుకగా ఇచ్చే అవకాశం లేదు. ఈ ప్రధాన యుద్ధ రంగ రాష్ట్రాల జాబితాలో మణిపూర్, మేఘాలయతో పాటు కేంద్ర పాలిత ప్రాంతాలు లద్దాఖ్, లక్షదీవులు, పుదుచ్చేరి కూడా ఉన్నాయి. ఈ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలోనే 2024 సార్వత్రిక ఎన్నికల అసలు సమరం జరగనున్నది. గత సార్వత్రిక ఎన్నికలలో ఈ 200 సీట్లలో 107ను (మిత్రపక్షాలు గెలుచుకున్న వాటిని కూడా కలుపుకుంటే మొత్తం 147) బీజేపీ స్వాధీనం చేసుకున్నది. ఈ సీట్లు అన్నిటినీ ప్రతిపక్ష కూటమి 'ఇండియా' లక్ష్యం కావాలి. తద్వారా బీజేపీని గణనీయంగా దెబ్బ తీయాలి. అయితే ఇందుకు ఈ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలలో 'ఇండియా' కూటమి ఒక పటిష్ఠ రాజకీయ పక్షంగా పని చేయవలసిన అవసరమున్నది. భాగస్వామ్య పక్షాలు అన్నీ కలసికట్టుగా పోరాడని పక్షంలో 'ఇండియా'కు విజయం దక్కదు. సమైక్యంగా పోరాడగలిగితే ఈ ప్రధాన యుద్ధ రంగంలో బీజేపీ 25 నుంచి 35 సీట్లను ఖాయంగా కోల్పోతుంది. ఇదే జరిగితే లోక్‌సభలో బీజేపీ ప్రస్తుత సంఖ్యాబలాన్ని 40 నుంచి 60 సీట్ల దాకా తగ్గించడం సాధ్యమవుతుంది. ఇదొక పెనుమార్పుకు కారణమవుతుంది. దేశ రాజకీయ వాతావరణాన్ని పూర్తిగా మార్చివేస్తుంది. మరి ఇటువంటి మార్పు నిజంగా సంభవిస్తుందా? సంభవించడం సాధ్యమవుతుందా? ఈ ప్రశ్నలకు సమాధానాలు 'ఇండియా' కూటమి, ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీ నేను విపులీకరించిన వ్యూహాన్ని పటిష్ఠంగా అమలుపరుస్తుందా అన్నదానిపై ఆధారపడివున్నాయి.

ఆంధ్రప్రదేశ్ చరిత్ర కాంగ్రెస్ 46వ వార్షిక సభలు

ఈ నెల 6, 7 తేదీలలో ఆంధ్రప్రదేశ్ చరిత్ర కాంగ్రెస్ 46వ వార్షిక మహాసభలు, విశాఖపట్నంలో డా. బుల్లయ్య కళాశాలలో ప్రిన్సిపాల్ కె.సి.రెడ్డి, అధ్యాపకుల ఆధ్వర్యంలో జరుగనున్నాయి. 1976లో కావలి జవహర్ భారతి కళాశాలలో, డా. మలిరెడ్డి పట్టాభిరామరెడ్డి చొరవతో మొదలైన ఈ చరిత్ర సంస్థ, క్రమం తప్పకుండా వార్షిక సభలు జరుపుకొంటూ, చరిత్రకారులకు ఒక వేదికగా రూపుదిద్దుకున్నది. వార్షిక సభలలో సమర్పించిన పరిశోధక పత్రాలను ఎంపిక చేసి, ఇంతవరకూ 45 సంపుటాలను ప్రచురించింది. ఇవి పరిశోధకులకు ఎంతగానో ఉపకరిస్తున్నాయి.

ఈ సంస్థ జరిపిన కృషిలో పలువురు సీనియర్ చరిత్రకారులతో పాటు, వర్తమాన చరిత్రకారులు తమ పరిశోధనలను, ప్రాచీన, మధ్యయుగ, ఆధునిక చరిత్ర రచన విభాగాల్లో సమర్పించి, చర్చించి, తద్వారా తెలుగువారి చరిత్ర, సంస్కృతులను సంపన్నం చేశారు.

ఆంధ్ర విశ్వవిద్యాలయం, 1926లో వాల్తేర్‌లో (అప్పట్లో విశాఖపట్నం శివారు) స్థాపించగా, అప్పటి వైస్ ఛాన్సలర్ కట్టమంచి రామలింగారెడ్డి సముద్రతీరానికి దాపులో, ఒక ఎత్తయిన ప్రదేశంలో నెలకొల్పారు. ఆంధ్ర ప్రాంతంలో ఆంధ్రులకు ఇది మొదటి విశ్వవిద్యాలయం. ఈ ప్రాంగణం నుంచి సముద్ర తరంగాలు నిరంతరం కనువిందు చేస్తుంటాయి. విశ్వవిద్యాలయ ప్రాంగణాన్ని ఎంపిక చేయడంలో కట్టమంచి వారి భావుకత, ప్రకృతి సౌందర్య అభిలాష, చూపరులను, ఆ తర్వాత తరతరాల విద్యార్థులను ఉత్తేజపరుస్తూ వస్తున్నాయి.

కట్టమంచి వారు వేసిన అధ్యయన పునాదులపై ఆ తర్వాత వచ్చిన అధ్యాపక ప్రముఖులు సర్వేపల్లి రాధాకృష్ణన్ (వైస్ ఛాన్సలర్‌గా పనిచేశారు), హుమయూన్ కబీర్, హీరేన్ ముఖర్జీ, అబ్బూరి రామకృష్ణారావు, మల్లంపల్లి సోమశేఖరశర్మ, గొర్తి వెంకటరావు, గంటి జోగిసోమయాజి, కె.ఆర్. శ్రీనివాసయ్యంగార్, ఉపాధ్యక్షులు వాసిరెడ్డి శ్రీకృష్ణ, వేణుగోపాలస్వామి, సర్వేశ్వరరావు మరెందరో విశ్వవిఖ్యాతి పొందిన శాస్త్రవేత్తలతో విశ్వవిద్యాలయం ఖ్యాతి నలుదిశలా వ్యాపించింది.

ఈ సభలను నిర్వహిస్తున్న (ఆచార్య కె.సి. రెడ్డి, తదితరులు), ఈ సభలలో పాల్గొంటున్న అనేకులకు ఈ విశ్వవిద్యాలయమే గురుపీఠం. ఈ చారిత్రక సభలను నిర్వహిస్తున్న ఆచార్య కె.సి.రెడ్డి, వారి సహచరులు ఇక్కడివారే! ఆంధ్ర విశ్వవిద్యాలయం, ఒక సుందర, అపూర్వ భావన. ఆంధ్రప్రదేశ్ చరిత్ర కాంగ్రెస్ జాతీయ స్థాయిలో గుర్తింపు పొందింది. ఇందులో సభ్యులు, జాతీయ స్థాయిలో బాధ్యతలు, కార్యదర్శిగా కూడ ఎన్నికయ్యారు. ఇక్కడ అనేక పట్టణాల్లో, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో, తెలంగాణలో అనేక పట్టణాల్లో వార్షిక సభలను జరుపుకొన్నది. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఉన్న చరిత్రకారులు, రొమీలా థాపర్, సర్వేపల్లి గోపాల్, బరుండే, బిపన్ చంద్ర, సవ్యసాచి భట్టాచార్య, మరెందరో ప్రముఖులు సభల్లో పాల్గొన్నారు. ఈ క్రమంలో సంస్థ జాతీయ స్థాయికి ఎదిగింది. సంస్థ సభ్యులు అఖిలభారత స్థాయిలో ముఖ్య బాధ్యతలు నిర్వహించారు.

నలభై అయిదు వార్షిక సభలు జరుపుకొని, ప్రస్తుతం 46వ వార్షిక సభలకు విశాఖపట్నంలోని ప్రముఖ యల్. బుల్లయ్య కళాశాలలో, ఆచార్య కె.సి. రెడ్డి నేతృత్వంలో జరుగుతున్నది. రాష్ట్రం నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో ప్రతినిధులు హాజరై, వివిధ చారిత్రక విభాగాల్లో పరిశోధనాపత్రాలు సమర్పించనున్నారు. ఈ సందర్భంలో కీ.శే. ఆచార్య మామిడిపూడి వెంకట రంగయ్య స్మారకోపన్యాసం ఉంటుంది.

– వకుళాభరణం రామకృష్ణ

కశ్మీర్ విషయంలో ఆయనవి మొసలి కన్నీళ్లు!

'ఇప్పుడు ప్రతి రాష్ట్రమూ కశ్మీరే' అంటూ చిదంబరం పలుకుల్లోని డొల్లతనం అందరికీ వివరించాల్సిన అవసరం వుంది. కేంద్ర హోం మంత్రి హోదాలో ఆంధ్రప్రదేశ్ విభజన చట్టం తెచ్చిన ఆయన, నేడు కశ్మీర్ విషయంలో కారుస్తున్నవి మొసలి కన్నీళ్లు. ఒక రాష్ట్ర భూభాగాన్ని ముట్టుకునే ముందు ఆ రాష్ట్ర శాసనసభ్యుల అభిప్రాయం రాష్ట్రపతి తెలుసుకున్న తర్వాతే సంబంధిత శాసన ప్రక్రియకు పూనుకోవాలి అని చిదంబరం నేడు వాదిస్తున్నారు. ఈ వాదన 2014లో ఏమైంది? ఆంధ్రప్రదేశ్ శాసనసభ చేసిన తీర్మానానికి నాటి చిదంబరం ఇచ్చిన విలువ ఏమిటి? నాడు ఆయన హోంమంత్రిగా చేసిన దానికన్నా భిన్నంగా అమిత్ షా ప్రవర్తించలేదు. శాసనసభ వ్యక్తీకరించిన అభిప్రాయం పట్టించుకోవాల్సిన అవసరం లేదు అని నాటి యూపీఏ ప్రభుత్వం చేసిన వాదన రికార్డుల్లో ఉంది. చిదంబరం తన కుహనా వాదనలను ఇకనైనా ఆపాలి.

– దుగ్గరాజు శ్రీనివాసరావు
విజయవాడ

అంపశయ్యపై రుణాంధ్రప్రదేశ్!

ఆర్థిక క్రమశిక్షణ విషయంలో మంచి పేరున్న ఆంధ్రప్రదేశ్‌ను ఆర్థికంగా పాతాళానికి నెట్టింది జగన్ ప్రభుత్వం. ఏ ప్రభుత్వమైనా తప్పని పరిస్థితుల్లో అప్పులు చేయడం సహజం. కానీ ఇంత బరితెగించి రాష్ట్రంపై ఘోరాతిఘోరంగా రుణభారం మోపడం బాధ్యతారాహిత్యం. వీలైనంత వరకు రాష్ట్రాన్ని అప్పుల్లో ముంచి వెళ్లిపోవాలని కంకణం కట్టుకున్నారు ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి.

అధికారిక అప్పులను చూపిస్తూ, అనధికారిక అప్పులను దాచిపెడుతూ రాష్ట్ర ప్రభుత్వం గందరగోళం సృష్టిస్తోంది. కాగ్‌ను సైతం తప్పుదారి పట్టిస్తోంది. ప్రభుత్వం తెచ్చిన అప్పులకు, చెబుతున్న లెక్కలకు ఎక్కడా పొంతన లేకుండా గణాంకాల గారడీ చేస్తున్నారు. ప్రభుత్వం చెబుతున్న అప్పుల అంకెలన్నీ నిజమైతే పబ్లిక్ అకౌంట్స్ కమిటీ సమావేశానికి ఎందుకు సిద్ధపడటం లేదు? శ్వేతపత్రం ఎందుకు విడుదల చెయ్యడం లేదు? ఇలా అప్పులు చేయడం అధికరణ 293(3), అధికరణ 261లను ఉల్లంఘించడమే. ప్రభుత్వ రుణాలను పక్కనబెడితే, రాష్ట్ర ప్రభుత్వం ఏకంగా రూ.1,70,000 కోట్ల మేరకు పెండింగ్ బిల్లులను చెల్లించాల్సి వుందని సమాచారం.

ఆర్బీఐ హెచ్చరించినా, కేంద్ర ఆర్థిక శాఖ పదేపదే అప్పుల లెక్కలు అడిగినా పట్టించుకోకుండా, చిన్నమొత్తాల పొదుపు, పీఎఫ్‌లు, డిపాజిట్లు, రిజర్వు నిధుల నుంచి సైతం సొమ్ములు కాజేసే దౌర్భాగ్య పరిస్థితి రాష్ట్రంలో నెలకొన్నది. బొంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ సైతం ఏపీ అప్పులపై అవాక్కయింది. జగన్ ప్రభుత్వం చేసిన అప్పులు మొత్తం రూ.12 లక్షల కోట్లకు చేరినట్లు సమాచారం. ఏ రాష్ట్ర అభివృద్ధికైనా ఎంతో, కొంత అప్పులు అవసరమే. కానీ రాష్ట్ర మొత్తం నికర స్థూల ఉత్పత్తిలో జీఎస్‌డీపీలో అవి 35 శాతాన్ని మించకూడదు అని ఆర్థిక నిబంధన వుంది. దాన్ని పట్టించుకోకుండా జగన్‌రెడ్డి తెచ్చిన అప్పులు 42శాతాన్ని దాటిపోయాయని కాగ్ హెచ్చరించింది. అనధికారంగా తెచ్చిన అప్పులు కూడా కలిపితే అప్పులు ఏకంగా 65శాతం దాటిపోతున్న పరిస్థితులు రాష్ట్రంలో నెలకొన్నాయి.

ఇప్పటికే ఈ ఆర్థిక సంవత్సరం అప్పుల భారం రూ.లక్ష కోట్లకు చేరింది. మిగిలివున్న ఆర్థిక సంవత్సరం మూడు నెలల్లో రూ.18వేల కోట్లు కావాలని రిజర్వు బ్యాంకును కోరింది జగన్ ప్రభుత్వం. ఈ విధంగా అప్పులు తేవడం ఎక్కడా ఎన్నడూ చూడలేదని ఆర్థిక నిపుణులు ఆశ్చర్యపోతున్నారు. రాష్ట్రంలో బహిరంగ మార్కెట్ రుణం, కేంద్రం నుంచి వచ్చే రుణాలు, ప్రావిడెంట్ ఫండ్ మొత్తాలు... ఇలా బయటకి కనిపించేవి కాగా, అసలు ఎవరికీ చెప్పకుండా ఇష్టానుసారం ప్రభుత్వ కార్పొరేషన్ల ద్వారా ప్రభుత్వమే గ్యారంటీలు ఇచ్చి రుణాలు తెచ్చారు. ఇదే జగన్‌రెడ్డి ప్రతిపక్షంలో ఉండగా ఎఫ్ఆర్‌బీఎం పరిమితిని మించి తెలుగుదేశం ప్రభుత్వం అప్పులు చేస్తుందంటూ, ఈ అప్పులు ఎవరు తీర్చాలంటూ గత ప్రభుత్వంపై ఇష్టానుసారం విమర్శలు చేసింది. ఇప్పుడు జగన్‌రెడ్డి చేస్తున్న అప్పులు ఎవరు తీర్చాలి? జగన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక అప్పుల కోసం ప్రభుత్వ గ్యారంటీలు ఇచ్చే పరిమితిని రెట్టింపు చేశారు. ఏటా ఆర్థిక సంవత్సరంలో సాధించిన పూర్తి రెవెన్యూ రాబడిలో 90 శాతం వరకు మాత్రమే గ్యారంటీల మొత్తం ఉండాలనే నిబంధన ఉండేది. కానీ జగన్ ప్రభుత్వం దానిని రెట్టింపు చేసి 180 శాతానికి పెంచింది. అప్పులు తేవడంకోసం కొత్త కొత్త కార్పొరేషన్లు ఏర్పాటు చేశారు. ఆర్బీఐ నుంచి తెచ్చే వేలకోట్ల అప్పులు కాకుండా, కార్పొరేషన్లు, బ్యాంకుల నుంచి తెస్తున్న అప్పులు కూడా సరిపోవడం లేదు. విచ్చలవిడిగా అప్పులు తెస్తూ, పారదర్శకత లేని పాలనా విధానాలతో ఆంధ్రప్రదేశ్ భవిష్యత్‌ను బలిపీఠం పైకి నెట్టారు.

నవంబర్ నెలాఖరు వరకు పన్నుల రాబడి మొత్తం రూ.79వేల కోట్లు రాగా, జగన్ ప్రభుత్వం చేసిన అప్పుల మొత్తం రూ.65వేల కోట్లు అని కాగ్ నివేదిక వెల్లడించింది. ఇందులో కార్పొరేషన్ల రుణాలు కూడా కలిపితే పన్నుల వసూళ్ల కన్నా చేసిన అప్పుల మొత్తమే ఎక్కువ ఉంటుంది. మరి ఈ రుణాలు అన్నీ ఎవరి జేబుల్లోకి వెళుతున్నట్లు? కొత్తగా ఒక్క సాగు నీటి ప్రాజెక్టును నిర్మించారా? కొత్తగా ఒక్క ఎకరం సాగు విస్తీర్ణం పెంచారా? కొత్తగా ఒక్క రోడ్డు వేశారా? ఒక్క హాస్పిటల్ నిర్మించారా? ఒక్క పాఠశాల, కళాశాల నిర్మించారా? ఐటీ రంగాన్ని అభివృద్ధి చేసారా? ఇవేవీ జరగలేదు. రాజధానిని చంపేశారు. ప్రతినెలా ఉద్యోగులకు మూడో వారం వచ్చినా జీతాలు ఇచ్చే పరిస్థితి లేదు. కాంట్రాక్టర్లకు, ఇతర చెల్లింపులకు ఇవ్వాల్సిన పెండింగ్ బిల్లులు లక్షన్నర కోట్ల వరకు ఉన్నట్లు సమాచారం. రానున్న ఎన్నికల్లో ఎట్లాగూ తాము అధికారంలోకి వచ్చే పరిస్థితి లేదు కాబట్టి ఆ వచ్చే ప్రభుత్వం వడ్డీలకు, అసలు చెల్లింపులకు పరిమితమై మరే ఇతర పనులు చేపట్టే వీలు లేకుండా అప్పులు చేసి వెళ్లిపోవాలని జగన్ నిర్ణయించుకున్నట్లు కనపడుతుంది. ఇప్పటికే రాష్ట్ర మొత్తం అప్పు రూ.12 లక్షల కోట్లకి చేరింది.

రాష్ట్రం పూర్తిగా అప్పుల ఊబిలో కూరుకుపోయినా ఏపీకి మరో 0.5 శాతం రుణం పొందేందుకు కేంద్రం అనుమతి ఇవ్వడం ఆశ్చర్యం వేస్తుంది. నీటి మీటర్ల నుంచి వివిధ అంశాల వరకు ఏపీలో విద్యుత్ సంస్కరణలకు జగన్ కేంద్ర ప్రభుత్వం మీద ప్రభు భక్తిని చాటుకున్నందుకు కేంద్రం రూ.5,858కోట్ల రుణాన్ని మార్కెట్ నుంచి అదనంగా పొందేందుకు అనుమతినిచ్చింది. ప్రభుత్వం అడ్డగోలుగా చేస్తున్న అప్పులపై అప్రమత్తం కావాల్సిన కేంద్రం వాటికి ఇచ్ఛానుసారంగా అనుమతులు ఇస్తున్నది.


2023–24 ఆర్థిక సంవత్సరం మొదటి ఎనిమిది నెలల గణాంకాలను కాగ్ వెల్లడించింది. కాగ్ లెక్కలు అదుపు తప్పిన రాష్ట్ర ఆర్థిక పరిస్థితికి అద్దం పడుతున్నాయి. ఈ ఆర్థిక సంవత్సరం చివరినాటికి మొత్తం రూ.22,316 కోట్ల మేర రెవెన్యూ లోటు ఉంటుందని అంచనా వేస్తే అది ఇప్పటికే అంతకు రెట్టింపు అయింది. ఈ ఆర్థిక సంవత్సరం మొదటి 9 నెలల్లో రెవెన్యూ లోటు రూ.50,000 వేలకోట్లకు చేరింది. 2023–24 ఆర్థిక సంవత్సరంలో మొత్తం రెవెన్యూ రాబడి నవంబరు నెలాఖరు నాటికి రూ.1,04,965 కోట్లు కాగా రెవెన్యూ ఖర్చులు ఏకంగా రూ.1,52,027 కోట్ల మేర చేశారు. ఈ ఆర్థిక సంవత్సరం మొత్తం మీద రూ.2,06,224 కోట్ల రాబడి వస్తుందని బడ్జెట్‌లో అంచనా వేశారు. కానీ ఇంతవరకు రాబడుల్లో వచ్చింది కేవలం రూ.1,04,965 కోట్లు మాత్రమే. ఈ ఏడాది గడచిన ఎనిమిది నెలల్లో అంచనాల్లో సాధించిన రాబడి మొత్తం కేవలం 51శాతం మాత్రమే.

రానున్న ఎన్నికల్లో ఎట్లాగూ తాము అధికారంలోకి వచ్చే పరిస్థితి లేదు కాబట్టి ఆ వచ్చే ప్రభుత్వం వడ్డీలకు, అసలు చెల్లింపులకు పరిమితమై మరే ఇతర పనులు చేపట్టే వీలు లేకుండా అప్పులు చేసి వెళ్లిపోవాలని జగన్ నిర్ణయించుకున్నట్లు కనపడుతోంది. ఇప్పటికే రాష్ట్ర మొత్తం అప్పు రూ.12 లక్షల కోట్లకి చేరింది.



ఒక వైపు అప్పులు, రెవెన్యూ లోటు అంచనాలు దాటిపోతూ, రెవెన్యూ రాబడులు తగ్గిపోవడం చూస్తే రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అంపశయ్య మీద ఉన్నట్లు అర్థం అవుతోంది. రాబడిని మించి చేసిన ఖర్చు అంతా అప్పు చేసి రెవెన్యూ ఖర్చులకు మళ్లించిందే. ఆదాయంతో సంబంధం లేకుండా విచ్చలవిడిగా అప్పులు చేస్తున్న ప్రభుత్వానికి శ్రీలంక ఆర్థిక సంక్షోభమే ఒక హెచ్చరిక అని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు. జగన్‌రెడ్డి తెచ్చిన అప్పులకు అసలు, వడ్డీ కలుపుకుని ఏడాదికి లక్ష కోట్ల వరకు చెల్లించాల్సిన పరిస్థితి రాబోతుంది. రాష్ట్రంలో ఆర్థిక అత్యవసర పరిస్థితి విధించే పరిస్థితులు నెలకొన్నాయి. ప్రభుత్వం చేసిన అప్పులపై శ్వేతపత్రం విడుదల చేసి వాస్తవాలు ప్రజలు ముందుంచాలి. అంతే తప్ప అప్పులపై అబద్ధాలు, కాకి లెక్కలు చెప్పి తప్పుదారి పట్టించవద్దు.

● యనమల రామకృష్ణుడు



ఘనంగా జోసఫ్ తంబి నవదిన ప్రార్థనలు ప్రారంభం

పెదఅవుటపల్లి కథోలిక పుణ్యక్షేత్రంలో 15 వరకు ఉత్సవాలు

- 6లో..



దీక్షతో..

రెండోరోజూ కొనసాగిన భక్తుల రద్దీ



వన్‌టౌన్, జనవరి 4 : భవానీ దీక్షల విరమణ మహోత్సవాల్లో రెండోరోజు గురువారం కూడా భక్తుల రద్దీ కొనసాగింది. దీక్షాధారులు ఇరుముడులు ధరించి, ఇంద్రకీలాద్రికి చేరుకుని తమ మొక్కులు తీర్చుకుంటున్నారు. దీక్షతో గిరిప్రదక్షిణ చేస్తున్నారు. అనంతరం దుర్గమ్మ దర్శనం చేసుకుని, ఇరుముడులు సమర్పించుకుని, నెయ్యి నింపిన టెంకాయలను హోమగుండాల్లో సమర్పిస్తున్నారు. తలనీలాలను సమర్పించి అమ్మవారిని భక్తితో వేడుకుంటున్నారు. కాగా, బుధవారం వరకు 70 వేలమంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. 3.46 లక్షల లడ్డూ ప్రసాదాలను కొనుగోలు చేశారు. 17,600 మంది తలనీలాలను సమర్పించుకున్నారు. 16వేల మంది అన్న ప్రసాదాన్ని స్వీకరించారని ఆలయ అధికారులు తెలిపారు. కాగా, ఈవో కేఎస్ రామారావు గురువారం భవానీ దీక్షల విరమణ ఏర్పాట్లను పరిశీలించారు. కేశఖండనశాల, ప్రసాదాల విక్రయాల కౌంటర్లు తనిఖీ చేశారు. రైల్వేస్టేషన్, బస్టాండ్ వద్ద ప్రసాదాల కౌంటర్లను పరిశీలించారు. భక్తుల రద్దీ కారణంగా అంతరాలయ దర్శనాలను రద్దు చేశారు.

అక్షరారోగ్యం

పుస్తక మహోత్సవంలో ఆకర్షిస్తున్న ఆరోగ్య విజ్ఞాన పుస్తకాలు



ఆరోగ్యమే మహాభాగ్యం అన్నారు పెద్దలు. పుస్తక మహోత్సవంలో విజ్ఞానంతో పాటు ఆరోగ్యాన్ని కాపాడుకునే అరుదైన పుస్తకాలు కూడా లభిస్తున్నాయి. దీర్ఘకాలిక వ్యాధులతో పాటు పాటు కేన్సర్, షుగర్, కొలెస్ట్రాల్, డయాబెటిస్ నిర్మూలనకు అవసరమైన సలహాలు, సూచనలు, బరువు తగ్గే మార్గాలు, తినే సమయాలు, ఇతర హెల్త్ టిప్స్ పుస్తక ప్రియులను ఆకర్షిస్తున్నాయి. ఒకటో నెంబర్ స్టాల్‌లో ఈ ఆరోగ్య అక్షర విజ్ఞాన నిధి అందుబాటులో ఉంది.

- 6లో..

స్థానికత చిచ్చు

సెంట్రల్‌లో వెలంపల్లికి సీటు కేటాయింపుపై వ్యతిరేకత



వైసీపీ అధిష్ఠానం చేసిన టికెట్ల ప్రకటన బెజవాడలో కలకలం రేపుతోంది. కులాల మధ్య చిచ్చు రగల్చడంతో పాటు స్థానికత చర్చను తెరపైకి తెస్తోంది. పశ్చిమ నియోజకవర్గానికి చెందిన వెలంపల్లి శ్రీనివాసరావుకు సెంట్రల్ టికెట్ ఇవ్వడంపై కార్పొరేటర్లు భగ్గుమంటుంటే, స్థానికులెవరూ లేరన్నట్టు స్థానికేతరులకు అవకాశం ఇవ్వడమేమిటనే వాదన తాజాగా బయటపడింది. ఇప్పటికే బ్రాహ్మణ సామాజికవర్గం నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతుండగా, తాజాగా సొంత పార్టీ కార్పొరేటర్లే అసహనం వ్యక్తం చేయడంతో వైసీపీ రాజకీయ రచ్చ ముదిరి పాకాన పడింది.

- స్థానికేతరులకు ఇవ్వడమేమిటని వైసీపీ కార్పొరేటర్ల చర్చ
- తమ అభిప్రాయాన్ని అధిష్ఠానం ముందుంచే యోచన
- మల్లాది బాటలోనే రక్షణనిధి
- కాంగ్రెస్‌లో చేరే అవకాశాలు

(విజయవాడ-ఆంధ్రజ్యోతి) : సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణుకు టికెట్ ఇవ్వకపోవడం, పశ్చిమ నియోజకవర్గానికి చెందిన వెలంపల్లికి ఆ సీటు కేటాయించడంపై అసంతృప్తి జ్వాలలు రగులుతున్నాయి. బుధవారం వెలంపల్లి పలువురు కార్పొరేటర్లు, డివిజన్ ఇన్‌చార్జులకు వాట్సాప్ కాల్స్ చేయగా, అధికశాతం మంది తమ వ్యతిరేకత తెలిపినట్లు సమాచారం. స్థానికేతరులకు ఏ ప్రాతిపదికన వైసీపీ అధిష్ఠానం టికెట్ ఇచ్చిందో అర్థం కావడం లేదని, ప్రస్తుత పరిస్థితుల్లో పార్టీ గెలుపే ప్రశ్నార్థకంగా ఉంటే, మళ్లీ స్థానికేతరులను తీసుకొచ్చి టికెట్ ఇవ్వడమేమిటని ఓ కార్పొరేటర్ 'ఆంధ్రజ్యోతి' వద్ద వ్యాఖ్యానించారు. సెంట్రల్ నియోజకవర్గంలో సుమారు 18 మంది వైసీపీ కార్పొరేటర్లు ఉన్నారు. వీరిలో అధికశాతం మంది మల్లాది విష్ణుపై వ్యతిరేకతతో ఉండేవారు. తమను పట్టించుకోవడం లేదని, భవన నిర్మాణాల విషయంలోనూ ఎమ్మెల్యే జోక్యం చేసుకుంటున్నారని వారంతా విష్ణుపై వ్యతిరేకత చూపేవారు. అయితే, తాజా పరిణామాలతో తమ పరిస్థితి పెనం పైనుంచి పొయ్యిలో పడినట్లు అయిందని వారు భావిస్తున్నారు. పశ్చిమలో వెలంపల్లి ఆధిపత్యం కారణంగా స్థానిక నాయకులు ఎన్ని ఇబ్బందులు పడ్డారో స్వయంగా చూసినవారు తమకూ అదే పరిస్థితి ఎదురవుతుందేమోనని భయపడుతున్నారు. ఈ కారణంగానే స్థానిక చర్చను తెరపైకి తెచ్చారు. సెంట్రల్ నియోజకవర్గంలో సమర్థులైన, ఆర్థికంగా బలంగా ఉన్న నాయకులు చాలామందే ఉన్నారని, వారిని కాదని స్థానికేతరులకు అవకాశం ఇవ్వడంపై తమ వ్యతిరేకతను వైసీపీ పెద్దల దృష్టికి తీసుకెళ్లేందుకు వీరు సిద్ధమవుతున్నారు.

- మిగతా 6వ పేజీలో..

కాంగ్రెస్‌వైపు కీలక నేతలు

వైఎస్ తనయ షర్మిల కాంగ్రెస్‌లో చేరడం.. ఏపీ కాంగ్రెస్ పగ్గాలు చేపట్టే అవకాశాలు ఉన్నాయని ప్రచారం జరుగుతుండటంతో చాలామంది వైసీపీ తిరస్కృతులు కాంగ్రెస్ బాట పట్టేందుకు సిద్ధమవుతున్నారు. మల్లాది విష్ణు కాంగ్రెస్‌లో చేరికకు రంగం సిద్ధమవ్వగా, ఇప్పుడు ఆయన బాటలోనే తిరువూరు ఎమ్మెల్యే రక్షణనిధి కూడా పయనిస్తున్నారని సమాచారం. వాస్తవానికి టీడీపీ లేదా జనసేన నుంచి టికెట్ కోసం రక్షణనిధి ప్రయత్నించారన్న ప్రచారం జరిగింది. పామర్రు నుంచి పోటీకి ఆయన సుముఖత చూపారని సమాచారం. అయితే తాజా పరిణామాల నేపథ్యంలో ఆయన కాంగ్రెస్ దిశగా అడుగులు వేస్తున్నారని అనుచరులు ప్రచారం చేస్తున్నారు. వైసీపీలో సీనియర్ నాయకులు సైతం తమకు ఈసారి టికెట్ ఉందా, లేదా అన్న సందిగ్ధంలో ఉన్నారు. దీంతో చాలామంది టీడీపీ, జనసేన వైపు చూస్తున్నారు. మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్, పెనమలూరు ఎమ్మెల్యే పార్థసారథి పార్టీ మారతారన్న ప్రచారం జరుగుతోంది. సారథికి సన్నిహితుడైన మచిలీపట్నానికి చెందిన గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రొండి కృష్ణ యాదవ్, మచిలీపట్నం మున్సిపల్ కార్పొరేషన్‌లో 40వ డివిజన్ వైసీపీ కార్పొరేటర్ నాలి శారద భర్త మాధవ ఇద్దరూ టీడీపీ తీర్థం పుచ్చుకోనున్నారు. వీరిలో రొండి కృష్ణ యాదవ్ సారథికి సన్నిహితుడు కావడం గమనార్హం. తాము 6 లేదా 7 తేదీల్లో టీడీపీలో చేరుతున్నట్లు మాధవ 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.



అలుపెరగని చైతన్యం

- 24వ రోజూ కొనసాగిన అంగన్వాడీల నిరసన
- ధర్నాచౌక్‌లో నినాదాలు

తమ సమస్యల పరిష్కారానికి అంగన్వాడీలు చేపట్టిన ధర్నా 24వ రోజు గురువారం కూడా కొనసాగింది. పోలీసుల దౌర్జన్యాన్ని ఖండిస్తూ నల్లజెండాలు, బ్యాడ్జీలతో ధర్నాచౌక్‌లో నిరసన తెలిపారు. పెద్దపెట్టున నినదించారు.

- 6లో..



పోలీసులకు చేతులెత్తి మొక్కుతున్న నిరుద్యోగులు

నిరుద్యోగుల నిరసనాగ్ని

- మెగా డీఎస్సీ కోసం రోడ్డెక్కిన ఆశావహులు
- అవనిగడ్డలో రాస్తారోకో
- చెప్పులతో కొట్టుకుని వినూత్న నిరసన
- పోలీసుల కాళ్లు పట్టుకుని వేడుకోలు
- మద్దతుగా నిలిచిన టీడీపీ, జనసేన నేతలు

- 6లో..

అక్షరారోగ్యం



» తొలిసారి ఆరోగ్యంపై రచనల వెల్లువ » సరళమైన భాషలో వైద్య విజ్ఞానం

ఆరోగ్యం.. మనిషి జీవితంలో ఆరోగ్యం ఎంత విలువైనదో ప్రతి ఒక్కరికీ తెలిసు.. దైనందిన జీవనంలో నేడు ఒత్తిడికి గురై అనేకమంది చిన్న వయస్సులోనే రుగ్మతల బారిన పడుతున్నారు. వాటి నుంచి మనల్ని మనం కాపాడుకోవాలంటే వ్యాధులపట్ల సరైన అవగాహన ప్రతి ఒక్కరికీ అవసరం.. అంటే ఇది అందరికీ సాధ్యమయ్యే పనికాదు. ఆర్థిక స్థోమత ఉన్నవారు నిరంతరం వైద్యుల పర్యవేక్షణలో ఉంటే.. ఇంటిపట్టున ఉండే మహిళలు, కాయకష్టం చేసుకునే పేదలు తమ ఆరోగ్యంపై సరైన అవగాహన లేక వాధుల బారిన పడుతున్నారు. ఇటువంటి వారికోసం నిపుణులైన వైద్యులచే పుస్తక రచనలు ఈసారి పుస్తకమహోత్సవంలో కొలువుదీరాయి.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ)

'మిమ్మల్ని మీరు పరిశీలించుకోండి.. ఆరోగ్యంపై అవగాహన పెంచుకుని జాగ్రత్త పడండి' అంటూ ఆరోగ్య విజ్ఞాన రచనలు అప్రమత్తం చేస్తున్నాయి. పుస్తక మహోత్సవంలో ఈసారి ఆరోగ్య రచనలతో పుస్తకాల స్టాళ్లు ఏర్పాటు చేశారు. ఉరుకులు పరుగుల జీవితంలో అనేక రుగ్మతలు మనుషుల్ని వెంటాడుతున్నాయి. చిన్న సమస్యే కదా అని తేలిగ్గా తీసుకుంటే.. భవిష్యత్తులో అవి ప్రాణాంతకంగా మారుతున్నాయి. హైబీపీ, షుగర్, ఊబకాయం, గుండెజబ్బులు, కేన్సర్ వంటివి అంత తొందరగా బయట పడవు. ఇటువంటి దీర్ఘకాలిక వ్యాధులను సరైన సమయంలో గుర్తించగలిగితే వాటి నుంచి బయట పడవచ్చు. నిపుణులైన వైద్యులు అక్షర రూపంలోకి మరల్చిన కొన్ని రచనలు ఈసారి పుస్తక మహోత్సవంలో కొలువుదీరాయి. వీటిలో 'ఆరోగ్య విజ్ఞాన ప్రచురణలు' ఒకటి. ఒకటో నెంబర్ స్టాల్‌లో సులభంగా అర్థం చేసుకోగలిగే పుస్తకాలు ఉన్నాయి. ఈ రచనలు వాడుక భాష తెలుగులో తీసుకువచ్చారు. 'పంచదార, ఆహారం మంచి-చెడు, ఉప్పు ముప్పే కాదు, కేన్సర్ కోడ్, మధుమేహం, ఊబకాయం, ఆహారం-ఆరోగ్యం, ఒకప్పుడు డయాబెటిస్ ఉండేది' వంటి పుస్తకాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. వీటితో పాటు బరువు తగ్గేందుకు సులువైన మార్గాలు, పిండి పదార్థాలు-హానికరం, మందులు లేకుండా మధుమేహం నుంచి బయటపడే మార్గం. ఇన్సులిన్ గురించి తెలుసుకోవాల్సిన విషయాలు కూడా పుస్తకాల రూపంలో అందుబాటులో ఉన్నాయి. వాటిలో ఉపవాసం పుస్తకం ఆకట్టుకుంటోంది. అంతర్జాతీయ ప్రముఖ వైద్యులు జాసన్ ఫండ్, గ్యారీటాబ్స్ తమ రచనలకు పుస్తకరూపం ఇచ్చారు.

పాకిస్తాన్ స్టోరీస్.. హాట్ సేల్స్



(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : దాయాది దేశం పాకిస్తాన్ గురించి తెలుసుకోవాలన్న కుతూహలం అందరికీ ఉంటుంది. ఉగ్రవాదం మాట పక్కన పెడితే అదో అందమైన, సంస్కృతి సంప్రదాయాలు కలిగిన దేశం. గ్రామీణ నేపథ్యం కలిగిన ప్రాంతం ఎక్కువగా ఉంటుంది. అక్కడి జాతులు, తెగలు, కళలు, వారి జీవనశైలి అద్భుతమనే చెప్పాలి. పాకిస్తాన్‌కు సంబంధించిన అంశాలను సృజించే జీవనశైలి అద్దం పట్టేలా, ఆ దేశం ఎదుర్కొంటున్న సవాళ్లను తెలియజెప్పేలా కేంద్ర సాహిత్య అకాడమీ అనువదించిన పుస్తకాలను పుస్తక మహోత్సవంలో ప్రదర్శిస్తోంది. పాకిస్తాన్ నేపథ్యంతో కూడిన 'పాకిస్తాన్ కథానికలు, ఎన్ని పాకిస్తానులు' పుస్తకాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు కూడా వచ్చిన ఈ పుస్తకాలు హాట్ కేక్‌లా అమ్ముడు పోతున్నాయని నిర్వాహకులు చెబుతున్నారు.

ఫిక్షన్ బామ్మలు..

» డిటెక్టివ్, ఫాంటసీ పుస్తకాలకు క్రేజు



(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఫిక్షన్ నవలలపై బామ్మలు మనసు పారేసుకుంటున్నారు. ఈసారి పుస్తక మహోత్సవంలో బామ్మలు కొనుగోలు చేసే పుస్తకాలలో ఎక్కువగా ఫిక్షన్ నవలలే ఉంటున్నాయి. నచ్చిన పుస్తకాలను కొనుగోలు చేస్తున్నారు. పుస్తక మహోత్సవంలో తమకు నచ్చిన ఫిక్షన్ పుస్తకాల కోసం కలియతిరుగుతున్నారు. ఈసారి అత్యధికంగా అమ్ముడుపోతున్న పుస్తకాలు కూడా ఇవే కావటం గమనార్హం. ఫిక్షన్ కథలు చదువుతుంటే.. మనం ఏకంగా కాల్పనిక సమాజంలోకి వెళ్లిపోతాం. ఇలాంటివి త్రీడీ షోలలో కనిపించవు. ఫిక్షన్ నవలల్లో మాత్రమే కనిపిస్తాయి. ఆ అనుభవాలను చవిచూస్తాం. ఫిక్షన్ పుస్తకాల కోసం ఎక్కడెక్కడి నుంచో విజయవాడ వస్తుంటారు. వీరిలో బామ్మలు ఎక్కువగా ఉంటున్నారు. వారిలో ఇద్దరిని 'ఆంధ్రజ్యోతి' పలకరించగా.. పేర్లు చెప్పటానికి ఇష్టపడకపోయినా.. ఫిక్షన్స్ అంటే పిచ్చి అని ఈ పుస్తకాలంటే ఎంతో క్రేజ్ అని చెబుతున్నారు. యాభై పుస్తకాలను పది, పదిహేను రోజుల్లో చదివేస్తారట. ఆ తర్వాత వాటిని లైబ్రరీలకు ఇస్తామని చెబుతున్నారు. ఈ ఏడాది సరికొత్త సిరీస్ వచ్చాయి. అనేక ఫాంటసీలతో కూడిన ఫిక్షన్ పుస్తకాలు మధుబాబు రచనలు వచ్చాయి. యద్దనపూడి సులోచనా రాణి, యండమూరి వీరేంద్రనాద్ ఫిక్షన్ నావల్స్ పెద్ద సంఖ్యలో కొలువుదీరాయి. ఈ సారి పుస్తక మహోత్సవంలో 'మరుగు పడిన అద్భుత కథ, మనిషిలో మనిషి, వజ్రాల దీవి, కాలసర్పం, పక్కలో బల్లెం, చాటు మనిషి, కపాల దుర్గం, చిక్కలేదు చిన్నదాని ఆచూకీ, అనైతికం, థ్రిల్లర్, క్షమించు సుప్రియా' వంటి పుస్తకాలు కొత్త ప్రచురణలతో వచ్చాయి. వీటిలో ఎక్కువగా డిటెక్టివ్ కథలతో కూడిన పుస్తకాలను కొనుగోలు చేస్తున్నారు.

తెలుగు సాహిత్యానికి సోమేపల్లి విశేష కృషి

విజయవాడ కల్చరల్ : తెలుగు సాహిత్యానికి సోమేపల్లి విశేష కృషి చేశారని కవి చలపాక ప్రకాష్ అన్నారు. గురువారం కేతు విశ్వనాథరెడ్డి సాహిత్య వేదికపై సోమేపల్లి వెంకట సుబ్బయ్య సంస్మరణ సభ నిర్వహించారు. కవిగా తన సాహిత్య ప్రయాణాన్ని ప్రారంభించి, సంపాదకుడిగా, కవిత్వ దోహదకారిగా సోమేపల్లి తెలుగు యువకవులకు అండగా నిలిచారన్నారు. నానీల ప్రక్రియను ప్రారంభించి యువ కవులను ప్రోత్సహిస్తూ నానీల చిన్నన్నగా రెండు తెలుగు రాష్ట్రాల్లో కీర్తిని పొందారన్నారు. తాను వెలుగులోకి రావడం కన్నా, పలువురు కవులను వెలుగులోకి తేవడానికే ఆయన ప్రాధాన్యమిచ్చారన్నారు. చిన్న కథల పోటీలు పెట్టి పాఠకులను ఆకట్టుకొనే విధంగా రాయించి ప్రతిభగలిగిన యువ కళాకారులకు జాతీయ స్థాయిలో సోమేపల్లి పురస్కారాలను 14 సంవత్సరాలుగా అందచేస్తూ వచ్చారన్నారు. గోళ్ల నారాయణరావు, మనోహర్‌నాయుడు, ఆంజనేయరాజు, శ్రీవశిష్ట తదితరులు పాల్గొన్నారు.

తెలుగు రచనలు హిందీ అనువాదాలు చేయాలి

ఇతర భాషల రచనలు తెలుగులోకి అనువాదాల కంటే, తెలుగులోంచి ఇతర భాషల్లోకి అనువాదాలు పెరగాలని ప్రముఖ రచయిత యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ చెప్పారు. గురువారం నిర్వహించిన కార్యక్రమంలో సాహిత్య అకాడమీ అవార్డు పొందిన దేవీప్రియ తెలుగు కవిత్వం 'గాలి రంగు' పుస్తకానికి హిందీ అనువాదం 'హవా కా రంగ్'ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, తెలుగులో జరుగుతున్న అద్భుతమైన సాహిత్య సృష్టిని దేశమంతటికీ చేర్చాల్సిన బాధ్యత కూడా తెలుగువాళ్లే తీసుకోవాలన్నారు. దక్షిణ భారతీయ హిందీ ప్రచార సభ విజయవాడ శాఖ ప్రతినిధి పేరిశెట్టి శ్రీనివాసరావు కవిత్వ తీరుతెన్నులు భారతీయ కవిత్వంలో వస్తున్న మార్పుల గురించి మాట్లాడారు. అనువాదం కంటే రెండు భాషా సమాజాల మధ్య సేతువుగా పనికి వస్తుందన్నారు. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత వెన్నా వల్లభరావు మాట్లాడుతూ కేంద్ర సాహిత్య అకాడమీ తెలుగు రచనలను అనువాదం చేసే ప్రక్రియలో అన్ని భాషల కంటే ప్రధానంగా హిందీ భాషలో ముందుగా అనువాదం చేయడం వల్ల తెలుగు రచన త్వరగా దేశవ్యాప్తం అవుతుందన్నారు.



పాలస్తీనా సమస్యలపై వాస్తవాలు తెలుసుకోవాలి

ప్రపంచంలో సామ్రాజ్యవాద అమెరికా దాష్టికాన్ని గురించి తెలుసుకోవాలంటే ప్రజలంతా పాలస్తీనా సమస్యపై వాస్తవాలు తెలుసుకోవాలని సాహితీవేత్త బుడ్డిగ జమిందార్ అన్నారు. పుస్తక మహోత్సవం ఎనిమిదవ రోజు గురువారం కేతు విశ్వనాథరెడ్డి సాహిత్య వేదికపై ఎస్.వేణుగోపాల్ రాసిన పాలస్తీనా స్వేచ్ఛకై గళమెత్తుదాం, సీఎస్సార్ ప్రసాద్ రాసిన మండిస్తూ మండే గాజా, జేవీ సత్యనారాయణమూర్తి రాసిన నెలలేని దేశం అనే పుస్తకాలను ఆవిష్కరించారు. ఆవిష్కరణ సభకు అధ్యక్షత వహించిన సందర్భంగా గత మూడున్నర నెలలుగా ఇజ్రాయిల్ పాలస్తీనాల మధ్య జరుగుతున్న ఘోర యుద్ధంపై మేధావుల స్పందనను ఈ పుస్తకాలు రికార్డు చేసి ప్రజల ముందుకు తెచ్చామన్నారు. రచయితలు ముగ్గురూ పాలస్తీనా సమస్యపై మాట్లాడారు. భారతీయులంతా పాలస్తీనీయులకు మద్దతివ్వాలని కోరారు.

నేడు
2 గం. క్రియేటివ్ రైటింగ్ వర్క్‌షాపు
6 గం. పాఠశాల చిన్నారులకు క్విజ్

'తత్వశాస్త్ర మేరు శిఖరం సచ్చిదానందమూర్తి'



కారుమబ్బులు వ్యాససంపుటిని ఆవిష్కరిస్తున్న యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, బుద్ధప్రసాద్, వెలగా జోషి

విజయవాడ కల్చరల్, జనవరి 4 : భారతీయ తత్వశాస్త్ర మేరు శిఖరం సచ్చిదానందమూర్తి అని ప్రముఖ రచయిత యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ అన్నారు. 34వ విజయవాడ పుస్తక మహోత్సవం ఎనిమిదో రోజు గురువారం కేతు విశ్వనాథరెడ్డి సాహిత్య వేదికపై తత్వవేత్త పద్మవిభూషణ్ కొత్త సచ్చిదానందమూర్తి రచించిన 'కారుమబ్బులు' వ్యాససంపుటిని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మనసులోతుల్లో తలెత్తే వేదనలకు కారణాలు, సమాధానాల వెతుకులాటను బాధ్యతగా చేపట్టి చివరిదాకా కొనసాగించిన తత్వవేత్త కొత్త సచ్చిదానందమూర్తి అని, తన మనస్సులో తలెత్తిన ప్రశ్నలకు సమాధానాలు వెతుకుతూ ఆ ప్రయత్నంలో చిన్న వయస్సులోనే ప్రపంచంలోని ప్రధాన తాత్విక చింతనలన్నిటినీ అధ్యయనం చేసి వాటిని అందరికీ అర్థమయ్యే రీతిలో రచించి, బోధించిన సచ్చిదానందమూర్తి జాతి గర్వించదగిన తత్వవేత్త అన్నారు. సచ్చిదానంద మూర్తి విశిష్టతను, రచనలను నేటి తరానికి పరిచయం చేయాల్సిన అవసరం వుందని ముఖ్య అతిథిగా పాల్గొన్న మండలి బుద్ధప్రసాద్ అన్నారు. డాక్టర్ గుమ్మా సాంబశివరావు మాట్లాడుతూ, భారతీయ, ఆధ్యాత్మిక, వేదతత్వ శాస్త్రం గురించి తెలుసుకోవాలంటే సచ్చిదానందమూర్తి రచనలు తప్పనిసరిగా చదవాలన్నారు. కార్యక్రమంలో సిద్ధార్థ ఆర్ట్స్ కాలేజ్ ప్రిన్సిపాల్ జంపాల రాజేష్ సభకు అధ్యక్షత వహించారు. డాక్టర్ వెలగా జోషి, ప్రొఫెసర్ కొత్త రమేష్, డాక్టర్ సురేంద్ర సభలో పాల్గొన్నారు.

స్త్రీ హక్కుల కోసం పోరాడిన ధీరవనిత సుధా భరద్వాజ



'ఉరి గది నుండి' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కాత్యాయనీ విద్మహే, సుంకర రాజేంద్రప్రసాద్

విజయవాడ కల్చరల్ : జాతీయస్థాయిలో స్త్రీల హక్కులు, సామాన్యుల కోసం పోరాడిన ధీరవనిత సుధా భరద్వాజ్ అని ప్రముఖ రచయిత్రి కాత్యాయనీ విద్మహే చెప్పారు. గురువారం కేతు విశ్వనాథరెడ్డి సాహిత్య వేదికపై నిర్వహించిన కార్యక్రమంలో ప్రజాశక్తి బుక్‌హౌస్ ప్రచురించిన 'సుధా భరద్వాజ' రచన 'ఉరి గది నుండి' పుస్తకాన్ని ఆమె ఆవిష్కరించారు. భారతీయ ప్రజల కోసం ఆమె అమెరికన్ పౌరసత్వం వదులుకుని, ఇక్కడ న్యాయవాద వృత్తి చేపట్టారని, ప్రభుత్వాలకు వ్యతిరేకంగా పోరాడి ఉరికి సమాన కారాగార శిక్షకు సిద్ధపడిందని ఆమె వివరించారు. ఒక న్యాయవాదిగా నేరస్థులను కాక, నేరాల వెనుక కారణాలను తెలుసుకొని సమాధానాలకు నిరంతరం ప్రయత్నం చేశారన్నారు. కారాగారంలో ఆడవాళ్ల మనఃస్థితులను 'ఉరి గది నుండి' పుస్తకం పూర్తిగా మహిళల కోణంలో విశ్లేషిస్తుందని ఆమె చెప్పారు. సుధా భరద్వాజ్ విలువలను అర్థం చేసుకొని కాపాడాల్సిన అవసరం వుందని ఆమె విజ్ఞప్తి చేశారు. న్యాయవాది సుంకర రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ, విచారణ ఖైదీలతో భారతీయ జైళ్లు నిండిపోతున్నాయని, వీరిలో అధిక శాతం దళితులు, బహుజనులు వున్నారని వివరించారు. అలాంటి ఖైదీల వెతలను సుధా భరద్వాజ్ తన రచనల్లో ప్రతిఫలించారన్నారు. విరసం బాలసుబ్రమణ్యం, ప్రజాశక్తి బుక్ హౌస్ పూర్వసంపాదకులు కె.ఉషారాణి, స్వరూపరాణి సభలో పాల్గొన్నారు. కె.లక్ష్మయ్య సభను నిర్వహించారు.

క్షేత్రస్థాయి సమస్యలు తెలిపితే పరిష్కారం

» ఎంపీ కేశినేని నాని



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న కేశినేని నాని

రెడ్డిగూడెం, జనవరి 4 : గ్రామాలకు కావాల్సిన మౌలిక వసతులు ఆయా గ్రామాల్లో నేతలు చెబితే తప్పకుండా కల్పించేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని, దీనిలో భాగంగానే కూనపరాజుపర్వ-రెడ్డిగూడెం రహదారి ఏర్పాటయ్యిందని విజయవాడ ఎంపీ కేశినేని శ్రీనివాస్ (నాని) అన్నారు. పీఎంజేఎస్‌వై నిధులు సుమారు రూ.3.5 కోట్లతో నూతనంగా నిర్మించిన రహదారిని ఆయన వైసీపీ ఎమ్మెల్యే వసంతతో కలిసి ప్రారంభించారు. రూ.3 కోట్లతో రహదారిలో నిర్మించనున్న వంతెనలకు ఆయన భూమి పూజ చేశారు. ఈసందర్భంగా ఎంపీ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్ పెట్టకున్నా కేంద్రం నుంచి పీఎంజేఎస్‌వై రూ.6.5 కోట్లు నిధులు రప్పించి రహదారి ఏర్పాటుతో పాటు వంతెనలు కూడా నిర్మిస్తున్నామని చెప్పారు. గ్రామాల్లో నీటి అవసరాలు తీర్చేందుకు సుమారు 300 వాటర్ ట్యాంక్‌లు ఇచ్చినట్టు తెలిపారు. గ్రామాల మౌలిక వసతులపై తనకు సమాచారం ఇచ్చే నేతలకు కృతజ్ఞతలు తెలిపారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గన్నే ప్రసాద్ (అన్న), కె.విజయబాబు, జానలపాటి వేణుగోపాల్ రెడ్డి, కుప్పిరెడ్డి అశోక్ రెడ్డి, పైడిమర్ల కిరణ్‌కుమార్ రెడ్డి, పాలంకి సురేష్ రెడ్డి, వైసీపీ సర్పంచ్ మల్లాది రాణి, జడ్పీటీసీ పాలంకి విజయ్ భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోటా పోటీ నినాదాలు

కూనపరాజుపర్వ-రెడ్డిగూడెం రహదారి ప్రారంభోత్సవానికి టీడీపీ నుంచి విజయవాడ ఎంపీ కేశినేని శ్రీనివాస్ (నాని), వైసీపీ ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్‌లు కొత్తరెడ్డిగూడేనికి చేరుకోవడంతో ఆయా పార్టీల కార్యకర్తల పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ దశలో ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. పరిస్థితిని చక్కదిద్దేందుకు పోలీసులు ఆపసోపాలు పడాల్సి వచ్చింది. ఇరుపార్టీల కార్యకర్తలు నినాదాలతో హోరెత్తిస్తుంటే నాయకులు చక్కగా మాట్లాడుకోవడం కొసమెరుపు.



పనులు పరిశీలిస్తున్న ఆనంద్‌బాబు, చిన్ని, దేవదత్ తదితరులు

చురుగ్గా చంద్రబాబు బహిరంగ సభ ఏర్పాట్లు

తిరువూరు, జనవరి 4 : టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు పాల్గొనే 'రా కదలిరా' బహిరంగ సభ ఏర్పాట్లు చురుకుగా సాగుతున్నాయి. గురువారం స్థానిక అయ్యప్ప దేవాలయం సమీపంలోని బహిరంగ సభ నిర్వాహించేందుకు ఎంపిక చేసిన స్థలంలో బహిరంగ వేదిక, హెలిప్యాడ్ ఏర్పాటు తదితర పనులకు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. పనులను మాజీ మంత్రి నక్కా ఆనంద్‌బాబు, కేశినేని శివనాథ్(చిన్ని) నియోజకవర్గ పరిశీలకుడు చింతాబత్తిన శ్రీనివాస్(చిట్టిబాబు)కోనేరు సురేశ్ తదితరులు పరిశీలించారు. ఈ సందర్భంగా కేశినేని చిన్ని మాట్లాడుతూ, నియోజకవర్గ ప్రజలు, టీడీపీ, జనసేన శ్రేణులు చంద్రబాబు బహిరంగ సభలో పాల్గొనేందుకు ఉత్సాహంగా ఎదురుచూస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రజలు మార్పు కోరుకుంటున్నారని, ప్రజాసంక్షేమ పాలన రాష్ట్ర అభివృద్ధి టీడీపీతోనే సాధ్యమని, చంద్రబాబును ముఖ్యమంత్రిని చేసేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. ఈనెల 7న తిరువూరులో జరిగే బహిరంగ సభను జయప్రదం చేయాలని ఆయన కోరారు.

గుండెపోటుతో చాట్రాయి తహసీల్దార్ మృతి

చాట్రాయి, జనవరి 4: ఏలూరు జిల్లా చాట్రాయి మండల తహసీల్దార్ సీహెచ్ విశ్వనాథరావు (57) గుండెపోటుతో గురువారం ఉదయం మృతి చెందారు. ఎన్టీఆర్ జిల్లా విస్సన్నపేటలో అద్దె ఇంట్లో నివాసం ఉంటూ చాట్రాయి మండలంలో మూడేళ్లుగా విధులు నిర్వహిస్తున్నారు. ఉదయమే నిద్ర లేచిన విశ్వనాథరావు గుండెలో నొప్పిగా ఉందని ఇంటి పనులు చూసే వ్యక్తితో చెప్పారు. సమాచారం అందు కున్న 108 సిబ్బంది అక్కడకు చేరుకుని ఆయనకు సీపీఆర్ చేస్తూ విస్సన్నపేట ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందారు. ఆయనకు భార్య సుశీల, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

హక్కులు హరిస్తున్న ప్రభుత్వాలు

» విజయవాడ ధర్నాచౌక్‌లో కొనసాగిన ఆందోళనలు



విజయవాడ ధర్నాచౌక్‌లో ఆందోళన చేస్తున్న అంగన్వాడీలు

ధర్నాచౌక్, జనవరి 4 : కార్మిక ఉద్యమాలపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపడం గర్హనీయమని పలువురు నేతలు మండిపడ్డారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల హక్కులను హరిస్తున్నాయని ధ్వజమెత్తారు. తమ సమస్యల పరిష్కారానికి అంగన్వాడీల ధర్నా 24వ రోజు, మున్సిపల్ కార్మికుల ధర్నా 10వ రోజు గురువారం కొనసాగాయి. ఇటీవల అంగన్వాడీలపై పోలీసుల దౌర్జన్యాన్ని ఖండిస్తూ నల్ల జెండాలు, బ్యాడ్జీలతో అంగన్వాడీలు నిరసన తెలిపారు. కార్యక్రమాల్లో సీఐటీయూ నేతలు సీహెచ్ బాబురావు, సుబ్బరావమ్మ, దోనేపూడి కాశీనాథ్, డీవీ కృష్ణ పాల్గొని సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, సీఎం జగన్ కార్మికుల సమస్యలను విస్మరిస్తున్నారని విమర్శించారు. కార్మికులు, ప్రజలను మోసం చేసిన వారికి శిక్ష తప్పదని హెచ్చరించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సమ్మెకు ముగింపు పలకాలని హితవు పలికారు. లేకుంటే రాజకీయ పక్షాలు, కార్మిక సంఘాలు ప్రత్యక్ష కార్యాచరణలోకి దిగాల్సి వస్తుందని హెచ్చరించారు.

ఘనంగా జోసఫ్ తంబి నవదిన ప్రార్ధనలు ప్రారంభం



జ్యోతి వెలిగించి నవదిన ప్రార్ధనలు ప్రారంభిస్తున్న ఫాదర్లు

ఉంగుటూరు, జనవరి 4 : కృష్ణాజిల్లా పెదఅవుటపల్లిలోని సుప్రసిద్ధ కథోలికా పుణ్యక్షేత్రంలో దైవ సేవకుడు బ్రదర్ జోసఫ్ తంబి 79వ వర్ధంతి మహోత్సవాలకు(తిరునాళ్ల)గురువారం మతగురువులు, గుడిపెద్దల సమక్షంలో అంకురార్పణ జరిగింది. జనవరి 13 నుంచి 15 వరకు అత్యంత వైభవంగా తొవ్మిదిరోజులపాటు నిర్వహించే నవదిన ప్రార్ధనలు పుణ్యక్షేత్రం రెక్టర్ రెవ.ఫాదర్ పాలడుగు జోసఫ్ ఆధ్వర్యంలో గురువులు జ్యోతి వెలిగించి ఘనంగా ప్రారంభించారు. ఏలూరు విజ్ఞాననిలయం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫిలాసఫీ అండ్ రిలీజియన్ ప్రెసిడెంట్ రెవ.ఫాదర్ పోలిశెట్టి చిన్ను తొలుత పతాకాన్ని, తంబి ఫోటోను తీర్థాలతో సంప్రోక్షణ చేసి ఆశీర్వదించారు. స్థానిక విచారణ గురువులు, సంఘపెద్దలు ఫోటో, పతాకాన్ని వెంటపెట్టుకుని మేళతాళాలతో, టపాసులు పేలుస్తూ, గ్రామ పురవీధులలో ప్రదక్షిణ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం జోసఫ్ తంబి సమాధివద్ద పతాకావిష్కరణ చేశారు. రెవ.ఫాదర్ పోలిశెట్టి చిన్ను దైవప్రేమ అంశంపై సందేశమిచ్చారు. దైవసేవకుడు బ్రదర్ జోసఫ్ తంబి ఇతరుల పట్ల సోదర ప్రేమను చూపించటంద్వారా దైవప్రేమను పొందగలిగాడన్నారు. ఆయనను ఆదర్శంగా తీసుకుని తోటివారికి సహాయం చేయడంద్వారా దేవుని దరికి చేరుకోగలమని తెలిపారు. ప్రార్ధనల్లో ఫాదర్లు గోపు ప్రవీణ్, గోపు అభిలాష్, కచ్చ కిషోర్, మద్దాల రవి తదితరులు పాల్గొన్నారు. రెవ.ఫాదర్ పాలడుగు జోసఫ్ నేతృత్వంలో గురువారం కృష్ణా జిల్లా ఎస్పీ జాషువాను కలిసి ఉత్సవాలకు సాదరంగా ఆహ్వానించారు.

నిరుద్యోగుల నిరసనాగ్ని

» మెగా డీఎస్సీ కోసం రోడ్డెక్కిన ఆశావహులు

అవనిగడ్డ, జనవరి 4 : మెగా డీఎస్సీ విడుదలకు డిమాండ్ చేస్తూ నిరుద్యోగులు ఆందోళన బాట పట్టారు. అవనిగడ్డ వంతెన సెంటర్‌కు ఒక్కసారిగా చొచ్చుకొచ్చి రాస్తారోకో నిర్వహించారు. రోడ్డుపై బైఠాయించారు. మెగా డీఎస్సీ వెంటనే వేయాలని ప్లకార్డులు ప్రదర్శించారు. అనుమతి లేకుండా రాస్తారోకో నిర్వహిస్తున్నారని డీఎస్పీ మురళీధర్ నేతృత్వంలో అవనిగడ్డ, నాగాయలంక, మోపిదేవి, కోడూరు మండలాల పోలీసు సిబ్బంది హెచ్చరించారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి చేతిలో మోసపోయినందుకు తమను తామే చెప్పులతో కొట్టుకుంటున్నామని డీఎస్సీ ఆశావాహులు మూకుమ్మడిగా చెప్పులు పైకెత్తి చెంపలపై కొట్టుకుని జగన్మోహన్‌రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పోలీసులు రంగ ప్రవేశం చేసి రాస్తారోకోను భగ్నం చేసి నిరసన తెలుపుతున్న వారిని పక్కకు ఈడ్చివేశారు. రాస్తారోకోను విరమించకుంటే కేసులు పెడతామని డీఎస్పీ హెచ్చరించారు. అరగంటకుపైగా అవనిగడ్డ వంతెన సెంటర్ మొత్తం ఉద్రిక్తత నెలకొంది. నాలుగున్నరేళ్లుగా ప్రభుత్వం నోటిఫికేషన్లు ఇవ్వకుండా చేసిన మోసానికి తాము రోడ్డు ఎక్కినందుకు కఠినంగా వ్యవహరిస్తే ఎలా అని పలువురు నిరుద్యోగులు చేతులెత్తి పోలీసుల కాళ్లపై పడి ప్రాధేయపడ్డారు. చివరకు వారికి మద్దతుగా వచ్చిన టీడీపీ, జనసేన నేతలు, రాష్ట్ర నిరుద్యోగ జేఏసీ ముఖ్యనేతలు నిరుద్యోగులకు సర్ది చెప్పడంతో తాత్కాలికంగా ఆందోళన విరమించారు. కార్యక్రమానికి రాష్ట్ర నిరుద్యోగ జేఏసీ కన్వీనర్ షేక్ సిద్ధిక్, జేఏసీ నేతలు పవన్ యాదవ్, గంగాధర్, సుధాకర్ తదితరులు నేతృత్వం వహించారు. యువత భవితను ప్రశ్నార్థకం చేసేలా ప్రభుత్వం వ్యవహరించటం సరికాదని మండలి బుద్ధప్రసాద్ అన్నారు.

నాలుగున్నరేళ్లుగా వలంటీర్ల ఉద్యోగాలు తప్ప మరే ఉద్యోగం ఇవ్వకుండా నిరుద్యోగులను ప్రభుత్వం మోసగించిందని నిరుద్యోగులు ఆగ్రహం వ్యక్తం చేశారు. నెలకు రూ.5 వేలు వెచ్చించి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి అవనిగడ్డకు వచ్చి శిక్షణ పొందుతున్నామని, నోటిఫికేషన్ ఇస్తాం అని ప్రభుత్వం మోసకారి మాటలు చెప్పటంతోనే ఇన్నాళ్లు ఆశగా ఎదురుచూశామన్నారు. నాలుగున్నరేళ్లలో రూ.3 లక్షల మేర శిక్షణ కోసం ఖర్చు పెట్టాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు.

స్థానికత చిచ్చు

(5వ పేజీ తరువాయి)

వాస్తవానికి మల్లాదికి సీటు రాదన్న విషయం ఏడాది ముందే నియోజకవర్గంలో ప్రచారంలోకి వచ్చింది. దీంతో అప్పటి నుంచే ఎమ్మెల్యే టికెట్ ఆశావహులు వైసీపీ పెద్దలను ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డారు. 30వ డివిజన్ వైసీపీ కార్పొరేటర్ జానారెడ్డి, 58వ డివిజన్‌కు చెందిన డిప్యూటీ మేయర్ అవుతు శైలజారెడ్డి భర్త, స్థానిక వైసీపీ నాయకుడు శ్రీనివాసరెడ్డి ఎమ్మెల్యే టికెట్ కోసం ప్రయత్నించారు. శ్రీనివాసరెడ్డి కుటుంబంలో ఒకరికి పదవి ఉండటంతో ఆయన అభ్యర్థనను వైసీపీ పెద్దలు తొలిదశలోనే తిరస్కరించినట్లు సమాచారం. జానారెడ్డి మాత్రం చివరి వరకు రేసులో ఉన్నా చివరికి రెడ్డి కావడంతో ఆయనకు టికెట్ దక్కలేదని సమాచారం. కొద్దిరోజుల క్రితం మల్లాదికి టికెట్ ఇవ్వాలంటూ సెంట్రల్ కార్పొరేటర్లు అందరూ సమావేశం నిర్వహించినా వీరిద్దరూ మాత్రం వెళ్లలేదు. జానారెడ్డి ఇంకా తన ప్రయత్నాలు కొనసాగిస్తున్నట్లు సమాచారం. ఎక్కడైనా సమీకరణాలు మారి తనకు అవకాశం వస్తుందన్న ఆశతో ఆయన ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు.

కృష్ణా జేసీగా గీతాంజలి శర్మ

» జేసీ అపరాజిత సింగ్ యూపీకి బదిలీ

మచిలీపట్నం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : కృష్ణాజిల్లా జాయింట్ కలెక్టర్ అపరాజిత సింగ్ బదిలీ అయ్యారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి ఉత్తర్వులు జారీచేశారు. 2022 నవంబరు నుంచి ఆమె కృష్ణాజిల్లా జాయింట్ కలెక్టర్‌గా పనిచేస్తున్నారు. ఉత్తరప్రదేశ్ ఐపీఎస్ కేడర్‌కు చెందిన దేవేంద్రకుమార్‌ను ఇటీవల ఆమె వివాహం చేసుకున్నారు. తనను ఉత్తరప్రదేశ్ ఐఏఎస్ కేడర్‌గా పంపాలని ఆమె కొంతకాలంగా ప్రయత్నాలు చేసుకుంటున్నారు. దీంతో ఆమెను ఉత్తరప్రదేశ్ ఐఏఎస్ కేడర్‌కు మార్పుచేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఆమెస్థానంలో జేసీగా 2020 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన గీతాంజలి శర్మను నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఒకట్రెండు రోజుల్లో ఆమె బాధ్యతలు చేపడతారని కలెక్టరేట్ అధికారులు తెలిపారు.

భవన యజమానులకూ తుపాను పరిహారం!

» రూ. 10 వేలు చెక్కులు అందించిన ఎమ్మెల్యే
» బాధితుల జాబితాలో చక్రం తిప్పిన వైసీపీ నేత

తోట్లవల్లూరు, జనవరి 4 : పక్కా భవనాలను పూరిళ్లగా చూపి లబ్ధి పొందటంలో వైసీపీ నాయకులు తమదైన మార్కు చూపారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. తుపానుకు పూరిళ్లు దెబ్బతింటే పరిహారం అందించటం సహజం. అయితే తోట్లవల్లూరు మండలంలో భవనాలను సైతం పూరిళ్లు కూలినట్టుగా చూపి రూ. 10 వేల చొప్పున చెక్కులు అందించిన ఘనత అధికారులకే దక్కింది. డిసెంబరులో సంభవించిన మిచాంగ్ తుపాను పరిహారం అందించేందుకు ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. దెబ్బతిన్న ఇళ్ల గుర్తింపును రెవెన్యూ సిబ్బందికి అప్పగించారు. ఇదిలా ఉంటే ఓ లంక గ్రామంలో పక్కా భవనాలున్న ఐదుగురు యజమానుల పేర్లను బాధితుల జాబితాలో చేర్చి రెవెన్యూ అధికారులు జిల్లా కలెక్టర్‌కు పంపటంతో వారికి రూ. 10 వేల చొప్పున పరిహారం మంజూరైంది. పెనమకూరులో బుధవారం చెక్కులను ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ పంపిణీ చేయటంతో గుట్టు రట్టయింది. మొత్తం 14 మందికి చెక్కులు రాగా అందులో ఐదు పక్కా భవనాలున్న వ్యక్తులు ఉన్నట్టు తెలిసింది. ఈ అక్రమాల వెనుక వైసీపీ ప్రజాప్రతినిధి ఉన్నట్టు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పాకలను ఫొటోలు తీసి అధికారులను బురిడీ కొట్టించినట్టు చెబుతున్నారు. అలాగే అగ్ని ప్రమాదంలో పాక్షికంగా దెబ్బతిన్న ఇంటిని తుపానుకు దెబ్బతిన్న ఇళ్ల జాబితాలో చేర్చి పరిహారం అందించారు. ఈ విషయమై తహసీల్దార్ ఎం.కుసుమకుమారిని వివరణ కోరగా.. పూరిళ్లకు మాత్రమే పరిహారం వచ్చిందని, వీటిలో డాబాలు లేవని తెలిపారు. వీఆర్వోలు ఇచ్చిన ఫొటోలను కలెక్టర్‌కు పంపించామన్నారు. ఐలూరులో ఒకటి, దేవరపల్లిలో ఒకటి, భద్రిరాజుపాలెంలో ఒకటి, నార్తువల్లూరులో ఒకటి, పాములలంకలో 10 ఇళ్లు దెబ్బతిన్నట్టు తేలిందన్నారు. ఈ 14 గృహాలకు రూ.1.34 లక్షలు మంజూరయ్యాయని తెలిపారు. ఐలూరులో ఒక ఇంటిని ప్రత్యక్షంగా పరిశీలించానని, పాములలంకలో వర్షంలో వెళ్లేందుకు వీలు పడలేదని, ఇపుడు పరిశీలిస్తానని తెలిపారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరి మృతి



గోపిచంద్ (ఫైల్)

పెనుగంచిప్రోలు, జనవరి 4 : వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో గురువారం ఇద్దరు మృతిచెందారు. ముచ్చింతాల సమీపంలో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో పెనుగంచిప్రోలు యాదవ బజారుకు చెందిన గజ్జి గోపిచంద్ (23) అక్కడికక్కడే మృతి చెందాడు. వత్సవాయి మండలం కంభంపాడులో జరిగిన శుభకార్యంలో పాల్గొని ద్విచక్రవాహనంపై వస్తుండగా ముచ్చింతాల సమీపంలో తీవ్ర అస్వస్థతకు గురై బైక్‌పై నుంచి పడిపోయి అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్సై బి.శంకర్ తెలిపారు. 65వ జాతీయ రహదారిపై ముండ్లపాడు క్రాస్ రోడ్డు సమీపంలో జరిగిన మరో ప్రమాదంలో తెలంగాణ రాష్ట్రంలోని మహబూబాబాద్ జిల్లా పెద్ద వంగర మండలం కొరిపల్లి గ్రామానికి చెందిన మట్టిపల్లి ముక్తానందు (32) అక్కడికక్కడే మృతి చెందాడు. హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు కంటైనర్ వాహనాన్ని నడుపుతూ డివైడర్‌ను ఢీ కొట్టి ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించినట్టు పోలీసులు తెలిపారు.



సిద్ధార్థ వైద్యకళాశాలలో ఉద్యోగాలకు దరఖాస్తులు

భవానీపురం, జనవరి 4: నగరంలోని ప్రభుత్వ సిద్ధార్థ వైద్య కళాశాలలో జూనియర్ అసిస్టెంట్, వార్డెన్, ఫార్మసిస్ట్ గ్రేడ్-2, డ్రైవర్ ఖాళీల భర్తీకి ఈనెల 8వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సిద్ధార్థ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కంచర్ల సుధాకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో రెండు జూనియర్ అసిస్టెంట్, రెండు వార్డెన్ (మహిళ), ఒక ఫార్మసీ గ్రేడ్-2(ఈడబ్ల్యూఎస్), రెండు డ్రైవర్(ఎల్ఎంవీ-మహిళ) ఖాళీలను కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ విధానంలో భర్తీ చేయనున్నట్లు తెలిపారు. వివరాలకు హెచ్‌టీటీపీ//డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూఎస్ఎంసీవీజేఏ. ఇన్ వెబ్‌సైట్‌ను సందర్శించాలని ప్రిన్సిపాల్ సూచించారు.

నిరుద్యోగ యువతకు ఉపాధి శిక్షణ

మొగల్రాజపురం, జనవరి 4: జిల్లావ్యాప్తంగా నిరుద్యోగ యువతీ యువకుల ఉపాధి కోసం జనశిక్షణా సంస్థాన్ మొగల్రాజపురంలో ఈనెలలో పలు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు డైరెక్టర్ ఎ.పూర్ణిమ ఒక ప్రకటనలో తెలిపారు. కటింగ్ టైలరింగ్, మిర్రర్ వర్క్స్, డ్రెస్ డిజైనింగ్, ఫ్యాబ్రిక్ పెయింటింగ్, హ్యాండ్ ఎంబ్రాయిడరీ, మెషీన్ ఎంబ్రాయిడరీ, ఎలక్ట్రికల్ టెక్నీషియన్, ఏసీ రిఫ్రిజియేషన్, ఐస్‌క్రీం మేకింగ్, స్క్రీన్ ప్రింటింగ్, జామ్, జ్యూస్ తయారీ, బాతిక్ పెయింటింగ్, హోమ్ క్రాఫ్ట్స్ విభాగాల్లో శిక్షణ ఇస్తామని తెలిపారు. వివరాలకు 0866 2470420 నంబరుకు ఫోన్ చేసి, తెలుసుకోవాలని ఆమె సూచించారు.

గ్రూప్స్ పరీక్షలపై అభ్యర్థులకు నేడు అవగాహన

పటమట, జనవరి 4: గ్రూప్స్ పరీక్షలకు హాజరయ్యే వేలాది మంది అభ్యర్థులకు ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు నేతృత్వంలో శుక్రవారం సర్వోత్తమ గ్రంథాలయంలో ఉచిత అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు గ్రంథాలయం కార్యదర్శి రావి శారద గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులకు గ్రూప్స్ పరీక్షల్లో ఎదురయ్యే సందేహాలను లక్ష్మణరావు నివృత్తి చేస్తారని తెలిపారు. అభ్యర్థులకు భారత సమాజం, ఆంధ్రుల చరిత్ర, ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థ పుస్తకాలను ఉచితంగా అందిస్తారని వివరించారు. ఈ అవకాశాన్ని నగరంలోని గ్రూప్స్ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులంతా వినియోగించుకోవాలని రావి శారద సూచించారు.

మోతీ మసీదు ఈద్గా..

షాదీఖానా అభివృద్ధికి కృషిచేస్తా

● టీడీపీ సీనియర్ నాయకుడు కేశినేని శివనాథ్(చిన్ని) హామీ

వన్‌టౌన్, జనవరి 4: మోతీ మసీదు ఈద్గా, షాదీఖానా అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని టీడీపీ సీనియర్ నాయకుడు కేశినేని శివనాథ్(చిన్ని) హామీ ఇచ్చారు. గురువారం మోతీ మసీదు షాదీఖానా కమిటీ ఆధ్వర్యంలో మహమ్మద్ ఫతావుల్లా అధ్యక్షతన నిర్వహించిన పేదలకు పింఛన్ల పంపిణీ, మక్కా యాత్రీకులకు సన్మాన కార్యక్రమంలో చిన్ని పాల్గొన్నారు. పక్కా ప్రణాళికతో ఏం చేయాలో తనకు తెలియజేస్తే మోదీ మసీదు ఈద్గా, షాదీఖానాల అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈద్గా పరిసర ప్రాంత ప్రజలు ఐక్యమత్యంతో ఉండి నిరుపేదలకు సహాయ సహకారాలు అందించడం అభినందనీయమన్నారు. మక్కా యాత్రీకులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర అభివృద్ధి కోసం అహర్నిశలు శ్రమిస్తున్న చంద్రబాబునాయుడు కోసం, తన కోసం ప్రార్థనలు చేయాలని కోరారు. వారందరికీ శాలువాలు కప్పి సత్కరించారు. పశ్చిమ నియోజకవర్గాన్ని శరవేగంగా అభివృద్ధి చేశామని ముసాఫిర్ ఖానా, ఉర్దూ కాలేజీ ఇంకా అనేక కార్యక్రమాలను చేపట్టామని మాజీ ఎమ్మెల్యే జలీల్‌ఖాన్ చెప్పారు. ఈ సందర్భంగా ముస్లిం యువకులు ఖిద్మాత్ షర్ కార్యాలయం నుంచి ఈద్గా వరకు బైక్ ర్యాలీ నిర్వహించి కేశినేని చిన్ని నాయకత్వం వర్ధిల్లాలని నినాదాలు చేశారు. ఈద్గా కమిటీ అధ్యక్షుడు షేక్ కాజా, కార్యదర్శి అలీ, టీడీపీ నాయకుడు జాహేద్, అంసార్ ఫిరోజ్ పాల్గొన్నారు.


మోతీ మసీదులో పింఛన్ల పంపిణీలో పాల్గొన్న కేశినేని శివనాథ్(చిన్ని)

టీడీపీ తిరువూరు బహిరంగ సభను జయప్రదం చేయండి: ఎంఎస్ బేగ్

వన్‌టౌన్: "పీడిత వర్గాలను ఏకం చేసే లక్ష్యంతో చంద్రబాబు సారథ్యంలో విజయవాడ భద్రాచలం రోడ్డులోని తిరువూరులో రా కదలి రా..అనే నినాదంతో ఈనెల 7న నిర్వహిస్తున్న టీడీపీ బహిరంగ సభను జయప్రదం చేయాలని పార్టీ సీనియర్ నాయకుడు ఎంఎస్ బేగ్ శ్రేణులకు పిలుపునిచ్చారు. టీడీపీ పశ్చిమ నియోజకవర్గం కార్యాలయంలో గురువారం సభ సన్నాహక సమావేశం నిర్వహించారు. సభను నిర్వహిస్తున్న నియోజకవర్గ పరిశీలకులు నల్లపాటి రాము, ఇసుకపట్ల ప్రేమచంద్ర కరుణకుమార్, చిరుమామిళ్ల సూర్యనారాయణప్రసాద్, ముత్తినేని రాజేష్‌తో కలిసి బేగ్ సభ విజయవంతంపై సమాలోచన చేశారు. ఈనెల 5 నుంచి 29 వరకు 22 పార్లమెంట్ నియోజకవర్గాల్లో సభలు నిర్వహిస్తున్నట్లు నాయకులు పేర్కొన్నారు. సభలు జయప్రదం చేయాలని కోరారు.


మాట్లాడుతున్న ఎంఎస్ బేగ్


యనమల రామకృష్ణుడికి పుష్పగుచ్ఛం అందింస్తున్న నాగుల్‌మీరా, నానయ్య

బీసీలంతా ఏకతాటిపైకి రండి

● వచ్చే ఎన్నికల్లో టీడీపీని గెలిపించండి: యనమల రామకృష్ణుడు

విద్యాధరపురం, జనవరి 4: బీసీలందరూ ఏకతాటిపైకి వచ్చి రానున్న ఎన్నికలలో టీడీపీని గెలిపించాలని ఆ పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు అన్నారు. గురువారం ఆయన నివాసంలో యనమలను బీసీ మైనారిటీ నాయకుడు, టీడీపీ అధికార ప్రతినిధి నాగుల్‌మీరా, నాయకులు లుక్కా సాయిరాం ప్రసాద్‌గౌడ్, గరిమెళ్ల నానయ్యచౌదరీలు మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి, నూతన సంవత్సర శుభాకంక్షలు తెలిపారు. జగన్‌రెడ్డి పాలనలో ఎక్కువగా ఇబ్బంది పడింది బీసీలేనని, బీసీలకు జరిగిన మోసాన్ని రాష్ట్రవ్యాప్తంగా ప్రజలలోకి తీసుకెళదామని సూచించారు. ఎన్టీఆర్ నుంచి చంద్రబాబు వరకు బీసీలకు ఎన్నో ప్రోత్సాహకాలు ఇచ్చారని టీడీపీ బీసీల పార్టీ అని పేర్కొన్నారు. రాబోయే ఎన్నికలలో బీసీ సత్తాను నిరూపించాలని పిలుపునిచ్చారు.

జయహో బీసీ సభకు భారీగా తరలిన నేతలు

ధర్నాచౌక్, జనవరి 4: మంగళగిరిలోని టీడీపీ ప్రధాన కార్యాలయంలో గురువారం నిర్వహించిన జయహో బీసీ కార్యక్రమానికి నగరంలోని 36వ డివిజన్ నుంచి బీసీ నేతలు భారీగా తరలివెళ్లారు. టీడీపీ బొందిలి సాధికారక సమితి రాష్ట్ర కన్వీనర్ నందేటి చంద్రభానుసింగ్ మాట్లాడారు. టీడీపీతోనే బీసీల అభ్యున్నతి, సంక్షేమం సాధ్యమని ఆయన అన్నారు. రాబోయే ఎన్నికల్లో టీడీపీకి బీసీలందరూ మద్దతుగా ఉండి చంద్రబాబును ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. బీసీ నేతలు ఇమ్మడి రాము, నందేటి లక్ష్మీనారాయణసింగ్, నందేటి శంకర్‌సింగ్, మహేంద్ర, ప్రసాద్, ఎన్.బాలాజీసింగ్, కడియాల బాస్కర్, బొందలి సాధికార సోషల్ మీడియా కో-ఆర్డినేటర్ వేణుగోపాల్‌సింగ్ తరలివెళ్లారు.

వ్యాన్ ఢీకొని తరకటూరు వాసి దుర్మరణం

కూచిపూడి, జనవరి 4: నిడుమోలులో గురువారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో గూడూరు మండలం తరకటూరు గ్రామానికి చెందిన బాదర్ల బ్రహ్మం (53) మృతి చెందినట్లు ఏఎస్సై సయ్యద్ అబ్దుల్ విక్రమ్ తెలిపారు. వ్యక్తిగత పనులపై నిడుమోలు వచ్చి బ్రహ్మం సైకిల్‌పై తిరిగి స్వగ్రామం వెళ్తుండగా, వెనుక నుంచి అతివేగంగా వ్యాన్ వచ్చి ఢీకొట్టింది. దీంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

● సీఐటీయూ నగర అధ్యక్షుడు వీబీ రాజు డిమాండ్

భారతీనగర్, జనవరి 4: మున్సిపల్ కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సీఐటీయూ నగర అధ్యక్షుడు వీబీ రాజు డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న మున్సిపల్ కార్మికుల సమ్మె 10వరోజుకు చేరింది. వారికి మద్దతుగా గురువారం గురునానక్ కాలనీ రామమందిర్ పాయింట్ వద్ద, 4వ డివిజన్ మహానాడు రోడ్డులో పనిచేస్తున్న మున్సిపల్ పోటీ కార్మికులను(డైలీ వర్కర్లను) ఎదుర్కొని, వారి కాప్ ఆటోలు నిలిపి సీఐటీయూ నాయకులు నిరసన తెలిపారు. కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ కార్మికులకు వేతనం రూ.26,000 ఇవ్వాలని, మున్సిపల్ ఆప్కాస్‌లో చేర్చిన కార్మికులను పర్మినెంట్ చేయాలని, గ్రాట్యుటీ ఇవ్వాలని, మున్సిపల్ పనిలో ఉన్న అన్ని విభాగాల్లో మెడికల్ అలవెన్స్ ఇవ్వాలని, కాప్ డ్రైవర్లకు రూ.18,500, పర్మినెంట్ కార్మికులకు సీపీఎస్ రద్దుచేసి పాత ఓపీఎస్ అమలుచేయాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికుల డిమాండ్లు ప్రభుత్వం ఆమోదించేంత వరకు సమ్మె కొనసాగుతుందని, కార్మికులకు సీఐటీయూ అండగా ఉంటుందని అన్నారు. ఎం.బుజ్జమ్మ, కార్మికులు పాల్గొన్నారు.

రేపు సంక్రాంతి ఆత్మీయ కలయిక

ధర్నాచౌక్, జనవరి 4: సిద్ధార్థ ఆడిటోరియంలో శనివారం సాయంత్రం సంక్రాంతి ఆత్మీయ కలయిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో కార్యక్రమ వాల్‌పోస్టర్‌ను గురువారం వారు ఆవిష్కరించారు. ప్రతీ ఏడాది సంక్రాంతి సందర్భంగా సమతా పార్టీ మాజీ అధ్యక్షుడు వీవీ కృష్ణారావు ఆధ్వర్యంలో ఆత్మీయ కలయిక నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ ఏడాది సాధారణ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్య ఎన్నికల అధికారి ముకేష్ కుమార్‌మీనా ముఖ్య అతిథిగా పాల్గొంటారన్నారు. రాజకీయ, కుల, మతాలకు అతీతంగా ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. కార్యక్రమ నిర్వాహక సంఘం సభ్యులు టి.దామోదర్, గోళ్లమూడి కిషోర్, ఎన్.పీ సురేష్, నందిగం కిషోర్, బాను పాల్గొన్నారు.

షర్మిల చేరికతో కాంగ్రెస్ కొత్త పుంతలు

● కొలనుకొండ శివాజీ ఆశాభావం

వన్‌టౌన్, జనవరి 4: షర్మిల రాకతో కాంగ్రెస్ కొత్త పుంతలు తొక్కుంతుందని ఏపీ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు కొలనుకొండ శివాజీ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఘర్ వాపసీలో భాగంగా వైఎస్ షర్మిల ఢిల్లీలో అగ్ర నాయకుల సమక్షంలో కాంగ్రెస్‌లో చేరడం హర్షణీయమన్నారు. 2014కు ముందర ఉన్న పరిస్థితులు ఏపీలో పునరావృతమవుతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ కుటుంబాలను చీలుస్తుందని వైఎస్ జగన్మోహన రెడ్డి ఆనడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. వైఎస్ రాజశేఖరరెడ్డి మరణానంతరం కుటుంబ పెద్దగా జగన్మోహనరెడ్డి కుటుంబ సభ్యుల ఆశలు, ఆకాంక్షలను సంతృప్తి పరచకుండా బాధ్యతను మరచిన కారణంగానే కుటుంబం కలతలతో చిన్నాభిన్నం అయిం దన్నారు. దీనికి కాంగ్రెస్ పార్టీ ఎందుకు కారణమ వుతుందని ప్రశ్నించారు.

ప్రిన్సిపాల్ వేధిస్తున్నారని ఎమ్మెల్యేకు ఫిర్యాదు

కూచిపూడి, జనవరి 4 : ప్రిన్సిపాల్ డాక్టర్ మాధవి వేధింపులకు గురి చేస్తున్నారని, విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తమకు న్యాయం చేయాలని కోరుతూ మొవ్వ వీఎస్ఆర్ ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాల కళాశాల అధ్యాపకులు, సిబ్బంది ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. గత రెండు రోజులుగా మొవ్వ కళాశాల ఎదుట ధర్నా నిర్వహించిన అనంతరం ప్రిన్సిపాల్ వేధింపులపై ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. సెలవు దినాల్లో సైతం కాలేజీకి రావాలని ఒత్తిడి చేస్తున్నారని, పని వేళలు పెంచి ఇబ్బందులకు గురి చేస్తున్నారని, అత్యవసర సమయాల్లో సైతం సెలవులు మంజూరు చేయటం లేదని, హెల్త్ కార్డులు ఇవ్వటం లేదని, మానసికంగా వేధిస్తున్నారంటూ ఎమ్మెల్యేకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. టి.శ్రీకాంత్, మంజుల, కరుణ శ్రీ, రఫియా, రజనీకాంత్, వెంకటేశ్వర్లు, అశోక్, వెంకయ్య, సునీత, రత్నకుమారి, శివనాగేశ్వరరావు తదితరులు ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేసిన వారిలో ఉన్నారు.

కావాలనే తనపై నిందలు : ప్రిన్సిపాల్

ఈ విషయమై ప్రిన్సిపాల్ మాధవిని వివరణ కోరగా, అధ్యాపకులు కావాలనే తనపై నిందలు మోపి తనను వ్యక్తిగతంగా టార్గెట్ చేస్తున్నారని ప్రిన్సిపాల్ తెలిపారు. వీరి చర్యల వల్ల విద్యార్థుల హాజరు శాతం కూడా తగ్గిందన్నారు. నాక్ బృందం వస్తున్న సం దర్భంగా కళాశాలను అప్రతిష్ఠ చేసేందుకు ప్రయ త్నిస్తున్నారని, కళాశాల అభివృద్ధికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

విద్యుదాఘాతంతో భవన నిర్మాణ కార్మికురాలి మృతి

అజిత్‌సింగ్‌నగర్, జనవరి 4: భవన నిర్మాణ పనుల్లో కూలీగా పనిచేస్తున్న ఓ మహిళ గురువారం విద్యుదాఘాతంతో మృతి చెందింది. వివరాల ప్రకారం ఊర్మిళ నగర్ ప్రాంతానికి చెందిన రావులపల్లి పద్మ(44) కూలీ పనులు చేస్తుంటుంది. గురువారం నందమూరినగర్‌లోని నిర్మాణంలో ఉన్న భవనంలో పనికి వచ్చింది. పనిలో భాగంగా ఇనుప చువ్వలను తీసుకుని ఐదో అంతస్తులోకి వెళ్తుండగా ఇనుప చువ్వ విద్యుత్ వైర్‌కు తగిలి, భవనం పైనుంచి పడిపోయింది. తీవ్రగాయాలపాలైన మహిళ అక్కడికక్కడే మృతి చెందింది. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మృతురాలి కుటుంబానికి నష్టపరిహారం చెల్లించాలి

● సీహెచ్ బాబూరావు డిమాండ్

అజిత్‌సింగ్‌నగర్: విద్యుదాఘాతానికి గురై మృతి చెందిన భవన నిర్మాణ కార్మికురాలు రావులపల్లి పద్మ(44) కుటుంబానికి పరిహారం చెల్లించాలని సీపీఎం నేత సీహెచ్ బాబూరావు డిమాండ్ చేశారు. మృతి చెందిన ప్రాంతాన్ని గురువారం బాబురావు పరిశీలించారు. కార్మికురాలు మృతి చెందిన భవనం ఎదుట ధర్నా నిర్వహించారు. భవన యజమాని మృతురాలి కుటుం బానికి నష్ట పరిహారం ఇవ్వాలని లేని పక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. దీంతో భవన యజమాని మృతురాలి మట్టి ఖర్చుల నిమిత్తం రూ.10 వేలు అందజేసి, రెండు రోజుల్లో రూ.7 లక్షలు అందిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. నారాయణ, రమణారావు, బాబూశంకర్ పాల్గొన్నారు.


ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్ మేకా రమేష్

పీబీ సిద్ధార్థ విద్యార్థులు 23 మందికి ఉద్యోగాలు

మొగల్రాజపురం, జనవరి 4: పీబీ సిద్ధార్థ డిగ్రీ చివరి సంవత్సరం విద్యార్థులు 23 మంది సాఫ్ట్‌వేర్ కంపెనీ కేర్లాస్ గ్లోబల్ సొల్యూషన్స్‌లో ఉద్యోగాలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్ చెప్పారు. కోనేరు లక్ష్మయ్య డీమ్డ్ యూనివర్శిటీలో నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూలో ఎంపికై ఉద్యోగాలు పొందిన విద్యార్థులను ఆయన అభినందించారు. అకాడమీ తరఫున అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ చదలవాడ నాగేశ్వరరావు, పాలడుగు లక్ష్మణ రావు, కళాశాల కన్వీనర్ సూరెడ్డి వెంకటేశ్వరరావు, డీన్ రాజేష్ జంపాల, ఉపాధి శిక్షణా విభాగం అధికారి కావూరి శ్రీధర్, అధ్యాపకులు అభినందించారు.

అత్తింటి వేధింపులపై గర్భిణి ఫిర్యాదు

చిట్టినగర్, జనవరి 4 : అత్తింటి వేధింపుల నుంచి రక్షించాలని కోరుతూ వివాహిత గురువారం కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆంజనేయవాగు డొక్క తిరుపతమ్మవీధిలో తల్లిదండ్రులతో ఉంటున్న కావ్య గాంధీ మహిళా కళాశాలలో చదువుతున్న సమయంలో ఆటో డ్రైవర్‌ను నవంబరు 16, 2023లో ప్రేమ వివాహం చేసుకుంది. అత్తింటికి వెళ్లగానే కట్నం తేలేదని నిత్యం అత్త రమణ వేధిస్తుండేది. విషయం తెలుసుకున్న తండ్రి అప్పు చేసి రూ.50 వేలు ఇచ్చాడు. అయినా వేధింపులు ఆగలేదు. అత్త, ఆమె అక్క దుర్గ, ఆడపడుచు దివ్యతో కలిసి వేధింపులకు గురిచేస్తుండడమే కాకుండా హత్యాయత్నం కూడా చేశారు. దీంతో వేధింపులు భరించలేక కావ్య పుట్టింటికి వచ్చి కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేసింది. గర్భిణిగా ఉన్న తనను భర్త, అత్తింటి వారు చంపుతానని బెదిరిస్తున్నారని, రక్షణ కల్పించాలని ఫిర్యాదు పేర్కొంది.

16వ రోజుకు సమగ్ర శిక్ష ఉద్యోగుల దీక్షలు

మచిలీపట్నం టౌన్ : జీతాలు పెంచాలంటూ సమగ్ర శిక్ష ఉద్యోగులు నిర్వహిస్తున్న రిలే దీక్షలు గురువారం నాటికి 16వ రోజుకు చేరుకున్నాయి. ఉద్యోగుల జిల్లా సంఘం నాయకులు శివనాగరాజు, పోతురాజు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ దీక్షల్లో పెద్ద సంఖ్యలో ఉద్యోగులు పాల్గొన్నారు. ఉద్యోగులు పాటలు పాడి తమ నిరసన తెలిపారు. ఈ రోజు దీక్షల్లో ఉద్యోగులు కుటుంబ సభ్యులతో కలసి వచ్చి ప్రభుత్వ విధానాలపై నినాదాలు చేశారు.

వైభవంగా పైడమ్మ జలవిహారం

పెడన, జనవరి 4 : అంగరంగ వైభవంగా జరుగుతున్న పెడన పైడమ్మ తల్లి జాతర ఉత్సవాలలో భాగంగా గురువారం రాత్రి తెప్పోత్సవం నిర్వహించారు. హంస వాహనంపై అధిరోహింప చేసి ఆమె వెలసిన పైడమ్మ చెరువులో తెప్పోత్సవం నిర్వహించారు. త్రిలోక సంచారానికి గుర్తుగా చెరువు చుట్టూ మూడు సార్లు జల విహారం చేశారు. తండోపతండాలుగా తరలివచ్చిన భక్తులు ఈ అపూర్వ ఘట్టాన్ని కనులారా వీక్షించి తరించారు. ఈవో టి.వి.వి. మోహనరావు, వ్యవస్థాపక ధర్మకర్త దాసు వాయునందనరావు, ఆశాది దాసు లీలాప్రసాద్, ట్రస్టు బోర్డు సభ్యులు తోట సాంబశివరావు, శ్రీకాకుళపు సుబ్బారావు, చాకరజాముల భగవాన్, చిల్లిముంత శ్రీనివాసరావు, సిరివెళ్ల వెంకట సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. జాతర ఉత్సవాలు 11వ రోజైన శుక్రవారంతో ఉత్సవాలు ముగుస్తాయి.



ఆంధ్రజ్యోతి
నవ్య | చిత్రజ్యోతి
శుక్రవారం • 5 జనవరి 2024
cinema@andhrajyothy.com

చీరకట్టులో సంప్రదాయబద్ధంగా



నాగార్జున 'నా సామిరంగ' సినిమాపై ప్రేక్షకుల్లో పాజిటివ్ వైబ్స్ కనిపిస్తున్నాయి. 1980ల్లో జరిగే కథ కావడం, నాగార్జునకు తోడుగా యువహీరోలు అల్లరి నరేశ్, రాజ్‌తరుణ్ నటించడం ఇవన్నీ సినిమాపై అంచనాలు పెంచాయనే చెప్పాలి. విజయ్ బిన్ని దర్శకత్వంలో శ్రీనివాస్ చిట్టూరి నిర్మించిన ఈ చిత్రం జనవరి 14న సంక్రాంతికి కానుకగా విడుదల కానుంది. ఈ సందర్భంగా ఇందులో 'మంగా'గా కీలక పాత్ర పోషిస్తున్న మిర్నా మీనన్ ఫస్ట్‌లుక్ పోస్టర్‌ని చిత్రం బృందం విడుదల చేసింది. సంప్రదాయబద్ధంగా చీరకట్టులో ఉన్న మిర్నా మీనన్ స్టిల్ యువతరం మెచ్చేలా ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ప్రేమ, స్నేహం, భావోద్వేగాలు, మాస్, యాక్షన్ ఇలా అన్ని రకాల ఎలిమెంట్స్ ఇందులో ఉంటాయని, సంక్రాంతికి సరైన సినిమా ఇదని మేకర్స్ నమ్మకం వ్యక్తం చేస్తున్నారు. ఆశికా రంగనాథ్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రానికి రచన: ప్రసన్న కుమార్ బెజవాడ, సంగీతం: ఎం.ఎం.కీరవాణి, కెమెరా: శివేంద్ర దాశరథి.

అబ్బురపరిచే చందమామకథలా విశ్వంభర



చిరంజీవి సినిమా అంటే విందుభోజనంలా ఉండాలి. పిల్లల దగ్గర్నుంచి పెద్దలదాకా అందరికీ నచ్చేలా ఉండాలి. పాటలు, డాన్సులు, ఫైట్లు, కథ, కథనం, కామెడీ అన్నీ ఓ రేంజ్‌లో ఉండాలి. మొత్తంగా ఓ చందమామకథలా ఉండాలి. చిరంజీవిని జగదేకవీరుడిగా చూపిస్తేనే జనం ఇష్టపడతారు. అప్పుడే అది పూర్తిస్థాయి చిరంజీవి సినిమా. దర్శకుడు వశిష్ఠ ఈ విషయాన్ని పూర్తిగా అవగతం చేసుకొని తయారు చేసుకున్న కథే 'విశ్వంభర'. అబ్బురపరిచే చందమామకథలా ఈ సినిమా ఉంటుందని చిత్రబృందం చెబుతోంది. సోషియో ఫాంటసీ కథాంశంతో ఈ చిత్రం రూపొందుతున్న విషయం తెలిసిందే. యముడుకి మొగుడు, జగదేకవీరుడు-అతిలోకసుందరి, అంజి గతంలో చిరంజీవి చేసిన ఫాంటసీ చిత్రాలు. వాటిని మించే స్థాయిలో, ఊహించని మలుపులతో ఊహకందని కేరక్టరైజేషన్స్‌తో మరోలోకంలోకి తీసుకెళ్లేలా ఈ సినిమా ఉండనుందని సమాచారం. అందుకే అత్యుత్తమ సాంకేతిక నిపుణులు ఈ సినిమాకు పనిచేస్తున్నారు. సునీల్ ప్రత్యేకపాత్ర పోషిస్తున్న ఈ చిత్రంలో త్రిష కథానాయికగా ఎంపికయ్యారు. కథానుగుణంగా ఇంకొందరు కథానాయికలు ఈ సినిమాకు అవసరం. వారి వివరాలు త్వరలో తెలుస్తాయి. ఇందులో విలన్‌గా ప్రముఖ బాలీవుడ్ నటుడు నటించనున్నాడు. సాయిమాధవ్ బుర్రా సంభాషణలు అందిస్తున్న విషయం తెలిసిందే.

డిప్యూటీ సీఎం భట్టితో చిరంజీవి భేటీ



సినీ నటుడు చిరంజీవి గురువారం డిప్యూటీ సీఎం, ఆర్థిక, విద్యుత్తు శాఖల మంత్రి మల్లు భట్టి విక్రమార్కతో భేటీ అయ్యారు. చిరంజీవి, ఆయన సతీమణి సురేఖ ప్రజాభవన్‌కు వెళ్లి, భట్టిని మర్యాదపూర్వకంగా కలిశారు. కశ్మీర్ నుంచి తెప్పించిన శాలువాతో భట్టిని సత్కరించారు. చిరంజీవి దంపతులకు డిప్యూటీ సీఎం పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు.

ఫిబ్రవరి బరిలోకి ఈగల్



రవితేజ కథానాయకుడిగా నటించిన 'ఈగల్' చిత్రం విడుదల తేదీ మారింది. సంక్రాంతి సందర్భంగా జనవరి 13న ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నట్లు గతంలో యూనిట్ ప్రకటించింది. అయితే ఈ సంక్రాంతికి రెండు మూడు రోజుల వ్యవధిలోనే అరడజనుకు పైగా పెద్ద హీరోల చిత్రాలు విడుదలవుతుండడంతో కొన్ని సినిమాలకు థియేటర్ల కొరత ఏర్పడింది. ఈ నేపథ్యంలో గురువారం తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్, తెలంగాణ స్టేట్ ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్, తెలుగు ఫిల్మ్ ప్రొడ్యూసర్స్ కౌన్సిల్ సంయుక్త సమావేశం నిర్వహించాయి. ఒకేసారి ఎక్కువ సినిమాల విడుదల వల్ల నష్టపోయే అవకాశం ఉండడంతో



దీనిని నివారించేందుకు ఆయా చిత్రాల నిర్మాతలతో చర్చించాయి. నిర్మాత దిల్‌రాజు నేతృత్వంలో సాగిన చర్చలు ఫలించి 'ఈగల్' చిత్రం రిలీజ్‌ను వాయిదా వేసేందుకు నిర్మాతలు టీజీ విశ్వప్రసాద్, వివేక్ కూచిభొట్ల అంగీకరించారు. తమ చిత్రానికి కొత్త రిలీజ్ డేట్‌ను ఖరారు చేశారు. ఫిబ్రవరి 9న 'ఈగల్'ను విడుదల చేయనున్నారు. ఈ సందర్భంగా నిర్మాత దిల్‌రాజు మాట్లాడుతూ 'ఈగల్ సినిమా విడుదల వాయిదాకు అంగీకరించిన నిర్మాతలకు ధన్యవాదాలు. ఇదొక మంచి పరిణామం. మేమంతా కలసి తీసుకున్న నిర్ణయం ఇద'న్నారు. దీంతో సంక్రాంతి బరిలో నిలిచే సినిమాలపై స్పష్టత వచ్చింది. జనవరి 12న మహేశ్‌బాబు 'గుంటూరు కారం', తేజ సజ్జ 'హను-మాన్', 13న వెంకటేశ్ 'సైంధవ్', 14న నాగార్జున 'నా సామిరంగ' చిత్రాల విడుదల ఖాయమైనట్లే.

ఫిబ్రవరిలో ఆట మొదలు



గీతానంద్, నేహా సోలంకి జంటగా నటించిన చిత్రం 'గేమ్ ఆన్'. దయానంద్ దర్శకత్వంలో రవి కస్తూరి నిర్మించారు. ఈ చిత్రాన్ని ఫిబ్రవరి 2న విడుదలచేస్తున్నట్లు నిర్మాత తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'గీతానంద్ ఈ చిత్రంతో హీరోగా మరో మెట్టు ఎక్కుతాడనే నమ్మకం ఉంది. నేహా సోలంకి తన అభినయంతో ఆకట్టుకుంటుంది. దయానంద్ ఈ చిత్రాన్ని అద్భుతంగా తెరకెక్కించాడు. విభిన్నమైన కథతో తెరకెక్కిన మా సినిమాను ప్రేక్షకులు ఆదరించాలి' అని కోరారు. దర్శకుడు మాట్లాడుతూ 'ఈ చిత్రంలో పాత్రలన్నీ గ్రే షేడ్‌లో ఉంటాయి. తన జీవితాన్ని చాలించాలనుకున్న ఓ వ్యక్తి రియల్‌టైమ్ సైకలాజికల్ గేమ్‌లోకి ఎలా ప్రవేశించాడు, ఆ తర్వాత జరిగిన పరిణామాలు ఎలాంటి పరిస్థితులకు దారి తీశాయనేది ఆసక్తికరంగా ఉంటుంద'న్నారు. మధుబాల కీలకపాత్ర పోషించిన ఈ చిత్రానికి అభిషేక్ ఏ ఆర్ సంగీతం అందించారు. సినిమాటోగ్రఫీ: అరవింద విశ్వనాథన్.

చిన్నతనంలోనే మార్ఫింగ్‌కి గురయ్యా..



యువతరం ఎక్కువగా ఇష్టపడే హీరోయిన్లలో జాన్వీకపూర్ ముందు వరుసలో ఉంటారు. ఎక్కువగా వార్తల్లో నిలిచే కథానాయికల లిస్ట్‌లో కూడా జాన్వీ ఒకరని చెప్పొచ్చు. ఇటీవల డీప్ ఫేక్ వీడియోలు హీరోయిన్లనే కాక సగటు స్త్రీలను కూడా భయపెడుతున్న తరుణంలో వాటి గురించి రీసెంట్‌గా స్పందించి చర్చనీయాంశమయ్యారు జాన్వీ. 'ఇలాంటి అంశాల గురించి నేను పెద్దగా స్పందించను. ఎందుకంటే నేనేం మాట్లాడినా నా పుట్టుపూర్వోత్తరాల గురించి మాట్లాడటం, అవాకులు చవాకులు రాసేయడం చాలామందికి అలవాటైపోయింది. అందుకే సాధ్యమైనంత వరకూ ఇలాంటి వాటికి దూరంగా ఉంటూ వచ్చాను. కానీ.. రష్మిక ఈ వీడియోలకు గురి అవ్వడం.. దానిపై ఆమె స్పందించిన తీరు, ఆ పోరాడిన విధానం నిజంగా అభినందనీయం. ఈ విషయంలో ఆమెను అభినందించకుండా ఉండలేను. నేను చిన్నతనంలోనే ఈ తరహా మార్ఫింగ్ వీడియోలకు గురయ్యాను. నా 15 ఏటే నా ఫేస్‌ని మార్ఫింగ్ చేసి వీడియోలను విడుదల చేశారు. అది చిన్న వయసు, పైగా వాటి ప్రభావం తెలీదు. అందుకే పెద్దగా పట్టించుకోలేదు. ఇప్పుడు ఇవి మరీ ఎక్కువైపోయాయి. ఈ విషయంలో స్త్రీలు అప్రమత్తంగా ఉండాలి' అంటూ స్పందిచారు జాన్వి. ప్రస్తుతం ఈ ముద్దుగుమ్మ తారక్ 'దేవర'తో తెలుగుతెరపై సాక్షాత్కరించనున్న విషయం తెలిసిందే.

చల్లగాలి ప్రేమగీతం



ప్రణవ్, షజ్ఞ శ్రీ హీరో హీరోయిన్లుగా శ్రీనాథ్ పులకురం దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'ప్రభుత్వ జూనియర్ కళాశాల'. భువన్‌రెడ్డి కొవ్వూరి నిర్మాత. ఇటీవలె విడుదలైన ప్రచార చిత్రాలకు చక్కటి ఆదరణ దక్కింది. గురువారం చిత్రబృందం రెండో గీతాన్ని విడుదల చేసింది. 'చల్లగాలి' అంటూ సాగే రొమాంటిక్ గీతాన్ని యూనిట్ గురువారం విడుదల చేసింది. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ 'పీరియాడిక్ నేపథ్యంలో కథ సాగుతుంది. పుంగనూరు గ్రామంలో జరిగిన సంఘటన ఆధారంగా ఈ చిత్రాన్ని తెరకెక్కించాం. తక్కువ బడ్జెట్‌లోనే మంచి సినిమాను తీశాం. ప్రేక్షకులు ఆదరించాలి' అని కోరారు. వినూత్నమైన కథాంశంతో ఈ చిత్రం తెరకెక్కుతోందని నిర్మాత తెలిపారు. ప్రేక్షకులను రెండు దశాబ్దాలు వెనక్కు తీసుకెళ్లేలా ఈ సినిమా ఉంటుంది అని ప్రణవ్ చెప్పారు.

బబ్బర్‌షేర్‌గా సల్మాన్?



సల్మాన్‌ఖాన్, కబీర్‌ఖాన్ మళ్లీ కలవనున్నారు. వీరిద్దరి కాంబినేషన్‌లో భజరంగీ భాయ్‌జాన్, ఏక్తాటైగర్, ట్యూబ్‌లైట్ చిత్రాలు రూపొందాయి. వీటిలో మొదటిరెండూ బ్లాక్‌బాస్టర్స్ కాగా, 'ట్యూబ్‌లైట్' మాత్రం ఆశించిన స్థాయి విజయాన్ని అందుకోలేకపోయింది. త్వరలో మళ్లీ సల్మాన్‌ని డైరెక్ట్ చేయనున్నారు కబీర్‌ఖాన్. ఈ కథకు 'బబ్బర్‌షేర్' అని టైటిల్‌ని కూడా ఫిక్స్ చేశారాయన. ఈ కథ గురించి బాలీవుడ్‌లో ప్రస్తుతం చర్చ నడుస్తోంది. ఊహకందని కథాకథనాలతో ఈ స్క్రిప్ట్‌ని కబీర్ రెడీ చేశారని సమాచారం. దాంతో చాలామంది హీరోలు ఈ ప్రాజెక్ట్‌ని సొంతం చేసుకోడానికి ప్రయత్నాలు చేశారని వినికిడి. అయితే.. కబీర్‌ఖాన్ మాత్రం తన మనసులో ఆ కథకు వేరొకర్ని కథానాయకుడిగా ఊహించలేకపోతున్నారట. అందుకే.. ఎవరు ఎంత ప్రయత్నించినా తను మాత్రం సల్మాన్ కోసమే వెయిట్ చేశారట. గత ఏడాది ఆగస్ట్, సెప్టెంబర్ నెలల్లో ఈ సినిమాకు సంబంధించిన చర్చలు సల్మాన్, కబీర్‌ల మధ్య జరిగాయని వినికిడి. ఈ నెల చివరికల్లా బౌండెడ్ స్క్రిప్ట్‌తో సల్మాన్‌ని ఆయన కలవనున్నారని సమాచారం. ఈ ప్రాజెక్ట్‌కి సంబంధించిన మిగతా వివరాలు తెలియాల్సివుంది.

సినిమా స్థాయికి తగిన సంఖ్యలో థియేటర్లు ఇవ్వాలి



కె. నిరంజన్ రెడ్డి

తేజ సజ్జ కథానాయకుడిగా ప్రశాంత్ వర్మ దర్శకత్వం వహించిన చిత్రం 'హను-మాన్'. కె. నిరంజన్‌రెడ్డి నిర్మాత. సంక్రాంతి సందర్భంగా జనవరి 12న విడుదలవుతోంది. ఈ సందర్భంగా నిరంజన్‌రెడ్డి సినిమా విశేషాలను విలేకరులతో పంచుకున్నారు.

- 'హను-మాన్' నిర్మాతగా నాకు తొలి చిత్రం. భారీ స్థాయిలో రూపుదిద్దుకోవడం, సంక్రాంతికి విడుదలవుతుండడం ఆనందాన్నిచ్చాయి. హాలీవుడ్‌లో సూపర్‌హీరో ఫ్రాంఛైజీలో చాలా చిత్రాలు వచ్చాయి. అలాంటి ఫ్రాంఛైజీ మనకు కూడా ఒకటి ఉండాలని ఈ సినిమా చేశాం. ఆంజనేయస్వామిని మన సంస్కృతిలో సూపర్‌హీరో అనుకోవచ్చు. సినిమా చూసిన ప్రేక్షకులంతా హనుమంతుడిని దర్శించుకున్న అనుభూతికి లోనవుతారు.
- ఈ సినిమా కోసం మేం మూడేళ్లు కష్టపడ్డాం. ప్రచార చిత్రాలకు అద్భుతమైన స్పందన వచ్చింది. దాంతో కంటెంట్‌కు కావాల్సినవన్నీ ఎక్కడా రాజీపడకుండా సమకూర్చాం. ముందు అనుకున్న బడ్జెట్ కన్నా ఐదు రెట్లు ఎక్కువ ఖర్చు చేయాల్సి వచ్చింది. 'హను-మాన్' వీఎఫ్‌ఎక్స్ క్వాలిటీ అద్భుతంగా ఉంది. ఖర్చు చేసిన ప్రతి రూపాయికి తగిన ప్రతిఫలం తెరపై కనిపిస్తుంది. ఇంతింతై వటుడింతై అన్నట్లుగా సినిమా స్థాయి పెరుగుతూ వచ్చింది. దానికి తగ్గట్లే సినిమాకు దేశ, విదేశాల్లో మంచి బిజినెస్ జరిగింది.
- సంక్రాంతికి ఎన్ని సినిమాలు బరిలో ఉన్నా 'హను-మాన్' విజయంపై మాకు పూర్తి నమ్మకం ఉంది. చాలా లాంగ్ రన్ ఉన్న చిత్రమిది. అందుకే ముందుగా ఎక్కువ థియేటర్లలో చేయాలని తొందరపడడం లేదు. తెలుగు రాష్ట్రాల్లో రూ. 20 కోట్ల థియేట్రికల్ బిజినెస్ జరిగింది. హిందీలో 200 స్క్రీన్లలో రిలీజ్ చేస్తున్నాం. సంక్రాంతికి ఎక్కువ సినిమాలు విడుదలవుతున్నాయి. దాన్ని దృష్టిలో ఉంచుకొని మా సినిమా స్థాయికి తగిన సంఖ్యలో థియేటర్లు ఇవ్వాలని పరిశ్రమ పెద్దలను కోరుతున్నాం. 'హను-మాన్' ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు చిరంజీవి గారు అతిథిగా వస్తున్నారు. బిజీ షెడ్యూల్‌లోనూ వెసులుబాటు చేసుకొని రవితేజ గారు కోటి అనే పాత్రకు వాయిస్ ఓవర్ ఇచ్చారు. వారికి ధన్యవాదాలు. మా బేనర్‌లో చేయబోయే కొత్త చిత్రాలను ఫిబ్రవరిలో ప్రకటిస్తాం.

ప్రేమకథకు ప్రేక్షకులు కనెక్ట్ అవుతారు



కిశోర్ కేఎస్‌డీ, దియా సితెపల్లి హీరో హీరోయిన్లుగా నటించిన చిత్రం 'ప్రేమకథ'. విజయ్ మట్టపల్లి, సుశీల్ వాజపిల్లి, శింగనమల కల్యాణ్ నిర్మాతలు. శివశక్తి రెడ్ డీ దర్శకుడు. నేడు ఈ చిత్రం విడుదలవుతోంది. గురువారం చిత్రబృందం ప్రీ రిలీజ్ వేడుకను నిర్వహించింది. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ "ప్రేమకథ' చిత్ర నేపథ్యం నిజ జీవిత సంఘటనలకు దగ్గరగా ఉంటుంది. ప్రేక్షకులు కథాంశంతో కనెక్ట్ అవుతారు' అన్నారు. 'నటీనటులు అంతా కష్టపడి మంచి సినిమా చేశారు. మధుర శ్రీధర్, ధీరజ్, శింగనమల కల్యాణ్ సాయం చేశారు. ప్రేక్షకులు మా సినిమాను ఆదరించాలి' అని నిర్మాతలు కోరారు. మా సినిమాలో ఇద్దరు అందమైన హీరోయిన్లు ఉన్నారు, వారి నటన ఆకట్టుకుంటుందని కిశోర్ చెప్పారు. 'ప్రేమకథ' చిత్రం ప్రేక్షకులను అలరించేలా ఉంటుందని దియా తెలిపారు.

జాలరి జీవిత పోరాటం



మత్స్యకారుల జీవితం నేపథ్యంలో రూపొందిన చిత్రం 'రేవు'. వంశీ రామ్, స్వాతీ భీమ్ రెడ్డి జంటగా నటించారు. ఎల్బీ శ్రీరామ్ అతిథి పాత్ర పోషించారు. సముద్రంలోని మత్స్యసంపదపై ఆధిపత్యం కోసం జరిగే పోరాటం నేపథ్యంలో దర్శకుడు హరినాథ్ పులిచర్ల తెరకెక్కించారు. ఏ. ఆర్ ఫిలిం టీమ్, విజయా టాకీస్ సంయుక్తంగా నిర్మించాయి. త్వరలో ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ చిత్రం టీజర్, పోస్టర్‌ను సీనియర్ నటుడు మురళీమోహన్ చేతుల మీదుగా యూనిట్ విడుదల చేసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'హరినాథ్ రియలిస్టిక్ అప్రోచ్‌తో ఈ చిత్రం తీశాడు. మంచి విజయం అందుకోవాలి' అని ఆకాంక్షించారు. దర్శకుడు మాట్లాడుతూ 'రేవు' చిత్రం ఫస్ట్ కాపీ సిద్ధమైంది. ఫిబ్రవరిలో విడుదల చేస్తాం. ప్రేక్షకులు ఆదరించాలి' అని కోరారు.

వజ్రం లాంటి పింకీ

సుమన్, శుభలేఖ సుధాకర్, రవి అట్లూరి ప్రధాన తారాగణంగా రూపొందుతున్న చిత్రం 'పింకీ'. కిరణ్, మౌర్యాణి జంటగా నటించారు. సీరపు రవికుమార్ దర్శకత్వంలో పసుపులేటి వెంకట రమణ నిర్మిస్తున్నారు. ఫిబ్రవరి మొదటి వారంలో ప్రేక్షకుల ముందుకు తెచ్చేందుకు నిర్మాత సన్నాహాలు చేస్తు



న్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో నిర్మాత మాట్లాడుతూ 'రవికుమార్ చెప్పిన కథ నచ్చి 'పింకీ' చిత్రాన్ని నిర్మించాను. దర్శకుడు అన్నీ తానై ఈ చిత్రాన్ని రూపొందించాడు' అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ 'ఇది నా తొలి చిత్రం. మా నిర్మాత ఖర్చుకు వెనుకాడకుండా నిర్మించారు. డైమండ్ కోసం జరిగే అన్వేషణ నేపథ్యంలో 'పింకీ' కథ సాగుతుంది. ఇదొక సస్పెన్స్ థ్రిల్లర్' అని తెలిపారు. దర్శకుడు ఈ చిత్రాన్ని అద్భుతంగా తెరకెక్కించారు అని కిరణ్ చెప్పారు.

సుభాషితం



అది అసాధ్యం


లభేత సిక తాసు తైలమపి యత్నతః పీడయన్
పిబేచ్చ మృగతృష్ణికాసు సలిలం పిపాసార్దితః
కదాచి దపి పర్యటన్ శశవిషాణ మాసాదయేత్
న తుప్రతినివిష్ట మూర్ఖజనచిత్తమారాధయేత్

మూర్ఖులైన వారిని మార్చడం ఎంత కష్టమో భర్తృహరి తన నీతి శతకంలోని ఈ శ్లోకంలో వర్ణించాడు.

దాన్ని ఏనుగు లక్ష్మణకవి...
తివిరి యిసుమున తైలంబు దీయవచ్చు
దవిలి మృగతృష్ణలో నీరు ద్రావవచ్చు
దిరిగి కుందేటికొమ్ము సాధింపవచ్చు
జేరి మూర్ఖుల మనసు రంజింప రాదు... అంటూ తెలుగువారికి పద్యరూపంలో సమర్పించాడు.

భావం: ఇసకలోంచి నూనెను ఏదో విధంగా తీయవచ్చు. ఎండమావుల్లో పరుగులెత్తి ఎక్కడో ఒక చోట నీరు తాగవచ్చు. కుందేటి కొమ్మును, ఎక్కడెక్కడో తిరిగి, ఎంతో కష్టపడి సంపాదించనూవచ్చు. కానీ మూర్ఖులైన వ్యక్తులకు నచ్చజెప్పడం, వారి మనసుకు నచ్చే పని చేయడం సాధ్యం కాదు.

స్వానుభవం



పద్మభూషణ్ కె.ఐ.వరప్రసాదరెడ్డి

దయలేని హృదయంలో దేవుడు ఉండడు

"నా ఆధ్యాత్మిక గురువుగా ప్రముఖ ప్రవచనకర్త చాగంటి కోటేశ్వర రావు గారిని ఎంచుకున్నాను. ఆయన దగ్గర నేను మంత్రోపదేశం లాంటివి ఏవీ తీసుకోలేదు కానీ... ఆయనను అనుసరిస్తాను. ఒక రోజు ఆయన నాకు హఠాత్తుగా ఫోన్ చేశారు. "వరప్రసాద్‌గారూ! నన్ను గురువుగా భావిస్తానంటారు. ఒక మాట అడగొచ్చా?" అన్నారు. ఆయన అడిగే పద్ధతి కాస్త విచిత్రంగా అనిపించింది. "అదేవిటండీ! అడగండి" అన్నాను. "తప్పకుండా మాట నిలబెడతారా?" అని అడిగారు. "చెప్పండి గురువుగారూ!" అన్నాను. "నేను చెప్పిన తరువాత కాదనకుండా చెయ్యాలి. మీకన్నా వయసులో చిన్నవాణ్ణయినా... ఇది అడుగుతున్నాననుకోవద్దు. ఆదేశిస్తున్నాను" అన్నారు. "సరే... చెప్పండి" అన్నాను. "రేపు ఉదయం ఉజ్జయిని ఆలయంలో భస్మహారతి తీసుకోండి" అన్నారు. "దేనికి గురువుగారూ!" అని అడిగాను. "అడగొద్దని చెప్పాను కదా! 'నాది ఆదేశం' అన్నాను కదా! మళ్ళీ ప్రశ్నించవద్దు" అన్నారు. నా మనస్సు చివుక్కుమంది. గురువుమాట జవదాటకూడదు కదా! ఎలా వెళ్ళాలి? అని ఆలోచిస్తున్నాను. అప్పుడు మా ఇంట్లో ఉన్న మా బంధువుల అమ్మాయి "ఏమిటి మామయ్యా! అంత ఆందోళనగా ఉన్నారు?" అని అడిగింది. "ఉజ్జయిని వెళ్ళాలి. ఎలా వెళ్ళాలో, అక్కడికి చేరుకోడానికి విమానాలు ఉన్నాయో లేదో తెలీదు. రేపు ఉదయం భస్మహారతి తీసుకోవాలి" అని చెప్పాను. "భస్మహారతి ఉదయం కాదు మామయ్యా! వేకువ జామునే ఏ రెండింటికో అవుతుంది" అందామె. 'అంటే ఈరోజే బయలుదేరాలి. గురువుగారు రేపు భస్మహారతికి వెళ్ళమన్నారు. రేపు రాత్రి చేసుకోవచ్చా?' అనేది మరో సందేహం. చివరికి... ఆ రోజే బయలుదేరి ఉజ్జయినికి చేరుకున్నాను. అక్కడ నాకెవరూ తెలీదు. నాకు భస్మహారతి సమయం గురించి చెప్పిన మా బంధువుల అమ్మాయే... ఉజ్జయినిలో ఒక పూజారి తెలుసంటూ ఫోన్ నెంబర్ ఇచ్చింది. ఆయన ఫోన్ ఎత్తడం లేదు. ఏం చెయ్యాలనే సందిగ్ధంలో ఉండగా... ధర్మారెడ్డి గారు ఏదో పని మీద ఫోన్ చేశారు (ప్రస్తుతం టీటీడీ ఇవోగా ఉన్న ఆయన అప్పట్లో ఢిల్లీలో పని చేసేవారు). నేను ఉజ్జయినిలో ఉన్నట్టు ఆయనకు చెప్పాను. "అక్కడ కలెక్టర్ తెలుగు వ్యక్తే. నేను చెబుతాను. మిమ్మల్ని కలుసుకుంటారు" అన్నారు ధర్మారెడ్డి. ఆ తరువాత కలెక్టర్ నన్ను దగ్గరుండి తీసుకువెళ్ళి, భస్మహారతి ఇప్పించారు. మర్నాడు తిరిగి వచ్చేశాను. ఇదంతా ఎందుకని మా గురువుగారు అడగొద్దన్నారు కాబట్టి... నేను అడగలేదు.

ఏడాది తరువాత... మా ఇంటి పురోహితుడితో ఏదో శుభ కార్యం గురించి మాట్లాడుతున్నాం. ఆయనకు జ్యోతిషం లాంటివి తెలుసు. నా జాతకచక్రం ఆయన దగ్గర ఉంది. "వరప్రసాద్ గారికి పెద్ద గండం గడిచిపోయింది. నాకు సంతోషంగా ఉంది" అన్నారాయన. "ఏం గడిచింది?" అని అడిగాను. "మీకు ఫలానా సమయంలో మారకం (ప్రాణాపాయం కలిగే సమయం) ఉంది. గ్రహాల సంచారం బాగు లేదు. మీరు మంచి పనులు చేస్తారు కాబట్టి దాన్ని దాటతారని తెలుసు. అలాగే దాటారు" అన్నారు. "ఎప్పుడండీ? అని అడిగాను. ఆయన తేదీలు చెప్పారు. గురువుగారు భస్మహారతి తీసుకోమని చెప్పింది కూడా అవే రోజుల్లో. చాగంటివారికి నేను పుట్టిన తేదీ, సమయం, స్థలం లాంటివి ఏవీ తెలీవు. జాతకాల గురించి ఎప్పుడూ మాట్లాడరు. అలాంటి వ్యక్తి ఉజ్జయినికి వెళ్ళాలని ఎందుకన్నారో తెలీదు. ఆయన దగ్గర ఏవైనా శక్తులు ఉన్నాయా? ఏవైనా ఉంటే... ఆయనకు ముందే తెలిసి ఉంటే, పదిరోజుల ముందే చెబుతారు కదా! అంటే ఆయనకు కూడా తెలీదు. ఆయన జాతకాలు చూసే వ్యక్తి కాదు. జాతకాలు చూసే అలవాటు ఉన్న మా పురోహితుడికి నా పట్ల వ్యతిరేకత ఏమీ లేదు. నా గండం గడవాలని పూజలు కూడా చేశారట. కానీ "మీకు ప్రమాదం ఉంది. జాగ్రత్తగా ఉండండి" అని నాకు చెప్పలేదు. ఆయన చెప్పలేదు కాబట్టి... దేవుడు మా గురువుగారిని ప్రేరేపించాడా? మారకం గురించి మా గురువుగారికి ఎలా తెలిసింది? ఆయనలో ప్రేరణ కలిగిందనేది మాత్రం నిజం. ఇలాంటివి తర్కానికీ, మీమాంసకూ నిలబడవు. దేవుణ్ణి నమ్మని మా మేనమామ 'అది యాదృచ్ఛికం' అంటారు. మా అమ్మ 'అంతా దైవసంకల్పం' అంటారు. దేన్ని నమ్మాలి? రెండూ నిజమే కావచ్చు. నన్ను ఉలిక్కిపడేలా చేసిన అనుభవం అది.

ఆ రెండూ ఒక్కటే...

నన్ను కన్న తల్లి ఆస్తికురాలు. నన్ను పెంచిన మా మేనమామ నాస్తికుడు. ఈ రెండిటికీ చాలా తేడా ఉందనుకొనే చిన్నవయసు నాది. నా అయిదో ఏట చదువుకోసం మా మేనమామ ఇంటికి వెళ్ళాను. సెలవులకు ఇంటికి వచ్చినప్పుడు... అమ్మ భగవద్గీత బోధించేవారు. రాముడు, మార్కండేయుడు, ధ్రువుడు తదితరుల గురించి చెప్పేవారు. పురాణాలు చెప్పేవారు. వీటన్నిటిద్వారా నాలో భక్తిని నింపడానికి ప్రయత్నించేవారు. నేను మళ్ళీ మా మేనమామ ఇంటికి వెళ్ళినప్పుడు... మార్క్సిజం, క్యాపిటలిజం, బలహీనుణ్ణి బలవంతుడు ఎలా పీల్చుకు తింటాడు, శ్రామికుల అదనపు శ్రమే పెట్టుబడిదారుల ఆదాయం... వీటన్నిటి గురించీ వినేవాణ్ణి. మనుషుల్లో దేవుణ్ణి చూడమని అమ్మ చెబుతుంది, మనుషుల్లో దేవుడెక్కడున్నాడని మామయ్య అంటారు. దేవుడనేవాడు లేడని ఆయన చెబుతారు. అంతా గందరగోళంగా ఉండేది. నాకు కొంత వయసు, పరిణతి వచ్చాక... అర్థమైనదేమిటంటే, ఆస్తికత్వం అనేది నాస్తికత్వానికి వ్యతిరేకం కాదని. రెండూ ఒకటే. మార్గాలు వేరు. ఆ రెండిటినీ సమన్వయం చేసుకొనే ప్రయత్నంలో నా ఆలోచనల్లో స్పష్టత వచ్చింది. దేవుడు చేసే పనులే మనం చేస్తే... దేవుడికీ ఇష్టమే కదా! దేవుణ్ణి అర్చించడం, దేవుడు సృష్టించిన కొబ్బరికాయల్నీ, ఆయన సృష్టించిన అరటి పండ్లనీ పెట్టడంలో అర్థమేముంది? అవన్నీ మనకు ఆయన ఇచ్చినవే. అవి మళ్ళీ ఆయనకు ఇవ్వడంలో విశేషం ఏముంది? మనల్ని చూసి పదిమంది అనుసరించినప్పుడే సంతృప్తి కలుగుతుంది. అలాగే దేవుడికైనా మనం ఆయన మార్గంలో పయనిస్తేనే ఆ తృప్తి కలుగుతుంది. సమాజానికి పనికొచ్చే పనులు చేస్తే... ఆయన మెచ్చుకుంటాడు. పూజగదిలో కూర్చొని, దేవుడు ఎక్కడుంటాడు, ఎలా ఉంటాడు? అని తపన పడి, పద్యాలు గుర్తుకు తెచ్చుకొని, మంత్రాలు చదువుకొని అవస్థ పడే బదులు... ఎదురుగా ఉన్న మనిషి అవసరాన్ని గుర్తించడం, ఏదైనా చెయ్యగలిగితే చెయ్యడం అనేది అర్థవంతంగా అనిపించింది. అలా చేస్తే వచ్చే తృప్తి పూజలు, పునస్కారాల ద్వారా వచ్చే దానికన్నా పెద్దది. అందుకే నా ఆస్తికత్వాన్ని సేవారంగంవైపు మళ్ళించాను. నా దగ్గర 1,600 మంది ఉద్యోగులున్నారు. నాతోపాటు వాళ్ళూ యజమానులే. వాళ్ళు నాకోసం పని చెయ్యడం లేదు. వాళ్ళకు వాళ్ళే పని చేసుకుంటున్నారు. ఆ భావన కల్పించాను. వాళ్ళకు ఆర్థికమైన ప్రతిపత్తి కల్పించాను. కమ్యూనిజం చెప్పింది ఇదే, మా అమ్మ చెప్పిందీ ఇదే. ఇలాంటివి చెయ్యకుండా కేవలం పూజలు మాత్రమే చేస్తే అది సంపూర్ణం కాదు. ఆ రెండిటి తాలూకు పరమోద్దేశం సర్వజనీనత. అందరితో సౌజన్యంగా ఉండడం.అయితే హోమం వేరు. హోమం అనేది పర్యావరణం కోసం చేసేది. మనకు వర్షాలు కావాలి. భూమి మీద పడే ఆ వర్షాల వల్లే వృక్షాలు పెరుగుతాయి. ఆహారం సమకూరుతుంది. అందరికీ ఆకలి తీరుతుంది. అదే హోమం ఉద్దేశం. ఆ హోమంలో కూడా మనం కృతజ్ఞతా పూర్వకంగా సమిధలు సమర్పిస్తాం. భక్తిలో కృతజ్ఞతా భావం ఉంది. ప్రేమైకభావం ఉంది.

> **ఆ గుణాలు ఉన్నవారందరూ దేవుళ్ళే...**
>
> నా దృష్టిలో భక్తికి అత్యున్నత స్థితి ప్రేమ. పూజలు, పునస్కారాలు అనేవి కోరికలు కోరడానికి కాదు. మనకు ఇప్పటికే ఇచ్చినవాటికి కృతజ్ఞతలు చెప్పడానికి. మనం ఊపిరి పీల్చుకుంటున్నాం. తిన్నది అరిగించుకోగలుగుతున్నాం. అనవసరమైన వ్యర్థాలను తొలగించుకోగలుగుతున్నాం. ఏ అవయవానికీ మనం ఆదేశాలు ఇవ్వడం లేదు. అవే చేసుకుంటూ పోతున్నాయి. వీటన్నిటినీ లోపల ఏదో ఒక శక్తి నడిపిస్తోంది. సూర్యోదయం, సూర్యాస్తమయాల్లో మన ప్రమేయం లేదు. ఇంత ప్రకృతిని, ఇన్ని వనరులను ఇచ్చిన ఒక శక్తిని దేవుడు అనుకోవచ్చు, బ్రహ్మం అనుకోవచ్చు. 'నిర్గుణ శక్తి' అని కూడా కొందరు చెబుతారు. ఆ శక్తికి కృతజ్ఞత చెప్పడమే భక్తి. తల్లితండ్రులను బిడ్డలు ఎందుకు ప్రేమిస్తారు? వాళ్ళ యోగక్షేమాలు చూస్తారు కాబట్టి. అదే ప్రేమ ప్రతి మానవుడికీ దైవం పట్ల ఉండాలి. క్షమ, సహనం, ఓర్పు, ప్రేమ, వాత్సల్యం, కరుణ... ఇవన్నీ దైవీ గుణాలు. అవి ఉన్న వ్యక్తి దేవుడితో సమానం. అలాంటి వ్యక్తిత్వాలను రూపొందించుకోమనే మనకు పురాణ పురుషులను ఆదర్శంగా చూపించారు.

ఏకైక లక్ష్యం అదే...

అందరిలో భగవంతుడు లేదా ఆత్మ అనేది ఉంది. మానవ జీవన ఏకైక లక్ష్యం అది ఎక్కడినుంచి వచ్చిందో... అక్కడికి తిరిగి చేరుకోవడం. ఈ ఆత్మ పరమాత్మ నుంచి విడివడిన ఒక భాగం. ఆ భాగం ఎన్నో జన్మలు ఎత్తి, అనేక కర్మలూ చేస్తుంది. చిట్టచివరికి దాని లక్ష్యం... పరిశుద్ధమై పరమాత్మను చేరుకోవడం. దాన్ని సాధించాలంటే. కరుణ కలిగి ఉండాలి, సాటి ప్రాణికోటి పట్ల కరుణ, వాత్సల్యం, మమకారం, ప్రేమ, క్షమ... ఇవన్నీ ఉండాలి. కేవలం పూజల ద్వారా అది జరగదు. రావణాసురుడూ అనేక పూజలు చేశాడు. అన్ని వేదాలూ చదివాడు. కానీ అక్కడితో ఆగిపోయాడు. వేరొకరి సొత్తును కావాలనుకున్నాడు. కాబట్టి కేవలం పూజా పునస్కారాలు, వేదవేదాంగాలు చదువుకోవడం భక్తి కాదు. దయలేని హృదయంలో దేవుడు ఉండడు. అది నా గట్టి నమ్మకం. ఈ వివేచన వచ్చిన తరువాత... నేను రెండిటినీ సమన్వయం చేసుకున్నాను. నేను నాస్తికుడిగా మారలేదు, నేను కమ్యూనిస్టునీ కాదు. అలాగని కేవలం పూజలకే పరిమితం కాలేదు.

(పారిశ్రామికవేత్తగా, 'శాంతా బయోటెక్నిక్స్' వ్యవస్థాపకునిగా సుప్రసిద్ధులైన పద్మభూషణ్ కె.ఐ.వరప్రసాదరెడ్డి సాంస్కృతిక, ఆధ్యాత్మిక రంగాల్లో విశేష సేవలు అందిస్తున్నారు.

సంభాషణ: **కృష్ణశర్మ**, ఫొటో: **రాజ్‌కుమార్**

గీతాసారం


తామరాకు మీద నీటిబొట్టు

జీవితంతో సహా ప్రతి భౌతిక వ్యవస్థా పలు అంశాలను స్వీకరించి, అనేక ఫలితాలను వెలువరిస్తుంది. మనం మన మాటలు, చేతల ఫలితాలను నిరంతరం అంచనా వేసుకుంటూ ఉంటాం. 'ఇది మంచి, ఇది చెడు' అని నిర్ధారిస్తూ ఉంటాం. ఇతరుల ప్రవర్తన గురించి, మన చుట్టూ ఉన్న పరిస్థితుల గురించి కూడా నిర్ధారణలు చేస్తూ ఉంటాం. జీవన పరిణామక్రమంలో పొంచి ఉన్న ప్రమాదాలను, ఆటంకాలను అంచనా వేయడానికి ఈ సమర్థత ఎంతగానో ఉపయోగపడుతుంది. కానీ అటువంటి నిర్ధారణలకు ప్రమాణాలు ఉండవు. కాబట్టి వాటి కోసం అజ్ఞానంతో కూడిన ఊహలు, అభిప్రాయాలు, విశ్వాసాలు, నమ్మకాల మీద ఆధారపడతాం. మన నమ్మకానికి అనుగుణంగా ఏదైనా జరిగితే సంతోషిస్తాం.



"మనస్సును వశంలో ఉంచుకున్నవాడు, జితేంద్రియుడు, అంతఃకరణ శుద్ధి కలిగినవాడు, సర్వప్రాణులలో ఆత్మ స్వరూపుడైన ఉన్న పరమాత్మను తన ఆత్మలో నిలుపుకొన్నవాడు అయిన కర్మయోగి... కర్మలను ఆచరిస్తున్నప్పటికీ ఆ కర్మలు, వాటి ఫలితాలు అతణ్ణి అంటవు" అని 'యోగయుక్తో విశుద్ధాత్మా' అనే శ్లోకంలో శ్రీకృష్ణుడు చెప్పాడు. మన చేసే కర్మల తాలూకు కల్మషం మనకు అంటని స్థితి గురించి భగవంతుడు మనకు ఇచ్చిన హామీ ఇది.

"ద్వేషం, కోరికలు లేని వ్యక్తి... తను అందరిలోనూ, అందరూ తనలోనూ ఉన్నట్టు గ్రహించినవాడు ఏ కర్మలు చేసినా అవి కలుషితమైనవి కావు" అని కూడా శ్రీకృష్ణుడు వివరించాడు. అందరిలోనూ తననే చూసుకున్నప్పుడు... కల్మషంతో కూడిన చర్యలను, నేరాలను చేయలేరన్నది దీని అంతరార్థం. దీనికి మరో అర్థం ఏమిటంటే... ఎవరైతే 'నేను, వాళ్ళు' అనే విభజన దృష్టితో చూస్తూ కర్మలను చేస్తారో... వారి అన్ని కర్మలు కలుషితం అవుతాయి. "కర్మలన్నిటినీ భగవదర్పణం చేసి, ఆసక్తిరహితంగా కర్మలను ఆచరించేవాడికి... తామరాకు మీద నీటి బిందువులా పాపాలు అంటవు" అని 'బ్రహ్మణ్యాధాయ కర్మాణి' అనే శ్లోకంలో శ్రీకృష్ణుడు అంటాడు. అంటే ఆ వ్యక్తి రకరకాల పరిస్థితుల మధ్య జీవిస్తూ కూడా... వాటి ప్రభావానికి లోనుకాకుండా ఉండగలుగుతాడు. మన కర్మలు, ఇతరుల కర్మలు భగవంతుడికి అంకితమైనప్పుడు... విభజనకు తావే లేదు. అప్పుడు మనం ఎదుర్కొనే పరిస్థితులు నాటకాల్లా, ఆటల్లా అనిపిస్తాయి. ఇందులో మనం కేవలం మన పాత్రను పోషిస్తాం. వాటి గుణ, దోషాలతో మనకు సంబంధం లేదు. ఈ స్థితిని శ్రీకృష్ణుడు 'నీటిలో ఉంటూ... నీరు అంటని తామరాకు'తో పోల్చాడు.



కె. శివప్రసాద్
ఐఎఎస్

దైవమార్గం



జగజ్జ్యోతి వెలుగులో...

"నేనే కాంతిని, ఆ కాంతి చూపే మార్గం నేనే. ఆ మార్గంలో కనిపించే సత్యాన్ని నేనే. ఆ సత్యంలో ప్రతిఫలించే ప్రేమను కూడా నేనే" అన్నాడు ఏసు క్రీస్తు. క్రీస్తు కాంతిలో దాగున్న ఔన్నత్యం అది. ఒకప్పుడు అగాథమయమైన ఈ విశ్వంలో తొలిసారిగా ప్రసరించింది వెలుగే. ఆరు రోజుల పాటు సాగిన మొత్తం సృష్టిలో, దైవవాక్కుతో పాటు జన్మించినది ఆ కాంతే.

వెలుగు దైవశక్తికి చిహ్నమైతే... చీకటి సైతానుకు సంకేతం. వెలుగంటే చీకటికి భయం. చాలా తప్పులు జరిగేది చీకటిలోనే. అజ్ఞానంతో, అవివేకంతో అంధకారంలో కొట్టుమిట్టాడుతున్న మానవాళిని... ఆ చీకటి నుంచి విముక్తం చెయ్యడం కోసం మరియా గర్భంలో ఏసు ప్రభువు జన్మించాడు. ఆ క్షణంలో... బాల ఏసు ముఖం నుంచి బెత్లెహేమ్‌లోని పశువుల పాకను ప్రకాశవంతం చేసిన కాంతి... ఆ తరువాత జగత్తు అంతటా వ్యాపించింది. చీకట్లను పటాపంచలు చేసింది. అందుకే అది జగజ్జ్యోతి అయింది. ఆకాశంలో తోకచుక్క తొలి విజయ సంకేతంలా నిలిచింది. సామాన్య శ్రామికులైన పశువుల కాపరులకు సైతం శుభవార్తలా మెరిసింది.

"అలసి సొలసిన జనులారా! నావద్దకు రండి" అనే క్రీస్తు స్వరాన్ని ప్రపంచమంతా వింది. ఆ చల్లని పిలుపు తమకోసమేనని లోకమంతా పరవశించింది. పాపులు, వ్యభిచారులు, తప్పుడు పనులు చేసేవారు, వికలాంగులు... ఆయన చల్లని చూపుల్లో పునీతులు కానివారెవరు? సకల పీడితులు, బాధితులు ఎందరెందరో తమ జీవితాల్లో కొత్త వెలుగులను నింపుకొన్నారు. నిరక్షరాస్యులైన మామూలు వ్యక్తులను సైతం తన పన్నెండుమంది శిష్యగణంలో చేర్చుకొని... తన ప్రసంగవాణిని వినిపించిన ఔదార్యం ఏసు ప్రభువుది. మానవుల కోసం మరణాన్ని సైతం ఇష్టంగా స్వీకరించిన... కలువరిగిరిపై ఎన్నటికీ ఆరని త్యాగజ్యోతి ఆయన. ఆ జగజ్జ్యోతి వెలుగు చూపించే మార్గంలో అందరూ పయనించాలి. ఆ మార్గంలో కనిపించే సత్యాన్ని దర్శించాలి. ఆ సత్యంలో ప్రేమను కనుగొనాలి. దాన్ని తోటివారందరికీ పంచాలి.

● డాక్టర్ దేవదాసు బెర్నార్డ్ రాజు, 9866755024


జెన్ కథ

విశ్వాసమే ఆలంబన

టిబెట్ జెన్ గురువైన మార్పాకి భారతదేశంతో అనుబంధం ఉంది. క్రీస్తు శకం 1012 నుంచి 1097 వరకూ జీవించిన మార్పా... భారతీయ బౌద్ధ గురువు నరోపాకు శిష్యుడు. జ్ఞానార్జన పట్ల అతనికి ఉన్న తపన... భారత్, నేపాల్ దేశాల్లో విస్తృతంగా పర్యటించేలా చేసింది. నరోపాను కలుసుకోవడానికి ముందు మార్పాకి ఒక కపట గురువు తగిలాడు. ఆ గురువు నిజమైన జ్ఞాని కాదు. కానీ అతనికి గొప్ప పేరు ప్రతిష్ఠలు ఉన్నాయి. ఎందరో శిష్యులు ఉండేవారు. ఆ కపట గురువు గురించి విన్న మార్పా అతని దగ్గరకు వెళ్ళాడు. "గురువుగారూ! ఈ క్షణం నుంచి నేను మీ శిష్యుణ్ణి. ఏం చెయ్యాలో ఆజ్ఞాపించండి" అని కోరాడు

"అయితే నిన్ను నువ్వు సంపూర్ణంగా సమర్పించుకో" అన్నాడు ఆ గురువు.

"అలాగే సమర్పించుకుంటున్నాను. తరువాత ఏం చెయ్యాలో సెలవివ్వండి" అని అడిగాడు మార్పా.



ఈ మాటలు ఇతర శిష్యులకు నచ్చలేదు. 'మార్పా మాటల్ని గురువు నమ్మితే... అతణ్ణి ప్రియశిష్యుడిగా స్వీకరిస్తాడు. ఎన్నో ఏళ్ళుగా ఉన్న తమ అందరికీ మార్పా నాయకుడవుతాడు. దీన్ని ఎలాగైనా ఆపాలి' అనుకున్నారు.

"గురువుగారూ! ఆ మార్పా చాలా ప్రమాదకరమైన వ్యక్తిలా, అబద్ధాలకోరులా, కపటిలా ఉన్నాడు. ఎన్నో ఏళ్ళ నుంచీ మీ దగ్గర శిష్యులుగా ఉన్న మేమే మీకు సంపూర్ణంగా సమర్పణ కాలేదు. ఇప్పుడు ఇతను వచ్చి "నేను మీకు సంపూర్ణంగా సమర్పించుకొన్నాను" అంటే ఎలా నమ్మాలి? ముందు ఇతణ్ణి బాగా పరీక్షించాలి. పరీక్షలో నెగ్గితే అప్పుడు అతని మాటలు నమ్మవచ్చు" అన్నారు.

"ఏం చేద్దామో, ఎలా పరీక్షిద్దామో మీరే చెప్పండి" అన్నాడు గురువు.

"ఈ కొండ మీంచి దూకమనండి" అన్నారు శిష్యులు.

"ఇదిగో దూకుతున్నాను" అంటూ దూకేశాడు మార్పా. అతను చచ్చిపోయి ఉంటాడని ఆ గురువు, శిష్యులు అనుకున్నారు. లోయలోకి దిగి చూశారు. అక్కడ పద్మాసనంలో కూర్చొని, ధ్యానం చేస్తూ కనిపించాడు మార్పా.

"ఈ అద్భుతం ఎలా జరిగింది?" అని ప్రశ్నించాడు గురువు.

"నాకేం తెలుసు? ఇది మీ ఘనతే" అన్నాడు మార్పా.

"ఇది యాదృచ్ఛికంగా జరిగి ఉండొచ్చు. మరోసారి పరీక్షించాలి" అన్నారు శిష్యులు. మార్పాను మండుతున్న ఒక ఇంట్లోకి వెళ్ళమన్నారు. అతను ఎలాంటి జంకూ లేకుండా ఆ ఇంట్లో ప్రవేశించాడు. మంటలన్నీ పూర్తిగా ఆరిపోయాక... వాళ్ళు లోపలికి వెళ్ళి చూశారు. ఎటు చూసినా మాడి మసైపోయిన వస్తువులు కనిపించాయి. కానీ ఒక గదిలో మార్పా చెక్కుచెదరకుండా, ప్రశాంతంగా ధ్యానం చేస్తూ కనబడ్డాడు. ఆ శిష్యుల ఆశ్చర్యానికి అంతులేదు. మార్పాకు మరో పరీక్ష పెట్టాలని వాళ్ళు పట్టుపట్టారు. నదీ ప్రవాహం మీద మార్పాను నడిచి వెళ్ళమన్నారు. క్షణం ఆలస్యం చెయ్యకుండా నదిపై నడవడం ప్రారంభించి, నది మధ్యకు వెళ్ళాడు మార్పా.

ఇది చూసిన గురువు 'నాలో నిజంగానే ఏదో మహిమ ఉన్నట్టుందే! నా శిష్యుడే నా మీద విశ్వాసం ఉంచి నదిలో నడవగలిగినప్పుడు... నేనెందుకు నడవలేను?' అనుకొని... నదిలోకి వెళ్ళి మునిగిపోయాడు.

'ఒక గురువు సరైన వాడు కానప్పటికీ... అతణ్ణి విశ్వసిస్తే ఇలాంటి అద్భుతాలు జరుగుతాయా?' అనే సందేహం రావచ్చు. ఒక వ్యక్తికి జబ్బు చేస్తుంది అతడు ఒక బాబాను కలుస్తాడు. ఆ బాబా ఇంత విభూతి ఇచ్చి నోట్లో వేసుకోమంటాడు. ఆ వ్యక్తి అలా వేసుకుంటే... జబ్బు నయం అవుతుంది. అలాగే ఏదో పుణ్య క్షేత్రానికి వెళితే జబ్బు తగ్గుతుందని ఎవరో చెబుతారు. అది జరుగుతుంది. ఇది కేవలం ఆ బాబా వల్లో, క్షేత్రం వల్లనో కాదనీ... వాటిపై రోగికి ఏర్పడిన విశ్వాసం అతనిలో రోగనిరోధక శక్తిని పెంచడమే దానికి కారణమనీ పెద్దలు చెబుతారు. విశ్వాసం, భక్తి, ప్రేమ వల్ల మనలో అంతర్గతమైన మార్పులు జరిగి... మేలు జరుగుతుందనే అభిప్రాయమూ ఉంది. ఆ విధంగా... అద్భుతాలు జరగడానికి విశ్వాసమే ఆలంబన అవుతుంది.

- రాచమడుగు శ్రీనివాసులు

సందేశం

దైవ ప్రసన్నత కోసం...

దైవ ప్రసన్నతను పొందే ఎన్నో మార్గాలను విశ్వాసులకు మహా ప్రవక్త మహమ్మద్ బోధించారు. నిత్య జీవితాలలో మానవులు మంచి పనులు ఆచరించడం ద్వారా మాత్రమే అల్లాహ్‌కు ప్రీతిపాత్రులవుతారని చెప్పేవారు.



ఒకరోజు ఆయనను ఒక వ్యక్తి కలిసి "మహా ప్రవక్తా! మనిషి ఆచరించే పనులన్నిటిలో దేవుడికి ఎక్కువ ఇష్టమైన ఆచరణ ఏది?" అని ప్రశ్నించాడు.

దానికి మహా ప్రవక్త బదులిస్తూ "నమాజ్ చేయడం దైవానికి అత్యంత ప్రీతిపాత్రమైన విషయం" అని చెప్పారు.

"నమాజ్ తరువాత దైవం ఎక్కువగా ఇష్టపడేది ఏవిటి?"

"తల్లితండ్రులకు సేవ చేయడం. వారికి ఏ కష్టం, బాధ కలుగకుండా చూసుకోవడం."

"ఆ తరువాత... ఏ కార్యాచరణ దేవుడికి ప్రీతి కలిగిస్తుంది?" అని అడిగాడు ఆ వ్యక్తి.

"దేవుని మార్గంలో పాటుపడడం" అని చెప్పారు మహా ప్రవక్త.

దైవ ప్రసన్నత పొందడం ఇస్లాంలో విశ్వాసుల అత్యున్నత లక్ష్యం. ఆ లక్ష్యసాధనకోసం క్రమబద్ధమైన జీవనాన్ని అలవరచుకోవాలి. నిత్యం క్రమం తప్పకుండా నిర్దేశిత సమయాల్లో నమాజ్ చేయాలి. జన్మను ఇచ్చిన తల్లితండ్రులు దైవసమానులు. వృద్ధాప్యంలో వారిని ఆప్యాయంగా చూసుకోవాలి. దైవం, ప్రవక్తలు చూపిన బాటలో పయనిస్తూ... తోటివారి ఆధ్యాత్మిక ఉన్నతికి దోహదపడాలి. ఇవన్నీ దేవునికి ఇష్టమైన విషయాలు. వీటిని ఆచరించేవారిపై అల్లాహ్ కారుణ్యాన్ని వర్షిస్తాడు.

ఎలా ఆడకూడదో చూపించారా?


ట్రోఫీతో కెప్టెన్లు రోహిత్-ఎల్గర్

అత్యంత వేగంగా ముగిసిన మ్యాచ్‌గా కేప్‌టౌన్ టెస్ట్ సరికొత్త రికార్డు సృష్టించింది. పేసర్లు రాజ్యమేలిన మ్యాచ్‌లో.. వికెట్లు టపటపా నేలరాలాయి. బ్యాటర్లు ఆడిన తీరుచూస్తే.. టెస్టుల్లో ఎలా ఆడకూడదో చూపించారనిపిస్తోంది. మ్యాచ్‌లో 33 వికెట్లు కూలినా ఒక్క ఎల్బీ కూడా లేదంటే.. పిచ్‌లోని అదనపు బౌన్స్ పెద్ద బ్రహ్మపదార్థమన్న విషయం అవగతమవుతోంది. ఇలాంటి వికెట్‌పై పాతుకు పోవాలంటే టెక్నికల్‌గా బలంగా ఉండడంతోపాటు క్రీజులో సహనం ప్రదర్శించాలి. అలాంటి ఆట టీమిండియా తొలి ఇన్నింగ్స్‌లో కోహ్లీలో మినహా.. ఏ ఒక్కరిలోనూ కనిపించ లేదు. విరాట్ కళాత్మక ఆటను ప్రదర్శించగా.. వైట్‌బాల్ క్రికెట్‌కు అలవాటుపడిన మిగతా వారు దూకుడుగా ఆడే క్రమంలో వికెట్లు పారేసుకొన్నారు. ఎక్కువగా బౌన్స్ అయ్యే బంతులను వదిలేసిన కోహ్లీ.. కొంచెం షార్ట్ పిచ్ అయినా షాట్లు ఆడాడు. పటిష్ట డిఫెన్స్‌తోపాటు అతడు కొట్టిన కొన్ని కవర్ డ్రైవ్‌లు ముచ్చటగొలిపాయి. కానీ, ఎవరూ కూడా అతడి ఆటను గమనించి.. ఆ విధంగా బ్యాటింగ్ చేయడానికి ప్రయత్నించకపోవడం బాధాకరం. రైజ్ అవుతున్న బంతిని ఎలా డిఫెన్స్ ఆడాలో తెలియక జైస్వాల్ అవుటయ్యాడు. శరీర బరువును వెనుక కాలి మీదకు వేగంగా మార్చకపోవడమనే బలహీనత గిల్ బ్యాటింగ్‌లో మరోసారి బహిర్గతమైంది. ఈ మ్యాచ్‌లో యువ ఆటగాళ్లు కనీసం డిఫెన్స్ ఆడే ప్రయత్నం కూడా చేయలేదు. ఐదు రోజుల టెస్ట్ మ్యాచ్ ఆడాలంటే నేటి తరం క్రికెటర్లు ఆటతోపాటు మైండ్‌సెట్‌ను కూడా మార్చుకోవాల్సిన అవసరం ఉంది.

(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)

'సెంచూరియన్ ఓటమితో మా లోపాలను సరిదిద్దుకున్నాం. ముఖ్యంగా బౌలింగ్‌లో అద్భుత ప్రదర్శన కనబరిచాం. అలాగే బ్యాటింగ్‌కు కష్టంగా మారిన పిచ్‌పై ఆధిక్యాన్నీ సాధించగలిగాం. సిరాజ్, బుమ్రా ఉత్తమ బౌలింగ్‌తో జట్టుకు గెలుపునందించారు. అలాగే దక్షిణాఫ్రికాలో ఆడడం ఎప్పుడూ సవాల్‌గానే ఉంటుంది'

- రోహిత్ శర్మ



రోజున్నరే..

పేసర్ల దన్నుతో భారత్ ఘనవిజయం

సఫారీల ఖేల్ ఖతం

దక్షిణాఫ్రికా గడ్డపై టీమిండియా అద్వితీయ ప్రదర్శనతో చరిత్ర సృష్టించింది. తొలి టెస్టులో ఇన్నింగ్స్ ఓటమికి ప్రతీకారంగా.. సఫారీల బాక్సులు బద్దలయ్యే రీతిలో అత్యంత వేగంగా టెస్టును ముగించింది. ఇక తొలి రోజు తరహాలోనే రెండో రోజూ వికెట్ల జాతర కొనసాగింది. ఈసారి బూమ్ బూమ్ బుమ్రా నిప్పులు చెరగడంతో ఆతిథ్య బ్యాటర్లు చకచకా పెవిలియన్‌కు చేరారు. దీంతో కేవలం 79 పరుగుల లక్ష్యాన్ని ఆడుతూ పాడుతూ ఛేదించిన రోహిత్ సేన కేప్‌టౌన్‌లో తొలిసారి విజయగర్వంతో సంబరాలు చేసుకుంది. అయితే ఇంతటి క్లిష్టమైన పిచ్‌పై ఓపెనర్ మార్‌క్రమ్ వీరోచిత శతకంతో అబ్బురపరచడం విశేషం.

● ఈసారి బుమ్రాకు ఆరు వికెట్లు ● మార్‌క్రమ్ అద్భుత శతకం వృథా

● 1-1తో సిరీస్ సమం ● దక్షిణాఫ్రికాతో ఆఖరి టెస్టు


బుమ్రా 13.5-0-61-6

కేప్‌టౌన్: దక్షిణాఫ్రికా పర్యటనను భారత జట్టు అదరగొట్టే రీతిలో ముగించింది. పూర్తిగా పేసర్లు రాజ్యమేలిన ఈ సంచలన రెండో టెస్టులో 7 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించడంతోపాటు, సిరీస్‌ను 1-1తో సమం చేసింది. కేవలం ఐదు సెషన్లలోపే మ్యాచ్ ముగియడం విశేషం. తొలి టెస్టులో భారత్.. ఇన్నింగ్స్ 32 రన్స్ తేడాతో ఓడిన విషయం తెలిసిందే. రెండో రోజు గురువారం పేసర్ బుమ్రా ఆరు వికెట్లతో చెలరేగి దక్షిణాఫ్రికా పతనాన్ని శాసించాడు. దీంతో ఆతిథ్య జట్టు 36.5 ఓవర్లలో 176 పరుగులకు ఆలౌటైంది. ఓపెనర్ మార్‌క్రమ్ (103 బంతుల్లో 17 ఫోర్లు, 2 సిక్సర్లతో 106) కెరీర్‌లోనే చిరస్మరణీయ శతకం సాధించగా.. మిగిలిన బ్యాటర్లలో ఎల్గర్ (12)ది మాత్రమే అత్యధిక స్కోరు. అనంతరం ఛేదనలో భారత్ 12 ఓవర్లలో 3 వికెట్లకు 80 పరుగులు సాధించి గెలిచింది. జైస్వాల్ (28), రోహిత్ (16 నాటౌట్) రాణించారు. రబాడ, బర్గర్, జాన్సెన్‌లకు ఒక్కో వికెట్ దక్కింది. దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్‌లో 55, భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 153 పరుగులు సాధించాయి. సిరాజ్‌కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' దక్కగా.. కెరీర్‌లో ఆఖరి టెస్టు ఆడిన ఎల్గర్-బుమ్రా సంయుక్తంగా ప్లేయర్ ఆఫ్ ద సిరీస్‌గా నిలిచారు.

అటు బుమ్రా, ఇటు మార్‌క్రమ్: 62/3 ఓవర్‌నైట్ స్కోరుతో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన ఆతిథ్య జట్టు తొలి సెషన్‌లోనే మిగతా ఏడు వికెట్లను కోల్పోయింది. పేసర్ బుమ్రా ఫుల్లర్, లెంగ్త్, షార్ట్ పిచ్ బంతులతో వణికిస్తూ కేవలం ఎనిమిది ఓవర్లలోనే నలుగురిని పెవిలియన్‌కు చేర్చాడు. ఆట ఆరంభం కాగానే బెడింగ్‌మ్ వికెట్ తీసిన బుమ్రా మరే బ్యాటర్‌ను కూడా కుదురుకోనీయలేదు. వరుసగా వికెట్లు తీస్తూ వెళ్లడంతో జట్టు 111/7 స్కోరుతో నిలిచింది. కానీ మరో ఎండ్‌లో మార్‌క్రమ్ మాత్రం ఏ బౌలర్‌నూ వదలకుండా చెలరేగాడు. ఎప్పుడో ముగియాల్సిన ఆట అతడి బ్యాటింగ్ కారణంగానే 78 పరుగుల ఆధిక్యం వరకు వెళ్లింది. వాస్తవానికి మార్‌క్రమ్ 73 పరుగుల వద్దే అవుట్ కావాల్సి ఉన్నా కీపర్ రాహుల్ క్యాచ్ అందుకోలేకపోయాడు. దీన్ని సద్వినియోగం చేసుకుంటూ ప్రసిద్ధ్ ఓవర్‌లో 4,6,6,4తో 20 రన్స్ రాబట్టాడు. ఆ వెంటనే బుమ్రా ఓవర్‌లో రెండు వరుస ఫోర్లతో 99 బంతుల్లోనే సూపర్ సెంచరీని పూర్తి చేశాడు. ఈ దశలో కెప్టెన్ రోహిత్ బంతిని సిరాజ్‌కు ఇచ్చి ఫలితం సాధించాడు. 32వ ఓవర్‌లో ఆఫ్ స్టంప్ వైపు వేసిన లెంగ్త్ బాల్‌ను మార్‌క్రమ్ పుల్ షాట్ ఆడాడు. అయితే బ్యాట్ ఎడ్జ్ తీసుకుని బంతి గాల్లోకి లేవగా లాంగాఫ్‌లో రోహిత్ సులువైన క్యాచ్ తీసుకున్నాడు. దీంతో భారత్ ఎదురు చూపులు ఫలించాయి. ఆ తర్వాత రబాడ (2)ను ప్రసిద్ధ్, ఎన్‌గిడిని బుమ్రా అవుట్ చేయంతో సఫారీల పోరాటం ముగిసింది.

జైస్వాల్ జోరు: ఛేదించాల్సింది స్వల్ప స్కోరే అయినా.. భారత్ రెండో ఇన్నింగ్స్ ధాటిగా సాగింది. ఉన్నది కాసేపే అయినా ఓపెనర్ జైస్వాల్ టీ20 ఆటతీరుతో చెలరేగాడు. తొలి ఓవర్‌లోనే రెండు ఫోర్లు బాదగా మొత్తంగా 23 బంతుల్లో 6 ఫోర్లతో 28 రన్స్ సాధించి ఆరో ఓవర్‌లో వెనుదిరిగాడు. అప్పటికే జట్టు 44 రన్స్ సాధించింది. గిల్ (10)ను రబాడ బౌల్డ్ చేశాడు. పదో ఓవర్‌లో రోహిత్, కోహ్లీ (12) చెరో ఫోర్ సాధించారు. రోహిత్ క్యాచ్‌ను జోర్జి వదిలేయగా.. విజయానికి నాలుగు పరుగుల దూరంలో కోహ్లీ వెనుదిరిగాడు. అయితే శ్రేయాస్ (4 నాటౌట్) చక్కటి ఫోర్‌తో మ్యాచ్‌ను ముగించాడు.

టెస్టు చరిత్రలో తొలిసారి

ఒకటిన్నర రోజుల్లోనే 33 వికెట్లు నేలకూలడంతో మొత్తంగా రెండో టెస్టు కేవలం 106.2 ఓవర్లలోనే ముగిసింది. అదీ కేవలం ఐదు సెషన్లలోనే కావడం మరో విశేషం. ఇక 642 బంతుల్లోనే టెస్టులో ఫలితం రావడం 147 ఏళ్ల టెస్టు చరిత్రలో ఇదే ప్రథమం. గతంలో 656 బంతుల్లో ఆసీస్-దక్షిణాఫ్రికా టెస్టు, 672 బంతుల్లో విండీస్-ఇంగ్లండ్ టెస్టు, 788 బంతుల్లో ఇంగ్లండ్-ఆసీస్ టెస్టు, 792 బంతుల్లో ఇంగ్లండ్-ఆసీస్ టెస్టుల ఫలితాలు వచ్చాయి.

1 కేప్‌టౌన్‌లో టెస్టు గెలిచిన తొలి ఆసియా జట్టుగా భారత్

దక్షిణాఫ్రికాపై ఎక్కువసార్లు (3) ఐదు వికెట్లు తీసిన భారత బౌలర్‌గా శ్రీనాథ్‌తో సమంగా నిలిచిన బుమ్రా.

2 ఆసియాకు అవల ఎక్కువసార్లు 5 వికెట్లు సాధించిన బౌలర్లలో చంద్రశేఖర్, కుంబ్లే, ఇషాంత్‌లతో కలిసి బుమ్రా (8 సార్లు) రెండో స్థానంలో ఉన్నాడు. కపిల్ (9 సార్లు) టాప్‌లో కొనసాగుతున్నాడు.

3 సఫారీ నేలపై అత్యధిక టెస్టు వికెట్లు (38) తీసిన మూడో భారత బౌలర్‌గా బుమ్రా. అనిల్ కుంబ్లే (45), శ్రీనాథ్ (43) ముందున్నారు.

స్కోరుబోర్డు

దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్: 55; భారత్ తొలి ఇన్నింగ్స్: 153; దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్: మార్‌క్రమ్ (సి) రోహిత్ (బి) సిరాజ్ 106; ఎల్గర్ (సి) కోహ్లీ (బి) ముకేష్ 12; జోర్జి (సి) రాహుల్ (బి) ముకేష్ 1; స్టబ్స్ (సి) రాహుల్ (బి) బుమ్రా 1; బెడింగమ్ (సి) రాహుల్ (బి) బుమ్రా 11; వెరీనె (సి) సిరాజ్ (బి) బుమ్రా 9; జాన్సెన్ (సి అండ్ బి) బుమ్రా 11; కేశవ్ (సి) శ్రేయాస్ (బి) బుమ్రా 3; రబాడ (సి) రోహిత్ (బి) ప్రసిద్ధ్ 2; బర్గర్ (నాటౌట్) 6; ఎన్‌గిడి (సి) జైస్వాల్ (బి) బుమ్రా 8; **ఎక్స్‌ట్రాలు: 6; మొత్తం: 36.5 ఓవర్లలో 176 ఆలౌట్. వికెట్ల పతనం:** 1-37, 2-41, 3-45, 4-66, 5-85, 6-103, 7-111, 8-162, 9-162, 10-176. **బౌలింగ్:** బుమ్రా 13.5-0-61-6; సిరాజ్ 9-3-31-1; ముకేష్ 10-2-56-2; ప్రసిద్ధ్ 4-1-27-1.

భారత్ రెండో ఇన్నింగ్స్: జైస్వాల్ (సి) స్టబ్స్ (బి) బర్గర్ 28; రోహిత్ (నాటౌట్) 16; గిల్ (బి) రబాడ 10; విరాట్ (సి) వెరీనె (బి) జాన్సెన్ 12; శ్రేయాస్ (నాటౌట్) 4; **ఎక్స్‌ట్రాలు: 10 ; మొత్తం: 12 ఓవర్లలో 80/3. వికెట్ల పతనం:** 1-44, 2-57, 3-75; **బౌలింగ్:** రబాడ 6-0-33-1; బర్గర్ 4-0-29-1; జాన్సెన్ 2-0-15-1.


మార్‌క్రమ్ (106)

మన ప్రదర్శన మెరుగయ్యేనా?

రా. 7.30 నుంచి స్పోర్ట్స్ 18, జియో సినిమాలో..

ఆసీస్ మహిళలతో నేడు తొలి టీ20


మంధాన

నవీ ముంబై: మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో భాగంగా శుక్రవారం జరిగే తొలి మ్యాచ్‌లో భారత్-ఆస్ట్రేలియా తలపడబోతున్నాయి. సొంత గడ్డపై ఆడుతున్నా భారత బ్యాటర్లు స్థాయికి తగ్గట్టు రాణించకపోవడం ఆందోళనకరం. దూకుడుగా ఆడడంలో బ్యాటర్లు తడబాటుకు లోనవుతుండగా..కెప్టెన్ హర్మన్‌ప్రీత్ ఫామ్‌లేమి తీవ్ర ప్రభావం చూపుతోంది. మరోవైపు భారత్‌కు పూర్తి భిన్నమైన రీతిలో ఆసీస్ అన్ని విభాగాల్లో అద్భుతంగా ఆడుతోంది.

● అరుణకు రజతం

భువనేశ్వర్: సీనియర్ ఆర్టిస్టిక్ జిమ్నాస్టిక్స్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ క్రీడాకారిణి అరుణారెడ్డి రజతం సాధించింది. అరుణ 11.867 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచింది. ప్రణతి దాస్ (రైల్వేస్) స్వర్ణం నెగ్గగా.. శతాక్షి (మహారాష్ట్ర) కాంస్యం దక్కించుకొంది.

● ప్రణవి హాఫ్ సెంచరీ

హైదరాబాద్ గెలుపు

న్యూఢిల్లీ: ప్రణవి చంద్ర (88 నాటౌట్) అజేయ అర్ధ శతకంతో.. సీనియర్ మహిళల వన్డే ట్రోఫీలో హైదరాబాద్ బోణీ చేసింది. గ్రూప్-డిలో గురువారం జరిగిన తమ తొలి మ్యాచ్‌లో హైదరాబాద్ 50 ఓవర్లలో 225/9 స్కోరు చేసింది. ధారా గుజ్జర్ 5 వికెట్లు పడగొట్టింది. ఛేదనలో బెంగాల్ 49.3 ఓవర్లలో 201 పరుగులకు ఆలౌటైంది.

● ఆస్ట్రేలియా 116/2

సిడ్నీ: ఆస్ట్రేలియా-పాకిస్థాన్ మధ్య మూడో టెస్ట్ రెండో రోజు ఆటకు వర్షం, వెలుతురు లేమి అడ్డంకిగా నిలిచాయి. దాంతో గురువారం 46 ఓవర్ల ఆటే సాధ్యమైంది. ఓవర్‌నైట్ 6/0 స్కోరుతో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన ఆసీస్‌జట్టు ఆట ఆపివేసే సరికి రెండు వికెట్లకు 116 పరుగులు చేసింది. ఖవాజా (47), వార్నర్ (34) అవుటయ్యారు. పాకిస్థాన్ మొదటి ఇన్నింగ్స్‌లో 313 పరుగులు చేసిన సంగతి తెలిసిందే.

నేటినుంచి రంజీ ట్రోఫీ

న్యూఢిల్లీ: దేశవాళీ టోర్నీ రంజీట్రోఫీకి రంగం సిద్ధమైంది. రెండు నెలలకు పైగా జరిగే ఈ టోర్నమెంట్‌కు శుక్రవారం తెరలేవనుంది. ఎలిట్, ప్లేట్ విభాగాలుగా జరిగే ఈ టోర్నీలో 38 జట్లు తలపడనున్నాయి. 35 ఏళ్ల వెటరన్లు రహానె, పుజార భారీ స్కోర్లు చేయడం ద్వారా సెలెక్టర్ల దృష్టిని ఆకర్షించాలని భావిస్తున్నారు. కాగా.. విశాఖలో బెంగాల్‌తో ఆంధ్ర, దిమాపూర్‌లో నాగాలాండ్‌తో హైదరాబాద్ తమ తొలి మ్యాచ్‌ల్లో తలపడతాయి.

స్టంపింగ్ రివ్యూ.. ఇక ఇలా

నిబంధనల్ని సవరించిన ఐసీసీ



దుబాయ్: స్టంపింగ్ నిబంధన దుర్వినియోగానికి అడ్డుకట్ట వేసేలా ఐసీసీ కీలక నిర్ణయం తీసుకొంది. ఇప్పటివరకు వికెట్ కీపర్ స్టంపౌట్‌కు అప్పీలు చేస్తే..ఫీల్డ్ అంపైర్ దాన్ని థర్డ్ అంపైర్‌కు రిఫర్ చేసేవాడు. థర్డ్ అంపైర్ తొలుత బ్యాటర్ క్యాచ్ అవుట్ అయ్యాడేమో పరిశీలించి, ఆ తర్వాత స్టంపౌట్‌ను కూడా చూసేవాడు. ఇక నుంచి అలా జరగదు. కొత్త నిబంధన ప్రకారం..వికెట్ కీపర్ స్టంపౌట్‌కు అప్పీలు చేస్తే థర్డ్ అంపైర్ కేవలం ఆ విజువల్స్‌ను మాత్రమే పరిశీలిస్తాడు. క్యాచ్ ద్వారా అవుటయ్యాడా లేదా అన్న విషయాన్ని చూడడు. ఒకవేళ క్యాచౌట్‌కు అప్పీలు చేయాలనుకొంటే ఫీల్డింగ్ టీమ్ ప్రత్యేకంగా డీఆర్‌ఎస్‌ను కోరాల్సి ఉంటుంది. గతనెల 12నుంచే ఈ నిబంధన అమల్లోకి వచ్చింది.

బిజినెస్

వివో నుంచి ప్రీమియం ఫోన్ ఎక్స్ 100



న్యూఢిల్లీ: స్మార్ట్ ఫోన్ల తయారీ సంస్థ వివో మార్కెట్లోకి ప్రీమియం విభాగంలో వివో ఎక్స్ 100 సిరీస్ హ్యాండ్‌సెట్లు విడుదల చేసింది. వీటి ధర రూ.63,999 నుంచి ప్రారంభమవుతుంది. ప్రీమియం ఫోన్ల విభాగంలో తమ స్థానం పటిష్ఠం చేసుకునే లక్ష్యంతో వీటిని మార్కెట్లోకి తెచ్చినట్టు వివో ప్రకటించింది. కస్టమర్లకు అద్భుతమైన ఫొటోగ్రఫీ అనుభూతిని కలిగించాలన్న తమ ప్రయత్నానికి ఈ ఎక్స్ సిరీస్ ఫోన్లు ఆలంబనగా నిలుస్తాయని కంపెనీ ప్రోడక్ట్ మేనేజ్‌మెంట్ హెడ్ వికాస్ తగ్రా తెలిపారు. టెలిఫొటో సన్‌షాట్ ఫీచర్ వీటి ప్రత్యేకత. ఈ ఫీచర్ కారణంగా సూర్యోదయం, సూర్యాస్తమయాలను ఇది అద్భుతంగా ఫొటో తీయగలుగుతుంది. వీటిలో ఎక్స్ 100 ప్రో హ్యాండ్‌సెట్ (16 జీబీ+512 జీబీ) ధర రూ.89,999 కాగా 12 జీబీ+256 జీబీ సామర్థ్యం గల ఎక్స్ 100 వేరియెంట్ ధర రూ.63,999. 16జీబీ+512 జీబీ సామర్థ్యం గల ఎక్స్ 100 వేరియెంట్ ధర రూ.69,999.

సరికొత్తగా.. బజాజ్ చేతక్

2 వేరియంట్లలో లభ్యం

ప్రారంభ ధర 1.15 లక్షలు



న్యూఢిల్లీ: దేశీయ వాహన కంపెనీ బజాజ్ ఆటో.. అప్‌డేటెడ్ చేతక్‌ను గురువారం మార్కెట్లోకి విడుదల చేసింది. 5 అంగుళాల టీఎఫ్‌టీ డిస్‌ప్లే స్ర్కీన్‌తో కూడిన ఈ ఎలక్ట్రిక్ స్కూటర్ రెండు (అర్బన్, ప్రీమియం) వేరియంట్లలో లభించనుంది. వీటి ధరలను రూ.1,15,001, రూ.1,35,463గా నిర్ణయించారు. ఇవి ఢిల్లీ ఎక్స్‌షోరూం ధరలు. 3.2 కిలోవాట్ బ్యాటరీతో కూడిన ఈ స్కూటర్.. పూర్తి చార్జింగ్‌తో 127 కిలోమీటర్ల వరకు ప్రయాణిస్తుంది. అంతేకాదు, గంటకు 73 కిలోమీటర్ల గరిష్ఠ వేగంతో దూసుకుపోతుందని కంపెనీ వెల్లడించింది. కాగా ఈ స్కూటర్ కొనుగోలుదారులకు కంపెనీ టెక్‌ప్యాక్‌ను ఆప్షనల్‌గా అందుబాటులోకి తెచ్చింది. టెక్‌ప్యాక్ ద్వారా టర్న్ బై టర్న్ నావిగేషన్, మ్యూజిక్, కాల్ కంట్రోల్స్, హిల్ హోల్డ్ మోడ్ వంటి ఫీచర్లను వినియోగించుకునే వీలుంటుంది. అంతేకాదు, సెల్ఫ్ క్యాన్సెలింగ్ టర్న్ ఇండికేటర్స్, ఎలక్ట్రానిక్ హ్యాండిల్ అండ్ స్టీరింగ్ లాక్స్, సీట్ స్విచెస్, హెల్మెట్ బాక్స్ ల్యాంప్, రివర్స్ గేర్ మోడ్ వంటి ఫీచర్లు కూడా ఈ స్కూటర్లో ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయి. బజాజ్ ఆటో ఇప్పటివరకు లక్షకు పైగా ఎలక్ట్రిక్ చేతక్‌లను మార్కెట్లో విక్రయించింది.

కోలుకుంటున్న కొలువుల మార్కెట్

ఈ ఏడాది 8.3% పెరగనున్న నియామకాలు



న్యూఢిల్లీ: జాబ్స్ మార్కెట్ గాడిన పడుతోంది. గత ఏడాది ఐదు శాతం తగ్గిన నియామకాలు ఈ సంవత్సరం 8.3 శాతం పెరగనున్నాయి. ఆన్‌లైన్ జాబ్స్ ప్లాట్‌ఫామ్ ఫౌండ్‌ఇట్ జరిపిన వార్షిక సర్వేలో ఈ విషయం తేలింది. గత ఏడాది డిసెంబరులో నియామకాలు అంతకు ముందు సంవత్సరంతో పోలిస్తే రెండు శాతం పెరిగాయి. ఇది సానుకూల అంశమని.. ఈ ఏడాది ఉద్యోగ మార్కెట్ బాగుంటుందనేందుకు సంకేతమని తెలిపింది.

ఈ రంగాల్లో ఎక్కువ అవకాశాలు

తయారీ, బ్యాంకింగ్, ఆర్థిక సేవలు, బీమా (బీఎఫ్ఎస్ఐ), ఆటోమోటివ్, రిటైల్, ట్రావెల్ అండ్ టూరిజం రంగాల్లో ఈ సంవత్సరం నియామకాల జోరు ఎక్కువగా ఉంటుందని ఫౌండ్‌ఇట్ సర్వే తెలిపింది. బీఎఫ్ఎస్ఐ విభాగంలో ఫైనాన్షియల్ అనాలిసిస్, రిస్క్ మేనేజ్‌మెంట్, కంప్లయెన్స్ రంగాల్లో నైపుణ్యాలు ఉన్న నిపుణులకు మంచి అవకాశాలు ఉన్నట్టు పేర్కొంది. ఐటీ రంగానికి వస్తే కృత్రిమ మేధ (ఏఐ), మెషిన్ లెర్నింగ్, డేటా సైన్స్ సైబర్ సెక్యూరిటీల్లో నైపుణ్యాలు ఉన్న వారికి ఈ సంవత్సరం కూడా తిరుగుండదని పేర్కొంది.

కలిసొచ్చే అంశాలు

ఏఐ కోసం చేస్తున్న పెట్టుబడులు, వృద్ధి రేటు కొనసాగించేందుకు కంపెనీలు అనుసరిస్తున్న విధానాలు, వ్యూహాత్మక మార్గదర్శకత్వం ఈ సంవత్సరం నియామకాలు పెంచనుంది. వీటికి తోడు కంపెనీలు సంప్రదాయ వ్యాపార విధానాలకు తోడు పర్యావరణ పరిరక్షణ విధానాలకు ప్రాధాన్యత ఇస్తున్నాయి. దీంతో ఈ రంగంలో నైపుణ్యాలు ఉన్న వారికీ ఉద్యోగ అవకాశాలు పెరగనున్నాయి. ఈ రంగాల్లో తగిన నైపుణ్యాలు ఉన్న నిపుణులు చాలినంత మంది లభించకపోతే, మంచి నైపుణ్యాలు ఉన్న నిపుణులను పార్ట్ టైమర్స్‌గా నియమించుకునేందుకూ కంపెనీలు వెనుకాడక పోవచ్చని తెలిపింది.

గత ఏడాది ట్రెండ్స్ ఎలా ఉన్నాయంటే..

2022తో పోలిస్తే 2023లో నియామకాలు తగ్గినా కొన్ని రంగాల్లో మాత్రం నియామకాలు పెరిగాయి. మారిటైమ్, షిప్పింగ్ రంగంలో 28%, రిటైల్, ట్రావెల్ అండ్ టూరిజం రంగాల్లో 25% నియామకాలు పెరిగాయి. డిజిటల్ మార్కెటింగ్, ఈ-కామర్స్ పుణ్యమాని అడ్వర్‌టైజింగ్, మార్కెట్ రీసెర్చి, పబ్లిక్ రిలేషన్స్ రంగంలోనూ నియామకాలు 18% పెరిగాయి. ఎన్‌జీఓలు, సోషల్ సర్వీస్ రంగాల్లోనూ 2022తో పోలిస్తే 2023లో నియామకాలు 12% జోరందుకున్నాయి.

ఐటీ రంగంలో ఢమాల్: అయితే అత్యధిక ఉద్యోగ అవకాశాలు కల్పించే ఐటీ, హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్ రంగాల్లో గత ఏడాది నియామకాలు 18% పడిపోయాయి. అమెరికా, యూరోపియన్ దేశాల్లో నెలకొన్న ఆర్థిక అనిశ్చితితో ఐటీ కంపెనీలు ముందు జాగ్రత్త పడటం, తగిన నైపుణ్యాలు ఉన్న నిపుణులు పెద్దగా దొరక్కపోవడం ఇందుకు ప్రధానకారణం. హెల్త్‌కేర్, ఫార్మా, బయోటెక్నాలజీ, బీఎఫ్ఎస్ఐ, తయారీ రంగాల్లోనూ గత ఏడాది నియామకాలు 8% నుంచి 12% తగ్గాయి.

రూ.3.24 లక్షల కోట్ల లాభం

- భారీగా పెరిగిన మార్కెట్ సంపద
- రెండ్రోజుల తర్వాత లాభాల్లోకి సూచీలు
- 491 పాయింట్లు బలపడిన సెన్సెక్స్

ముంబై: గత రెండు రోజులు నష్టాలు చవిచూసిన ప్రామాణిక ఈక్విటీ సూచీలు గురువారం మళ్లీ లాభాల్లోకి మళ్లాయి. రియల్టీ, పవర్, ఆర్థిక సేవల రంగ షేర్లలో కొనుగోళ్లు మార్కెట్ ర్యాలీకి దోహదపడ్డాయి. సెన్సెక్స్ 490.97 పాయింట్లు పెరిగి 71,847.57 వద్దకు చేరుకుంది. ఒక దశలో సూచీ 598 పాయింట్ల మేర ఎగబాకి 71,955 వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని నమోదు చేసింది. నిఫ్టీ విషయానికొస్తే, 141.25 పాయింట్ల లాభంతో 21,658.60 వద్ద ముగిసింది. సెన్సెక్స్‌లోని 30 లిస్టెడ్ కంపెనీల్లో 18 లాభపడ్డాయి. కాగా, ఈక్విటీ మదుపరుల సంపదగా పరిగణించే బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ ఒక్కరోజే రూ.3.24 లక్షల కోట్లు పెరిగి రూ.368.33 లక్షల కోట్లకు చేరుకుంది.

జ్యోతి సీఎన్‌సీ ఐపీఓ ధర శ్రేణి రూ.315-331: గుజరాత్‌కు చెందిన జ్యోతి సీఎన్‌సీ ఆటోమేషన్ తొలి పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీఓ) ఈ నెల 9న ప్రారంభమై 11న ముగియనుంది. ఈ ఇష్యూలో విక్రయించనున్న షేర్ల ధర శ్రేణిని కంపెనీ రూ.315-331గా నిర్ణయించింది. ఈ ఏడాదిలో ఐపీఓకు వస్తున్న తొలి కంపెనీ ఇదే.

ఒక్కరోజే వెండి రూ.1,900 డౌన్

రికార్డు గరిష్ఠాలకు చేరువైన బంగారం, వెండి మళ్లీ దిగివచ్చాయి. ఢిల్లీ బులియన్ మార్కెట్లో 10 గ్రాముల మేలిమి (24 క్యారెట్లు) బంగారం ధర గురువారం రూ.420 తగ్గి రూ.63,550కి పరిమితమైంది. కిలో వెండి ఏకంగా రూ.1,900 తగ్గి రూ.76,900 ధర పలికింది. అంతర్జాతీయంగా వీటి రేట్లు తగ్గడమే ఇందుకు కారణమని మార్కెట్ వర్గాలు పేర్కొన్నాయి. ఇంటర్నేషనల్ మార్కెట్లో ఔన్స్ (31.10 గ్రాములు) గోల్డ్ ఒక దశలో 2,042 డాలర్లు, సిల్వర్ 23.05 డాలర్లకు తగ్గాయి.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	63,380 ▼	58,100 ▼	78,000 ▼
ముంబై	62,774 ▼	57,501 ▼	71,779 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

4వ తేదీ		విజయవాడ	585
హైదరాబాద్	582	విశాఖపట్నం	625
5 జనవరి		వరంగల్	584
చిత్తూరు	608	డజను గుడ్లు రూ.72	
గోదావరి	585		

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	85	గోదావరి	89
వరంగల్	85	విజయవాడ	89
కరీంనగర్	85	గుంటూరు	85
మహబూబ్‌నగర్	85	ఒంగోలు	85
కర్నూలు	85	చిత్తూరు	85
విశాఖపట్నం	84		

సెబీ ఈడీగా తెలుగు వ్యక్తి జీఆర్ఎం రావు



న్యూఢిల్లీ: మార్కెట్ నియంత్రణ మండలి సెబీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఈడీ)గా గోవిందాయపల్లి రామ్మోహన్ రావు బాధ్యతలు స్వీకరించారు. ఆయనను మూడు సంవత్సరాల కాలానికి ఈడీగా సెబీ నియమించింది. ఆయన అసోసియేషన్ ఆఫ్ సర్టిఫైడ్ ఫ్రాడ్ ఎగ్జామినర్స్ (ఏసీఎఫ్ఈ) నుంచి సర్టిఫైడ్ ఫ్రాడ్ ఎగ్జామినర్ సర్టిఫికెట్ కలిగి ఉన్నారు. హైదరాబాద్‌లోని ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి ఇంజనీరింగ్, ఎంబీఏ డిగ్రీ పట్టాను అందుకున్న రామ్మోహన్ రావు.. ముంబై విశ్వవిద్యాలయంలో లా డిగ్రీని కూడా పూర్తి చేశారు. కాగా ఈడీ హోదాలో సెబీలో దర్యాప్తు, అంతర్గత తనిఖీ విభాగాలను ఆయన పర్యవేక్షిస్తారు. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా నియమితులు కావడానికి ముందు ఆయన సెబీ ఈస్టర్న్ రీజినల్ డైరెక్టర్‌గా ఉన్నారు. ఆ హోదాలో ఆయన తనిఖీలు, ఇన్వెస్టర్ సర్వీస్ కేంద్రాల ఏర్పాటు, ఇన్వెస్టర్ చైతన్యం, ఫిర్యాదుల పరిష్కారం వంటి విభిన్న శాఖలను నిర్వహించారు.

విమాన ప్రయాణికులకు స్వల్ప ఊరట

IndiGo

- ఎయిర్ టికెట్లపై ఇంధన చార్జీని ఉపసంహరించుకున్న ఇండిగో
- రూ.300 నుంచి రూ.1,000 వరకు తగ్గనున్న టికెట్ రేట్లు

న్యూఢిల్లీ: ప్రయాణికుల నుంచి వసూలు చేస్తున్న ఇంధన చార్జీని ఉపసంహరించుకుంటున్నట్లు దేశీయ విమానయాన సంస్థ ఇండిగో గురువారం ప్రకటించింది. దీంతో కొన్ని దూర ప్రాంత ప్రయాణ మార్గాల్లో విమాన చార్జీలు రూ.1,000 వరకు తగ్గనున్నాయి. 61.8 శాతం మార్కెట్ వాటాతో ఇండిగో దేశంలో అతిపెద్ద ఎయిర్‌లైన్స్‌గా కొనసాగుతోంది. విమాన ఇంధనం (ఏవియేషనల్ టర్బైన్ ఫ్యూయల్-ఏటీఎఫ్) ధరలు భారీగా పెరగడంతో గత ఏడాది అక్టోబరు 6 నుంచి ఇండిగో దేశీయ, అంతర్జాతీయ విమాన టికెట్లపై అదనంగా ఇంధన చార్జీ కూడా వసూలు చేయడం ప్రారంభించింది. ప్రయాణ దూరాన్ని బట్టి ఈ చార్జీని రూ.300 నుంచి రూ.1,000 వరకు వసూలు చేస్తూ వచ్చింది.

అయితే, ఈ నెల ఒకటి నుంచి కేంద్రం ఏటీఎఫ్ ధరలను కాస్త తగ్గించింది. ఈ నేపథ్యంలో ఇంధన చార్జీని ఉపసంహరించుకుంటున్నట్లు, ఈ నెల 4 (గురువారం) నుంచి ఇది అమల్లోకి వస్తుందని ఇండిగో వెల్లడించింది. కాగా, విమాన చార్జీలను నిర్ణయించే విషయంలో స్వీయ నియంత్రణ పాటించడంతో పాటు ప్రయాణికుల ప్రయోజనాలను కూడా దృష్టిలో పెట్టుకోవాలని పౌర విమానయాన మంత్రిత్వ శాఖ గత నెలలో ఎయిర్‌లైన్స్‌కు సూచించింది.

జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్‌కు రూ.800 కోట్ల నిధులు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): రుణాల రూపంలో జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ దాదాపు రూ.800 కోట్లు సమీకరించింది. అన్ సెక్యూర్డ్, లిస్టెడ్, నాన్ కన్వర్టబుల్ డిబెంచర్ల రూపంలో ఈ నిధులను సమీకరించింది. కంపెనీ జారీ చేసిన నాన్ కన్వర్టబుల్ డిబెంచర్లలో స్టాండర్డ్ చార్టర్డ్ బ్యాంక్, సింగపూర్ రూ.400 కోట్లు, క్రెడిట్ సొల్యూషన్ ఇండియా ట్రస్ట్ రూ.300 కోట్లు, ఆదిత్య బిర్లా స్పెషల్ రూ.100 కోట్లు పెట్టుబడులు పెట్టినట్లు సంబంధిత వర్గాల ద్వారా తెలుస్తోంది. ఈ బాండ్లపై కూపన్ రేటు 13.275% ఉంది. ఈ నిధులు కలిపితే.. నవంబరు నుంచి ఇప్పటి వరకూ జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్, జీఎంఆర్ గోవా ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్, జీఎంఆర్ విశాఖపట్నం ఎయిర్‌పోర్ట్స్ సంయుక్తంగా రూ.8,400 కోట్లు సమీకరించినట్లవుతుంది.

రూ.40 కోట్లతో హైదరాబాద్‌లో రెయిన్‌బో కొత్త ఆసుపత్రి

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్ హైదరాబాద్‌లో మరో ఆసుపత్రిని ప్రారంభించింది. రూ.40 కోట్ల ఏర్పాటు చేసిన కొత్త ఆసుపత్రిలో 60 పడకలు ఉంటాయని, దీంతో రెయిన్‌బో, దాని అనుబంధ కంపెనీల మొత్తం పడకల సామర్థ్యం 1,715 పడకల స్థాయికి చేరుతుందని కంపెనీ వెల్లడించింది. పబ్లిక్ ఇష్యూ ద్వారా సమీకరించిన నిధులతో హైదరాబాద్‌లోని హిమాయత్ నగర్‌లో ఈ కొత్త ఆసుపత్రిని ప్రారంభించారు. ఇది హైదరాబాద్‌లో రెయిన్‌బోకు 8వ ఆసుపత్రి. కాగా వచ్చే ఐదేళ్లలో హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, ఎన్‌సీఆర్, ఆంధ్రప్రదేశ్, తమిళనాడుల్లోని ద్వితీయ శ్రేణి నగరాల్లో మొత్తం 1,000 పడకలను అదనంగా సమకూర్చుకోవాలని రెయిన్‌బో భావిస్తోంది.

'మున్సిపల్' సమ్మె ఉధృతం

కడపలో ప్రభుత్వ దిష్టిబొమ్మకు శవయాత్ర

- అనంతలో మోకాళ్లపై నిలబడి అర్ధనగ్న ప్రదర్శన
- విశాఖలో కార్మికుడి ఆత్మహత్యాయత్నం

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

మున్సిపల్ కార్మికుల సమ్మె ఉధృతంగా మారుతోంది. డిమాండ్ల సాధన కోసం మున్సిపల్ ఇంజనీరింగ్, పారిశుధ్య కార్మికుల చేపట్టిన ఆందోళనలు గురువారం పదో రోజు కొనసాగాయి. ముఖ్యమంత్రి జగన్ సొంత జిల్లాలో కడప మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ఎదుట కార్మికులు కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలిపారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ప్రభుత్వ దిష్టిబొమ్మతో శవయాత్ర నిర్వహించారు. జమ్మలమడుగు, ప్రొద్దుటూరు, బద్వేలుల్లోనూ ఆందోళనలు కొనసాగాయి. అనంతపురంలో సీఐటీయూ, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఇంజనీరింగ్ కార్మికులతో కలసి యూనియన్ నాయకుడు నాగభూషణం అనంతపురానికి నీటి సరఫరా చేసే కొర్రకొల్లు డ్యామ్ వద్ద రెండు గంటల పాటు నీటి సరఫరాను నిలిపివేయించారు. వారిని కూడేరు పోలీసులు అడ్డుకున్నారు. అనంతపురంలో సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్, జిల్లా అధ్యక్షుడు చిరంజీవి ఆధ్వర్యంలో మోకాళ్లపై నిలబడి అర్ధనగ్న ప్రదర్శన చేశారు. తాడిపత్రిలో ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ప్రైవేటు ట్రాక్టర్లు, కార్మికులతో చెత్తను తరలించేందుకు యత్నించగా.. మున్సిపల్ కార్మికులు అడ్డుకున్నారు. వారిని పోలీసులు అరెస్టు చేశారు. శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరంలో మున్సిపల్ అధికారులు తాత్కాలిక కార్మికుల ద్వారా చెత్తను తరలిస్తుండగా కార్మికులు అడ్డుకున్నారు. జీవీఎంసీ పరిధిలోని పీఎం పాలెం కారు షెడ్ కూడలి వద్ద కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ పారిశుధ్య కార్మికులు నిరసన చేపట్టారు. అదే ప్రాంతంలో అధికారులు ప్రైవేటు వ్యక్తులతో చెత్త తరలించే పనులు చేపట్టారు. అది చూసి తమ సమ్మెను నిర్వీర్యం చెయ్యడానికి అధికారులు యత్నిస్తున్నారంటూ యాజ్ల చిన్న అనే కార్మికుడు పెట్రోల్ మీద పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకోబోయాడు. తోటి కార్మికులు అడ్డుకుని, నీళ్లు పోశారు. ఈ గందరగోళంలో చిన్నా అపస్మారక స్థితికి చేరుకోగా సమీపంలో ఉన్న ఆస్పత్రికి తరలించారు.



విజయవాడ ధర్నా చౌక్‌లో ధర్నా చేస్తున్న మునిసిపల్ కార్మికులు

జగన్‌ను నమ్మి మోసపోయాం

చెప్పులు పైకెత్తి చెంపలు వాయించుకున్న నిరుద్యోగులు

మెగా డీఎస్సీ ప్రకటించాలంటూ అవనిగడ్డలో రాస్తారోకో

అవనిగడ్డ, జనవరి 4: మెగా డీఎస్సీ కోసం డిమాండ్ చేస్తూ నిరుద్యోగులు రోడ్డెక్కారు. కృష్ణా జిల్లా అవనిగడ్డలో గురువారం గంటకుపైగా రాస్తారోకో చేపట్టారు. చెప్పులు పైకెత్తి, చెంపలు వాయించుకుంటూ సీఎం జగన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఏపీ నిరుద్యోగ జేఏసీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి అవనిగడ్డకు వచ్చి, ఇక్కడి డీఎస్సీ కోచింగ్ సెంటర్లలో శిక్షణ పొందుతున్న వందలాది మంది విద్యార్థులు పాల్గొన్నారు. 'పోయాం... మోసం' అని నినదిస్తూ వంతెన సెంటర్‌లో బైఠాయించారు. వెంటనే మెగా డీఎస్సీ వేయాలని ప్లకార్డులు ప్రదర్శించారు. రాస్తారోకో నిర్వహిస్తున్న విద్యార్థులను చెదరగొట్టేందుకు పోలీసు సిబ్బంది ప్రయత్నించారు. వారికి చేతులెత్తి మొక్కుతూ.. తమకు న్యాయం చేయాలంటూ నినాదాలు చేశారు. వారికి మద్దతుగా వచ్చిన టీడీపీ, జనసేన నేతలు, రాష్ట్ర నిరుద్యోగ జేఏసీ ముఖ్య నేతలు సర్దిచెప్పడంతో ఆందోళనను విరమించారు.



కృష్ణాజిల్లా అవనిగడ్డలో చెప్పులు పైకి లేపి నిరసన తెలుపుతున్న నిరుద్యోగులు

తడాఖా చూపిస్తాం!

జగన్ సర్కారుకు అంగన్వాడీల హెచ్చరిక

- నోటీసులకు బెదిరేది లేదని స్పష్టీకరణ
- జీవో ప్రతులను దహనం చేసి నిరసన
- రాష్ట్రవ్యాప్తంగా 24వ రోజు ఆందోళనలు

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

"అమ్మలా అదరించడమే కాదు.. ఆది పరాశక్తుల్లా మారి దుష్టశిక్షణ కూడా చేస్తాం" అంటూ రాష్ట్ర ప్రభుత్వానికి అంగన్వాడీలు తేల్చిచెప్పారు. నోటీసులు ఇస్తే బెదిరిపోమని, తమ తడాఖా చూపిస్తామని హెచ్చరించారు. ఇచ్చిన హామీలు నెరవేర్చకపోతే వచ్చే ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపుతామని, డిమాండ్లను పరిష్కరించే వరకూ సమ్మెను విరమించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా అంగన్వాడీలు చేపట్టిన ఆందోళనలు గురువారం 24వ రోజు కొనసాగాయి. "పోలేరమ్మ, బంగారమ్మ, పైడితల్లమ్మ, నూకాలమ్మా, అంకాలమ్మా.. మా మొర వినండి. ముఖ్యమంత్రి జగన్, మంత్రులు, అధికారులకు మంచి బుద్ధిని ప్రసాదించి మా సమస్యలు పరిష్కరించేలా చూడండమ్మా.." అంటూ విజయనగరం కలెక్టరేట్ వద్ద శిబిరంలో అంగన్వాడీలు వినూత్నంగా నిరసన తెలిపారు. అనంతపురం కలెక్టరేట్ వద్ద శిబిరంలో అంగన్వాడీల దుస్థితి, ప్రభుత్వం తీరుపై సోది చెబుతూ నిరసన తెలిపారు. ఈ నెల 6న అనంతపురం జిల్లా బుక్కరాయసముద్రంలో జరిగే కార్యక్రమానికి గవర్నర్ అబ్దుల్ నజీర్ వస్తున్నారు. ఈ నేపథ్యంలో కలెక్టరేట్ సమీపంలోని అంగన్వాడీల దీక్షా శిబిరం చుట్టూ పోలీసులు ఇనుప బారికేడ్లు ఏర్పాటు చేశారు. పోలీసుల తీరుపై అంగన్వాడీలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శింగనమల నియోజకవర్గ కేంద్రంలో అంగన్వాడీలు ఉరి వేసుకుని, శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరంలో మోకాళ్లపై నిలబడి గోవింద నామాలు చెబుతూ నిరసన తెలిపారు. నంద్యాల జిల్లా కేంద్రంలో ప్రభుత్వం అల్టిమేటం జారీ చేసిన జీవో ప్రతులను అంగన్వాడీలు దహనం చేశారు. వైసీపీ ప్రభుత్వానికి పట్టిన దెయ్యాన్ని వదిలిస్తామంటూ తిరుపతి జిల్లా నాయుడుపేటలో అంగన్వాడీ ఉద్యోగులు వేపాకులు పట్టుకుని చిందులు తొక్కుతూ వినూత్న రీతిలో నిరసన వ్యక్తం చేశారు. శుక్రవారం నుంచీ విధులకు హాజరు కావాలంటూ సీడీపీవోలు అందజేసిన నోటీసు ప్రతులను తిరుపతి, పిచ్చాటూరు, పుత్తూరుల్లో ఉద్యోగులు ఆందోళనా శిబిరాల ఎదుట తగులబెట్టారు. కోట మండల కేంద్రంలో అంగన్‌వాడీ ఉద్యోగుల రిలే దీక్షకు చిన్నారులు హాజరై మద్దతు ప్రకటించగా పిచ్చాటూరులో ఉద్యోగులు సోది చెబుతూ నిరసన తెలిపారు. ఏలూరు జిల్లా పెదపాడులో మోకాళ్లపై నిలబడ్డారు. పోలవరంలో జీవో ప్రతులను దహనం చేశారు. ముసునూరులో గంగిరెద్దుకు వినతిపత్రం ఇచ్చారు. ప్రకాశం జిల్లాలోని అన్ని ఐసీడీఎస్ ప్రాజెక్టుల కేంద్రాల్లో, ఒంగోలులోని ప్రకాశం భవనం ఎదుట అంగన్వాడీల ధర్నాలు కొనసాగాయి. మార్కాపురం, దర్శి, కనిగిరి, గిద్దలూరు, వైపాలెం, పొదిలి, కొండపిలలో కలెక్టర్ పంపిన నోటీసులను దహనం చేశారు. శ్రీకాకుళం అర్బన్ ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు ఒంటికాలిపై నిరసన తెలిపారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పశ్చిమగోదావరి జిల్లా పాలకోడేరులో జగన్ పేరును ముఖానికి మాస్క్ పెట్టుకొని ఓ కార్యకర్త బ్యాటింగ్ చేయగా.. అంగన్‌వాడీ పేరుతో మరో కార్యకర్త బౌలింగ్ చేసి జగన్‌ను క్లీన్ బౌల్డ్ చేశారు. విజయవాడ ధర్నాచౌక్‌లో ఆందోళన చేస్తున్న కార్మికులకు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి సీహెచ్ బాబూరావు మద్దతు పలికారు. ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఆసుల రంగనాయకులు మాట్లాడుతూ.. కార్మికులను నమ్మించి మోసం చేసిన జగన్‌ను గద్దె దించే వరకు ఆందోళనలు కొనసాగుతాయన్నారు. మైలవరంలో అంగన్వాడీలు రాస్తారోకో నిర్వహించారు. పార్వతీపురం మన్యం జిల్లా పాలకొండ తహసీల్దార్ కార్యాలయం ఎదుట, సీతానగరం, కురుపాంలో మోకాళ్లపై కూర్చొని, సాలూరులో ఒంటికాలిపై నిలబడి నిరసన తెలిపారు. కడప జిల్లా ప్రొద్దుటూరు, కొండాపురంలో పొర్లుదండాలు పెట్టి, బద్వేలులో కళ్లకు గంతలు కట్టుకున్నారు. పోరుమామిళ్లలో ఆటోలను తాళ్లతో లాగారు. బద్వేలు, అన్నమయ్య జిల్లాలో జీవో ప్రతులు దహనం చేశారు. తంబళ్లపల్లెలో వాటర్‌ట్యాంకు పైకి ఎక్కి నిరసన తెలిపారు.



అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లెలో వాటర్ ట్యాంకు ఎక్కిన అంగన్వాడీలు

9లోగా సమస్యలు పరిష్కరించాలి: సీఐటీయూ

చట్ట ప్రకారం సమ్మె చేస్తున్న అంగన్వాడీలను తొలగించే అధికారం ప్రభుత్వానికి లేదని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరసింగరావు స్పష్టం చేశారు. గురువారం నెల్లూరులో అంగన్వాడీలనుద్దేశించి మాట్లాడారు. సమ్మె విరమించకుంటే అందరినీ డిస్మిస్ చేస్తామని రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రటరీ చెప్పారని, ఆ కాగితాలు నాలుక గీసుకోవడానికి కూడా పనికిరావని ఎద్దేవా చేశారు. బెదిరింపులు మాని సామరస్యంగా చర్చలు జరపాలని సూచించారు. లేకుంటే ఈ నెల 9న అన్ని కార్మిక సంఘాలు, వివిధ యూనియన్లతో పెద్ద ఎత్తున తరలివచ్చి అంగన్వాడీలకు మద్దతుగా నిలుస్తామని హెచ్చరించారు.

కేజీబీవీ టీచర్లను తీసేయండి

- సమ్మెలో ఉంటే తొలగించాలని ఆదేశాలు
- జగన్ ప్రభుత్వ సంచలన నిర్ణయం

అమరావతి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల (కేజీబీవీ) ఉపాధ్యాయినిలపై జగన్ ప్రభుత్వం కన్నెర్ర చేసింది. సమ్మెకు దిగిన వారిని విధుల నుంచి తొలగించాలని సంచలన నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ఆదేశాలు జారీచేసినట్లు సమగ్ర శిక్ష ప్రాజెక్టు అధికారులు వెల్లడించారు. కేజీబీవీ టీచర్లను వెంటనే విధుల్లో చేరాలని సూచించాలని, చేరని వారిని పూర్తిగా విధుల నుంచి తొలగించాలని జిల్లాల అధికారులకు సమగ్ర శిక్ష కార్యాలయం నుంచి ఆదేశాలు జారీ అయ్యాయి. క్షేత్రస్థాయిలో ఈ ఆదేశాలు అమలుచేస్తే ఒకేసారి దాదాపు వెయ్యి మంది టీచర్లు ఉద్యోగాలు కోల్పోయే ప్రమాదం ఏర్పడింది. ఒకట్రెండు రోజుల్లో తొలగింపు ఉత్తర్వులు జారీ చేసేందుకు జిల్లాల్లో అధికారులు సన్నద్ధమవుతున్నారు. అయితే ప్రభుత్వం ఎన్ని బెదిరింపులకు దిగినా సమ్మె విరమించేది లేదని సమగ్రశిక్ష ఉద్యోగుల జేఏసీ ప్రకటించింది. కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించాలనే డిమాండ్‌తో శుక్రవారం చలో విజయవాడ కార్యక్రమాన్ని నిర్వహించాలని జేఏసీ నిర్ణయించింది. విజయవాడలోని సమగ్రశిక్ష కార్యాలయాన్ని ముట్టడిస్తామని జేఏసీ చైర్మన్ కాంతారావు తెలిపారు. సమగ్రశిక్ష ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని, లేనిపక్షంలో మినిమం టైమ్ స్కేలయినా అమలుకు డిమాండ్ చేస్తూ సమగ్ర శిక్ష ఉద్యోగులు డిసెంబరు 20 నుంచి సమ్మెలోకి వెళ్లారు. వారితోపాటు కేజీబీవీ టీచర్లు కూడా సమ్మెకు దిగారు. అయితే బోధనేతర సిబ్బందిని సీరియస్‌గా తీసుకోని ప్రభుత్వం కేజీబీవీ టీచర్లపై మాత్రం బెదిరింపులకు దిగుతోంది. డిసెంబరు చివరి వారంలోనే వారికి షోకాజ్ నోటీసులు జారీచేసింది. అనధికారికంగా విధులకు దూరమైనందున వెంటనే వివరణ ఇవ్వాలని, లేనిపక్షంలో విధుల నుంచి తొలగిస్తామని స్పష్టంచేసింది.

వారిని తొలగించి కొత్తవారిని తీసుకోండి..

రాష్ట్రవ్యాప్తంగా కేజీబీవీల్లో 4,594 మంది ప్రిన్సిపాళ్లు, టీచర్లు, పీఈటీలుగా పనిచేస్తున్నారు. వారిలో 1,555 మంది కొత్తగా భర్తీ అయ్యారు. అంతకముందు నుంచి పనిచేస్తున్న 3,039 మందిలో ప్రిన్సిపాళ్లు మినహా అందరూ సమ్మెకు దిగినట్లు ఉద్యోగ నాయకులు చెబుతున్నారు. కానీ ప్రభుత్వ ఒత్తిళ్లు, బెదిరింపులతో కొందరు ఉద్యోగులు తిరిగి విధుల్లోకి చేరినట్లు తెలిసింది. ఇప్పటికీ సమ్మె కొనసాగిస్తున్న వారిని తొలగించాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. వారి స్థానంలో కొత్తవారిని తీసుకోవాలని సూచించారు. ఇటీవల ఉద్యోగాల భర్తీలో మెరిట్ జాబితాలో తర్వాతి స్థానాల్లో ఉన్న వారిని విధుల్లోకి తీసుకోవాలని స్పష్టంచేశారు. కాగా, 2 నెలల్లో పబ్లిక్ పరీక్షలున్న సమయంలో కేజీబీవీ టీచర్లు సమ్మెకు దిగడం సరికాదని సమగ్రశిక్ష ఎస్పీడీ బి.శ్రీనివాసరావు అన్నారు. ఉద్యోగుల జేఏసీ సమ్మెను కొనసాగిస్తుంటే కేజీబీవీ టీచర్ల సంఘం మాత్రం తాత్కాలికంగా విరమిస్తున్నట్లు ప్రకటించింది. సమ్మె విరమిస్తే ఎంటీఎస్ అమలుచేస్తామని ప్రభుత్వ పెద్దలు హామీ ఇచ్చారని, దీంతో తాత్కాలికంగా విరమిస్తున్నామని సంఘం అధ్యక్షురాలు ఎస్‌బీఎస్ దేవి తెలిపారు.



నరసాపురంలో వీధులు ఊడుస్తున్న సచివాలయ శానిటరీ కార్యదర్శులు

రోడ్లు ఊడ్చిన సచివాలయ సిబ్బంది!

నరసాపురం, జనవరి 4: పశ్చిమగోదావరి జిల్లా నరసాపురంలో సచివాలయ శానిటరీకార్యదర్శులు పారిశుధ్య కార్మికుల అవతారం ఎత్తారు. సమస్యల పరిష్కారం కోసం మున్సిపల్ కార్మికులు సమ్మె చేస్తుంటే గురువారం ఉదయం వీరు రోడ్లు ఊడ్చిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. రహదారులపై చెత్త వేయకుండా వ్యాపారుల్లో అవగాహన కల్పించేందుకు శానిటరీ మేస్త్రీలు, సచివాలయ శానిటరీ కార్యదర్శులతో కలసి తాను కూడా చీపురుపట్టి ఊడ్చానని మున్సిపల్ కమిషనర్ డాక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. కేవలం స్వచ్ఛభారత్ మాత్రమే చేపట్టామని పేర్కొన్నారు.

కొత్త సమర్థులు కావలెను!

- వైసీపీ అభ్యర్థుల ఎంపికకు తాడేపల్లిలో కసరత్తు

అమరావతి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): అధికార పక్షం వైసీపీ రాబోయే ఎన్నికల్లో పోటీకి సమర్థులైన కొత్త అభ్యర్థులను అన్వేషిస్తోంది. రెండు విడతలుగా ఇప్పటికే 35 మంది అసెంబ్లీ ఇన్‌చార్జులను, ముగ్గురు లోక్‌సభ ఇన్‌చార్జులను నియమించగా.. ఇంకా 140 అసెంబ్లీ, 22 లోక్‌సభ స్థానాలపై కసరత్తు చేస్తోంది. విజయసాయిరెడ్డి, వైవీ సుబ్బారెడ్డి, అయోధ్యరామిరెడ్డి, వేమిరెడ్డి ప్రభాకరరెడ్డితో పాటు మంత్రి బొత్స సత్యనారాయణ, సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి 25రోజులుగా ఈ పనిలో బిజీగా ఉన్నారు. దాదాపు రోజూ సీఎం జగన్ వారితో సమీక్షలు నిర్వహిస్తున్నారు. దాదాపు 92మంది ఎమ్మెల్యేలపై ప్రజా వ్యతిరేకత నెలకొందని.. వారిస్థానంలో కొత్తవారిని నియమించి ఎన్నికల్లో గెలవాలని జగన్ భావిస్తున్నారు. కానీ అంతమంది సమర్థులు దొరకడం లేదని వైసీపీ వర్గాలు చెబుతున్నాయి. లోక్‌సభ అభ్యర్థులకు తీవ్ర కొరత ఉంది. అరకు ఎంపీ మాధవి స్థానంలో పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మిని ఇన్‌చార్జిగా నియమించారు. గోరంట్ల మాధవ్ స్థానంలో బళ్లారి బీజేపీనేత శ్రీరాములు సోదరి శాంతను తీసుకొచ్చారు. తలారి రంగయ్యను కల్యాణదుర్గం ఇన్‌చార్జిగా నియమించారు. వంగా గీతను పిఠాపురం, మార్గాని భరత్‌ను రాజమండ్రి సిటీ ఇన్‌చార్జులుగా నియమించారు. మిగతా స్థానాల్లో పోటీకి ఆర్థిక బలం ఉన్న అభ్యర్థులు దొరకడం లేదంటున్నారు. అసెంబ్లీలో ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరు ప్రసాదరాజు, కనిగిరి ఎమ్మెల్యే బుర్రా మధుసూదన యాదవ్ గురువారం క్యాంపు కార్యాలయానికి వచ్చి ధనుంజయరెడ్డి, సజ్జల రామకృష్ణారెడ్డితో భేటీ అయ్యారు. జగన్ లేని సమయంలో వీరిద్దరూ రావడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది.

టీడీపీ అభ్యర్థులపై కసరత్తు ముమ్మరం!

వడపోత పనిలో చంద్రబాబు

నెలాఖరుకల్లా 90 మందిపై స్పష్టత!

అమరావతి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తుండడంతో ప్రధాన ప్రతిపక్షం టీడీపీ తన అభ్యర్థుల ఎంపిక కసరత్తు ముమ్మరం చేసింది. పార్టీ అధినేత చంద్రబాబు కొన్ని రోజులుగా ఈ క్రతువులో నిమగ్నమయ్యారు. వివిధ నియోజకవర్గాల్లో రాజకీయ పరిస్థితులు, ప్రతిపాదనలో ఉన్న అభ్యర్థుల బలాబలాలకు సంబంధించి తెప్పించుకున్న నాలుగైదు రకాల నివేదికలను ఆయన వడబోస్తున్నారు. ఏదో ఒక నివేదికపై ఆధారపడకుండా రకరకాల మార్గాల ద్వారా సమాచారాన్ని ఆయన సేకరిస్తున్నారు. టీడీపీకి ఎన్నికల వ్యూహకర్తగా వ్యవహరిస్తున్న రాబిన్ శర్మ బృందం కొన్ని ప్రతిపాదనలు అందజేస్తోంది. నాలుగైదు జిల్లాలకు కలిపి నియమించిన జోనల్ సమన్వయకర్తలు కొంత సమాచారం ఇస్తున్నారు. ఇవిగాక పార్టీ సీనియర్ల నుంచి కొన్ని ప్రతిపాదనలు అందుతున్నాయి. వీటితోపాటు రెండు మూడు రకాల ప్రైవేటు సంస్థలను నియమించి వాటి ద్వారా కూడా సమాచార సేకరణ జరుపుతున్నారు. 70-80 నియోజకవర్గాల్లో అభ్యర్థులపై అధినాయకత్వం ఇప్పటికే ఒక అవగాహనకు వచ్చింది. సామాజిక సమీకరణాలు, రాజకీయ బలాబలాలు, ప్రజల్లో వారిపై ఉన్న ఆదరాభిమానాలను మరోసారి బేరీజు వేసుకుని చూసుకుంటోంది. అధికార పార్టీ అభ్యర్థుల విషయంలో చేస్తున్న మార్పుచేర్పులను కూడా గమనిస్తోంది. ఉదాహరణకు.. ఉమ్మడి గుంటూరు జిల్లాలో చిలకలూరిపేట, వేమూరు నియోజకవర్గాల్లో మంత్రులు విడదల రజని, మేరుగ నాగార్జునలను గుంటూరు పశ్చిమ, సంతనూతలపాడుకు మార్చి.. ఇక్కడ కొత్త అభ్యర్థులను వైసీపీ నిలుపుతోంది. టీడీపీకి ఈ రెండు నియోజకవర్గాల్లో మాజీ మంత్రులు ప్రత్తిపాటి పుల్లారావు, నక్కా ఆనందబాబు ఇన్‌చార్జులుగా ఉన్నారు. వైసీపీ కొత్త అభ్యర్థులతో పోలిస్తే వీరిద్దరూ బలంగా ఉన్నారని టీడీపీ నాయకత్వం అభిప్రాయపడుతోంది. ఇదే మాదిరిగా అన్ని నియోజకవర్గాలపై పరిశీలన జరుపుతోంది. అయితే అభ్యర్థులను వెంటనే ఖరారు చేయకుండా ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. ఐవీఆర్ఎస్ విధానం పేరిట ఫోన్ సర్వేలు చేసే పద్ధతి టీడీపీలో ఎప్పటి నుంచో అమల్లో ఉంది. ఈసారి కూడా ఇదే అమలు చేస్తోంది. ఫోన్ సర్వేలు రెండు రకాలుగా చేస్తున్నారు. పార్టీ సభ్యులు, నాయకుల నుంచి విడిగా.. సాధారణ ప్రజల నుంచి వేరుగా అభిప్రాయాలు తీసుకుంటున్నారు. కొద్ది రోజుల్లో 20-25 నియోజకవర్గాల్లో సర్వేకు సన్నాహాలు చేస్తున్నారు. మదనపల్లె వంటి నియోజకవర్గాల్లో ఇప్పటికే సర్వే చేశారు. ఒక్కో నియోజకవర్గం నుంచి రెండు మూడు పేర్లు పెట్టి వీరిలో ఎవరికి ఎక్కువ మద్దతు ఉందో చూస్తున్నారు. ఈ సర్వే ఫలితాలు నేరుగా చంద్రబాబుకు మాత్రమే అందుతున్నాయి. దీంతో వీటిపై టీడీపీ వర్గాల్లో ఉత్కంఠ వ్యక్తమవుతోంది.

అభ్యర్థులకు స్పష్టత!

80-90 నియోజకవర్గాల్లో తాము ఎంపిక చేసిన అభ్యర్థులకు ఈ నెలాఖరు నాటికి అంతర్గతంగానైనా స్పష్టత ఇవ్వాలని టీడీపీ నాయకత్వం భావిస్తోంది. ఎన్నికల షెడ్యూల్ వెలువడిన తర్వాతే పేర్లు అధికారికంగా ప్రకటించాలని నిర్ణయించింది. పొత్తు ప్రతిపాదనలో ఉన్న నియోజకవర్గాలను అధికారిక ప్రకటనలో ఆపి కొంత ఆలస్యంగా ప్రకటించే అవకాశం ఉంది. ఫిబ్రవరి మధ్యలో ఎన్నికల షెడ్యూల్ వెలువడే అవకాశం ఉందని వార్తలు వస్తున్నాయి.

ఆశావహుల సందడి

అభ్యర్థుల ఎంపికకు కసరత్తు జరుగుతుండడంతో టీడీపీ కేంద్ర కార్యాలయంలో నేతల సందడి పెరిగింది. ఆశావహులు, వారి అనుచరులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి చంద్రబాబు దృష్టిలో పడే ప్రయత్నం చేస్తున్నారు. రాయచోటి నియోజకవర్గానికి చెందిన వైసీపీ నేత, మాజీ ఎమ్మెల్యే ద్వారకానాథరెడ్డితోపాటు టికెట్ ఆశిస్తున్న రాంప్రసాద్‌రెడ్డి అనే నేత తన సహచరులతో చంద్రబాబును కలిశారు. అదే నియోజకవర్గానికి చెందిన మాజీ ఎమ్మెల్యే రమేశ్‌కుమార్‌రెడ్డి తన సహచరులతో తరలివచ్చారు. నరసరావుపేట నుంచి నల్లపాటి రాము అనుచరవర్గం వచ్చింది. జయహో బీసీ సదస్సుకు హాజరైన ఇంకొందరు నేతలు చంద్రబాబుకు తమ వినతులు విన్నవించారు. తంబళ్లపల్లె మాజీ ఎమ్మెల్యే శంకర్ యాదవ్ తనకు మరోసారి అవకాశం ఇవ్వాలని సదస్సు వేదికపైనే అభ్యర్థించారు. పెనుకొండ టికెట్ ఆశిస్తున్న సబిత, చిత్తూరు ఆశిస్తున్న నాజర్, గుంతకల్ రేసులో ఉన్న మాజీ ఎమ్మెల్యే జితేందర్ గౌడ్‌తో పాటు, మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరి, ప్రొద్దుటూరు టికెట్ ఆశిస్తున్న మాజీ ఎమ్మెల్యే లింగారెడ్డి కూడా ఉన్నారు.



విజయవాడలోని పంచాయతీరాజ్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు

ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ల ధర్నా

- కమిషనరేట్ వద్ద వందలాది మంది బైఠాయింపు
- జగన్ ఇచ్చిన హామీలు నెరవేర్చాలని నినాదాలు
- జీతాల పెంపుదల, ఉద్యోగ భద్రతకు డిమాండ్
- ప్రభుత్వంతో సంప్రదిస్తామన్న కమిషనర్

అమరావతి, జనవరి 4(ఆంధ్రజ్యోతి): జీతాలు పెంచాలని డిమాండ్ చేస్తూ ఉపాధి హామీ పథకంలో పనిచేసే వందలాది మంది ఫీల్డ్ అసిస్టెంట్లు గురువారం తాడేపల్లి పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ కమిషనర్ కార్యాలయానికి తరలివచ్చారు. ఏపీ గ్రామీణ ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ల యూనియన్ గౌరవాధ్యక్షుడు కె.ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో కమిషనరేట్ వద్ద బైఠాయించి తమ డిమాండ్లు పరిష్కరించాలని నినాదాలు చేశారు. ప్రభుత్వం ఎప్పటినుంచో జీతాలు పెంచుతామని చెబుతున్నా కార్యరూపం దాల్చలేదని ఆందోళన వ్యక్తం చేశారు. కమిషనర్ సూర్యకుమారిని ఉమామహేశ్వరరావు కలిసి తమ సమస్యలపై చర్చించారు. రాష్ట్ర ప్రభుత్వంతో చర్చించి జీతాలు పెరిగేట్లు చూస్తామని కమిషనర్ చెప్పారు. అర్హులకు పదోన్నతులు, నష్టదాయకంగా ఉన్న మ్యాన్ డేస్ విధానాన్ని సవరిస్తామని, ఫీల్డ్ అసిస్టెంట్లకు కూడా ఎఫ్‌టీఈ అమలు చేస్తామని తెలిపారు. పట్టణాల్లో కలిసిపోయిన గ్రామాలకు చెందిన ఫీల్డ్ అసిస్టెంట్లకు శిక్షణ ఇచ్చి ప్రత్యామ్నాయ ఉపాధి కల్పిస్తామని, ప్రమాదంలో చనిపోయినవారి కుటుంబాలకు ఉద్యోగం కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం అంగీకరించిన హామీలన్నీ సంక్రాంతిలోగా పరిష్కరించాలని, లేకుంటే 18న ఫీల్డ్ అసిస్టెంట్లందరూ సమ్మెబాట పడతారని ఉమామహేశ్వరరావు స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలో ఉపాధి హామీ పథకం తమ ఆధ్వర్యంలో నడుస్తోందని, తమ డిమాండ్లను ప్రభుత్వం పట్టించుకోకపోతే రాష్ట్ర వ్యాప్తంగా పనులు నిలిపేస్తామని ఫీల్డ్ అసిస్టెంట్ల రాష్ట్ర యూనియన్ అధ్యక్షుడు పరంధామయ్య హెచ్చరించారు.

జగన్‌ను ఓడించడానికి జనం సిద్ధం

- షర్మిల చేరిక సంతోషదాయకం: ఏపీ ఇన్‌చార్జి ఠాగూర్ స్పష్టీకరణ
- షర్మిలతో కలిసి పనిచేస్తాం: రుద్రరాజు

న్యూఢిల్లీ, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రజలు రానున్న ఎన్నికల్లో సీఎం జగన్మోహన్‌రెడ్డిని ఓడించడానికి సిద్ధంగా ఉన్నారని రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్యం ఠాగూర్ అన్నారు. వైసీపీ మైదానం ఖాళీ అవుతోందని.. జగన్‌లో ఓటమి భయం స్పష్టంగా కనపడుతోందని చెప్పారు. జగన్ చెల్లెలు, మాజీ సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కుమార్తె షర్మిల గురువారమిక్కడ కాంగ్రెస్‌లో చేరిన సందర్భంగా ఆయన ఏఐసీసీ ప్రధాన కార్యాలయం వద్ద విలేకరులతో మాట్లాడారు. షర్మిల చేరికపై హర్షం వ్యక్తం చేశారు. రాజశేఖర్‌రెడ్డి కాంగ్రెస్ కుటుంబ సభ్యుడని స్పష్టం చేశారు. వచ్చే ఎన్నికల్లో ఆయన పేరును ఉపయోగించుకుంటామని చెప్పారు. ఏపీలో ఇండియా కూటమిలో ఉన్న పార్టీలతో పొత్తు ఉంటుందన్నారు. షర్మిలకు ఎలాంటి బాధ్యతలు ఇవ్వాలనేది ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే నిర్ణయం తీసుకుంటారని అన్నారు. ఎన్డీఏలో రెండు కూటమిలు ఉన్నాయని, ఆంధ్రలో ఉన్న రెండు రాజకీయ పార్టీలు నకిలీ ఎన్డీఏలో ఉన్నాయని ఠాగూర్ విమర్శించారు. జగన్, మోదీ వైఫల్యాలను రాష్ట్ర ప్రజల్లోకి తీసుకెళ్తామన్నారు. కాగా.. షర్మిల రాకను స్వాగతిస్తున్నామని పీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు చెప్పారు. రాష్ట్రంలో కాంగ్రెస్ బలోపేతానికి ఆమెతో కలిసి టీంలాగా పనిచేస్తామన్నారు. తమకు పదవులు ముఖ్యం కాదని.. కాంగ్రెస్ అధిష్ఠానం ఏ నిర్ణయం తీసుకున్నా దానికి కట్టుబడి నిబద్ధత కలిగిన కార్యకర్తగా పార్టీ కోసం పనిచేస్తానని తెలిపారు. జగన్‌ను, కేంద్రంలో బీజేపీని ఓడించడమే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. రాబోయే రోజుల్లో పలువురు మాజీ ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరతారని చెప్పారు.


కాంగ్రెస్‌లోకి షర్మిల

(మొదటి పేజీ తరువాయి)

సంతోషంగా విలీనం చేస్తున్నట్లు ప్రకటించారు. ఇక నుంచి ఆ పార్టీ వేరు కాదని.. కాంగ్రెస్‌లో అంతర్భాగమని స్పష్టం చేశారు. తన తండ్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జీవితమంతా కాంగ్రెస్ కోసమే పనిచేశారని, కాంగ్రెస్ సేవలోనే మరణించారని, తన జీవితాన్ని పార్టీ కోసమే బలిచేశారని చెప్పారు. ఆయన కూతురుగా ఆయన అడుగుజాడల్లో నడుస్తున్నానని తెలిపారు. ఇవాళ ఆయన బిడ్డ కాంగ్రెస్‌లో చేరుతున్నందుకు ఆయన ఎక్కడున్నా సంతోషిస్తారని, గర్వపడతారని అన్నారు. అనంతరం షర్మిల 10-జన్‌పథ్‌కు వెళ్లి కాంగ్రెస్ అగ్ర నాయకురాలు సోనియాగాంధీని కలుసుకున్నారు.

అండమాన్‌లో పనిచేయాలన్నా..

కాంగ్రెస్ తనకు ఏ బాధ్యతలు అప్పగించినా విధేయతతో, నిజాయితీగా నిర్వహిస్తానని, అండమాన్‌లో పనిచేయమన్నా మనస్ఫూర్తిగా పనిచేస్తానని షర్మిల విలేకరులకు చెప్పారు. రాహుల్‌గాంధీని ప్రధానిగా చూడాలని తన తండ్రి కల గన్నారని, దానిని నెరవేర్చేందుకు కృషి చేస్తానని తెలిపారు ఏ బాధ్యతలు అప్పజెబుతారన్నది ఒకట్రెండు రోజుల్లో తెలుస్తుందన్నారు. వచ్చే ఎన్నికల్లో పోటీ చేస్తారా అని అడుగగా.. పార్టీ ఎక్కడ పోటీ చేయమంటే అక్కడ చేస్తానని బదులిచ్చారు. 'కాంగ్రెస్ దేశంలో అతి పెద్ద లౌకిక పార్టీ. అది దేశ సంస్కృతిని కాపాడింది. ఈ దేశ పునాదిని నిర్మించింది కాంగ్రెస్ పార్టీయే. దేశంలో అన్ని వర్గాలకు సేవలందించింది. రాహుల్ భారత్ జోడో యాత్ర ద్వారా భారత ప్రజల విశ్వాసాన్ని చూరగొన్నారు. ఆయన వల్లే కర్ణాటకలో కాంగ్రెస్ విజయం సాధించింది. తెలంగాణలో కూడా గెలవడం ఖాయమని తెలిసి.. కేసీఆర్ వ్యతిరేక ఓట్లు చీలకుండా ఉండేందుకు కాంగ్రెస్ కు మద్దతిచ్చాను. తెలంగాణలో కాంగ్రెస్ విజయంలో ఆ రకంగా నా పాత్ర కూడా ఉన్నందుకు సంతోషంగా ఉంది. కుల, మత. వర్గ తేడాల్లేకుండా ప్రతి సెవర్గానికీ నమ్మకం కలిగించే పార్టీ కాంగ్రెస్. రాహుల్, ఖర్గే నాయకత్వంలో ప్రజలకు మేలు చేస్తుందన్న విశ్వాసం నాకుంది' అని తెలిపారు.



మణిపూర్ క్రూర ఘటనలను జీర్ణించుకోలేకపోతున్నా!

మణిపూర్‌లో జరిగిన క్రూర సంఘటనలను ఓ క్రైస్తవురాలిగా ఇప్పటికీ జీర్ణించుకోలేకపోతున్నాను. అక్కడ 2 వేల చర్చిలను ధ్వంసం చేశారు. 60 వేల మంది నిరాశ్రయులయ్యారు. లౌకిక పార్టీ అధికారంలో లేకపోతే ఏం జరుగుతుందో నాకు అప్పుడే తెలిసింది. ఆ రోజే కాంగ్రెస్‌కు మద్దతివ్వాలని నిర్ణయించాను.

\- షర్మిల

పీసీసీ బాధ్యతలపై మల్లగుల్లాలు

మరోవైపు.. షర్మిలకు ఏ బాధ్యతలు అప్పజెప్పాలన్న అంశంపై కాంగ్రెస్ అధిష్ఠానం తర్జనభర్జన పడుతోంది. గురువారం ఉదయం పార్టీలో చేరకముందు షర్మిల, ఆమె భర్త అనిల్.. కేసీ వేణుగోపాల్‌తో చర్చించారు. ఈ సమావేశంలో పీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు కూడా ఉన్నారు. ఆ తర్వాత తాము బస చేసిన లీలా హోటల్ నుంచే షర్మిల, అనిల్ తమ శ్రేయోభిలాషులు, కాంగ్రెస్ మధ్యవర్తులతో చర్చలు జరిపారు. రాహుల్ మాత్రం ఆమెకు రాష్ట్ర సారథ్యమే అప్పజెప్పే ఉద్దేశంతో ఉన్నట్లు ఏఐసీసీ వర్గాలు అంటున్నాయి. ఏ పదవి ఇచ్చేదీ ఒకట్రెండు రోజుల్లో స్పష్టత వస్తుందని చెబుతున్నాయి.



'జగనన్న' ట్యాబ్‌లతో పిల్లాటలు!

- గేమ్స్ ఆడుకుంటున్నామంటూ వీడియో
- సోషల్ మీడియాలో హల్‌చల్

'హాయ్... జగనన్న ట్యాబులో గేమ్ ఆడుతున్నా. ఇదిగో చూడండి'.. అని ఓ కుర్రాడి దిలాసా!

'నేనూ ఆడుతున్నా. జగనన్న ట్యాబు ఇచ్చాడు. హెచ్‌ఎంకు చెబుతావో, వాళ్ల తాతకు చెప్పుకుంటావో చెప్పుకో. నాకు భయం లేదు".. అని మరో పిల్లాడి తెగింపు!

"ఇదిగో చూడు! నేను ఏం ఆడుతున్నానో చూపించు" అంటూ ట్యాబ్‌ను మరింత క్లియర్‌గా చూపించిన పిల్లోడు!

ఇది సోషల్ మీడియాలో... మరీ ముఖ్యంగా ఉపాధ్యాయుల వాట్సాప్ గ్రూపుల్లో విపరీతంగా షేర్ అయిన వీడియో! ఆరా తీయగా... శ్రీకాకుళం జిల్లా నరసన్నపేట మండలం బొరిగివలసలో దీని మూలాలు తేలాయి. ఆ ఊరి పాఠశాల విద్యార్థులు ఐదారుమంది బైజూస్ ట్యాబ్‌లలో గేమ్స్‌ను డౌన్‌లోడ్ చేయించుకుని... ఓచోట కూర్చుని ఆడుతున్నారు. దీనిని మరొకరు వీడియో తీస్తుండగా... 'మాకేం భయంలేదు. ఇవి జగనన్న ట్యాబ్‌లు. గేమ్స్ ఆడుకుంటున్నాం' అని చెప్పారు. బైజూస్ కంటెంట్ నింపిన ట్యాబ్‌లు ఇచ్చేసి, విద్యారంగంలో అద్భుతాలు సృష్టిస్తున్నట్లు ప్రభుత్వ పెద్దలు ఘనంగా చెప్పుకొంటున్నారు. "బైజూస్ ట్యాబ్‌లకు లాక్ సిస్టమ్ ఉంటుంది. అందులో ఉన్న కంటెంట్‌ను చదువుకోవడానికి మాత్రమే పనికొస్తుంది. విద్యార్థులకు అవసరమైన 5 యాప్స్ మాత్రమే పని చేస్తాయి. మూడంచెల రక్షణ వ్యవస్థ ఉంటుంది. ఇతర యాప్స్ వాడలేరు" అని అడ్డగోలు వాదన చేస్తున్నారు. నిజానికి... ఈ ట్యాబ్‌లను అన్‌లాక్ చేయడం చాలా సులభమని, ఎలాంటి యాప్‌లనైనా ఇన్‌స్టాల్ చేసుకోవచ్చునని టెక్ నిపుణులు స్పష్టంగా చెబుతున్నారు. ఇప్పుడు... శ్రీకాకుళం జిల్లాలో పిల్లలు బైజూస్ ట్యాబుల్లో ఆడుకుంటున్న దృశ్యాలు బయటపడ్డాయి. ప్రభుత్వ పెద్దలు ఇప్పుడేమంటారో!

- నరసన్నపేట

అయ్యో... ఇదేంది బొత్స!

- లేని వెబ్‌సైట్‌ను ప్రారంభించిన మంత్రి



అమరావతి, జనవరి 4(ఆంధ్రజ్యోతి): అది సమగ్రశిక్ష వెబ్‌సైట్. దానిని విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ప్రారంభించారు. ప్రారంభమైతే అయింది కానీ, సైట్ మాత్రం అందుబాటులోకి రాలేదు. ఇదేంటని ఆరా తీస్తే అసలు వెబ్‌సైటే సిద్ధం కాలేదని తెలిసింది. అంటే సిద్ధంకాని వెబ్‌సైట్‌ని మంత్రితోనే ప్రారంభింపజేసిన ఘనత సమగ్ర శిక్ష అధికారులు దక్కించుకున్నారు. బుధవారం మంత్రి బొత్స ప్రారంభించిన సమగ్రశిక్ష వెబ్‌సైట్ గురువారం కూడా అందుబాటులోకి రాలేదు. దీంతో మంత్రి సమగ్రశిక్ష అధికారులు తప్పుదారి పట్టించినట్లు స్పష్టమైంది. పాఠశాల విద్యాశాఖ పరిధిలోని సమగ్రశిక్ష అభియాన్‌కు గతంలో సర్వశిక్ష అభియాన్‌గా ఉన్నప్పుడు రాష్ట్రంలో ప్రత్యేకంగా వెబ్‌సైట్ ఉండేది. కేంద్ర ప్రభుత్వం దానిని సమగ్రశిక్షగా మార్చిన తర్వాత రాష్ట్రంలో వెబ్‌సైట్‌ను రూపొందించలేదు. దీంతో కొత్త వెబ్‌సైట్ సిద్ధం చేయాలనుకున్న సమగ్రశిక్ష అధికారులు... అది పూర్తిస్థాయిలో సిద్ధం కాకుండానే మంత్రిని పిలిచి హడావిడిగా ప్రారంభించారు. అధికారులు ఓపెనింగ్ అనడంతో... అది ఉందో.. లేదో? చూసుకోకుండా మంత్రి బొత్స దాన్ని ప్రారంభించేశారు.

ఇదే మంత్రి రజనీ ఇల్లట!



- ఈ స్థలానికే ఇంటి నంబరు వేసి ఓటు కోసం దరఖాస్తు
- విచారణ చేయకుండానే ఓకే చేసిన అధికారులు

గుంటూరు కార్పొరేషన్, జనవరి 4: ఇక్కడ ఉన్న ఖాళీ స్థలం చూశారా! ఇదే మంత్రి విడదల రజనీ ఇల్లట. ఈ స్థలానికే ఇంటి నంబరు ఇచ్చి ఆమె ఓటు కోసం దరఖాస్తు చేశారు. అధికారులు కూడా విచారణ జరపకుండానే ఆ దరఖాస్తును ఓకే చేసేశారు. మంత్రి రజనీ 2019 అసెంబ్లీ ఎన్నికల్లో చిలకలూరిపేట నుంచి వైసీపీ తరఫున పోటీ చేసి గెలుపొందారు. అప్పట్లో ఆమెకు చిలకలూరిపేట నియోజకవర్గ పరిధిలోని పురుషోత్తపట్నంలో పోలింగ్‌స్టేషన్ నంబర్ 135లో ఓటు ఉంది. ఇటీవల గుంటూరు పశ్చిమ నియోజకవర్గానికి సమన్వయకర్తగా నియమితురాలు కావడంతో పురుషోత్తపట్నంలో ఉన్న ఓటును తొలగించాలని, గుంటూరులో కొత్తగా ఓటు హక్కు కోసం గత నెల 22న దరఖాస్తు చేశారు. ఆమె ప్రస్తుతం గుంటూరు పట్టాభిపురం రెండో లైన్‌లోని శ్యామల గ్రాండ్ అపార్ట్‌మెంటులో నివాసం ఉంటున్నారు. ఓటు కోసం శ్యామలనగర్‌లో తాను కొనుగోలు చేసిన ఖాళీ స్థలానికి 9-2-98 డోర్ నంబరు వేసి ఓటు కోసం దరఖాస్తు చేశారు. ఈ దరఖాస్తును గత నెల 29న ఓకే చేసి, ఓటు మంజూరు చేశారు. దీనిపై టీడీపీ కార్పొరేటర్లు, నాయకులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇందుకు సంబంధించిన ఆధారాలతో టీడీపీ కార్పొరేటర్లు గురువారం గుంటూరు నగరపాలక సంస్థ ఎదుట ఆందోళన చేశారు. తప్పుడు సమాచారంతో ఓటు హక్కు పొందిన మంత్రి రజనీపై చర్యలు తీసుకోవాలని, తక్షణమే ఆమె ఓటును తొలగించాలంటూ ఫాం-7ను ఎన్నికల రిటర్నింగ్ అధికారి శివజ్యోతికి అందజేశారు.

పెన్షన్లన్నీ పెండింగ్‌లోనే..!

- పదవీ విరమణ చేసిన ఉద్యోగుల్లో ఆందోళన

అమరావతి, జనవరి 4(ఆంధ్రజ్యోతి): కొత్త సంవత్సరంలోనూ ప్రభుత్వ ఉద్యోగుల కష్టాలు తీరడం లేదు. జనవరి 5వ తేదీ వచ్చినా ప్రభుత్వం ఇప్పటి వరకు పూర్తిస్థాయిలో జీతాలు, పెన్షన్లు చెల్లించనే లేదు. జీతాలు కొంతమేర చెల్లించినా, పెన్షన్లు మాత్రం పూర్తిగా పెండింగ్‌లోనే ఉన్నాయి. రిటైర్డ్ ఉద్యోగుల పెన్షన్ల కోసం ప్రభుత్వం ప్రతినెలా రూ.1,800 కోట్లు చెల్లించాలి. కానీ, గురువారం మధ్యాహ్నం వరకూ వీరిలో ఒక్కరికి కూడా పెన్షన్ అందలేదు. ఉద్యోగుల వేతనాలకు రూ.3,800 కోట్లకుగాను ఇప్పటికి రూ.2,800 కోట్లు మాత్రమే చెల్లించారు. ఆర్‌బీఐ నుంచి ఈ నెల 2న జగన్ ప్రభుత్వం రూ.3,000కోట్ల అప్పు తెచ్చింది. అలాగే ఒకటో తేదీన కేంద్రం నుంచి దాదాపు రూ.2,000 కోట్ల వరకు రాష్ట్ర ఖజానాకు చేరాయి. కానీ, ఉద్యోగులకు జీతాలు, పెన్షన్లు మాత్రం చెల్లించడంలేదు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వానికి రూ.1,300 కోట్లు వేజ్ అండ్ మీన్స్ వాడుకునే వెసులుబాటు ఉంది. ప్రతినెలా వేజ్ అండ్ మీన్స్‌తో పాటు ఓడీ అప్పులు కూడా పూర్తిగా వాడేస్తున్నారు. పెన్షన్లు చెల్లించేందుకు ఈ నెల వేజ్ అండ్ మీన్స్ అప్పు వెసులుబాటును ఇంకా వాడలేదు. రిటైర్డ్ ఉద్యోగుల్లో ఏ ఒక్కరికీ పెన్షన్ పడలేదు.

కిలాడీ కేజీఎఫ్.. మట్టి, భూములు ఉఫ్!



(మొదటి పేజీ తరువాయి)

విధ్వంసం సాగించారు. అక్రమ తవ్వకాలకు ఏకంగా 700 ఎకరాల పండ్ల తోటలు కనుమరుగయ్యాయి. ప్రతిపక్షం లెక్క ప్రకారం ఎకరానికి రూ.3 కోట్ల గ్రావెల్ తవ్వకాలు జరిగితే.. 700 ఎకరాల్లో రూ.2 వేల కోట్ల వైబడి తవ్వకాలు జరిగాయి. ప్రైవేటు వ్యక్తులు గ్రావెల్ తవ్వకాలు చేపట్టాలంటే ఆయనకు ఎకరానికి రూ.25 లక్షల చొప్పున 'కే' ట్యాక్స్ చెల్లించాల్సిందే. తొలుత ఒక మైనింగ్ నిర్వాహకుడితో కలిసి గ్రావెల్ తవ్వకాలు చేపట్టారు. కొన్నాళ్లకు లెక్కల్లో తేడా రావడంతో ఆ మైనింగ్ నిర్వాహకుడిని రకరకాలుగా వేధించారు. మైనింగ్ అధికారులను ఉసిగొల్పి జరిమానాలు విధించడమే కాకుండా పోలీసులతో బెదిరించి ఖాళీ చెక్కులపై సంతకాలు తీసుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. గుంటూరు నగరానికి అతి చేరువగా ఉన్న ఆ మండలంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం ఊపందుకోవడంతో భూమార్పిడికి ఎకరానికి రూ 5 లక్షల చొప్పున వసూలు చేస్తున్నారు. ఓ గ్రామంలో 40 ఏళ్ల క్రితం దళితులకు ఇచ్చిన అసైన్డ్ భూములను చేజిక్కించుకుని 60 ఎకరాల్లో అక్రమ మైనింగ్ సాగించడం వెనుక ప్రజాప్రతినిధి హస్తం ఉందన్నది బహిరంగ రహస్యమే. ఆ మండల కేంద్రం గుంటూరు జిల్లాలోనే మేజర్ పంచాయతీ. ఇక్కడ ఆయన తన సమీప బంధువైన ఉద్యోగి ద్వారా కోట్లాది రూపాయలు కొల్లగొట్టారన్న ఆరోపణలున్నాయి. ఈ మండలంలోని ఓ శివాలయం జిల్లాలోని ప్రముఖ శైవ క్షేత్రాల్లో ఒకటి. ఈ ఆలయానికి అనువంశిక ధర్మకర్తలు ఉన్నప్పటికీ వారిని పక్కన పెట్టి ఆలయాన్ని అక్కడ నుంచి తరలించి పునర్నిర్మించేందుకు పెద్ద ప్రయత్నమే చేశారు. పునర్నిర్మాణ కమిటీ పేరుతో ప్రముఖ విద్యాసంస్థ అధినేత నుంచి, పారిశ్రామికవేత్తల నుంచి ఆలయ నిర్మాణానికి ఆ ప్రజాప్రతినిధి రూ.లక్షలు వసూలు చేశారు. అనువంశిక ధర్మకర్తలు న్యాయస్థానాలను ఆశ్రయించడంతో ఆలయ నిర్మాణం ఆగిపోయింది. కానీ వసూలు చేసిన డబ్బు ఏమైందో దేవుడికే ఎరుక!

బార్ల సిండికేట్..

నియోజకవర్గ కేంద్రమైన పట్టణంలో ఆ ప్రజాప్రతినిధి మద్యం సిండికేట్ ఏర్పాటు చేశారు. నాలుగు బార్ల స్థానంలో రెండే పెట్టించి ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టారు. సిండికేట్ నుంచి లక్షలాది రూపాయల ముడుపులతో పాటు అనధికార వాటాలను పొందారనే ఆరోపణలున్నాయి. గ్రామాల్లో బెల్ట్ షాపులు ఏర్పాటు చేయించి తన అనుయాయుల ద్వారా రోజూ వేలల్లో, నెలకు లక్షల్లో ఆదాయం గడిస్తున్నారు. పురపాలక సంఘంలో పాలకవర్గం లేకపోవడంతో ఆయన ఆడిందే ఆట, చేసిందే చట్టంలా సాగుతోంది. పురపాలక సంఘంలో ప్రతి పనికీ ఒక రేటు నిర్ణయించి అధికారుల ద్వారానే డబ్బు వసూళ్లకు పాల్పడుతున్నారు. పట్టణంలో కాంప్లెక్స్‌లు, అపార్ట్‌మెంట్ల నిర్మాణం జరగాలంటే ఆయన అనుమతి పొందాల్సిందే. పట్టణంలో ప్రముఖ ఆలయానికి పట్టణ శివారులో కోట్లాది రూపాయల విలువైన భూములున్నాయి. వాటిపై ఆయన కన్ను పడింది. అనుకున్నదే తడవుగా ఆయన సతీమణిని పాలక మండలిలో సభ్యురాలుగా చేర్చి భూముల కైంకర్యానికి పథకం వేశారు. అనువంశిక ధర్మకర్త రాజా వాసిరెడ్డి వెంకటాద్రినాయుడి వారసులు వ్యతిరేకిస్తున్నప్పటికీ ప్రధాన రహదారి జీబీసీ రోడ్డు వెంట ఉన్న 22 ఎకరాల వ్యవసాయ భూమిలో ఆటోనగర్ ఏర్పాటుకు తీర్మానం చేయించి ప్రభుత్వ అనుమతి కోసం పంపారు. దీనిపై తీవ్ర విమర్శలు చెలరేగాయి. గుట్టు రట్టవడంతో దొడ్డిదారిన కమర్షియల్ లీజ్ పేరుతో ఈ 22 ఎకరాల భూములను చేజిక్కించుకునేందుకు కొత్త పన్నాగం పన్నారు. ఆలయంలో మహా కుంభాభిషేకం చేయిస్తున్నానంటూ.. దేవదాయ శాఖ అనుమతి లేకుండా ప్రజల నుంచి సుమారు రూ.50 లక్షల దాకా వసూలు చేశారు. ప్రతిపక్షాలు తూర్పారబట్టడంతో కార్యక్రమాన్ని తూతూ మంత్రంగా నిర్వహించి చేతులు దులుపుకొన్నారు. పట్టణంలో ప్రధాన రహదారి జీబీసీ రోడ్డు విస్తరణ పేరుతో సరైన అనుమతులు, నిధులు లేకుండా అర్థరాత్రి 157 భవనాలను ఎమ్మెల్యే దగ్గరుండి మరీ కూల్చివేయించారు. వాటి యజమానులకు నేటికీ పరిహారం గానీ, టీడీఆర్ బాండ్లు గానీ అందజేయలేదు. దీనిపై ప్రశ్నిస్తే వైసీపీ నాయకులను ఇళ్లకు పంపి బెదిరింపులకు పాల్పడుతున్నారు. అలాగే పట్టణంలో ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ గెస్ట్ హౌస్‌ల మధ్య నుంచి జిల్లా పరిషత్‌కు చెందిన భూమిని రైతులకు దారి పేరుతో రియల్ ఎస్టేట్ వ్యాపారులకు కట్టబెట్టారు. వారి నుంచి నగదు రూపంలో భారీగా లబ్ధి పొందారని తెలిసింది.

అధికారులు, కార్యకర్తలు హడల్

ఆ ప్రజాప్రతినిధి పేరు చెబితే అధికారులతో పాటు సొంత పార్టీ కార్యకర్తలు కూడా హడలిపోతున్నారు. ఆయన అరాచకాలు అక్రమాలకు తట్టుకోలేక.. ఆయనకు మళ్లీ టికెట్ ఇస్తే పనిచేసేది లేదంటూ కీలక నాయకులు తేల్చిచెప్పారు. ఆయన అరాచకాలపై నాయకత్వం కూడా గుర్రుగా ఉన్నట్లు తెలిసింది.

పెదకాకాని మండలంలో..

రాజధాని అమరావతిని కలిసి ఉండే ఇంకో మండలంలో ప్రముఖ శైవ క్షేత్రం శ్రీగంగా, భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి దేవాలయం సాక్షిగా ఎమ్మెల్యే అక్రమాలను ఎవరినడిగినా చెబుతారు. ఈ ఆలయ మహాకుంభాభిషేకం పేరుతో దాతల నుంచి రూ.లక్షలు వసూలు చేసి ఖర్చుల లెక్కలు చెప్పలేదు. ఆలయ సిబ్బంది నియామకాల పేరుతో లేని పోస్టులు సృష్టించి వారి జీత భత్యాల కింద నెలవారీ కైంకర్యం చేస్తున్నారు. ఈ ఆలయంలో ఎమ్మెల్యే అనుచరుల ఆగడాలు మితిమీరాయి. గుడి క్యాంటీన్లో మాంసాహారం వండిన ఆయన అనుచరుల తీరు బట్టబయలై సంచలనంగా మారింది. ఈ మండల కేంద్రం కూడా జిల్లాలోనే మేజర్ కమర్షియల్ పంచాయతీ. దీని నిధులను బ్లీచింగ్, సున్నం, విద్యుత్ ఉపకరణాలు కొనుగోలు, పారిశుధ్య పనుల పేరుతో దుర్వినియోగం చేశారు. కోట్లాది రూపాయల పంచాయతీ నిధులను ప్రజాప్రతినిధి దారి మళ్లించారు. ఓ గ్రామంలో 22.50 ఎకరాల దళితుల భూమి కబ్జాకు ప్రయత్నిస్తున్నారు. సొంత బంధువు పేరుతో ఈ భూములు బదలాయించాలని చూస్తున్నారు. రెండు గ్రామాల్లో అక్రమ క్వారీ తవ్వకాలు చేపట్టి అక్కడి స్థానిక ప్రజాప్రతినిధి ద్వారా రూ.కోట్లు దోపిడీ చేస్తున్నారని విమర్శలు వస్తున్నాయి.

రైతులకు అన్యాయం..

ధాన్యం, మొక్కజొన్న, జొన్న కొనుగోలు కేంద్రాలను తన మనుషులకు కట్టబెట్టి కొనుగోళ్లలో భారీగా అక్రమాలకు పాల్పడ్డారని ఆయనపై విమర్శలు గుప్పుమంటున్నాయి. క్వింటాల్‌కు రూ.100 నుంచి రూ.500 వరకు వసూళ్లు చేశారు. రైతులకు ప్రభుత్వం సరఫరా చేసిన గోనె సంచుల సొమ్మును కూడా దిగమింగారనే ఆరోపణలు ఉన్నాయి. అధికారులు, పోలీసుల పోస్టింగుల్లో చేతివాటం ప్రదర్శించడమే గాక.. పోస్టింగులు ఇప్పించినవారినుంచి నెలనెలా వసూళ్లు చేస్తున్నారని ప్రచారం జరుగుతోంది. కొందరు అధికారులు ఈ నియోజకవర్గంలో పనిచేయలేమంటూ వేరే ప్రాంతాలకు బదిలీ చేయించుకుని పారిపోయారు. కొందరు ఆయన దోపిడీకి సహకరించి సస్పెండయ్యారు. సహకరించని అధికారులపై ఎమ్మెల్యే జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేసి సస్పెండ్ చేయించారు. చెప్పిన పని చేయని వారిని నోటికొచ్చినట్లు తిడుతుంటారు. ఆయన తీరుతో విసిగిపోయిన సొంత పార్టీ కార్యకర్తలే అధిష్ఠానానికి ఫిర్యాదులు పంపారు. మన్నవ గ్రామ వలంటీర్లు నేరుగా జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. తన విజయానికి పాటుపడిన వైసీపీ నాయకులు పనుల కోసం, పదవుల కోసం వెళ్తే వారి నుంచీ ముడుపులు ఆశించారని ఆయనపై విమర్శలు ఉన్నాయి.



అవాక్కయ్యేలా ముగ్గు!

మామూలుగా అయితే ఈ బొమ్మ... ఈ నినాదాల గురించి చెప్పుకోవాల్సిన పనిలేదు. అయితే, ఈ ముగ్గు వేసిన ప్రాంతం వల్ల దీనికి ప్రాముఖ్యత వచ్చింది. సంక్రాంతి సందర్భంగా వైసీపీ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీ నిర్వహించారు. ఇందులో పాల్గొన్న బాలిక వేసిన ముగ్గు ఇది. పల్నాడు జిల్లా రాజుపాలెం మండలం బీరవల్లిపాయ గ్రామంలో గురువారం నిర్వహించిన ఈ పోటీల్లో ఒక అమ్మాయి.. జనసేన లోగోను ముగ్గుగా వేసింది. ముగ్గుతో పాటు 'వైసీపీ వద్దు... జనసేన ముద్దు' అని రాసింది. ఈ ముగ్గును చూసి నిర్వాహకులు అవాక్కయ్యారు.

- రాజుపాలెం

బెదిరించి 'అసెంబ్లీ రౌడీ' బోర్డులు!





ఇచ్ఛాపురం రూరల్, జనవరి 4: రాష్ట్రంలో ఊరి ఊరిలో 'అసెంబ్లీ రౌడీ' సినిమా సీన్ ఆవిష్కృతమవుతోంది. ఎవరైనా విశ్వాసం కొద్దీ... అభిమానం కొద్దీ తమ దైవాల పేర్లు... హీరోల పేర్లు... నాయకుల పేర్లను దుకాణాలు, ఇళ్లకు పెట్టుకుంటూ ఉంటారు. అయితే, ఇప్పుడు రాష్ట్రంలో దుకాణాలకు, ఇళ్లకు 'మా నమ్మకం నువ్వే జగన్' అనే బోర్డులు కనిపిస్తున్నాయి. టిడ్కో నివాసాలు, మంచినీళ్ల ట్యాంకులు, ప్రభుత్వ భవనాలకు నిబంధనలకు విరుద్ధంగా తమ పార్టీ రంగులు వేసుకున్న వైసీపీ నాయకులు.. తాజాగా కొంత మంది ఇళ్లపైన, దుకాణాల వద్ద వారి పార్టీకి చెందిన బోర్డులు అమర్చుతున్నారు. సంక్షేమ పథకాల ఆశ చూపించి... వాటికీ లొంగని వారిని బెదిరించి ఈ బోర్డులు పెట్టిస్తున్నారని తెలుస్తోంది. శ్రీకాకుళం జిల్లాలోని కొందరు దుకాణదారులు, ఇళ్ల యజమానులను దీనిపై ప్రశ్నించగా... జగన్ సైన్ బోర్డులు పెట్టుకోకుంటే... సంక్షేమ పథకాలు రద్దవుతాయని చెప్పడంతో చేసేదిలేక వాటిని ఏర్పాటు చేసుకున్నామని వాపోయారు.

తిట్టను పో!

(మొదటి పేజీ తరువాయి)

ఆయన అంగీకరించలేదని చెబుతున్నారు. గురువారం తనను కలిసిన వైసీపీ పార్టీ దూతలతో మహీధరరెడ్డి ఆ విషయాన్ని తేల్చిచెప్పారు. చంద్రబాబు, పవన్‌కల్యాణ్, నారా లోకేశ్‌లపై విమర్శలు చేస్తూ మీడియా సమావేశం ఏర్పాటు చేయాలని మహీధరరెడ్డికి జగన్‌రెడ్డి షరతు విధించారు. ఆ విషయాన్ని చెప్పాలని విజయసాయిరెడ్డి, రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డిలకు జగన్ సూచించారు. ఆయనకు నేరుగా ఆ విషయాన్ని చెప్పలేక నెల్లూరు డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్, ఐప్యాక్ ప్రతినిధులను గురువారం మహీధరరెడ్డి వద్దకు పంపారు. అందిన సమాచారం మేరకు 'నేను ప్రెస్‌మీట్ పెట్టను, పెట్టలేను' అని మహీధరరెడ్డి చెప్పినట్లు తెలిసింది. ఆ షరతును అమలు చేస్తేనే పార్టీ టికెట్ లభిస్తుందని సీఎం చెప్పమన్నట్లుగా వారు ఆయన దృష్టికి తీసుకెళ్లినట్లు కూడా తెలిసింది. 'అలాగా.. అయితే ప్రెస్‌మీట్ వద్దు, టికెట్ విషయం మీ ఇష్టం. మా తండ్రి మూడుసార్లు ఎమ్మెల్యే, నేను నాలుగుసార్లు ఎమ్మెల్యేని. స్వతంత్ర అభ్యర్థిగా గెలిచిన చరిత్ర మాది. నలభై ఏళ్ల రాజకీయ జీవితంలో చాలా చూశాం. వైసీపీ రాజకీయ చరిత్ర కన్నా మా రాజకీయ చరిత్రే అధికం' అని సూటిగా ఆయన తేల్చిచెప్పినట్లు తెలిసింది. ఆ తర్వాత మహీధరరెడ్డితో జరిగిన సంభాషణను వారు విజయసాయి, వేమిరెడ్డిలకు వివరించారు. కాగా ఇదే సమయంలో కనిగిరి ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌యాదవ్ సీఎంవోకు వెళ్లటం విశేషం. గురువారం సాయంత్రం ఆయన సీఎంవోలో ఉన్నారు. దీంతో అవసరమైతే మధుసూదన్‌యాదవ్‌ను కందుకూరు నుంచి రంగంలోకి దింపే ప్రయత్నంలో భాగంగా పిలిపించి ఉండవచ్చని భావిస్తున్నారు. అయితే తాను నియోజకవర్గ పనులపై సీఎంవోకు వచ్చానని తనకు కనిగిరి టికెట్ ఎప్పుడో ఖరారైందని మధుసూదన్‌యాదవ్ తనను అడిగిన సన్నిహితులకు చెప్పుకొన్నారు.

జగన్‌కు ఇది నాలుగో షాక్!?

నెల్లూరు జిల్లా వైసీపీ నేతలు జగన్‌కు షాకుల మీద షాకులు ఇస్తున్నారు. కొన్నాళ్ల క్రితం కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, ఆనం రామనారాయణరెడ్డి, మేకపాటి చంద్రశేఖర్ రెడ్డి జగన్‌పై తిరుగుబాటు ప్రకటించి బయటకు వచ్చారు. తెలుగుదేశం పార్టీ సాదర ఆహ్వానం మేరకు ఆ పార్టీలో చేరారు. వాస్తవానికి జగన్‌కు ఇది భారీ షాక్. రాష్ట్రవ్యాప్తంగా వైసీపీలో తిరుగుబాట్లకు నెల్లూరులోనే బీజం పడింది. ముగ్గురు బలమైన నాయకులు ఏక కాలంలో తిరుగుబాటు ప్రకటించి వెలుపలికి వెళ్లిన కొద్ది రోజుల వ్యవధిలోనే ఇదే జిల్లాకు చెందిన మరో బలమైన ఎమ్మెల్యే మహీధర్‌రెడ్డి జగన్ ఆదేశాన్ని ధిక్కరించారు. వీరందరూ జగన్ సామాజికవర్గానికి చెందినవారే కావడం ఒక విశేషమైతే, అందరూ వైఎస్ కుటుంబానికి వీర విధేయులుగా గుర్తింపు పొందిన నాయకులు కావడం మరోవిషయం.

ఇప్పుడేం చేయాలి!

(మొదటి పేజీ తరువాయి)



ముఖ్యమంత్రి జగన్‌తో కేటీఆర్ ఆలింగనం

చేరుకున్నారు. అక్కడ గంటకుపైగా గడిపారు. జగన్‌కు బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, కేసీఆర్ తనయుడు కేటీఆర్ పుష్పగుచ్ఛం ఇచ్చి సాదర స్వాగతం పలికారు. ఇద్దరూ ఆత్మీయ ఆలింగనం చేసుకున్నారు. ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస యాదవ్ కూడా అక్కడే ఉన్నారు. ఆ తర్వాత జగన్‌ను కేసీఆర్ వద్దకు తీసుకుని వెళ్లారు. కేసీఆర్‌కు జగన్ పుష్పగుచ్ఛం అందించారు. వెంకటేశ్వర స్వామి చిత్రపటాన్నీ బహూకరించారు. తుంటి మార్పిడి శస్త్ర చికిత్స, ప్రస్తుత పరిస్థితి, కోలుకునేందుకు ఎంత సమయం పడుతుంది... ఇలాంటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అంతటితో అసలు పరామర్శ ముగిసింది.

ఏకైక 'రాజకీయ గురువు'

జాతీయ రాజకీయాల్లో జగన్ ఒంటరి! ఏ కూటమిలోనూ ఉండరు. ఎవరితోనూ సన్నిహితంగా మెలగరు. ఢిల్లీలో ముఖ్యమంత్రుల సదస్సుల్లో పాల్గొన్నా అటూఇటూ దిక్కులు చూస్తారే తప్ప ఒక్కరితోనూ మాట కూడా కలపరు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీతో ఆయనవి పక్కా సొంత అవసరాలే! 'ఉభయ కుశలోపరి' తరహాలో కేంద్రంతో ఆయన సంబంధాలు ఉంటాయి. ఇక ఆయనకు ఏకైక సన్నిహితుడు, రాజకీయ గురువు కేసీఆర్ ఒక్కరే. వీరిద్దరి రాజకీయ శత్రువు చంద్రబాబు కావడంతో శత్రువుకు శత్రువు మిత్రుడు అన్నట్లుగా కేసీఆర్‌కు దగ్గరయ్యారు. గత ఎన్నికల్లో జగన్ గెలుపు కోసం... అప్పుడు తెలంగాణలో అధికారంలో ఉన్న కేసీఆర్ సంపూర్ణ సహకారం అందించారు. తాజాగా జరిగిన తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో కేసీఆర్ గెలుపుకోసం జగన్ లోపాయికారీగా సహకరించారు. బీఆర్‌ఎస్ హ్యాట్రిక్ కోసం జగన్ ఎంతగానో పరితపించారు. కానీ... నిరాశే మిగిలింది. 'తదుపరి వంతు జగన్‌దే. ఏపీలో ఆయన ఓటమి ఖాయం' అనే ప్రచారం జోరందుకుంది. సిట్టింగ్‌లందరికీ టికెట్లు ఇవ్వడమే కేసీఆర్ ఓటమికి కారణమనే సూత్రీకరణ నేపథ్యంలో... జగన్ ఇక్కడ సిట్టింగ్‌లను మార్చే పనిలో పడ్డారు. కానీ... ఆయన చేస్తున్న ప్రయోగాలన్నీ వికటిస్తున్నాయి. ఐప్యాక్‌తో సహా ఇతర అన్ని సర్వేల్లో జగన్‌కు ప్రతికూల ఫలితాలే కనిపిస్తున్నాయి. సిట్టింగ్‌ల మార్పు ప్రక్రియ వికటిస్తోంది. కొందరి విషయంలో బెట్టు వీడి మెట్టు దిగాల్సి వస్తోంది. 'వారసులకు నో ఛాన్స్' అని చెప్పిన జగన్... ఆ తర్వాత చెవిరెడ్డి భాస్కర రెడ్డి, పేర్ని వెంకట్రామయ్య, మహ్మద్ ముస్తాఫా, సుభాష్ చంద్రబోస్, భూమన కరుణాకర్ రెడ్డి వారసులకు టికెట్లు ప్రకటించక తప్పలేదు. ఇప్పుడు కంట్లో నలుసులా .. సొంత చెల్లెలు షర్మిల కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. టికెట్లు దక్కని వారు ఎదురు తిరుగుతున్నారు. కాంగ్రెస్ వైపు చూస్తున్నారు. దీంతో రాజకీయంగా జగన్‌కు దిక్కుతోచని పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలోనే 'పాహిమాం' అంటూ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు కేసీఆర్ వద్దకు సలహాల కోసం పరుగులు తీసినట్లు తెలుస్తోంది.

పనిలో పనిగా తల్లి వద్దకు...

కేసీఆర్‌ను పరామర్శించేందుకు హైదరాబాద్ వెళ్లిన జగన్.. పనిలోపనిగా లోటస్‌పాండ్‌లో ఉన్న తల్లి వద్దకు కూడా వెళ్లారు. షర్మిల ఢిల్లీకి వెళ్లడంతో విజయలక్ష్మి ఒక్కరే ఇంట్లో ఉన్నారు. అక్కడ జగన్ అరగంట మాత్రమే ఉన్నారు. సోదరి కాంగ్రెస్‌లో చేరినప్పటికీ... తల్లిని మాత్రం కాంగ్రెస్‌కు మద్దతుగా నిలవొద్దని జగన్ కోరినట్లు తెలుస్తోంది.

ఏకాంతంగా చర్చించి...

పరామర్శ తర్వాత కేటీఆర్ సహా అందరినీ బయటికి పంపించారు. కేసీఆర్‌తో జగన్ కొద్దిసేపు ఏకాంతంగా చర్చించుకున్నారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం... చుట్టుముడుతున్న సమస్యల నుంచి బయటపడి, వచ్చే ఎన్నికల్లో గట్టెక్కడంపై కేసీఆర్ సలహాలు, సూచనలు తీసుకున్నట్లు తెలుస్తోంది. తెలంగాణలో బీఆర్‌ఎస్ ఓటమిని ఊహించలేదని కేసీఆర్ చెప్పినట్లు తెలుస్తోంది. ఎన్నికల షెడ్యూల్ వచ్చేదాకా ప్రజల్లో ఎలాంటి వ్యతిరేకత కనిపించలేదని... ఆ తర్వాతే పరిస్థితి మారిందని చెప్పినట్లు సమాచారం. "అంతా బాగుందనుకున్నాం. కానీ... ఎన్నికల ప్రక్రియ ప్రారంభమయ్యాక 40 రోజుల్లో మార్పు కనిపించింది. ఇది ఊహించని పరిణామం" అని పేర్కొన్నట్లు తెలిసింది. దీంతోపాటు... 'అధికారంలో ఉన్న పార్టీపై ప్రజలు తమ వ్యతిరేకతను ఎన్నికల షెడ్యూల్ వచ్చే వరకు బయట పెట్టరు.. జాగ్రత్త' అని జగన్‌ను హెచ్చరించినట్లు తెలుస్తోంది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.

7న తిరువూరులో భారీ బహిరంగ సభ

ముఖ్య అతిథిగా చంద్రబాబు: కేశినేని చిన్ని

అజిత్‌సింగ్‌నగర్: తిరువూరు నియోజకవర్గం లో ఈనెల 7న తెలుగుదేశం పార్టీ భారీ బహిరంగ సభ జరగనుందని కేశినేని ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ కేశినేని శివనాథ్ (చిన్ని) తెలిపారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ బహిరంగ సభ కు తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. సుమారు 2 లక్షల మందితో న భూతో న భవిష్యత్ అన్నట్టుగా నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. చంద్రబాబును సీఎంగా చూడాలనే తపన తనకుందని అం దుకే పార్టీ కోసం అహర్నిశలు పనిచేస్తున్నానన్నారు. పార్టీలో చిన్న చిన్న మనస్పర్థలు సహజమేనని టీ కప్పులో తుఫాన్‌లా సమసిపోతాయన్నారు. పార్టీ ఆదేశాలే శిరోధార్యంగా పార్టీకి పనిచేస్తానని, టీడీపీ అధికారంలోకి రావడమే ప్రధాన అజెండా అని అన్నారు. ప్రతి ఒక్కరూ బహిరంగ సభలో పాల్గొని విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

బీసీ కులాల ఆత్మీయ సమావేశం: ఆర్.కృష్ణయ్య

ధర్నాచౌక్: ఆంధ్రప్రదేశ్ బీసీ సంఘం ఆధ్వర్యంలో బీసీ కులాల ఆత్మీయ సమావేశం గాంధీనగర్‌లోని ఓ ప్రముఖ హోటల్‌లో గురువారం జరిగింది. ముఖ్య అతిథులుగా రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య, బీద మస్తాన్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ సామాజిక న్యాయంలో దేశానికి సీఎం జగన్ ఆదర్శంగా నిలిచారన్నారు. బలహీన వర్గాలు పాలితులుగానే కాదు పాలకులు గా ఉండాలన్నదే ఆయన లక్ష్యమన్నారు. బీద మస్తాన్‌రావు మాట్లాడుతూ కేంద్ర పరిధిలో బీసీలకు ప్ర త్యేక మంత్రిత్వశాఖ లేకపోవడం శోచనీయమన్నా రు. బీసీలకు చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్లు క ల్పించాలన్నారు. ఆంధ్రప్రదేశ్ బీసీ సంఘం రాష్ట్ర అ ధ్యక్షుడు డాక్టర్ ఎన్.మారేష్, బీసీ సంఘాల నేతలు వేముల బేబీరాణి, బెజవాడ గణేష్, జబ్బల శ్రీనివాస్, జక్కా శ్రీనివాసరావు, జగదీష్ పాల్గొన్నారు.

సంక్రాంతికి ప్రత్యేక రైళ్లు

రైల్వేస్టేషన్: సంక్రాంతి దృష్ట్యా ప్రయాణికుల రద్దీని తట్టుకునేందుకు ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేసినట్టు డివిజనల్ రైల్వే పీఆర్‌వో నుస్రత్ ఎం మండ్రుప్కర్ గురువారం ఒక ప్రటనలో తెలిపారు. ఈనెల 11న రాత్రి సికింద్రాబాద్- కాకినాడ టౌన్‌రైలు సికింద్రాబాద్‌లో రాత్రి 9 గంటలకు బయలుదేరుతుంది. మరుసటి ఉదయం 11 గంటలకు కాకినాడ టౌన్ చే రుతుంది. తిరిగి 12న సాయంత్రం 6.30 గంటలకు కాకినాడ టౌన్‌లో బయలుదేరుతుంది. మరుసటి ఉదయం 5.55కు సికింద్రాబాద్‌కు చేరుకుంటుంది. హైదరాబాద్-కాకినాడ టౌన్ 12న సాయంత్రం 6.30 గంటలకు హైదరాబాద్‌లో బయలుదేరి మరుసటి ఉదయం 7.10 గంటలకు కాకినాడ టౌన్‌కు చేరుకుంటుంది. కాకినాడ టౌన్-హైదరాబాద్ రైలు కాకినాడ టౌన్‌లో 13న రాత్రి 10 గంటలకు బయలుదేరుతుం ది. మరుసటి ఉదయం 8.30 గంటలకు హైదరాబాద్‌కు చేరుకుంటుంది. 07021-07022 సికింద్రాబాద్- కాకినాడ టౌన్ ప్రత్యేక రైలు రైలు జనగాం. కాజీపేట వరంగల్, మహబూబాబాద్, డోర్నకల్ జంక్షన్, ఖ మ్మం, రాయనపాడు, గుడివాడ, కైకలూరు, ఆకివీడు, భీమవరం టౌన్, తణుకు నిడదవోలు, రాజమండ్రి, అనపర్తి, సామర్లకోట స్టేషన్లలో ఆగుతుంది. 07023- 07024 కాకినాడ టౌన్-హైదరాబాద్ ప్రత్యేక రైలు న ల్గొండ, మిర్యాలగూడ, పిడుగురాళ్ల, సత్తెనపల్లి, గుం టూరు, విజయవాడ, గుడివాడ జంక్షన్‌లు, కైకలూ రు, ఆకివీడు, భీమవరం టౌన్, తణుకు, నిడదవోలు, రాజమండ్రి, అనపర్తి, సామర్లకోటలో ఆగుతుంది.

లైంగిక వేధింపులపై మహిళ పిర్యాదు

వన్‌టౌన్: ఒక ఫైనాన్స్ కంపెనీలో తన కుమారుడితో పాటు పనిచేసే ఇద్దరు ఉద్యోగులు తనను లైంగిక వేధించటమే కాక, పొరుగింటి వారికి చెందిన ద్విచక్ర వాహనాన్ని బలవంతంగా తీసుకోవడం, కుమారుడిని కొట్టి, బెదిరించి కాగితాలపై సంతకాలు చేయించుకున్నారని, కుమారుడు ఉద్యోగం మానేసినా తనను లైంగికంగా వేధిస్తున్నారని అంబాపురానికి చెందిన పీట్ల సుగుణ డీజీపీ, సీఎం, పోలీసు ఉన్నతాధికారులు ఫిర్యాదు చేశారు. టూటౌన్ పోలీసు స్టేషన్ పరిధిలోని అంబాపురానికి చెందిన బాధితురాలికి కుమారుడు, కుమార్తె. భర్త ట్రాక్టర్ డ్రైవర్, కుటుంబం గడవకపోవడంతో కుమారుడు 6 నెలలుగా ఒక ఫైనాన్స్ సంస్థలో పనిచేస్తున్నాడు. అతడితో కలిసి పని చేసే శ్రీకాంత్, విజయ్ తరచూ ఇంటికి వస్తూ తమ వాంఛను తీర్చాలని కోరుతున్నారన్నారు. ఇందుకు నిరాకరించడంతో తమను ఇబ్బందికి గురిచేస్తున్నారని ఫిర్యాదు చేసింది.

స్వీపర్‌కు గాయాలు..

కార్పొరేషన్ వాహనం తగిలి కాంట్రాక్ట్ పారిశుధ్య కార్మికురాలు గాయపడింది. కృష్ణలంక కరకట్ట ప్రాంతానికి చెందిన మోపిదేవి మరియమ్మ కాంట్రాక్ట్ కార్మికురాలుగా పనిచేస్తోంది. మునిపిపల్ కార్మికుల సమ్మె నేపథ్యంలో వేరే వ్యక్తుల చేత పనులు చేయిస్తున్నారు. మునిసిపల్ అధికారులు గురువారం చెత్తతరలింపు వాహనాన్ని తీసుకురాగా మరియమ్మ సహా మరికొందరు అడ్డుకునేందుకు ప్రయత్నించారు ఈనేపథ్యంలో ఆమె చేతికి గాయాలయ్యాయి. దీంతో ఆమె కృష్ణలంక పోలీసులకు ఫిర్యాదు చేసింది.

ఆందోళన భగ్నం

- బైజూస్‌తో ఒప్పందాన్ని రద్దు చేయాలని విద్యార్థి సంఘాల నిరసన
- పరిస్థితి ఉద్రిక్తం, ఆందోళన కారుల అరెస్టు ● వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌కు తరలింపు

వన్‌టౌన్, జనవరి 4: దివాలా తీసిన బైజూస్ సంస్థతో ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాన్ని రద్దు చేయాలని కోరుతూ వామపక్ష విద్యార్థి సంఘాలు గురువారం ఏలూరు రోడ్డులోని బైజూస్ క్యాంపస్ వద్ద తలపెట్టిన ఆందోళనను పోలీసులు భగ్నం చేశారు. ఈ సందర్భంగా అక్కడ ఉద్రిక్త పరిస్థితి నెలకుంది. పోలీసులకు, నేతలకు వాగ్వాదం జరిగింది. దీంతో ఆందోళనకారులను పోలీసులు అరెస్టు చేసి వన్‌టౌన్ స్టేషన్‌కు తరలించారు. ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఏలూరు రోడ్డులోని బైజూస్ క్యాంపస్ వద్ద నిరసన చేపట్టారు. నేతలు ఎం సాయికుమార్, ఉప్పుటూరి అరుణ్‌కుమార్, ఏఐవైఎఫ్ నేతలు లంకే సాయికుమార్ ఏఐఎస్ఎఫ్ నేతలు రంజిత్, జగదీష్, సురేష్, అయ్యప్ప, బి.ప్రసాద్, లాల్‌మోహన్‌ను పోలీసులు అరెస్టు చేశారు. ఆందోళనకు బయలుదేరిన పరుచూరి రాజేంద్రబాబు, మక్కి. లెనిన్‌బాబును హనుమాన్‌పేటలో అరెస్టు చేసి వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌కు



ఆందోళన చేస్తున్న విద్యార్థి సంఘాల నేతలు



పోలీసుస్టేషన్‌లో ఉన్న వామపక్ష నేతలు శంకర్

తరలించారు. దీంతో సీపీఐ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్, నగర కార్యదర్శి కోటేశ్వరరావు, బుట్టి రాయప్ప, తాడి పైడయ్య, కొట్టు రమణ వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌కు వెళ్లి విద్యార్థి నేతలను పరామర్శించి ధైర్యం చెప్పారు. అనంతరం నేతలు మాట్లాడుతూ బైజూస్ సంస్థ దేశంలోనే దివాలా తీసిన సంస్థ అని, ఇప్పటికే దానిపై మనీల్యాండరింగ్ కేసులున్నాయని, రూ.9,200 కోట్లు ఇతర దేశాలకు తరలించారని, అలాంటి సంస్థతో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం చేసుకోవడం దుర్మార్గమన్నారు. ట్యాబ్‌ల పేరుతో ప్రభుత్వం కోట్లాది రూపాయల ధనాన్ని దుర్వినియోగం చేస్తుందన్నారు. విద్యార్థులకు నష్టం కలిగిస్తూ తల్లితండ్రుల నుంచి రూ.లక్షల్లో వసూలు చేస్తున్నారని ఆరోపించారు. దగాకోరు బైజూస్‌తో రాష్ట్ర ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. 8వ తరగతి విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ట్యాబ్‌లతో పడుతున్న ఇబ్బందులను వివరించారు.

కేశినేని ఫౌండేషన్ ఆధ్వర్యంలో.. ఉచిత మెగా మెడికల్ క్యాంపు

- 4వేల మందికి ఉచిత వైద్య పరీక్షలు
- 3వేల మందికి భోజనాలు

పాయకాపురం, జనవరి 4: కేశినేని ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ కేశినేని శివనాథ్ (చిన్ని) ఆధ్వర్యంలో గురువారం వాంబేకాలనీలో ఉచిత మెగా మెడికల్ క్యాంపు జరిగింది. టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బొండా ఉమామహేశ్వరరావు, కేశినేని చిన్ని ప్రారంభించారు. కాలనీలోని సీ బ్లాక్ గ్రౌండ్‌లో జరిగిన మెడికల్ క్యాంపులో 4వేల మందికి ఉచితంగా వైద్యం అందించారు. 1430 మందికి కంటి పరీక్షలు, 1210 మందికి గుండె పరీక్షలు, 174 మంది మహిళలకు ప్రసూతి పరీక్షలు, 182 మందికి ఆర్థో పరీక్షలు, 170 మందికి క్యాన్సర్ పరీక్షలు, 152 మందికి దంత పరీక్షలు చేసిన వైద్యులు ఉచితంగా మందులను అందజేశారు. క్యాంపునకు వచ్చిన 3వేల మందికి వైద్య శిబిరంలో భోజన ఏర్పాట్లు చేశారు. బొండా ఉమా మాట్లాడుతూ రాష్ట్రంలోని జగన్ ప్రభుత్వంలో వైద్యం అందటం లేదని, పేరుకే ఆరోగ్య శ్రీ పథకం ఉందన్నారు. వైద్యం ప్రజలకు భారంగా మారటంతో కేశినేని చిన్ని కార్పొరేట్ స్థాయి మెడికల్ క్యాంపులను ఏర్పాటు చేసి వైద్య సేవలందిస్తున్నారన్నారు. అనంతరం కేశినేని చిన్ని మెడికల్ క్యాంపు నిర్వాహణకు సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. తొలుత ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించారు. కార్పొరేటర్ కంచి దుర్గ, కంచి ధనశేఖర్, నవనీతం సాంబశివరావు, ఘంటా కృష్ణమోహన్, మాజీ కార్పొరేటర్ పైడి తులసి, దాసరి ఉదయశ్రీ, పాల మాధవ, కేశవ, దాసరి కనకారావు, లబ్బా వైకుంఠం పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు పరిశీలిస్తున్న బొండా, కేశినేని చిన్ని

పశ్చిమలో ఛీత్కారం..

సెంట్రల్‌లో ఉత్తర ప్రగల్భాలా..!

- టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు బొండా ఉమా

పాయకాపురం, జనవరి 4: పశ్చిమ ప్రజలు ఛీ కొడుతుంటే సెంట్రల్‌కు వచ్చి ఎమ్మెల్యే వెల్లంపల్లి శ్రీనివాస్ ఉత్తర ప్రగల్భాలు పలుకుతున్నాడని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బొండా ఉమామహేశ్వరరావు విమర్శించారు. 62వ డివిజన్ ప్రకాష్‌నగర్‌లో గురువారం బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారంటీ జరిగింది. ఇందులో పాల్గొన్న ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను వివరించి టీడీపీ అధికారంలోకి రాగానే అమలు చేయనున్న వివిధ పథకాలతో కూడిన కరపత్రాలను స్థానికులకు పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ సొంత నియోజకవర్గంలో వ్యతిరేకత ఎదుర్కొంటున్న వెల్లంపల్లి శ్రీనివాస్‌ను వేరే నియోజకవర్గంలో ప్రజలు ఆదరిస్తారా అని ప్రశ్నించారు. ఐ ప్యాక్ టీం వేసిన తూకంలో నీళ్ల కన్నా పలచనగా ఎమ్మెల్యే వెల్లంపల్లి శ్రీనివాస్ అయిపోయాడని తెలిసే జగన్ అతడికి పశ్చిమ టిక్కెట్ ఇవ్వలేదని ఎద్దేవా చేశారు. రానున్న ఎన్నికల్లో సెంట్రల్‌లో టీడీపీ జెండా ఎగురవేసి తమ అధినేత చంద్రబాబును సీఎంను చేసి తీరుతామన్నారు. నేతలు నవనీతం సాంబశివరావు, ఘంటా కృష్ణమోహన్, పైడి శ్రీను, బత్తుల కొండ, మాజీ కార్పొరేటర్ పైడి తులసి పాల్గొన్నారు.



మహిళలకు కరపత్రాలు ఇస్తున్న ఉమా

విష్ణు, తనతో చర్చించే

సెంట్రల్‌పై జగన్ నిర్ణయం

- ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు

వన్‌టౌన్, జనవరి 4: పశ్చిమం నుంచి సెంట్రల్‌కు తనను మార్చే విషయంలో పార్టీ అధినేత జగన్మోహనరెడ్డి తనతోను మల్లాది విష్ణుతోను చర్చించే నిర్ణయం తీసుకున్నారని పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు గురువారం మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాజీ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు వ్యాఖ్యలపై తీవ్రంగా స్పందించారు. నేను వస్తున్నానని బొండా ఉమాకు చెప్పండి.. నేను చెల్లని నాణాన్నో.. చెల్లే నాణాన్నో చేసి చూపిస్తామన్నారు. తాను, తన కార్యకర్తలు పశ్చిమలో వైసీపీ గెలుపు కోసం కృషి చేస్తామన్నారు. ఆకస్మికంగా సీటు మార్చడంతో కార్యకర్తల్లో కొంత ఇబ్బంది ఉంటుందని, దాన్ని అధిగమించి ముందుకు పోతామన్నారు. సెంట్రల్‌లో అసమ్మతి వర్గంతో తాను, విష్ణు కలిసి మాట్లాడి గెలుపునకు కృషి చేస్తామన్నారు. తాను, విష్ణు అన్నదమ్ముల్లా ఉన్నామని, అలాగే ముందుకు వెళతామన్నారు. ఈసారి తూర్పు, పశ్చిమ, సెంట్రల్ అసెంబ్లీ సహా పార్లమెంట్ సీటును గెలిచి జగన్మోహనరెడ్డికి బహుమతిగా ఇస్తామన్నారు. ఆ సందర్భంగా బొండా ఉమాకు సవాలు విసిరారు. తానేమిటో చూపిస్తానన్నారు.

దేవదాయ శాఖ అనుమతి లేకుండా

భవనం పై అంతస్తు కూల్చివేత

వన్‌టౌన్, జనవరి 4: దేవదాయ శాఖ పరిధిలోని గవర్నరుపేట శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానానికి చెందిన పురాతన భవనం పై అంతస్తును ఓ టైల్స్ వ్యాపారి అధికారుల అనుమతి లేకుండా కూల్చివేశారు. ఈ ప్రదేశంలో నూతనంగా షాపు ఏర్పాటుకు ప్రయత్నం చేస్తున్నట్టు తెలుస్తోంది. వన్‌టౌన్ బ్రాహ్మణ వీధిలోని శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానానికి గవర్నరుపేట చల్లపల్లి బంగ్లా సమీపంలో రెండు వ్యాపార సముదాయ భవనాలున్నాయి. అందులో ఒకటి సుమారు 120 గజాల స్థలంలో వందేళ్ల క్రితం జీ+1 భవనాన్ని నిర్మాణం చేపట్టారు. గ్రౌండ్ ఫ్లోర్‌లో షాపును అధికారులు 2022లో వేలం పాట నిర్వహించగా శిఖాకొల్లి రంగారావు, సుభాష్ షాపును నెలకు రూ. 65వేల లీజుకు పాడుకుని శిఖాకొల్లి బ్రదర్స్ పేరుతో టైల్స్ వ్యాపారం నిర్వహిస్తున్నారు. దేవదాయశాఖ షాపును మూడేళ్ల పాటు లీజుకిచ్చింది. షాపు పైనున్న పెంకుటిల్లుతో వారికెలాంటి సంబంధం లేదు. అయితే శిఖాకొల్లి రంగారావు, సుభాష్ ఆ పెంకుటిల్లును వినియోగించుకోవాలనే దురుద్దేశంతో దేవదాయ శాఖ అధికారుల అనుమతి తీసుకోకుండా రాత్రికి రాత్రే కూల్చివేశారు. దీనిపై ఓ వ్యక్తి ఉన్నతాధికారులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశాడు. విషయం తెలుసుకుని అధికారులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. కింద టైల్స్ షాపులోని శిఖాకొల్లి రంగారావు, సుభాష్‌ను వివరాలడిగి తెలుసుకున్నారు. పైనున్న పెంకుటిల్లును కూల్చివేయమని ఈవో చెప్పినట్టు టైల్స్ వ్యాపారస్థులు పలువురు స్థానికులకు చెబుతున్నారు.



పై అంతస్తును కూల్చివేసిన భవనం ఇదే..

వ్యాపారులపై చర్యలు తీసుకుంటాం: ఈవో శ్రీనివాస్

అధికారుల అనుమతి లేకుండా పురాతన భవనం పైన పెంకుటిల్లును కూల్చివేసిన టైల్స్ వ్యాపారస్థులు శిఖాకొల్లి రంగారావు, సుభాష్‌పై శాఖపరమైన చర్యలు తీసుకుంటామని శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానం ఈవో శ్రీనివాస్ ఆంధ్రజ్యోతికి చెప్పారు.

అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయాలి

జగన్ సర్కారుకు వివిధ పార్టీల నేతల హెచ్చరిక

అమరావతి (ఆంధ్రజ్యోతి)/ విజయవాడ(ధర్నాచౌక్), జనవరి 4: అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయకపోతే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాసంఘాల నేతలు జగన్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విజయవాడలోని హనుమంతరాయ గ్రంథాలయంలో చేపట్టిన 30గంటల ధర్మపోరాట దీక్ష గురువారం ముగిసింది. టీడీపీ, కాంగ్రెస్, వామపక్ష పార్టీల రాష్ట్ర నేతలు పాల్గొని ప్రసంగించారు. సీఎం జగన్ ఇచ్చిన హామీలను అమలు చేయకుండా.. వైసీపీ ఎమ్మెల్యేల స్థానాలను మార్చడం వల్ల ప్రయోజనం ఉండదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. సిటింగ్ ఎమ్మెల్యేల స్థానాలను మారిస్తే ఓట్లు పడతాయనుకోవడం భ్రమేనని స్పష్టం చేశారు. టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య మాట్లాడుతూ అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయాలని కోరుతూ టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే బాధితులకు న్యాయం జరుగుతుందని భరోసా ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత ఎన్.తులసిరెడ్డి మాట్లాడుతూ అగ్రిగోల్డ్ బాధితులు, వారి కుటుంబ సభ్యులతో కలిపి దాదాపు 30లక్షల మంది ఓటర్లు ఉంటారని, వీరి ఓట్ల కోసమైనా సమస్యను పరిష్కరించాలని సూచించారు. అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ అగ్రిగోల్డ్ బాధిత కుటుంబాలకు ఈ నెల 15వ తేదీ లోపు రూ.10లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. మిగిలిన బాధితులకు డిపాజిట్ మొత్తాన్ని ఎప్పుడు చెల్లిస్తారో తేదీని ప్రకటించాలని కోరారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు అక్కినేని వనజ, ఏపీ మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెన్మెత్స దుర్గాభవానీ తదితరులు మాట్లాడారు.

20న మాదిగల రాజకీయ సమన్యాయ మహాసభ

ధర్నాచౌక్, జనవరి 4: రాష్ట్రంలో రానున్న ఎన్నికల్లో ఎస్సీలకు రిజర్వు అయిన 29 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 15 సీట్లు మాదిగ, మాదిగ అనుబంధ కులాలకు కేటాయించాలని ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దాసరి సువర్ణరాజు అన్ని రాజకీయ పార్టీలను డిమాండ్ చేశారు. ఈ డిమాండ్ సాధనకు ఈ నెల 20న వైఎస్సార్ కడప జిల్లా కడప పట్టణంలో లక్షమంది మాదిగలతో "మాదిగల రాజకీయ సమన్యాయ మహాసభ " నిర్వహిస్తున్నట్టు చెప్పారు. గాంధీనగర్‌లోని ఓ ప్రముఖ హోటల్‌లో గురువారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. మాదిగల ఓట్లు అత్యధికంగా ఉన్న చింతలపూడి, సింగమల, పూతలపట్టు, గోపాలపురం, బద్వేల్, నందికొట్కూరు నియోజకవర్గాలను మాల ఉపకులం వారికి కేటాయించడం దారుణమన్నారు. సమావేశంలో కుందుర్తి సుబ్బారావు, వరదరాజులు, ఏసుపోగు బాబు తదితరులు పాల్గొన్నారు.

పూలమొక్కల పెంపకం

సృజనాత్మక కళ: కలెక్టర్

కృష్ణలంక, జనవరి 4: పూలమొక్కల పెంపకం ఓ సృజనాత్మక కళ అని, హరితమయం, అందమైన పూలవర్ణాలతో పరిసరాలను ఆహ్లాకరంగా తీర్చిదిద్ది, అందమైన సమాజం లక్ష్యంగా, పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములవుతున్న రోజ్ సొసైటీ, హరిత ప్రియ ప్లాంట్ లవర్స్ సొసైటీ సేవలు అభినందనీయమని కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అన్నారు. రోజ్ సొసైటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, హరిత ప్రియ ప్లాంట్ లవర్స్ సొసైటీ, విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్, ఆంధ్రా నర్సరీ పార్మర్స్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో 7వ రాష్ట్రస్థాయి అగ్రి హార్టీకల్చర్ షో, 6వ వార్షిక గులాబీ ప్రదర్శన, విక్రయ స్టాళ్లను సిద్ధార్థ హోటల్ మేనేజ్‌మెంట్ కాలేజ్ మైదానంలో కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు, మేయర్ రాయన భాగ్యలక్ష్మి నిర్వాహకులతో కలిసి గురువారం ప్రారంభించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ మొక్కల పెంపకంతో ఆహ్లాదంతో పాటు ఆరోగ్యం కూడా సొంతమవుతుందన్నారు. ఈనెల 4 నుంచి 8 వరకు ప్రదర్శన జరుగుతుందని, ఇందులో రకరకాల గులాబీలు, పూలమొక్కలను ప్రదర్శించడం జరుగుతుందన్నారు. పట్టణ ప్రాంతాలతో పాటు గ్రామీణ ప్రాంతాల ప్రజలు ఈ ప్రదర్శనను సందర్శించాలన్నారు. రోజ్ సొసైటీ ప్రెసిడెంట్ జీఎస్ఆర్ మోహన్‌రావు, హానరరీ సీతామహాలక్ష్మి, వైస్ ప్రెసిడెంట్ పద్మజ, సెక్రటరీ ఎన్.పద్మప్రియ, ప్రతినిధులు లక్ష్మి, ఛాయ, రత్నలక్ష్మి, అఖిలాండేశ్వరి, శిరీష, రాఘవేంద్రరావు పాల్గొన్నారు.



అగ్రి హార్టికల్చర్, వార్షిక గులాబీ ప్రదర్శన, విక్రయ స్టాళ్లను ప్రారంభిస్తున్న కలెక్టర్ దిల్లీరావు, మేయర్ భాగ్యలక్ష్మి

అంధుల జీవితాల్లో బ్రెయిలీ వెలుగులు

- కలెక్టర్ దిల్లీరావు

ధర్నాచౌక్, జనవరి 4: బ్రెయిలీ లిపి అంధుల జీవితాల్లో వెలుగులు నింపుతోందని, దీన్ని సద్వినియోగం చే సుకుని జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కలెక్టర్ దిల్లీరావు ఆ కాంక్షించారు. జిల్లా విభిన్న ప్రతిభావంతులు, టీజీ, వయోవృద్ధుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో గురువారం జరిగిన లూ యిస్ బ్రెయిలీ 215 జయంతి సభకు ఆయన హాజరయ్యారు. తొలుత విభి న్న ప్రతిభావంతులతో కలిసి లూయిస్ బ్రెయిలీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మాట్లాడుతూ చేతి వేళ్లతో చుక్కలను స్పృశించడం ద్వారా చదవగలిగే లిపిని ఆవిష్కరించడంతో బ్రెయిలీ మహామనిషిగా నిలిచారన్నారు. సిస్టమాటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్ (స్వీప్)లో భాగంగా విభిన్న ప్రతిభావంతులకు ఓటు ప్రాధాన్యం, నమోదు, వివిధ ఫారాలు వంటి అంశాలపై అధికారులు అవగాహన కల్పించారు. విభిన్న ప్రతిభావంతులు, టీజీ, వయోవృద్ధుల సంక్షేమశాఖ ఏడీ వి.కామరాజు, ఎన్ఎఫ్‌బీ ఉమ్మడి కృష్ణాజిల్లా అధ్యక్షుడు హసీమ్, విజువల్లీ చాలెంజ్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు దుర్గారావు పాల్గొన్నారు.





ఆందోళన చేస్తున్న జనసేన నేతలను నిలువరిస్తున్న ఎస్సై రమేష్

జగనన్న ఇళ్ల నిర్మాణంలో

మోసపోయిన వారిని ఆదుకోవాలి

- జనసేన సేతల డిమాండ్

పెనమలూరు, జనవరి 4: ఇళ్లు నిర్మిస్తామని అమాయక కూలీల వద్ద లక్షల్లో డబ్బులు వసూలు చేసి మోసం చేసిన దళారి ఖనిజం వీరకృష్ణ, యనమలకుదురు సచివాలయ సిబ్బంది నవీన్, సురేష్‌వర్మపై కఠి న చర్యలు తీసుకోవాలని జనసేన నేతలు, తాడిగడప మునిసిపాలిటీ జ నసేన అధ్యక్షుడు తాతపూడి గణేష్, టీడీపీ పెనమలూరు నియోజకవర్గ సమన్వయ కర్త ముప్పారాజా, కరిమికొండ సురేష్, వడ్డీ జీవా డిమాండ్ చేశారు. గురువారం వణుకూరు ఇళ్లస్థలాల నిర్మాణంలో బిల్డర్ వీరకృష్ణ చేతిలో మోసపోయిన బాధితులతో కలిసి జనసేన నేతలు సచివాలయా లు, పెనమలూరు పోలీసు స్టేషను వద్ద ఆందోళన చేపట్టారు. పేదలందరికీ ఇళ్లంటూ దళారులను ప్రవేశపెట్టి వైసీపీ నేతలు జేబులు నింపుకున్నారన్నారు. ఆందోళన వ్యక్తం చేస్తున్న జనసేన నేతలను పోలీసులు వా రించడంతో పోలీసు స్టేషను వద్ద కొద్దిసేపు స్వల్ప ఉద్రిక్త పరిస్థితులు నె లకొన్నాయి. జగన్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా బాధితులు, జనసేన నేత లు నినాదాలు చేశారు. జనసేన నేతలు చెన్నా గాంధీ, అడపా నాగశ్రీ, ఆవుల రత్తయ్య, తిరుమలశెట్టి సుధీర్, సుంకర శివ, పచ్చిపాల రాజా, పంచకర్ల గణేష్, కొప్పనాతి రమేష్, కరీముల్లా పాల్గొన్నారు.

రహదారి ప్రమాదంలో

బాలుడికి తీవ్రగాయాలు

- కన్ను, ముక్కు భాగాల్లో చెక్కుకుపోయి తీవ్రరక్తస్రావం

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జనవరి 4: స్కూల్ వెళ్లేందుకు ఆటో ఎక్కిన విద్యార్థి ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ప్రాణాపాయస్థితికి చేరుకున్న ఘటన బండారుగూడెంలో గురువారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం బండారుగూడెం కు చెందిన బెజవాడ సూర్య హనుమాన్‌జంక్షన్‌లోని విద్యాసంస్థలో 10వ తరగతి చదువుతున్నాడని, రోజులాగే ఆటోలో స్కూ ల్‌కు వెళుతుండగా మలుపువద్ద ఆటో అదుపుత ప్పి ప్రమాదం జరిగింది. ప్రమాదంలో సూర్య రోడ్డుపై పడిపోయి కొంతదూరం ఈడ్చుకుపోవడంతో ముఖం ప క్కభాగంలోని కన్ను, ముక్కు ప్రాంతం కొట్టుకుపోయి తీవ్ర రక్తస్రావమైంది. క్షతగాత్రుడి తండ్రి అనారోగ్యంతో ఇంటివద్దే ఉంటాడని, తల్లి కష్టపడి పోషిస్తోందని, మరో సోదరుడు ఇంటర్ చదువుతున్నాడని స్థానిక లు తెలిపారు. స్థానికుల సమాచారంతో ఘటనాస్థలానికి చేరుకున్న వీరవల్లి ఎస్సై చిరంజీవి క్షతగాత్రుడిని అంబులెన్స్‌లో విజయవాడకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.



రోడ్డు ప్రమాదంలో నెత్తురోడుతున్న సూర్య

జాతీయ బాస్కెట్‌బాల్‌కు నగేష్‌బాబు

విజయవాడ స్పోర్ట్సు, జనవరి 4: పంజాబ్ రాష్ట్రం పాటియాలలో ఈనెల 6 నుంచి 11వరకు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జరిగే 67వ జాతీయ బాస్కెట్‌బాల్ పోటీలకు జిల్లాకు చెందిన జి.నగేష్‌బాబు ఎంపికయ్యాడు. నగరంలోని ఐజీఎంసీలో కోచ్ ఎస్.సంతోష్ కుమార్ వద్ద శిక్షణ పొందుతున్న నగేష్ మదనపల్లిలో జరిగిన రాష్ట్ర అండర్-19 పోటీల్లో చూపిన ప్రతిభ ఆధారంగా ఎంపికయ్యాడు. కోచ్, నగేష్‌ను జిల్లా క్రీడాభివృద్ధి అధికారి అజీజ్ గురువారం అభినందించారు.



ఎంపికైన నగేష్‌బాబును అభినందిస్తున్న అజీజ్

స్మృతివనం ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేయండి

- అధికారులకు మంత్రి నాగార్జున ఆదేశం

కృష్ణలంక: దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్మించి న అంబేద్కర్ స్మృతివనం, 125 అడుగుల అంబేద్కర్ విగ్రహావిష్కరణకు అన్ని ప్రాంతాల నుంచి అంబేద్కర్ అభిమానులు భారీగా వచ్చే అవకా శం ఉందని మంత్రి మేరుగ నాగార్జున తెలిపారు. ఈనెల 19న ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా పటిష్ఠ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. గు రువారం సచివాలయంలో ఏర్పాట్లపై అధికారులతో ఆయన సమీక్షించారు. పురపాలక పట్టణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ వై.శ్రీలక్ష్మి, ఎమ్మెల్యే మల్లాది విష్ణు, సాంఘిక సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జి.జయలక్ష్మి, జేసీ సంపత్‌కుమార్, వీఎంసీ కమిషనర్, సాంఘిక సంక్షేమ శాఖ ఏడీ రఘురామ్ పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న కార్మికులు

జగన్ ప్రభుత్వాన్ని గద్దె దించుతాం

- కార్మికుల ఆందోళనలో ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు

చిట్టినగర్, జనవరి 4: పారిశుధ్య కార్మికులను దగా చేసిన జగన్ ప్రభుత్వాన్ని గద్దె దించుతామని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఆసుల రంగనాయకులు అన్నారు. మున్సిపల్ పారిశుధ్య కార్మికుల ఆందోళనలో భాగంగా గురువారం కొత్తపేట నెహ్రూబొమ్మ సెంటర్‌లో ధర్నా నిర్వహించారు. అనంతరం కేటీరోడ్డులో ప్రదర్శనగా వెళ్లి భిక్షాటన చేశారు. అనంతరం మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులను జగన్ ప్రభుత్వం మోసం చేసిందని, చర్చల పేరిట కాలయాపన చేస్తూ మాయ చేస్తున్నారన్నారు. సమస్యలపై పరిష్కారంపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదన్నారు. వెంటనే తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించి సమ్మెను విరమింపజేయాలన్నారు. లేకుంటే ఉదయం, సాయంత్రం ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం కార్మికులకు చేసిన అన్యాయాన్ని నేరుగా ప్రజలకు వివరించి కరపత్రాలను పంపిణీ చేస్తామన్నారు. యూనియన్ నేతలు విక్కీ తుపాకుల నాగేశ్వరరావు, జిక్కి జేమ్స్, ఏఐటీయూసీ నగర సహాయ కార్యదర్శి కొట్టు రమణారావు, నేతలు సింగరాజు సాంబశివరావు, ఆకుల ఏసు, భూపతి వెంకటేశ్వరరావు, భారతి పాల్గొన్నారు.

పొగమంచులోనూ రైళ్లు రయ్ రయ్..



రైళ్లకు అమర్చే ఫాగ్‌పాస్ పరికరం

» ఫాగ్‌పాస్ పరికరాలు సమకూర్చిన రైల్వే శాఖ

» లోకో పైలట్లకు ఎంతో ఉపయోగకరం

గుంటూరు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): శీతాకాలంలో దట్టమైన పొగమంచు కారణంగా రైళ్లు ఆలస్యంగా నడుస్తుంటాయి. కొన్ని సందర్భాల్లో ప్రమాదాలు కూడా జరుగుతుంటాయి. గంటకు 130 కి.మీ. వేగంతో ప్రయాణించాల్సిన రైళ్లు కూడా 30 నుంచి 40 కి.మీ. వేగంతోనే వెళుతుంటాయి. గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలోనూ ఈ సమస్య ఉంది. ప్రధానంగా శబరి, ప్రశాంతి, అమరావతి, ఫలక్‌నుమా తదితర ఎక్స్‌ప్రెస్ రైళ్లపై శీతాకాలంలో మంచు ప్రభావం అధికంగా ఉండేది. అయితే ఈ కష్టాలన్నింటికీ చెక్ పెడుతూ.. పొగ మంచులోనూ రైళ్లు రయ్ రయ్‌మంటూ దూసుకెళ్లి సకాలంలో గమ్యస్థానాలకు చేరేలా రైల్వేశాఖ ఇటీవల ఫాగ్‌పాస్ పరికరాలను అందుబాటులోకి తెచ్చింది. దీనివల్ల రైలు ప్రయాణం మరింత సురక్షితంగా మారుతుందని, లోకో పైలట్లు ఎలాంటి భయం లేకుండా విధులు నిర్వహించవచ్చని పేర్కొంది.

ఈ పరికరం ఎలా పనిచేస్తుందంటే..

ఫాగ్‌పాస్ జీపీఎస్ ఆధారిత నేవిగేషన్ డివైస్. ఇది ఆన్‌బోర్డు రియల్‌టైం సమాచారాన్ని లోకో పైలట్‌కు అందిస్తుంది. డిస్‌ప్లేతోపాటు వాయిస్ ద్వారానూ సమాచారం ఇస్తుంది. రైలు వెళ్లే మార్గంలో వచ్చే సిగ్నల్స్, లెవల్ క్రాసింగ్ గేట్లు, వేగ నియంత్రణ, న్యూట్రల్ సెక్షన్ల గురించి తెలియజేస్తుంది. ఈ పరికరానికి 18 గంటల పాటు బ్యాటరీ బ్యాకప్ కలిగిన బిల్ట్-ఇన్- రీచార్జబుల్ బ్యాటరీ ఉంటుంది. దీని బరువు కూడా 1.5 కిలోలే. లోకో పైలట్ విధులకు హాజరయ్యేటప్పుడు తన చేతిలో పట్టుకుని తీసుకెళ్లవచ్చు.

కోర్టు సమయం వృథా చేశావ్..

లక్ష కట్టు!

» వాస్తవాన్ని దాచి పదేపదే అప్పీల్ చేసిన వ్యక్తిపై హైకోర్టు ఆగ్రహం

అమరావతి, జనవరి 4(ఆంధ్రజ్యోతి): వాస్తవాన్ని దాచి, పదేపదే అప్పీలు చేసిన వ్యక్తిపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. కోర్టు విలువైన సమయాన్ని వృథా చేయడంతోపాటు, విచారణ ప్రక్రియను దుర్వినియోగం చేసినందుకు ఖర్చుల కింద రూ.లక్ష చెల్లించాలని ఆదేశించింది. ఆ మొత్తాన్ని ఆరు వారాల్లోగా లీగల్ సర్వీసెస్ అథారిటీకి చెల్లించాలని నిర్దేశించింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ జి.నరేందర్, జస్టిస్ ఎన్.విజయ్‌తో కూడిన ధర్మాసనం ఇటీవల తీర్పు ఇచ్చింది. పశ్చిమగోదావరి జిల్లా చాగల్లు మండలం, దారవరం గ్రామానికి చెందిన అబ్రహం సాంఘిక సంక్షేమశాఖ ఉద్యోగి. ఆయనను ఉద్యోగం నుంచి తొలగిస్తూ సాంఘిక సంక్షేమశాఖ 1984లో ఉత్తర్వులిచ్చింది. వాటిని సవాల్ చేస్తూ అబ్రహం 1991లో లేబర్ కోర్టులో పిటిషన్ వేశారు. లేబర్‌కోర్టు అతన్ని తిరిగి ఉద్యోగంలో చేర్చుకోవాలంటూ 1996లో ఆదేశాలిచ్చింది. సాంఘిక సంక్షేమశాఖ అధికారులు 1997లో అబ్రహంకు కాల్‌లెటర్ కూడా పంపారు. అయితే అబ్రహం అప్పటికే తపాలాశాఖ ఉద్యోగంలో చేరారు. ఆ విషయాన్ని దాచిపెట్టి లేబర్‌కోర్టు ఆదేశాలను అమలు చేయడంతోపాటు 1997 నుంచి 2002 కాలానికి వేతనాలు చెల్లించేలా ఆదేశాలివ్వాలని కోరుతూ అబ్రహం ఎగ్జిక్యూషన్ పిటిషన్(ఈపీ) దాఖలు చేశారు. ఆ ఈపీని కోర్టు అనుమతించింది. ఈపీ ఉత్తర్వులపై సాంఘిక సంక్షేమశాఖ అధికారులు 2016లో హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. 1992లోనే అబ్రహం తపాలాశాఖలో ఉద్యోగంలో చేరారని, లేబర్ కోర్టు ఆదేశాలకు అనుగుణంగా తాము కాల్ లెటర్ పంపించినా అతను ఉద్యోగంలో చేరలేదని కోర్టు దృష్టికి తెచ్చారు. ఆధారాలను పరిశీలించిన హైకోర్టు సింగిల్ జడ్జి వేతన బకాయిలు చెల్లించాలంటూ లేబర్ కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేస్తూ 2017లో తీర్పు ఇచ్చారు. ఈ తీర్పును సవాల్ చేస్తూ అబ్రహం అదే ఏడాది హైకోర్టు ముందు అప్పీల్ చేశారు. విచారణ జరిపిన ధర్మాసనం అబ్రహంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ రూ.లక్ష ఖర్చులు విధించింది.

యశస్వి లుక్ అవుట్ సర్క్యులర్‌పై వివరాలు సమర్పించండి

» సీఐడీకి హైకోర్టు ఆదేశం.. విచారణ 9కి వాయిదా

అమరావతి, జనవరి 4(ఆంధ్రజ్యోతి): ఏపీ సీఐడీ అధికారులు తనపై జారీచేసిన లుక్ అవుట్ సర్క్యులర్‌ను రద్దు చేయాలని కోరుతూ ఎన్ఆర్ఐ బొద్దులూరి యశస్వి దాఖలు చేసిన పిటిషన్ గురువారం హైకోర్టులో విచారణకు వచ్చింది. ఈ వ్యవహారంపై పూర్తి వివరాలు సమర్పించాలని సీఐడీని హైకోర్టు ఆదేశించింది. విచారణను ఈనెల 9కి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బీఎస్ భానుమతి గురువారం ఆదేశాలిచ్చారు. సీఎం జగన్‌ను, రాష్ట్ర ప్రభుత్వాన్ని అప్రతిష్ఠ పాలుచేసేలా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారంటూ యశస్విపై కేసు నమోదు చేసిన సీఐడీ పోలీసులు ఆయనపై లుక్ అవుట్ సర్క్యులర్ జారీ చేశారు. దాన్ని రద్దు చేయాలని కోరుతూ యశస్వి దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టు విచారణ జరిపింది. యశస్వి తరఫున పీపీజీ ఉమేశ్‌చంద్ర వాదనలు వినిపించారు. లుక్ అవుట్ సర్క్యులర్‌ను రద్దు చేయాలని అభ్యర్థించారు.

నిందితుడికి సాగిలపడతారా?

» ఆ పోలీసులపై చర్య తీసుకోండి: రామకృష్ణ

అమరావతి, జనవరి 4(ఆంధ్రజ్యోతి): దళిత యువకుడిని హత్య చేసి డోర్ డెలివరీ చేసిన వైసీపీ ఎమ్మెల్సీ అనంత ఉదయ భాస్కర్‌కు పోలీసు అధికారులు పుష్పగుచ్ఛాలు అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలపడం పోలీసు వ్యవస్థకే సిగ్గుచేటని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ విమర్శించారు. పోలీసులు అవినీతికి, ప్రలోభాలకులోనై దిగజారిపోతున్న తీరుకు ఇదే నిదర్శనమని గురువారం పేర్కొన్నారు. హంతకుడికే పోలీసులు సాగిలపడుతుంటే హత్యకు గురైన సుబ్రహ్మణ్యం కుటుంబానికి న్యాయం ఎలా జరుగుతుందని ప్రశ్నించారు. ఎమ్మెల్సీ అనంతబాబుకు శుభాకాంక్షలు తెలిపేందుకు పోటీపడిన పోలీసులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఏసీబీ వలలో దర్శి ఎస్ఐ

» రూ.20 వేలు లంచం తీసుకుంటుండగా పట్టివేత



లంచం సొమ్ముతో ఎస్ఐ రామకృష్ణ, చిత్రంలో ఏసీబీ అధికారులు

దర్శి, జనవరి 4: ప్రకాశం జిల్లా దర్శి ఎస్ఐ డి.రామకృష్ణ లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు. ఏసీబీ డీఎస్పీ శ్రీనివాసరావు కథనం ప్రకారం.. దర్శి పట్టణానికి చెందిన శేషం రమణయ్య అతని సోదరుడు చిన్న రమణయ్య, తండ్రి వెంకటేశ్వర్లు 2022లో జరిగిన హత్య కేసులో నిందితులు. వారిపై రౌడీషీట్ కూడా తెరిచారు. దానిని ఎత్తివేయాలంటూ నిందితులు హైకోర్టును ఆశ్రయించారు. కౌంటర్ ఫైల్ దాఖలు చేయాలని ఎస్పీ మలికగర్గ్‌కు కోర్టు ఆదేశాలు అందాయి. జిల్లా పోలీసు కార్యాలయం నుంచి ఆ సమాచారాన్ని దర్శి పోలీస్ స్టేషన్‌కు పంపారు. కౌంటర్ దాఖలుకు రూ.లక్ష లంచం ఇవ్వాలని ఎస్ఐ రామకృష్ణ రమణయ్యను డిమాండ్ చేశారు. దీంతో రమణయ్య ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. వారి సూచన మేరకు గురువారం మధ్యాహ్నం ఎస్సైకి రూ.20 వేలు అందజేశారు. కొద్దిసేపటికే ఏసీబీ అధికారులు ఎస్ఐని రెడ్‌హ్యాండెడ్‌గా అదుపులోకి తీసుకొని నగదు స్వాధీనం చేసుకున్నారు.

ధర్మాసుపత్రిలో ఇదేం పాడుబుద్ధి!

» నెల్లూరు జీజీహెచ్‌లో ఎంఎన్‌వో, పారిశుధ్య కార్మికురాలి రాసలీలలు

నెల్లూరు (వైద్యం), జనవరి 4: నెల్లూరులోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో రాసలీలల వీడియోలు కలకలం రేపుతున్నాయి. ఈ విషయం ఉన్నతాధికారులకు తెలియడంతో పారిశుధ్య కార్మికురాలిని విధుల నుంచి తొలగించారు. జనరల్ ఆసుపత్రి ప్రసూతి విభాగంలో బుధవారం మధ్యాహ్నం మేల్ నర్స్ ఆర్డినరీ(ఎంఎన్‌వో), ఓ పారిశుధ్య కార్మికురాలు సన్నిహితంగా ఉన్న సమయంలో పారిశుధ్య సూపర్‌వైజర్ తన సెల్‌ఫోన్‌లో వీడియో తీసినట్టు సమాచారం. ఈ వీడియో ఉన్నతాధికారుల వరకు వెళ్లింది.

అటవీశాఖలో స్టేట్ క్యాడర్ పోస్టుల నిర్ధారణ

అమరావతి, జనవరి 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అటవీ శాఖలో పరిపాలనా సౌలభ్యం కోసం వివిధ డివిజన్లు, సబ్ డివిజన్లను పునర్విభజన చేసిన నేపథ్యంలో స్టేట్ క్యాడర్ పోస్టులు నిర్ధారించారు. ఏపీ ఫారెస్ట్ సర్వీస్ స్ట్రెంత్ కింద 33మంది డిప్యూటీ కన్జర్వేటర్, 62మంది అసిస్టెంట్ కన్జర్వేటర్ పోస్టులను వివిధ విభాగాలకు కేటాయించారు. ఈ మేరకు ప్రభుత్వం గురువారం గెజిట్ ఉత్తర్వులు జారీ చేసింది. కాగా, రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ నెల్లూరు రీజనల్ మేనేజర్‌గా ఐఎఫ్ఐ అధికారి సందీప్ కృపాకర్ గుండాలను నియమిస్తూ ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది.

జూనియర్ కాలేజీలకు ఆన్‌లైన్ అఫిలియేషన్లు

అమరావతి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): జూనియర్ కాలేజీలకు ఇకపై ఆన్‌లైన్ విధానంలో అఫిలియేషన్లు ఇవ్వాలని ఇంటర్మీడియట్ విద్యాశాఖ నిర్ణయించింది. ఇప్పటికే ఈ విధానం కొంతమేర అమల్లో ఉండగా పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురానుంది. ఈ మేరకు గురువారం తాడేపల్లిలోని ఇంటర్ విద్య కార్యాలయంలో విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అధ్యక్షతన బోర్డు సమావేశంలో తీర్మానించారు.

పదోన్నతుల్లో ఓసీ, బీసీ ఉద్యోగులకు న్యాయం చేయాలి

పదోన్నతుల్లో ఓసీ, బీసీ, మైనార్టీ ఉద్యోగులకు అన్యాయం జరుగుతోందని, న్యాయం చేయాలని సచివాలయ బీసీ, ఓసీ సంఘం డిమాండ్ చేసింది. అమరావతి సచివాలయంలో గురువారం సంఘం జనరల్ బాడీ సమావేశం అనంతరం సీఎస్ కార్యాలయంలో వినతి పత్రాన్ని అందజేశారు. సంఘం అధ్యక్షులు అప్పారావు, నాపా ప్రసాద్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

జనసేన శ్రీకాకుళం అధ్యక్షుడిగా చంద్రమోహన్

అమరావతి, జనవరి 4(ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా అధ్యక్షునిగా పిసిని చంద్రమోహన్ నియమితులయ్యారు. ఈమేరకు గురువారం మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో పార్టీ అధ్యక్షులు పవన్ కల్యాణ్ నియామకపత్రాన్ని అందజేశారు. వలసలు ఎక్కువగా ఉండే శ్రీకాకుళం జిల్లాను అభివృద్ధి చేయడంపై జనసేనకు ప్రత్యేక దృష్టి ఉందని, అక్కడి యువతకు, మహిళలకు ప్రస్తుత ప్రభుత్వ పాలనలోని వైఫల్యాలపై అవగాహన కల్పించాలని చంద్రమోహన్‌కు సూచించారు.

కలకత్తా హైకోర్టు తీర్పులో సమస్యాత్మక పేరాగ్రాఫ్‌లు

» బాలికలకు చెప్పిన హితవు అభ్యంతరకరం: సుప్రీంకోర్టు వ్యాఖ్య

న్యూఢిల్లీ, జనవరి 4: లైంగిక దాడి కేసులోని నిందితుడ్ని విడుదల చేస్తూ కలకత్తా హైకోర్టు ఇచ్చిన తీర్పులోని కొన్ని పేరాలు సమస్యాత్మకంగా ఉన్నాయని గురువారం సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. ఈ కేసులో నిందితుడికి కింది కోర్టు 20 ఏళ్ల జైలు శిక్ష విధించగా, అది పరస్పర అంగీకారంతో జరిగిన శృంగారమని భావించి హైకోర్టు నిర్దోషిగా ప్రకటించింది. ఈ సందర్భంగా బాలికలకు హితబోధన చేసింది. 'లైంగిక కోరికలను అదుపులో ఉంచుకోవాలని', 'రెండు నిమిషాల సుఖం కోసం లొంగిపోవద్దంటూ' పలు వ్యాఖ్యలు చేసింది. ఈ వ్యాఖ్యలపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి అభ్యంతరం చెప్పారు. ఈ కేసు గురువారం మళ్లీ జస్టిస్ ఎ.ఎస్.ఓకా, జస్టిస్ ఉజ్జల్ భుయాన్ ధర్మాసనం ముందుకువచ్చింది. హైకోర్టు తీర్పుపై సకాలంలో అప్పీలు చేయలేకపోయామని బెంగాల్ ప్రభుత్వం తరఫు సీనియర్ న్యాయవాది హుఫేజా అహ్మదీ అంగీకరించారు. ఈ సందర్భంగా కొన్ని పేరాలను ఆయన చదివి వినిపించారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ తీర్పు రాసే పద్ధతి ఇదేనా అని ప్రశ్నించింది. అలాంటి వ్యాఖ్యలు సమస్యాత్మకంగా మారుతాయని అభిప్రాయపడింది. విచారణను ఈనెల 12కు లిస్టు చేయాలని రిజిస్ట్రీని ఆదేశించింది.

కంది రైతుల కోసం 'ఈ-సమృద్ధి' పోర్టల్!

న్యూఢిల్లీ, జనవరి 4: దేశంలో కంది పప్పు పండించే రైతుల కోసం 'ఈ-సమృద్ధి' పేరుతో కేంద్రం ఓ పోర్టల్‌ను తీసుకొచ్చింది. దీన్ని కేంద్ర హోం, సహకార శాఖ మంత్రి అమిత్ షా గురువారం ప్రారంభించారు. ఈ పోర్టల్‌లో కంది రైతులు రిజిస్ట్రేషన్ చేసుకోవడం ద్వారా తమ పంటను కనీస మద్దతు ధర లేదా మార్కెట్ ధరలకు విక్రయించుకోవచ్చని ఆయన వెల్లడించారు.

ఇకమీద రక్తంపై ప్రాసెసింగ్ చార్జీలు మాత్రమే: డీసీజీఐ

న్యూఢిల్లీ, జనవరి 4: రక్తం కోసం ఆస్పత్రులు, బ్లడ్ బ్యాంకులు ఎక్కువ డబ్బులు వసూలు చేయడాన్ని కట్టడి చేసేందుకు డ్రగ్స్ కంట్రోలర్ జనరల్ ఆఫ్ ఇండియా(డీసీజీఐ) ఓ కీలక నిర్ణయం తీసుకుంది. రక్తంపై ప్రాసెసింగ్ రుసుము మినహా మరే ఇతర రుసుములు వసూలు చేయడానికి వీల్లేదని నిర్ణయించింది. ఇందుకు సంబంధించి అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని డ్రగ్స్ కంట్రోలర్స్, లైసెన్సింగ్ అథారిటీలకు డీసీజీఐ ఆదేశాలు జారీ చేసింది. ప్రాసెసింగ్ ఫీజు రూ.250 నుంచి రూ.1,550 వరకు మాత్రమే వసూలు చేయాలని పేర్కొంది.

బంగారుకొండకు

వసూల్‌రాజా అండ

» గనుల అక్రమాలపై విజిలెన్స్ విచారణకు మోకాలడ్డు

» చీకటి కోణాలు వెలుగు చూస్తాయనే

» పెద్దలు, బంగారుకొండ అవినీతి బయటపడకుండా పన్నాగం

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలో ముఖ్యనేత వద్ద పనిచేస్తున్న వసూల్ రాజా మళ్లీ తెరమీదకు వచ్చారు. గనులశాఖలో అవినీతి, అక్రమాలు.. చట్టాలు, నిబంధనలు ఉల్లంఘించి అడ్డగోలు దోపిడీకి పాల్పడిన బంగారుకొండతో పాటు కొందరు సీనియర్ అధికారులను కాపాడేందుకు తన పలుకుబడిని ఉపయోగిస్తున్నారు. తన అధికారాలను దుర్వినియోగం చేస్తూ గనులశాఖలో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విచారణను అడ్డుకుంటున్నారు. లేఖలు, నివేదికలపై తనకు తెలియకుండా ఏ నిర్ణయాలూ తీసుకోవద్దని, ఎన్నికల సమయంలో విచారణ పేరిట తమ వారికి కొత్త కష్టాలు తీసుకురావద్దని విచారణ వ్యవస్థను కట్టడి చేసే ప్రయత్నం చేస్తున్నారు. ఈ పరిణామాలతో విజిలెన్స్ విచారణనే అడ్డుకునేంతగా గనుల శాఖలో ఏం జరుగుతోందన్న చర్చ సాగుతోంది. రాష్ట్రంలో భూముల సర్వేకు అవసరమైన సర్వే రాళ్ల కొనుగోళ్లను ప్రభుత్వం గనుల శాఖకు అప్పగించిన సంగతి తెలిసిందే. దాదాపు మూడున్నర కోట్ల సర్వే, సరిహద్దు రాళ్ల కొనుగోలు బాధ్యతను గనుల శాఖ తీసుకుంది. అయితే టెండర్లు లేకుండా ఓ ప్రైవేటు సంస్థకు వర్క్ ఆర్డర్ ఇచ్చారు. సగటున ఒక్కో రాయిపై రూ.100 చొప్పున అధికారులు వెనకేసుకునేలా వ్యూహం అమలు చేశారని, ఇందులో బంగారుకొండకు రూ.50, మరో ముగ్గురు అధికారులు, సరఫరా చేసిన కాంట్రాక్టర్‌కు కలిపి రూ.50 దక్కేలా వ్యవహారం నడిపారని ఆరోపిస్తూ గనులశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి ఫిర్యాదు వచ్చింది. తొలుత ఈ ఫిర్యాదుపై విజిలెన్స్ విచారణ చేయించాలని మంత్రి ఆదేశించారు. అప్పుడు బంగారుకొండ.. వసూల్‌రాజా శరణు కోరారు. దీంతో ఆయన్ను కాపాడేందుకు విజిలెన్స్ విచారణ జరగకుండా వసూల్‌రాజా అడ్డుకున్నారు. చివరకు గనులశాఖ డైరెక్టర్, ఏపీఎండీసీ మేనేజింగ్ డైరెక్టర్‌గా ఉన్న వెంకటరెడ్డితోనే విచారణ చేయించాలని పట్టుబట్టి సాధించారు. అయితే వెంకటరెడ్డిని సత్వరమే విచారణ నివేదిక ఇవ్వాలని కోరగా ఆయన నింపాదిగా డిసెంబరులో ఇచ్చారు. అక్రమాలేవీ జరగలేదని, అంతా పారదర్శకం అంటూ అసలు విషయాలు చెప్పకుండా నిజాలను దాటవేసి నివేదిక ఇచ్చారు. ఈ నివేదికపై సర్కారు తీవ్ర అసంతృప్తితో ఉంది. నివేదికను పరిశీలిస్తే గ్రానైట్ రాళ్ల కొనుగోళ్లలో ఏదో గూడుపుఠాణి జరిగిందని, దాన్ని నివేదికలో పొందుపరచలేదన్న అభిప్రాయానికి వచ్చినట్లు తెలిసింది. మరోవైపు ఇదే అంశంపై సమగ్ర ఆధారాలు, నివేదికలను పొందుపరుస్తూ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ), విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్‌తో పాటు లోకాయుక్తకు ఫిర్యాదులు వెళ్లాయి.

విజిలెన్స్ విచారణకు లేఖ

రాళ్ల కొనుగోళ్లపై వచ్చిన ఆరోపణలపై విజిలెన్స్ విచారణ జరిపించాలని ప్రభుత్వం భావించింది. సకాలంలో వెంకటరెడ్డి నుంచి నివేదిక రాకపోవడం, మరోవైపు ఆరోపణల తీవ్రత పెరుగుతుండటంతో ఈ మొత్తం వ్యవహారంపై విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్‌తోనే విచారణ జరిపించాలని మంత్రి పెద్దిరెడ్డి భావించారు. సమగ్ర విచారణ చేపట్టాలని కోరుతూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి గోపాలకృష్ణ ద్వివేది లేఖ రాశారు. ప్రభుత్వానికి అందిన ఫిర్యాదు, మంత్రి కార్యాలయం రాసిన లేఖను జతచేసి విజిలెన్స్‌కు పంపించారు. సాధారణంగా విజిలెన్స్ విభాగం సీఎం నేతృత్వంలోని జీఏడీ నియంత్రణలో ఉంటుంది. ఈ విభాగం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి రిపోర్టు చేస్తుంది. అయితే విచారణ జరగకుండా వసూల్‌రాజా చక్రం తిప్పారు.

ఈ బంధం చాలా స్ట్రాంగ్

జగన్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్ రెడ్డి, గనుల శాఖ డైరెక్టర్, ఏపీఎండీసీ మేనేజింగ్ డైరెక్టర్ వెంకటరెడ్డిది ఉమ్మడి కడప జిల్లానే. ఒకే సామాజికవర్గం. ముఖ్యనేత వద్ద పనిచేస్తున్న వసూల్‌రాజాది కూడా ఉమ్మడి కడప జిల్లానే. ఈ జిల్లా బంధం చాలా గట్టిదని వసూల్‌రాజా నిరూపిస్తున్నారు. గనుల శాఖ ముఖ్య కార్యదర్శి కోరినట్లుగా సర్వే రాళ్ల కొనుగోళ్లలో అక్రమాల ఆరోపణలపై విజిలెన్స్ విచారణ చేయాలి. ఈ మేరకు ఉత్తర్వులు ఇవ్వాల్సింది ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డే. విజిలెన్స్ విచారణ జరిపి సీఎస్‌కే నివేదిక ఇవ్వాలి. మధ్యలో వసూల్‌రాజా ప్రమేయం లేదు. ఎందుకంటే.. జీఏడీకి సీఎస్‌నే హెడ్‌గా ఉంటారు. కాబట్టి విచారణ జరగాలా? వద్దా అనేది నిర్ణయించేది సీఎస్‌నే. అయితే ముఖ్యనేత ఆఫీసులున్న వసూల్‌రాజా అన్నింటికి అడ్డుపడుతున్నారు. బంగారుకొండతోపాటు ఇతర అధికారుల అక్రమాలేవీ బయటపడకుండా అడ్డుకోవాలన్న తలంపుతోనే ఆయన ఇలా చేస్తున్నారని తెలుస్తోంది. కారణమేంటంటే.. విజిలెన్స్ విచారణ జరిగి నిజంగానే రాళ్ల కొనుగోళ్లలో అక్రమాలు జరిగాయని తేలితే ఆ శాఖ విభాగాధిపతిగా ఉన్న వెంకటరెడ్డికే ఇబ్బంది. ఎందుకంటే ఆయనకు తెలియకుండా ఏ నిర్ణయం జరగదక్కడ. అక్రమాలు జరుగుతుంటే, ఏపీఎండీసీ ఎండీగా ఏం చేస్తున్నారంటూ ఆయన్ను కూడా ప్రశ్నించాల్సి వస్తుంది. ఇది జరగడం వసూల్‌రాజాకు ఇష్టం లేకపోవడంతో విచారణ ప్రారంభం కాకముందే అడ్డుపుల్లలు వేస్తున్నట్లు తెలుస్తోంది. గనుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఇచ్చిన లేఖను కూడా వెనక్కి తీసుకోవాలని తీవ్ర ఒత్తిడి తెస్తున్నట్లు తెలిసింది.

దారితప్పిన విజిలెన్స్!

» ఆరోగ్యశ్రీలో ఈ విభాగంపైనే ఎక్కువ ఫిర్యాదులు

» తనిఖీల పేరుతో ఆస్పత్రులకు బెదిరింపులు

» నెట్‌వర్క్ ఆస్పత్రుల నుంచి భారీ ఎత్తున వసూళ్లు

» అనంత, చిత్తూరు, గుంటూరు.. అన్ని జిల్లాల్లోనూ ఇదే తీరు

» ఫిర్యాదులు వచ్చినా పట్టించుకోని ట్రస్ట్ అధికారులు

అమరావతి, జనవరి 4(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యశ్రీ ట్రస్ట్‌ను విజిలెన్స్ భ్రష్టుపట్టిస్తోంది. ట్రస్ట్‌లో ఎవరైనా తప్పు చేసినా, అవినీతికి పాల్పడినా, నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో అక్రమాలు జరుగుతున్నా విజిలెన్స్ విభాగం విచారణ చేపడుతుంది. రోగులు ఎవరైనా ఆస్పత్రులపై ఫిర్యాదులు చేసినా నేరుగా విజిలెన్స్ విభాగం విచారణ జరుపుతుంది. అయితే విజిలెన్స్ విభాగం ఉద్యోగులు తనిఖీల పేరుతో ఆస్పత్రులకు వెళ్లి.. భారీ ఎత్తున ముడుపులు డిమాండ్ చేస్తున్నారు. ఈ మధ్య కాలంలో అనంతపురంలోని ఒక ప్రముఖ ఆస్పత్రిపై ఫిర్యాదులు రావడంతో విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేశారు. అక్కడ కొన్ని తప్పులను గుర్తించిన అధికారులు.. అక్కడ ప్రముఖ హోటల్‌లో కూర్చుని ఆస్పత్రి యాజమాన్యాన్ని పిలిపించారు. విజిలెన్స్ రిపోర్టు ఆస్పత్రికి అనుకూలంగా రాస్తామని చెప్పి, కొంత మొత్తాన్ని డిమాండ్ చేశారు. దానికి ఆస్పత్రి యాజమాన్యం కూడా అంగీకరించింది. ఆపై ఆరోగ్యశ్రీ ట్రస్ట్ సీఈవోకి ఫిర్యాదు చేసింది. దీనిపై సీఈవో వ్యక్తిగతంగా విచారణ చేపట్టి ఆస్పత్రితో డీల్ చేసిన ఉద్యోగులను విధుల నుంచి తొలగించారు. ఇద్దరు విజిలెన్స్ అధికారులను ట్రస్ట్ నుంచి పూర్తిగా తొలగించారు. ఇందులో మరికొంతమంది అధికారులు పాత్ర కూడా ఉంది. కానీ వారంతా తప్పించుకున్నారు. ఇలాంటి సంఘటనలు ట్రస్ట్‌లో అనేకం జరుగుతున్నాయి. ఒక్క అనంతపురమే కాదు కర్నూలు, గుంటూరు, చిత్తూరు, విజయవాడలోని కొన్ని ఆస్పత్రుల నుంచి భారీ ఎత్తున ముడుపులు తీసుకున్నారు. ఒకవైపు ఉద్యోగులను తొలగిస్తున్నా.. అధికారులు వెనక్కితగ్గడం లేదు.

విజిలెన్స్‌పై సీఎంవోకి ఫిర్యాదు

ఒక కేసు విషయంలో విజిలెన్స్ విభాగంపై నేరుగా సీఎంవోకే ఫిర్యాదులు వెళ్లాయి. గుంటూరు జిల్లాలోని ఒక ప్రముఖ ఆస్పత్రిపై ఒక రోగి ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదు మేరకు విజిలెన్స్ అధికారులు తనిఖీలకు వెళ్లారు. అక్కడ చిన్న చిన్న లోపాలను గుర్తించి, దీనిని క్యాష్ చేసుకునేందుకు ప్రయత్నించారు. తాము రిపోర్టు ఇస్తే ఆస్పత్రిని ఎంప్యానెల్ నుంచి తొలగిస్తారని యాజమాన్యాన్ని బెదిరించి, రూ.20 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీనిపై సదరు ఆస్పత్రి యాజమాన్యం సాక్ష్యాధారాలతో నేరుగా సీఎంవోకి ఫిర్యాదు చేసింది. సీఎంవో అధికారులు ఆరోగ్యశ్రీ ట్రస్ట్ సీఈవోని, ఉన్నతాధికారులను పిలిపించి తలంటేశారు. అయినా ట్రస్ట్ అధికారులే విజిలెన్స్ అధికారులకు మద్దతుగా నిలిచారు. వారిపై చర్యలు తీసుకోకుండా చూశారు. ఆతర్వాత కొన్ని రోజులకే చిత్తూరు జిల్లాలోని పుత్తూరులో మరో ఆస్పత్రిపై ఇదేవిధంగా బెదిరింపులకు పాల్పడ్డారు. సదరు ఆస్పత్రిపై ఆర్థో విభాగంలో చికిత్స చేయించుకున్న ఒక రోగి ఫిర్యాదు చేయడంతో విజిలెన్స్ అధికారులు తనిఖీలకు వెళ్లారు. విజిలెన్స్ అధికారులు ఆస్పత్రి యాజమాన్యాన్ని రూ.15 లక్షల వరకూ డిమాండ్ చేశారు. ఏం చేస్తారో చేసుకోండి.. లక్షలు ఇవ్వడం తమ వల్ల కాదని యాజమాన్యం తేల్చి చెప్పేసింది. ఇలా ఒకటీ రెండూ కాదు విజిలెన్స్ అధికారులు ఏ ఆస్పత్రికి వెళ్లే, ఆ ఆస్పత్రి నుంచి ముడుపులు వసూలు చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. విజిలెన్స్ విభాగంపై అనేక ఫిర్యాదులు వస్తున్నా ట్రస్ట్ అధికారులు అవినీతి అధికారులకు అండగా నిలుస్తున్నారు. దీనిపై పూర్తిస్థాయిలో దృష్టిపెట్టాలన్న డిమాండ్లు వస్తున్నాయి.

బండీ.. మీకిది తగునా..!?

» అంగన్వాడీలు, మున్సిపల్ సమ్మెకు మద్దతు తెలపొద్దు

» బండి శ్రీనివాసరావు పేరిట వాట్సాప్ గ్రూపుల్లో మెసేజ్

అమరావతి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): తోటి ఉద్యోగులు రోడ్డెక్కి బతుకు పోరాటం చేస్తుంటే అండగా ఉండాల్సిన ఏపీ ఎన్జీవో రాష్ట్ర నాయకత్వం మాత్రం నవ్విపోదురుగాక నాకేంటి అన్నట్లు వ్యవహరిస్తోంది. తమ డిమాండ్ల సాధనకు వేలాది మంది ఉద్యోగులు, ప్రభుత్వ రంగ కార్మికులు రోడ్డెక్కితే ముందుండి నడిపించాల్సింది పోయి చేతులు ముడుచుకుని కూర్చుంది. సహచర ఉద్యోగుల కష్టాలు చూసి తాళలేక.. ఒకరిద్దరు ఆ పోరాటాలకు మద్దతుగా నిలిస్తే.. అది కూడా సహించలేకపోతోంది. జగన్ సర్కారుకు వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటాలకు సఘీభావం తెలపొద్దంటూ హెచ్చరికలు జారీచేస్తోంది. ఇతర సంఘాలు చేస్తున్న నిరసనల్లో ఏపీ ఎన్జీవో జిల్లా నాయకత్వాలు పాల్గొనవద్దంటూ ఏపీ ఎన్జీవో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బండి శ్రీనివాసరావు పేరిట వాట్సాప్ గ్రూపుల్లో పెట్టిన మెసేజ్‌పై ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. ఆయన తీరుపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

బండిపై ప్రభుత్వ ఒత్తిడి పనిచేసిందా..?

"అన్ని జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులకు తెలియజేయునది ఏమనగా ఇది ఎన్నికల సమయం కాబట్టి కొన్ని కార్మిక సంఘాలు, మున్సిపల్ కార్మికుల ధర్నాల్లో కొంత మంది జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొంటున్నారు. రాష్ట్ర సంఘం ఆదేశాలు లేకుండా ఇలా ఏ కార్యక్రమంలోనూ పాల్గొనవద్దని మీకు మనవి చేస్తున్నాం. రాష్ట్ర ఏపీఎన్జీవోస్ సంఘానికి లిఖిత పూర్వకంగా, మౌఖికంగా కానీ ఎలాంటి ఆహ్వానం లేకుండా కొన్ని జిల్లా సంఘాలు వెళ్లి ఆందోళనల్లో పాల్గొంటున్నాయి. రాష్ట్ర సంఘం ఆదేశాలు లేకుండా ఎవరూ బయట సంఘాల కార్యక్రమాల్లో పాల్గొన వద్దు" ఇట్లు బండి శ్రీనివాసరావు, అధ్యక్షుడు ఏపీ ఎన్జీవో సంఘం, ప్రధాన కార్యదర్శి శివారెడ్డి పేరుతో ఆ సంఘానికి సంబంధించిన వాట్సాప్ గ్రూపుల్లో మెసేజ్ పెట్టారు. రాష్ట్ర వ్యాప్తంగా అంగన్వాడీలు, ఆశా వర్కర్లు, మున్సిపల్ కార్మికులు, సమగ్ర శిక్ష ఉద్యోగులు సమ్మెతో జగన్ సర్కారుపై ఒత్తిడి పెరుగుతోంది. అందుకే ఏపీ ఎన్జీవో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బండిపై ప్రభుత్వం ఒత్తిడి పెంచిందనే చర్చ జరుగుతోంది. పీఆర్సీ, సీపీఎస్, ఉద్యోగుల సమస్యలు అన్నింటిపై పోరాటాలను ఉవ్వెత్తుకు తీసుకెళ్లి చివరకు చప్పగా మార్చేసిన రాష్ట్ర ఉద్యోగ, వివిధ జేఏసీల నాయకులపై ఉద్యోగుల్లో నమ్మకం పోయిందనే చర్చ జరుగుతోంది. అందుకే రాష్ట్రంలో 24 రోజులుగా అంగన్వాడీలు రోడ్డెక్కి ఉవ్వెత్తున ఉద్యమాలు చేస్తున్నా, మున్సిపల్ కార్మికులు, పలు శాఖల ఉద్యోగులు.. తమ సమస్యలను తమ సంఘాల ద్వారానే పరిష్కరించుకోవాలని ప్రయత్నిస్తున్నారు. రాష్ట్ర స్థాయి నేతలను పిలవడంలేదు. వారు రంగంలోకి దిగితే తమ సమస్యలు కూడా గత ఉద్యమాల్లాగా నీరుగారిపోతాయేమోననే భయం వారిని వెంటాడుతోంది.

ఈ ఏడాది 68 రాజ్యసభ సీట్లు ఖాళీ

» తెలుగు రాష్ట్రాల నుంచి ఆరు

న్యూఢిల్లీ, జనవరి 4: రాజ్యసభలో ఈ ఏడాది 68 మంది సభ్యుల పదవీ కాలం ముగియనుంది. వీరిలో తొమ్మిదిమంది కేంద్ర మంత్రులు కూడా ఉన్నారు. కేంద్ర మంత్రులు అశ్వినీ వైష్ణవ్(రైల్వే), ధర్మేంద్ర ప్రధాన్(విద్య), భూపేంద్ర యాదవ్(పర్యావరణం), మన్సూఖ్ మాండవీయ(ఆరోగ్య), పరుషోత్తం రూపాల(మత్స్యశాఖ), మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ సహా 57 మంది పదవీకాలం ఏప్రిల్‌లో ముగియనుంది. వీరిలో ఆంధ్రప్రదేశ్ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ముగ్గురు, తెలంగాణ నుంచి ముగ్గురు ఉన్నారు. ఏపీ నుంచి కనకమేడల రవీంద్రకుమార్(టీడీపీ), సీఎం రమేశ్(బీజేపీ), వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి(వైసీపీ), తెలంగాణ నుంచి బీఆర్ఎస్ ఎంపీలు జె.సంతోష్‌కుమార్, వి.రవిచంద్ర, బి.లింగయ్యయాదవ్, మహారాష్ట్ర నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న విదేశాంగశాఖ సహాయమంత్రి వి.మురళీధరన్, యూపీ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న జీవీఎల్ నరసింహారావు(బీజేపీ), జయాబచ్చన్(ఎస్పీ)ల పదవీకాలం కూడా ఏప్రిల్‌లో ముగియనుంది. .

తెలంగాణలో జీతాలు పడ్డాయ్

హైదరాబాద్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత తొలి నెలలో ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు సకాలంలో జీతాలు చెల్లించారు. గురువారం (4వ తేదీ) నాటికి ఆ రాష్ట్రంలో అన్ని జిల్లాల్లో డిసెంబరు నెల జీతాలు, పింఛన్ల పంపిణీ పూర్తయింది. ఎన్నికల సందర్భంగా హామీ ఇచ్చినట్లుగానే ఉద్యోగులు, పెన్షనర్లకు చెల్లింపులు చేశారు. దీనిపై వారు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇకమీదట కూడా ఇదేవిధానం అమలు కావాలని ఆకాంక్షిస్తున్నారు. కాగా అంతకుముందు తెలంగాణలో రోజుకు ఇన్ని జిల్లాల వంతున విడతల వారీగా చెల్లించేవారు. 12 నుంచి 20వ తేదీ వరకు ఖాతాల్లో జమ చేసేవారు. దీన్ని ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు తీవ్రంగా నిరసించాయి.

మోదీ సాహస ఈత



ప్రధాని నరేంద్రమోదీ లక్షద్వీప్ పర్యటనలో భాగంగా సముద్రంలో స్నార్కెలింగ్ చేశారు. సముద్రపు అడుగున ఉండే జీవరాశులను పరిశీలించారు. సముద్రపు ఒడ్డున నడుస్తూ.. దీవులలోని ప్రకృతి అందాలను ఆస్వాదించారు. కొద్దిసేపు అక్కడే సేద తీరారు. ఇందుకు సంబంధించిన ఫోటోలను ఆయన తన ఎక్స్(ట్విటర్) ఖాతాలో పోస్టు చేశారు. 140 కోట్ల భారతీయుల సంక్షేమం కోసం ఇంకెంత కష్టపడాలో తనకు ఈ వాతావరణం నేర్పిందని, సాహసాలు చేయాలనుకునేవారు తమ లిస్టులో లక్షద్వీప్‌ను కూడా చేర్చుకోవాలని మోదీ సూచించారు.

అమెరికా సెక్స్ కుంభకోణంలో.. బిల్ క్లింటన్, ట్రంప్, ప్రముఖుల పేర్లు

న్యూయార్క్, జనవరి 4: అమెరికాను కుదిపేసిన హైప్రొఫైల్ సెక్స్ కుంభకోణంలో పత్రాలను న్యూయార్క్ కోర్టు బుధవారం బహిర్గతం చేసింది. జెఫ్రీ ఎప్‌స్టీన్‌కు సంబంధించిన ఈ కేసులో.. అమెరికా మాజీ అధ్యక్షులు బిల్ క్లింటన్, డొనాల్డ్ ట్రంప్, పాప్‌స్టార్ మైఖేల్ జాక్సన్, బ్రిటన్ రాజకుటుంబానికి చెందిన ప్రిన్స్ ఆండ్రూ సహా.. పలువురు ప్రముఖులు, సంపన్నుల పేర్లు ఉన్నాయి. తొలివిడతగా 40 పత్రాలను విడుదల చేసిన న్యాయమూర్తి.. ఈ పత్రాలు ఇప్పటికే ప్రజల్లోకి వెళ్లాయని, అందుకే బయటపెడుతున్నట్లు తెలిపారు. ప్రముఖ ఫైనాన్సర్ జెఫ్రీ ఎప్‌స్టీన్ బాలికలు, యువతులకు డబ్బు ఎర వేసి, వారిని సెక్స్ కుంభకోణంలోకి లాగినట్లు అభియోగపత్రాలు స్పష్టం చేస్తున్నాయి. ఇతని సెక్స్ స్కామ్ చైన్‌స్కీమ్‌ను పోలి ఉంటుందని ఇదివరకే దర్యాప్తు అధికారులు వెల్లడించారు. ఈ చీకటి వ్యవహారం 2005లో తొలిసారి బయటపడింది. అప్పట్లో అతను అరెస్టయ్యి.. 13 నెలల పాటు జైలులో ఉన్నాడు. 2019లో 'మీ-టూ' ఉద్యమం సందర్భంగా మరోమారు జెఫ్రీ పేరు వెలుగులోకి వచ్చింది. అప్పట్లో అతని మాజీ ప్రియురాలు గిస్లేయిన్ మ్యాక్స్‌వెల్ ఆరోపణలు చేశారు. అదే ఏడాది ఆగస్టులో జెఫ్రీ జైల్లోనే ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ కేసులో జోహన్నా సోబెర్గ్ వాంగ్మూలాన్ని కూడా కోర్టు నమోదు చేసుకుంది. ఎప్‌స్టీన్‌కు చెందిన పామ్‌బీచ్‌లో ఓసారి మైఖేల్ జాక్సన్‌ను కలిశానని, ఆయన తనను ఏమాత్రం ఇబ్బందులకు గురిచేయలేదని సోబెర్గ్ పేర్కొన్నారు. అయితే.. ప్రిన్స్ ఆండ్రూ మాత్రం 2001లో న్యూయార్క్‌లోని ఎప్‌స్టీన్ నివాసంలో తనను అసభ్యంగా తాకినట్లు చెప్పారు. ఇదే వాంగ్మూలంలో ఆమె బిల్ క్లింటన్, ట్రంప్ పేర్లను ప్రస్తావించారు. ఈ పత్రాల్లో బిల్ క్లింటన్ పేరు దాదాపు 50 సార్లు ప్రస్తావనకు వచ్చినట్లు సమాచారం.

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
diksuchi@andhrajyothy.com
విజయవాడ ● శుక్రవారం 5 జనవరి 2024



జేఎన్‌టీయూహెచ్‌లో పార్ట్ టైమ్ పీజీ

హైదరాబాద్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ (జేఎన్‌టీయూహెచ్)- పార్ట్ టైమ్ పోస్ట్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తు గడువు పొడిగిస్తూ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఎంటెక్, ఎంబీఏ ప్రోగ్రామ్‌లు అందుబాటులో ఉన్నాయి. ఒక్కో ప్రోగ్రామ్ వ్యవధి మూడేళ్లు. ఆరు సెమిస్టర్లు ఉంటాయి. వీటిని ఉద్యోగులకు ప్రత్యేకించారు. దరఖాస్తు నాటికి హైదరాబాద్ పరిధిలో కనీసం ఏడాదిపాటు ఉద్యోగం చేసిన అనుభవం తప్పనిసరి. దరఖాస్తుతోపాటు ఒరిజినల్ సర్వీస్ సర్టిఫికెట్ అప్‌లోడ్ చేయాలి. ఎంట్రెన్స్ టెస్ట్ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. ఈ ప్రోగ్రామ్‌లకు ఎటువంటి స్కాలర్‌షిప్ లభించదు.

స్పెషలైజేషన్‌లు: ఎంటెక్ ప్రోగ్రామ్‌లో ఎలక్ట్రికల్ పవర్ ఇంజనీరింగ్, పవర్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇండస్ట్రియల్ డ్రైవ్స్, ఇంజనీరింగ్ డిజైన్, థర్మల్ ఇంజనీరింగ్, అడ్వాన్స్‌డ్ మాన్యుఫాక్చరింగ్ సిస్టమ్స్, ఎంబెడెడ్ సిస్టమ్స్, కంప్యూటర్ సైన్స్, ఇండస్ట్రియల్ మెటలర్జీ, బయోటెక్నాలజీ, ఎన్విరాన్‌మెంటల్ మేనేజ్‌మెంట్, వాటర్ రిసోర్సెస్ ఇంజనీరింగ్, రిమోట్ సెన్సింగ్ అండ్ జీఐఎస్ స్పెషలైజేషన్‌లు ఉన్నాయి. స్పెషలైజేషన్‌కు 30 సీట్లు ప్రత్యేకించారు. ఎంబీఏ ప్రోగ్రామ్‌లో హెచ్ఆర్, ఫైనాన్స్, మార్కెటింగ్, ఆంత్రప్రెన్యూర్‌షిప్ స్పెషలైజేషన్‌లు ఉన్నాయి. ఈ ప్రోగ్రామ్‌లో మొత్తం 30 సీట్లు ఉన్నాయి.

అర్హత వివరాలు: ఎంటెక్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి స్పెషలైజేషన్‌కు నిర్దేశించిన విభాగాల్లో బీఈ/బీటెక్/ఏఎంఐఈ ఉత్తీర్ణులై ఉండాలి. కంప్యూటర్ సైన్స్‌కు ఎంసీఏ ఉత్తీర్ణులు; బయోటెక్నాలజీకి ఎమ్మెస్సీ(ఎన్విరాన్‌మెంటల్ సైన్సెస్/కెమిస్ట్రీ/బయోకెమిస్ట్రీ/మైక్రోబయాలజీ/లైఫ్‌సైన్సెస్/బయోటెక్నాలజీ)/బీవీఎస్సీ/ఎంబీబీఎస్/బీడీఎస్/బీఫార్మసీ అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. ఎన్విరాన్‌మెంటల్ మేనేజ్‌మెంట్‌కు ఏదేని డిగ్రీ(ఇంజనీరింగ్/టెక్నాలజీ/ఆర్కిటెక్చర్/ప్లానింగ్/అగ్రికల్చర్); పీజీ(సైన్సెస్/కంప్యూటర్ అప్లికేషన్స్/ ఐటీ)/ఎంసీఏ పూర్తిచేసి ఉండాలి. వాటర్ రిసోర్సెస్ ఇంజనీరింగ్‌కు ఎమ్మెస్సీ (జియో ఫిజిక్స్/ జియాలజీ/ హైడ్రాలజీ/ రిమోట్ సెన్సింగ్/ఎన్విరాన్‌మెంటల్ సైన్సెస్/అగ్రికల్చర్/జియోస్పేషియల్/ఎర్త్ సైన్సెస్/అట్మాస్ఫిరిక్ సైన్సెస్/వాటర్ అండ్ ఎన్విరాన్‌మెంటల్ సైన్సెస్) పూర్తిచేసినవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. రిమోట్ సెన్సింగ్ అండ్ జీఐఎస్‌కి ఎమ్మెస్సీ(జియోఇన్ఫర్మాటిక్స్/జియోమాటిక్స్/మేథ్స్/ఫిజిక్స్/జాగ్రఫీ/అగ్రికల్చర్/వాటర్ రిసోర్సెస్/వాటర్ అండ్ ఎన్విరాన్‌మెంటల్ సైన్సెస్/జియోస్పేషియల్ సైన్స్ అండ్ టెక్నాలజీ/ఎర్త్ రిసోర్సెస్/ఓషన్ సైన్సెస్)/ఎంసీఏ/ఎంటెక్ పూర్తిచేసినవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. ఎంబీఏ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి ఏదేని మూడేళ్ల డిగ్రీ పాసైతే చాలు.

అడ్మిషన్ టెస్ట్ వివరాలు: పరీక్ష సమయం గంట. ఇందులో మొత్తం 60 ఆబ్జెక్టివ్ ప్రశ్నలు ఇస్తారు. ఎంటెక్‌లో ప్రవేశానికి నిర్వహించే పరీక్షలో సంబంధిత స్పెషలైజేషన్ నుంచి ప్రశ్నలు అడుగుతారు. ఎంబీఏ అభ్యర్థులకు అనలిటికల్/రీజనింగ్ ఎబిలిటీ, మేథమెటికల్ ఎబిలిటీ, కమ్యూనికేషన్ ఎబిలిటీ అంశాలనుంచి ప్రశ్న లు అడుగుతారు. ఎంట్రెన్స్ టెస్ట్ సిలబస్ కోసం వెబ్‌సైట్ చూడవచ్చు. టెస్ట్ తేదీలను త్వరలో ప్రకటిస్తారు.

ముఖ్య సమాచారం

- **ట్యూషన్ ఫీజు:** సెమిస్టర్‌కు రూ.25,000
- **దరఖాస్తు ఫీజు:** రూ.3,000
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జనవరి 20
- **దరఖాస్తుతోపాటు అప్‌లోడ్ చేయాల్సిన పత్రాలు:** పదోతరగతి, ఇంటర్, డిగ్రీ, పీజీ మార్కుల పత్రాలు; టీసీ; అనుభవం సంబంధిత పత్రాలు; నో ఆబ్జెక్షన్ సర్టిఫికెట్; సర్వీస్ సర్టిఫికెట్; మెడికల్ సర్టిఫికెట్ (దివ్యాంగులకు మాత్రమే)
- **పరీక్ష కేంద్రం:** జేఎన్‌టీయూహెచ్ క్యాంపస్, కూకట్‌పల్లి, హైదరాబాద్
- **వెబ్‌సైట్:** www.jntuh.ac.in

ఐఐఎం రోహ్‌తక్‌లో మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్‌లు

రోహ్‌తక్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్(ఐఐఎం)- ఎగ్జిక్యూటివ్ పీజీ డిప్లొమా, పీజీ, డాక్టోరల్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతూ విడివిడిగా నోటిఫికేషన్‌లు విడుదల చేసింది. ప్రోగ్రామ్‌ను అనుసరించి జాతీయ పరీక్ష స్కోర్ లేదా సంస్థ నిర్వహించే రీసెర్చ్ ఎంట్రెన్స్ టెస్ట్, అకడమిక్ ప్రతిభ, అనుభవం ఆధారంగా షార్ట్‌లిస్ట్ చేసిన అభ్యర్థులకు పర్సనల్ ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హులను ఎంపిక చేస్తారు.

- వెబ్‌సైట్: www.iimrohtak.ac.in

పీజీ ప్రోగ్రామ్(పీజీపీ)

- ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. మొదటి ఏడాది మేనేజ్‌మెంట్ సంబంధిత సబ్జెక్టులు, రెండో ఏడాది ఎలక్టివ్ సబ్జెక్టులు చదవాల్సి ఉంటుంది. ఏడాదికి మూడు టర్మ్‌లు చొప్పున మొత్తం ఆరు టర్మ్‌లు ఉంటాయి. మూడో టర్మ్ చివరలో రెండు నెలల సమ్మర్ ఇంటర్న్‌షిప్; నాలుగో టర్మ్‌లో గ్లోబల్ బిజినెస్ సిమ్యులేషన్; అయిదో టర్మ్‌లో మార్క్‌స్ట్రాట్ సిమ్యులేషన్; ఆరో టర్మ్‌లో క్యాప్‌స్టోన్ సిమ్యులేషన్, ఇంటిగ్రేటివ్ ప్రాజెక్ట్ ఉంటాయి. ఈ ప్రోగ్రామ్ పూర్తిచేసినవారికి ఎంబీఏ డిగ్రీ ప్రదానం చేస్తారు.

ఎలక్టివ్ స్పెషలైజేషన్‌లు: ఎకనామిక్స్ అండ్ పబ్లిక్ పాలసీ, ఫైనాన్స్ అండ్ అకౌంటింగ్, మేనేజ్‌మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్, ఆపరేషన్స్, హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్, మార్కెటింగ్ అండ్ స్ట్రాటజీ.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. క్యాట్ 2023 అర్హత పొంది ఉండాలి. క్యాట్ స్కోర్‌కు 60 శాతం, ఇంటర్వ్యూ స్కోర్‌కు 20 శాతం, అకడమిక్ మెరిట్‌కు 20 శాతం వెయిటేజీ ఇస్తారు.

- **రిజిస్ట్రేషన్ ఫీజు:** రూ.2928
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జనవరి 5

డాక్టోరల్ ప్రోగ్రామ్ ఇన్ మేనేజ్‌మెంట్(డీపీఎం)

- ఇది నాలుగేళ్ల వ్యవధిగల ఫుల్ టైం రెసిడెన్షియల్ పీహెచ్‌డీ ప్రోగ్రామ్. విదేశీయులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

స్పెషలైజేషన్‌లు: ఎకనామిక్స్ అండ్ పబ్లిక్ పాలసీ, ఫైనాన్స్ అండ్ అకౌంటింగ్, మేనేజ్‌మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్, మార్కెటింగ్ అండ్ స్ట్రాటజిక్ మేనేజ్‌మెంట్, ఆపరేషన్స్ మేనేజ్‌మెంట్ అండ్ క్వాంటిటేటివ్ టెక్నిక్స్, ఆర్గనైజేషనల్ బిహేవియర్ అండ్ హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్.

అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఏదేని స్పెషలైజేషన్‌తో పోస్ట్ గ్రాడ్యుయేట్ డిగ్రీ పూర్తిచేసినవారు అర్హులు. డిగ్రీతోపాటు సీఏ/ఐసీడబ్ల్యుఏఐ/సీఏ స్/ఎల్ఎల్‌బీ ఉత్తీర్ణులు; ఎంబీబీఎస్ ఉత్తీర్ణులు; అయిదేళ్ల ఇంటిగ్రేటెడ్ మాస్టర్స్ డిగ్రీ కోర్సులు చేసినవారు; నాలుగేళ్ల బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణతతోపాటు 2024 జూన్ 1 నాటికి ఏడాది అనుభవం ఉన్నవారు కూడా అర్హులే. ఏ కోర్సులోనైనా 55 శాతం మార్కులు ఉండాలి. చివరి సంవత్సర పరీక్షలకు సన్నద్ధమౌతున్నవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. వీరు 2024 డిసెంబరు 31 నాటికి సర్టిఫికెట్‌లు, మార్కుల పత్రాలు సబ్మిట్ చేయాల్సి ఉంటుంది. క్యాట్/జీఆర్ఈ/జీమ్యాట్/యూజీసీ నెట్/గేట్ వ్యాలిడ్ స్కోర్ ఉండాలి. రీసెర్చ్ ఆప్టిట్యూడ్ టెస్ట్, ఇంటర్వ్యూల ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. ఐఐఎం సంస్థల నుంచి పీజీడీఎం/ఎంబీఏ పూర్తిచేసిన వారిని నేరుగా ఇంటర్వ్యూకి అనుమతిస్తారు.

రీసెర్చ్ ఆప్టిట్యూడ్ టెస్ట్: ఇందులో క్వాంటిటేటివ్ ఎబిలిటీ, వెర్బల్ ఎబిలిటీ, రీసెర్చ్ ఆప్టిట్యూట్ సంబంధిత ప్రశ్నలు ఇస్తారు.

ఫెలోషిప్: మొదటి రెండేళ్లు నెలకు రూ.34,000; చివరి రెండేళ్లు నెలకు రూ.40,000ల స్కాలర్‌షిప్ ఇస్తారు. నిబంధనల ప్రకారం మెరిట్ ఫెలోషిప్ కింద రెండో ఏడాది నెలకు రూ.10,000; మూడు, నాలుగు సంవత్సరాల్లో నెలకు రూ.15,000 చెల్లిస్తారు. కంటింజెన్సీ గ్రాంట్ కింద ప్రోగ్రామ్ మొత్తానికి రూ.2,50,000 ఇస్తారు. జాతీయ, అంతర్జాతీయ కాన్ఫరెన్స్‌లకు హాజరయ్యేందుకు అవసరమైన ఆర్థిక సహకారం అందిస్తారు.

- **దరఖాస్తు ఫీజు:** రూ.2928
- **దరఖాస్తుకు చివరి తేదీ:** ఫిబ్రవరి 29
- **డీపీఎం రీసెర్చ్ ఆప్టిట్యూడ్ టెస్ట్ తేదీ:** ఏప్రిల్ 15
- **ఇంటర్వ్యూలు:** ఏప్రిల్, 15, 16
- **ఎంపికైన అభ్యర్థుల లిస్ట్ విడుదల:** ఏప్రిల్ 25
- **రిపోర్టింగ్ తేదీ:** జూన్ 6

ఎగ్జిక్యూటివ్ పీజీ డిప్లొమా ఇన్ స్పోర్ట్స్ మేనేజ్‌మెంట్

- ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. దీనిని మేనేజ్‌మెంట్ ప్రొఫెషనల్స్, స్పోర్ట్స్ పర్సన్స్, స్పోర్ట్స్ అడ్మినిస్ట్రేటర్స్‌కు ఉద్దేశించారు. ఈ ప్రోగ్రామ్ పూర్తిచేసినవారు ఉల్‌స్టర్ యూనివర్సిటీ (యూకే)లో ఎమ్మెస్సీ(స్పోర్ట్స్ మేనేజ్‌మెంట్) అడ్మిషన్ పొందే వీలుంది.
- ఈ ప్రోగ్రామ్‌ను బ్లెండెడ్ లెర్నింగ్ - ఆన్‌లైన్ & ఆఫ్‌లైన్ సెషన్స్ మోడ్‌లో నిర్వహిస్తారు. ప్రోగ్రామ్‌లో భాగంగా ఇంటరాక్టివ్ సెషన్స్, లైవ్ ప్రాజెక్ట్‌లు, ఇండస్ట్రియల్ విజిట్స్ ఉంటాయి.
- **అర్హత:** ద్వితీయ శ్రేణి మార్కులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణతతోపాటు సంబంధిత విభాగాల్లో అనుభవం ఉండాలి. స్పోర్ట్స్ ఆప్టిట్యూడ్ అసెస్‌మెంట్ టెస్ట్(ఆన్‌లైన్), ఆన్‌లైన్ ఇంటర్వ్యూల ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.
- **స్పోర్ట్స్ ఆప్టిట్యూడ్ అసెస్‌మెంట్ టెస్ట్:** ఇందులో క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్, లాజికల్ రీజనింగ్, ఇంగ్లీష్ కాంప్రహెన్షన్, స్పోర్ట్స్ ఆప్టిట్యూడ్ సంబంధిత ప్రశ్నలు ఇస్తారు.
  - **దరఖాస్తు ఫీజు:** రూ.1000
  - **దరఖాస్తు సబ్మిషన్‌కు చివరి తేదీ:** జనవరి 9

విదేశీ విద్య కొన్ని భ్రమలు



ఇప్పటి యువతలో విదేశాల్లో చదువుకోవాలనే ఆకాంక్ష ఎక్కువ. అయితే దీనికి సంబంధించి విద్యార్థుల తల్లిదండ్రులకు మాత్రం అనుమానాలు, అపనమ్మకాలు కూడా ఎక్కువే. అయితే విదేశాల్లో చదువుకుంట్ను విద్యార్థులు, సంబంధిత అకడమిక్ నిపుణులతో మాట్లాడినప్పుడు పలు అంశాలపై మనోళ్ల అనుమానాలకు అర్థం లేదని అనిపించింది. అవేంటో చూద్దాం.

ఖర్చు ఎక్కువ

విదేశీ చదువు అంటే ఖర్చుతో వ్యవహారం అనుకుంటారు. అయితే ఎంచుకున్న కోర్సు ఇన్‌స్టిట్యూషన్ తదితరాలను అనుసరించి వ్యయం ఉంటుంది. అంతేతప్ప ఏ కోర్సు తీసుకున్నా ఒకేరకమైన ఖర్చు ఉండదు. కొన్నిసార్లు విదేశీ యూనివర్సిటీలు, అక్కడి ప్రభుత్వాలు ఇచ్చే స్కాలర్‌షిప్స్‌తో చాలా వరకు భారాన్ని తగ్గించుకోవచ్చు. ఆన్ క్యాంపస్ జాబ్స్, టీచింగ్ అసిస్టెన్స్, రీసెర్చ్ అసిస్టెన్స్‌తోనూ ఒకింత ఉపశమనం పొందవచ్చు.

➡ ఇండియన్ యూనివర్సిటీలతో పోల్చుకుంటే విదేశీ విశ్వవిద్యాలయాల్లో చదువుకు అయ్యే వ్యయం ఎక్కువే. అయితే భారత దేశంలోని టైర్ వన్ పట్టణాల్లోని కొన్ని ప్రైవేటు విద్యాసంస్థల్లో బీటెక్, మేనేజ్‌మెంట్ కూడా వ్యయభరితమే. అదే విదేశాల విషయానికి వస్తే కొన్ని వర్సిటీలు బ్రైట్ విద్యార్థులకు ట్యూషన్ ఫీజుల్లో పాతిక నుంచి డెబ్బయ్ అయిదు శాతం మేర మినహాయింపును ఇస్తున్నాయి.

స్థానిక భాష రాకున్నా పర్వాలేదు

సాధారణంగా ఇంగ్లీష్ బోధన లేని దేశాలను విద్యార్థులు తమ జాబితా నుంచి తొలగిస్తూ ఉంటారు. అయితే అలా తీసేయాల్సిన పని లేదు. చాలా దేశాలు ఇప్పుడు ఇంటర్నేషనల్ స్టూడెంట్స్ కోసం ఇంగ్లీష్‌లో బోధనకు ముందుకు వస్తున్నాయి. అయితే ఇంగ్లీషులో బోధన ఉన్నంత మాత్రాన స్థానిక భాష అక్కర లేదు అన్నట్లు కాదు. లోకల్ లాంగ్వేజ్ ఎంత బాగా తెలిస్తే చదువు అంత బాగా ముందుకు సాగుతుంది అని ప్రొఫెసర్లు చెబుతుంటారు. అలాగే అక్కడే ఉన్నత ఉద్యోగాల్లో స్థిరపడాలని అనుకుంటే లోకల్ భాష తెలియకుంటే ఎలా అన్నదే ప్రశ్న. జర్మనీలో చదవాలనుకుంటే జర్మన్ లాంగ్వేజ్ నేర్చుకోవడం మంచిది. ఆ దేశం అనే కాదు ఎక్కడైనా శాశ్వతంగా లేదంటే తాత్కాలికంగా ఉండాలనుకునే వ్యక్తులకు స్థానిక భాషపై పట్టు అవసరం.

చాలా దేశాల్లో చదువులు ఉచితం

కొన్ని యురోపియన్ దేశాల విషయంలో ఇది నిజం కూడా. అయితే ట్యూషన్ ఫీజులు మాత్రమే పూర్తిగా లేకుంటే సబ్సిడీతో కానీ ఉంటాయి. ఉదాహరణకు నార్వే, ఫిన్లాండ్, స్వీడన్, డెన్మార్క్ తదితర దేశాలు ఫీజు మినహాయింపు లేదంటే సబ్సిడీ ఆఫర్ ఉంటాయి. జర్మనీలో ఆఫర్ చేసే అండర్ గ్రాడ్యుయేట్ కోర్సులకు ట్యూషన్ ఫీజులే ఉండవు. అయితే అకామిడేషన్, ఫుడ్ తదితర సొంత అవసరాలకు ఇండియన్ మనీలో ఏటా ఎనిమిది నుంచి పదిలక్షల మేర వ్యయమవుతుంది. ఈ విషయాన్ని గుర్తు పెట్టుకోవాలి.

స్కాలర్‌షిప్స్ సాధించడం సులువు

అమెరికా, బ్రిటన్ విద్యా సంస్థల్లో చేరి స్కాలర్‌షిప్‌లు సాధించడం చాలా సులువు అనుకుంటారు కొంత మంది విద్యార్థులు. అయితే స్కాలర్‌షిప్స్ రావాలంటే మంచి అకడమిక్ ట్రాక్ రికార్డ్ ఉండాలి. అలాగే కొన్ని స్కాలర్‌షిప్స్ మెరిట్ బేస్డ్ ఉంటే మరి కొన్ని నీడ్ బేస్డ్‌గా ఉంటాయి. ఆయా సెక్షన్‌లకే ఇవి అందుబాటులో ఉంటాయి. అంతేకాకుండా చాలా స్కాలర్‌షిప్స్ గ్రాడ్యుయేషన్, రీసెర్చ్ విద్యార్థుల కోసం మాత్రమే ఉంటాయి. అండర్ గ్రాడ్యుయేషన్‌కు అందుబాటులో ఉండేవి చాల తక్కువ.



➡ యూకే, అమెరికా ప్రభుత్వాలు కూడా భారతీయ విద్యార్థుల కోసం ప్రత్యేకంగా స్కాలర్‌షిప్స్‌ను మంజూరు చేస్తాయి. యూకే ప్రభుత్వం ఇచ్చే 'కామన్వెల్త్ మాస్టర్స్ స్కాలర్‌షిప్', 'కామన్వెల్త్ షేర్డ్ స్కాలర్‌షిప్', 'చెవనింగ్ స్కాలర్‌షిప్'లను - అకడమిక్ మెరిట్, ఫైనాన్షియల్ బ్యాక్‌గ్రౌండ్, ఎక్స్‌పీరియెన్స్ తదితరాలను పరిగణనలోకి తీసుకుని మంజూరు చేస్తారు. 'ఫుల్‌బ్రైట్ స్కాలర్‌షిప్స్'ను కూడా మంజూరు చేస్తాయి. అయితే కొన్ని సంస్థలు విదేశీ విద్యార్థులకు ఫీజుల్లో పూర్తిగా, కొంత మేర మినహాయింపును ఇస్తాయి. ఇలాంటి వాటికి గ్యారంటీ అంటూ ఏమీ ఉండదు. నిధుల అందుబాటు, అకడమిక్ రికార్డు తదితరాలు ఆధారంగా వీటిని ఇస్తారు. అమెరికాలోని ఐవీ లీగ్ కాలేజీలు మరో అడుగు ముందుకేశాయి. వాటి అలూమ్నీ కూడా కార్పస్ ఫండ్‌తో అర్హులకు స్కాలర్‌షిప్స్‌ను అందిస్తుంటాయి.

దరఖాస్తు ప్రక్రియ క్లిష్టం

కోర్సు ఏదైనప్పటికీ విదేశీ వర్సిటీల దరఖాస్తు ప్రక్రియ దాదాపుగా ఒకేలా ఉంటుంది. అకడమిక్ అర్హతల నుంచి ఇంగ్లీష్ లాంగ్వేజ్ ప్రొఫిసియెన్సీలో అడిగే స్కోర్‌లు కూడా దాదాపుగా ఒకేలా ఉంటాయి. చాలా వరకు యూనివర్సిటీలు స్టేట్‌మెంట్ ఆఫ్ పర్పస్, లెటర్స్ ఆఫ్ రికమెండేషన్‌ను అడుగుతాయి. ఇంగ్లీష్ లాంగ్వేజ్ ప్రొఫిసియెన్సీలో గ్రేడులను చూస్తాయి. స్కాలర్‌షిప్స్‌ను అందించే సంస్థలకు కూడా ఇవే అవసరమవుతాయి. అయితే దరఖాస్తు ప్రక్రియ, సెలెక్షన్ వంటివి సుదీర్ఘంగా సాగే వ్యవహారమే అయినప్పటికీ ఎక్కడా క్లిష్టత అంటూ ఏమీ ఉండదని సంబంధిత అకడమిక్ నిపుణులు అంటారు.

లెర్నింగ్ కష్టం

విదేశాల్లో చదువు అంటే కొద్దిగా కష్టంగానే అనిపిస్తుంది. అడాప్టబిలిటీ కోసం కష్టపడటం తప్ప మరో మార్గం లేదు. అయితే కోర్సు తీరుతెన్నులపై అవగాహన కోసం వారం నుంచి పదిరోజుల పాటు ఓరియెంటేషన్ ప్రోగ్రామ్ ఉంటుంది. మరో విషయం, అక్కడ కోర్సులు ఎక్కువగా ఇండస్ట్రీ నిర్దేశితంగా ఉంటాయి. కేస్ స్టడీలు ఉంటాయి. కేవలం థియరీ బోధనకే పరిమితం కావు. ప్రాక్టికల్ ఓరియెంటెడ్‌గా ఉంటాయి. ఫ్యాకల్టీ మెంబర్స్‌కు కూడా పది నుంచి పదిహేనేళ్ళ వరకు ఇండస్ట్రీ అనుభవం ఉంటుంది. ప్రాక్టికల్ ప్రపంచంతో మమేకమయ్యే థియరీలు ఉంటాయి. ఇండస్ట్రీలో ఏమి జరుగుతుందో అదే నేర్చుకోవాల్సి ఉంటుంది. ఈ మార్పునకు తగ్గట్టు అడ్జస్ట్ కావడమే కాదు, ఎదగాల్సిన అవసరం మన విద్యార్థులకు ఉంటుంది.

డిగ్రీ వ్యవధి ఎక్కువ

విదేశీ వర్సిటీల్లో నాలుగేళ్ళ కాలవ్యవధి కలిగిన డిగ్రీ కోర్సులు ఉంటాయి. మన దగ్గర ఇంజనీరింగ్, మెడిసిన్ తప్ప ఇతర యూజీ విద్యార్థులను అలా చదివించడానికి విద్యాలయాలు వెనకాడుతాయి. అమెరికన్ వర్సిటీలు చాలావరకు ఫ్లెక్సిబుల్‌గా ఉంటాయి. అంటే కోర్సుకు నిర్దేశించిన క్రెడిట్స్‌ను ముందస్తుగా పూర్తి చేయగలిగితే మూడేళ్ళకే డిగ్రీని ఇస్తాయి. అందుకోసం ప్రతి సెమిస్టర్‌లో అదనంగా కొన్ని కోర్సులను తీసుకోవాలి. అలా బరువు పెంచుకోవడమే కాదు, సమ్మర్ క్లాసులకు కూడా హాజరై ముందుగానే కోర్సు పూర్తిచేసుకోవచ్చు. అయితే ఈ వెసులుబాటుపై ఎక్కువ మందికి అవగాహన ఉండదు.

క్షేమమేనా

విదేశాలకు పిల్లలను పంపడం అంత క్షేమం కాదన్న భ్రమలో చాలా మంది తల్లిదండ్రులు ఉంటారు. అప్పుడప్పుడు జరిగే కొన్ని సంఘటనలు వారిని ఇలా ఆలోచించేలా చేస్తాయి. ఇందులో నిజం వేరుగా ఉంది. వాస్తవానికి అకామిడేషన్ తదితర అంశాల్లో యూనివర్సిటీలే బాధ్యత తీసుకుంటాయి. సురక్షితమైన ట్రాన్స్‌పోర్టేషన్‌సహా విద్యార్థులతో కనెక్ట్ అయ్యే విషయంలోనూ సూచనలు ఇస్తాయి. తద్వారా తమ విద్యార్థులు అంతా సౌకర్యంగా ఫీలయ్యేలా, క్యాంపస్‌లో హాయిగా చదువుకునేలా చూస్తాయి. విద్యార్థులు తమ వర్సిటీకి ఒక మెసేజ్ ఇస్తే చాలు స్పందిస్తాయి. వెంటనే అకడమిక్, సెక్యూరిటీ డిపార్ట్‌మెంట్‌లు రంగంలోకి దిగి ఇబ్బందుల్లో ఉన్న విద్యార్థులను ఆదుకుంటాయి. దీనికోసం యాప్స్‌ను కూడా వర్సిటీలు నిర్వహిస్తూ ఉంటాయి.

స్నేహితులను చేసుకోవడం కష్టం

విదేశీ విద్యార్థులను ఎక్కువగా తీసుకునే యూనివర్సిటీలు తమ స్టూడెంట్స్ మధ్య ఇంటరాక్షన్ కోసం పలు చర్యలు తీసుకుంటాయి. అందుకోసం ప్రత్యేకించి ఈవెంట్స్‌ను నిర్వహిస్తాయి.

ఉద్యోగాలు వస్తాయా?

ఐవీ లీగ్ యూనివర్సిటీలో చదివే వారికి మాత్రమే ఉద్యోగాలు వస్తాయనేది భ్రమ. టెక్ కంపెనీలు అంటే మొదటి వరుసలో ఉండేవే కాదు అంతకుమించి పెద్ద కంపెనీలు కూడా ఉన్నాయి. వేటికవి కొన్ని నిబంధనలకు లోబడి తమ రిక్రూట్‌మెంట్ ప్రాసెస్‌ను నిర్వహిస్తాయి. విదేశాల్లో టూటైర్ పట్టణాల్లోని యూనివర్సిటీ విద్యార్థులకు కూడా క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ ఉంటాయి. విద్యార్థి ఏ ఎకనామిక్ సైకిల్‌కు చెందిన వ్యక్తి అన్నది ప్లేస్‌మెంట్స్‌లో ప్రాధాన్యం కలిగి ఉంటుంది. అంటే ఇక్కడ ఐఐఎం, ఐఐటి విద్యార్థులకు మిగిలిన వారికి ఉన్న తేడా మాదిరిగానే ఉంటుంది.

లిటిల్స్



ఏది మంచి? ఏది చెడ్డ?

చైనాలో ఓ పెద్దాయన ఉండేవాడు. జీవితం అంతా అయిపోయింది. ఏదైనా మంచి సలహాలు ఇవ్వడానికే బతికి ఉన్నా అనుకుండేవాడు. తెలివైన వాడు. మంచి ఆలోచనా పరుడు. అతని భార్య, కొడుకు తనను బాగా చూసుకునేవారు. ఆ పెద్దాయనకు ఓ గుర్రం ఉండేది. ఆ గుర్రంతోనే స్నేహం. తన రెండో కొడుకులా చూసుకునేవాడు.

ఒక రోజు తను ఎంతో ప్రేమగా చూసుకునే గుర్రం ఉదయం లేస్తూనే కనపడకుండా పోయింది. పెద్దాయన మనసు గుర్రం మీదనే ఉంది. తను నడవ లేడు. ఆ గుర్రం ఎక్కడ పోయిందనని కొడుకును పంపాడు. కొడుకు వెళ్లి చూసినా కనపడలేదు. పెద్దాయన గుర్రం పోయిందని ఊరంతా తెలిసింది. వారంతా వచ్చి 'పాపం.. పెద్దాయన.. బాధపడకు' అంటూ ఓదార్పు చెబుతోంటే.. 'జరిగేది మంచికే కావొచ్చు' అన్నాడు. పెద్దాయన చాదస్తం అనుకున్నారు జనాలు.

నాలుగు రోజుల తర్వాత ఉదయాన్నే పెద్దాయన నిద్రలేవగానే గుర్రం కనపడింది. తోడుగా మరో గుర్రం ఉంది. జంట గుర్రాలను చూసి ఇంట్లోవారు మురిసిపోయారు. జనాలు కూడా వచ్చి 'నీ అదృష్టమే అదృష్టం' అంటూ తెగ పొగిడారు. అది కూడా పెద్దగా పట్టించుకోలేదు. పైగా 'ఏ నష్టమో ఏమో' అన్నాడు. ఈ పెద్దాయనకు మనశ్శాంతి లేదని తిట్టుకున్నారు జనాలు కొందరు.


ఆ మరుసటి రోజు కొత్త గుర్రంమీద పెద్దాయన కొడుకు స్వారీ చేశాడు. కొత్త గుర్రం వేగంగా పరిగెత్తింది. ఆ గుర్రాన్ని పట్టుకోలేక తన కొడుకు కిందపడిపోయాడు. గాయాలయ్యాయి. కొడుకు బాధతో మూలుగుతున్నాడు. పెద్దాయన కొడుకును పరామర్శించటానికి ఊరిలోని దగ్గరి బంధువులు, స్నేహితులూ వచ్చారు. 'ఇది కూడా ఓ మంచికేలే' అన్నాడు పెద్దాయన. ఇక ఈ పెద్దాయన మారడేమో అని తిట్టుకున్నారు కొందరు. ఇంట్లో కొడుకు, భార్య కూడా తనమీద కోప్పడ్డారు.


ఓ ఐదు రోజుల తర్వాత రాజు ఆదేశాల మేరకు ఊరిలోని మగవాళ్లంతా యుద్ధానికి రావాలి అని దండోరా వేశారు. ఊరిలోని మగవాళ్లనందరినీ సైనికులు వచ్చి తీసుకుపోయారు. ఇష్టం లేదన్నా మగవాళ్లను లాక్కెళ్లారు. పెద్దాయన కొడుక్కి గాయాలు ఉండటంతో అతన్ని తీసుకెళ్లలేదు. ఆ తర్వాత యుద్ధానికి వెళ్లిన వాళ్లంతా భీకరయుద్ధంలో అతని శత్రురాజు దెబ్బకు మరణించారు. ఆ తర్వాత ఆ పెద్దాయన ఎంత గొప్పవాడోనని అందరూ అనుకున్నారు. అలా కొడుకు బతికిపోయాడు ఆ గుర్రం వల్ల. ఏది మంచి? ఏది చెడ్డ? అనుకుంది ఆ పెద్దాయన భార్య.

చుక్కలు కలిపి బొమ్మ గీయండి



దారి కనుక్కోండి







డైలీ సుడోకు - 196

	9	2		6				
5								
4			8	5			9	
		4		7		1	3	
			6		3			
	7	8		4		9		
	5			3	4			8
								5
				2		4	7	

సుడోకు - 195 సమాధానం

5	1	6	7	3	9	2	4	8
2	9	7	8	4	5	6	3	1
3	8	4	1	2	6	5	9	7
4	5	8	2	7	3	9	1	6
1	6	2	5	9	4	8	7	3
9	7	3	6	8	1	4	2	5
6	4	5	9	1	7	3	8	2
8	3	1	4	6	2	7	5	9
7	2	9	3	5	8	1	6	4

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.